
ఆంధ్రప్రదేశ్

మార్చి - ఏప్రిల్

1969

50 పైసలు



ఆంధ్రప్రదేశ్ను గురించి....

విస్తీర్ణం	1,06,286 చ. మై.
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961)	359.83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ. మై. 1కి.
అక్షరాస్యులు (1961)	76.27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు (1961)	49.74 లక్షలు
షెడ్యూలు తెగలవారు (1961)	13.24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	3,928
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు	61
విధానసభ సభ్యులు	288
శాసనమండలి సభ్యులు	90

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 13]

మార్చి – ఏప్రిల్, 1969

ఫాల్గుణం_వైశాఖం 1890_91 శా.శ

[సంచిక: 5, 6

ప్రధాన సంపాదకులు

బి. కె. రావు, ఐ. ఎ. యస్.

సంపాదకులు

ఎన్. వి. గోపాలశాస్త్రి

ఈ సంచికలో...

మొదటి అట్ట : కొత్త రుచుల సరికొత్త జీవితానికి నాంది
చిత్రకారుడు : 'శీలావి'

మూడవ అట్ట : ఉద్యాన పండిట్ బహుమతి పొందిన శ్రీ సాగిరాజు పెద్దసోమరాజు (జీడిమెట్ల గ్రామం హైదరాబాదు జిల్లా)

నాలుగవ అట్ట : నాగార్జునసాగర్ ఆనకట్ట

[ఈ సంచికలోని అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించనక్కరలేదు.]

పేజీ



తెలంగాణా రక్షణల అమలుకు కట్టుదిట్టమైన చర్యలు: ప్రధానమంత్రి ప్రకటన

తెలంగాణా సత్వరాభివృద్ధికై ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, లోక్‌సభలో ఏప్రెల్ 11 న చేసిన ప్రకటన పూర్తిపాఠం:

"గత కొద్దివారాలుగా నేను ప్రభుత్వంలోని, పార్టీలోని సహచరులతోనూ, పార్లమెంటులోని ప్రతిపక్ష నాయకులతోను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితోనూ, తెలంగాణాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగతాప్రాంతాలలోని కొన్నిపార్టీల నాయకులతోనూ తదితరులతోనూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితిపై చర్చలుజరిపాను.

తెలంగాణాలో నివసిస్తున్న ప్రజల న్యాయమైన సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక చర్యలు రూపొందించడానికి ఈ చర్చలు అరమరికలు ఏమీలేని వాతావరణంలో కొనసాగింప బడినవి. ఆంధ్రప్రదేశ్ సమగ్రతను, ఐక్యతను కొనసాగిస్తూనూ, మరింత పరిపుష్టం చేస్తూనూ, అదే సమయంలో తెలంగాణాప్రాంతంలోని ప్రజల సత్వర అవసరాలనూ, దీర్ఘకాలిక అవసరాలనూ తీర్చడంకోసం త్వరితంగా నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవడంలో గల ప్రాముఖ్యాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. తెలంగాణా అభివృద్ధి గతినీ, ఉద్యోగావకాశాల విస్తృతీకరణనూ మరింత త్వరితం చేయడమూ, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల సహకారంతోనూ, ఉమ్మడి కృషితోనూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి సాధించడానికి అవకాశాలు కల్పించడమూ—ఇదీ ప్రభుత్వ ధ్యేయం.

ఈ ధ్యేయ సాధనకు కొన్ని ప్రత్యేక చర్యలు నిర్ణయించబడినవి.

అష్టసూత్ర పథకం

(1) రిటైరయిన, లేక ఇప్పుడు పదవిలో ఉన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలు, క్షుణ్ణంగా తెలిసిన ఒక ఆర్థిక నిపుణుడూ, కంట్రోలరు ఆడిటరు జనరలు కార్యాలయంనుండి ఒక సీనియర్ ప్రతినిధి సభ్యులుగా ఒక ఉన్నతాధికార సంఘం నియమింపబడుతుంది. తెలంగాణా నిధులకు సంబంధించిన భిన్న భిన్నంగా వున్న అంచనాలను, అభ్యర్థనలను పరిశీలించి తెలంగాణా ప్రాంతపు అభివృద్ధిపై ఖర్చు చేయవలసివుండిన మిగులు నిధులను ఈ సంఘం నిర్ధారిస్తుంది. వచ్చేనెలాఖరులోగా ఈ సంఘం తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.

(2) మిగులు నిధుల మొత్తం మేరకు ఎలా ధనాన్ని సేకరించాలన్న విషయం నిర్ణయించడానికై కేంద్ర ఆర్థిక, హోం మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, ప్రణాళికా సంఘం ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు వెంటనే చర్చలు ప్రారంభిస్తారు.

(3) ముఖ్యమంత్రి సూచనపై తెలంగాణా అభివృద్ధికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని వెంటనే ఏర్పరచాలని అంగీకరించడం జరిగింది. ఈ సంఘానికి ముఖ్యమంత్రి అధ్యక్షులుగా వుంటారు, ప్రణాళికా సంఘం సభ్యులు ఒకరు, రాష్ట్ర మంత్రివర్గంలోని

తెలంగాణా మంత్రులూ, తెలంగాణా ప్రాంతీయ సంఘం అధ్యక్షుడూ ఇందులో సభ్యులుగా వ్యవహరిస్తారు.

పంచవర్ష ప్రణాళికల్లో తెలంగాణా ప్రాంతంలో అమలు జరుగ వలసిన పథకాలనూ, కార్యక్రమాలనూ, సాధించవలసిన భౌతిక ఆర్థిక లక్ష్యాలనూ నిర్దేశించడం ఈ సంఘం ప్రధాన విధుల్లో ఒకటి. ఈ పథకాలూ, కార్యక్రమాలూ సరిగా అమలు జరుగు తున్నాయా లేదా అనే విషయాన్నికూడా ఈ సంఘం సమీక్షి చేస్తుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సలహాలను కూడా ఈ సంఘం అందజేస్తుంది.

(4) ప్రణాళికా కార్యక్రమాలు, పథకాలు అమలుజరుగుతున్న తీరును విపులంగా సమీక్ష చేయడానికి ఒక ప్రణాళిక అమలు సంఘం కూడా నియమింప బడుతుంది. ఈ సంఘానికి ప్రణాళికా సంఘం ప్రతినిధి ఒకరు అధ్యక్షులుగా వుంటారు. కేంద్ర ఆర్థిక, హోంశాఖల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఈ సంఘంలో ఉంటారు.

ఈ సంఘం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై ప్రధాన మంత్రికి, ముఖ్యమంత్రికి నివేదికలు సమర్పిస్తుంది.

(5) ఈ నిర్ణయాలను సత్వరం శక్తివంతంగా అమలు జరపడానికి, వాటి సమన్వయానికి తెలంగాణా ప్రాంతం సమస్యల బాధ్యత కలిగిన ప్రత్యేక అధికారులకు ఇంకా ఎక్కువ అధికారాలను ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి పరిశీలిస్తారు.

(6) తెలంగాణా ప్రాంతం ప్రజల ఉద్యోగాల విషయంలో రాజ్యాంగబద్ధమైన తగుహామీలు ఇచ్చే అవకాశాన్ని గురించి భారత ప్రభుత్వం, న్యాయశాస్త్రవేత్తల బృందంతో కలిసి పరిశీలిస్తుంది.

(7) తెలంగాణాలో ప్రభుత్వోద్యోగుల విషయంలో వున్న కష్ట నిష్ఠూరాల పరిశీలనకు 1956 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టంక్రింద కేంద్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్ చైర్మను అధ్యక్షతన నియమించ బడిన కేంద్ర సలహా సంఘం (ఇందులో ఒక రిటైరయిన హైకోర్టు న్యాయమూర్తి, కేంద్ర ప్రభుత్వంనుండి రిటైరయిన ఒక న్యాయశాఖా కార్యదర్శి సభ్యులుగా వుంటారు.) త్వరలో హైదరాబాదు వెళ్లి కేంద్ర మంత్రికి తగు సిఫార్సులు చేయగలదు. ఈ సూచనను ముఖ్యమంత్రి చేసారు.

సర్వీసులకు సంబంధించి తేలకుండా మిగిలి పోయిన కేసుల పరిష్కారానికి నిర్ణీత వ్యవధిలోగా హోంశాఖ ఒక అత్యవసర కార్యక్రమాన్ని నిర్ణయిస్తుంది.

కేంద్ర సలహా సంఘంకాని, రాష్ట్ర సలహా సంఘంకాని ఇచ్చే సలహాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గైకొనే నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అమలు జరుపుతుందని ముఖ్యమంత్రి కేంద్రానికి హామీ ఇచ్చారు.

(8) తెలంగాణా సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం ఇక ముందుకూడా ఎప్పుడూ శ్రద్ధ వహించేందుకు గాను ఆరు నెలల కొకసారి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రితోనూ, తెలంగాణా అభివృద్ధికేర్పడిన ఉన్నతాధికార సంఘంలోని తదితరులతోను సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తారు. ఈ సూచనను కూడా ముఖ్యమంత్రి చేశారు. ఈ సమావేశాలకు ఉప ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ఇందుకు సంబంధించిన ఇతర కేంద్ర మంత్రులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుకూడా హాజరవుతారు.

సహకార భావం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని ప్రజలమధ్య పరస్పర అవగాహన, సహకార భావాలు ఉన్నప్పుడూ, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పుడూ తెలంగాణా ప్రాంతం సత్వరాభివృద్ధి, మొత్తం రాష్ట్రం సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యాలు నెరవేరగలవు.

ఈ లక్ష్యాలను సాధించడంలో తోడ్పడేటట్లు తగిన రాజకీయ ఏర్పాట్లు చేయగలనని, యిలా చేసేముందు నాతో చర్చిస్తానని ముఖ్యమంత్రి సంభాషణల సందర్భంగా నాతో చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో పరిపూర్ణ శాంతిసుహృద్భావ వాతావరణాన్ని తిరిగి నెలకొల్పేటట్లు చేయడానికి గల ప్రాధాన్యత ఈ అనేక చర్చల సందర్భంలో గుర్తించబడింది.

ఆందోళన విరమణకు విజ్ఞప్తి

ప్రస్తుత చర్చల ఫలితంగా తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యల అమలులోనూ, ఇకముందు రూపొందించబడే చర్యల అమలులోనూ పరిపూర్ణ సహకారం అందజేయమనీ, ప్రస్తుత ఆందోళనను విరమించమని నేను తెలంగాణా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాభిప్రాయాన్ని వ్యక్తీకరించే వివిధ వర్గాలతో చర్చలు కొనసాగించడానికి నేను నిశ్చయురాలనై వున్నాను.

తెలంగాణాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలలోనూ గల ప్రజల న్యాయమైన సమస్యలను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సామభూతితో పరిశీలించగలదని నేను హామీ ఇస్తున్నాను.''

★

పరిపాలనా విషయాలు

శీఘ్రతరంగా తెలంగాణా రక్షణల అమలుకు ప్రత్యేక చర్యలు

ప్రధాన మంత్రి ఏప్రిల్ 11వ తేదీన లోకసభలో చేసిన ప్రకటన మేరకు తెలంగాణా అభివృద్ధికి సంబంధించి ఒక ఉన్నతాధికార సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ముఖ్యమంత్రి నాయకత్వం వహించే పదకొండు మంది సభ్యులుగల ఈ సంఘంలో ప్రణాళికా సంఘం సభ్యుడు శ్రీ ఆర్. వెంకటరామన్, తెలంగాణా ప్రాంతీయసంఘం అధ్యక్షుడు, ఎనిమిది మంది తెలంగాణా మంత్రులు సభ్యులుగా వుంటారు.

ప్రధాని ప్రకటనలో పేర్కొన్న ప్రణాళికా అమలు సంఘాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రణాళికా సంఘానికి సంబంధించిన ఒక సలహాదారు నాయకత్వం వహించే యీ ప్రణాళికా అమలు సంఘంలో కేంద్ర ఆర్థిక, హోం శాఖలనించి ఒక్కొక్కరు చొప్పున యిద్దరు సంయుక్త కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శి, ప్రణాళికాశాఖ కార్యదర్శి సభ్యులుగా వుంటారు.

ఆంధ్రప్రదేశ్ ప్రణాళికాశాఖ కార్యదర్శి ఈ రెండు సంఘాలకు కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

తెలంగాణా రక్షణలను శీఘ్రతరంగా అమలు జరిగేటట్లు చూచేందుకు తెలంగాణా సీనియర్ అధికారిని ఒకరిని అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమించే విషయమై ముఖ్యమంత్రి మార్చి 24న ఒక ప్రకటన చేశారు. అదనపు ప్రధాన కార్యదర్శిగా శ్రీ యస్. ఎ. ఖాదర్ పదవి స్వీకారం చేశారు.

రెండువేల ఉద్యోగాలు

తెలంగాణా ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికీ, అభివృద్ధి పథకాలను త్వరగా అమలు పరిచేలా పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్టం చేయడానికీ వెంటనే 2000 ఉద్యోగాలను సృష్టించడానికి చర్యలు తీసుకొనబడుతున్నాయి.

సర్వీసు వ్యవహారాలకు సంబంధించి, ముఖ్యంగా ఉద్యోగాల గ్రేడ్ల విషయంలో, సామాన్య జాబితా తయారు చేయడానికి చర్య తీసుకొనడం జరిగింది. కష్టాలున్న ఉద్యోగులు వాటి విషయమై విజ్ఞప్తులను పంపుకోడానికి అవకాశం కల్పించబడింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంక్రింద అధికారం కలిగిన కేంద్ర సలహాసంఘం ముందు ఈ విజ్ఞప్తులను పరిశీలన నిమిత్తం వుంచుతారు.

కేంద్ర సలహా సంఘం

సర్వీసుల ఏకీకరణ విషయంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేందుకు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం క్రింద ఏర్పాటైన ఉన్నతాధికార కేంద్ర సలహా సంఘం ఏప్రిల్ 27న హైదరాబాదుకు రానున్నది. యు. పి. యస్. సి. ఛైర్మన్ శ్రీ దామ్లె ఈ సంఘానికి నాయకత్వం వహిస్తున్నారు. భారత ప్రభుత్వ న్యాయశాఖ మాజీ కార్యదర్శి శ్రీ బండార్కర్, పార్లమెంటు సభ్యులు శ్రీ. పి.ఎన్. సప్రూ, రిటైరయిన ఒక హైకోర్టు జడ్జి కూడా యిందులో వున్నారు. ఇరు ప్రాంతాలకు చెందిన గజిటెడ్ ఆఫీసర్లనుండి 737విజ్ఞప్తులు యింతవరకూ రావడం జరిగింది. ఏప్రిల్ 14వ నాటికి నాన్‌గజిటెడ్ ఉద్యోగులనుండి 2400 విజ్ఞప్తులు వచ్చాయి. యింకా రావచ్చునని అనుకుంటున్నారు. రాష్ట్ర సలహా సంఘానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షులు నాయకత్వం వహిస్తారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులూ, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన ఒకరూ వుంటారు. ఏప్రిల్ 29నుండి ఒక వారం రోజులపాటు ఈ సంఘం హైదరాబాదులో సమావేశమౌతుంది.

తెలంగాణా మిగులునిధులు

గత సంవత్సరం మార్చి 31వ తేదీనాటికి నికరంగా తెలంగాణా ప్రాంతం మిగులు నిధులు రు. 34.10 కోట్లని శ్రీ కుమార్ లలిత్ లెక్కకట్టి తేల్చారు. తెలంగాణా మిగులు నిధులను లెక్క కట్టేందుకు, రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనపై, భారత ఆడిటర్ అండ్ కంప్ట్రోలర్ జనరల్‌చే పంపబడిన శ్రీ లలిత్‌ను, 1959 నవంబరు 1 నుండి 1968 మార్చి 31 వరకూ జమకాబడిన తెలంగాణా మిగులు నిధులను పరిశీలించవలసినదిగా కోరడం జరిగింది. శ్రీ కుమార్ లలిత్ నివేదిక సీలువేసిన కవరులో మార్చి 13న ముఖ్యమంత్రికి అందింది. ఈ సీలు వేసిన కవరును శాసన సభలో గౌరవ సభ్యుల సమక్షంలో తెరిచి నికర మిగుళ్ళ సంఖ్యను ముఖ్యమంత్రి, ముందుగా సభ్యులకు తెలియజేసారు.

తెలంగాణా ప్రాంతాభివృద్ధికై ఖర్చు కావలసి వుండి వున్న తెలంగాణా మిగులు నిధులను నిర్ణయించే నిమిత్తం, సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ వసిష్టభార్గవ అధ్యక్షతన ఒక ఉన్నతాధికార సంఘాన్ని భారత ప్రభుత్వం నియమించింది. తెలంగాణా ప్రాంతాభివృద్ధి గమనాన్ని శీఘ్రతరం చేసేందుకూ, ఈ ప్రాంతంలో ఉద్యోగావకాశాలను విస్తృతీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్దుష్టమైన చర్యలలో యిది ఒకటి. ఈ సంఘం మే నెల 31 నాటికి తన నివేదికను ప్రభుత్వానికి అందజేయగలదని ఊహించబడుతున్నది.

న్యాయశాస్త్రవేత్తల సంఘం నియామకం

ముల్కీ నిబంధనలు చెల్లనేరవని సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పు మూలకంగా తెలంగాణా ప్రాంత ప్రజల ఉద్యోగాల విషయంలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిని పరిశీలించే నిమిత్తం న్యాయవేత్తలతో కూడుకున్న ఒక సంఘాన్ని ఏప్రిల్ 19న భారత ప్రభుత్వం నియమించింది. తెలంగాణా ప్రాంతం ప్రజల ఉద్యోగాల విషయంలో తగు రాజ్యాంగ బద్ధమైన రక్షణలను కల్పించేందుకు శాసన సంబంధమైన చర్యలతోసహా తగు సూచనలను చేయవలసిందిగా ఈ సంఘాన్ని కోరడం జరిగింది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ కె. ఎన్. వాంఛూ (కన్వీనర్), అటార్నీ జనరల్ శ్రీ నిరేన్ డే, మాజీ అటార్నీ జనరల్ శ్రీ యం. సి. సెతల్వాడ్ ఈ సంఘంలో సభ్యులుగా వున్నారు.

తెలంగాణా అభివృద్ధికి ఇతోధికంగా నిధులు జిల్లాకు కోటిరూపాయలు

ప్రతీ తెలంగాణా జిల్లాకు 1969_70 సంవత్సరానికి కోటి రూపాయల చొప్పున కేటాయించడం జరిగింది. మార్చి 21న ముఖ్యమంత్రి ఈ విషయాన్ని ప్రకటిస్తూ యింతకుముందు తెలంగాణాకు ఉద్దేశించిన 7కోట్ల రూపాయల గ్రాంటును ప్రభుత్వం 9 కోట్ల రూపాయలకు పెంచినట్టు పేర్కొన్నారు.

మొత్తం కేటాయింపు రూ. 9 కోట్లలోనూ జిల్లాకు 40 లక్షల రూపాయల చొప్పున వెరసి రూ. 3.60 కోట్లను గ్రామీణ విద్యుదీకరణకు ఉద్దేశించడం జరిగింది. ప్రతి జిల్లాకు వున్న బేలన్స్ మొత్తం రూ. 60 లక్షలకు సంబంధించిన ప్రతిపాదనలను 1969 ఏప్రెల్ 30 లోగా పంపించవలసినదిగా జిల్లా పరిషత్తులను కోరడం జరిగింది. గతంలో చేపట్టి పూర్తి కాకుండా మిగిలిపోయిన పథకాలకు సంబంధించి యీ ప్రతిపాదనలు వుంటాయి. అయితే ప్రతిపాదనల తుదిరూపం నిర్ణయించేలోపున స్పిల్ ఓవర్ పనుల నిమిత్తం వెంటనే జిల్లాకు 10 లక్షల చొప్పున ఖర్చు చేయడానికి జిలా పరిషత్తుకు అధికారమివ్వబడింది.

పంచాయతీ ఎన్నికల వాయిదా

రాష్ట్రం మొత్తంమీద పంచాయతీ ఎన్నికలను ఒక సంవత్సరంపాటు వాయిదావేస్తూ మార్చి 31న మంత్రిమండలి ఒక నిర్ణయం తీసుకున్నది. ఈ ఎన్నికలు నిర్ణీత కార్యక్రమం మేరకు 1969 మే నెలలో జరగవలసివున్నవి.

డైరెక్టు రిక్రూట్‌మెంటుకు గరిష్ఠ వయఃపరిమితి

సబార్డినేటు సర్వీసులో, గరిష్ట వయః పరిమితి 25 సంవత్సరములు, అంతకన్న ఎక్కువ, 28 సంవత్సరములకన్నా తక్కువగా కానీ వుంటూవున్న పోస్టులకు డైరెక్టు రిక్రూట్ చేసే విషయంలో ఈ గరిష్ట వయః పరిమితిని 28 సంవత్సరములకు పెంచుతూ జి. వో. యం. యస్. నెం. 193 జి. ఎ. (సర్వీసెస్_బి) తే. 2_4_1969 లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రాజీనామా

మంత్రి మండలినుండి వైదొలగుతూ శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన రాజీనామా మార్చి 29న గవర్నరు ఆమోదించారు. ముఖ్యమంత్రి సలహా మేరకు, గవర్నరు జనసంబంధ శాఖను విద్యామంత్రి శ్రీ పి. వి. నరసింహారావుకు అప్పజెప్పారు.

సమైక్యత ద్వారా పరిపూర్ణ వికాసం



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మార్చి 3వ తేదీన 1969_70 సం. పు బడ్జెటు అంచనాలను విధాన సభకు సమర్పించారు. ఫైనాన్స్ కమిషన్ తుది నివేదిక యింకా అందకపోవడంవల్లా, నాల్గవ పంచవర్ష ప్రణాళిక స్వరూపం యింకా ఖరారు కాకపోవడంవల్లా, తెలంగాణా మిగులు నిధులు యింకా నిర్ధారించవలసి వున్నందువల్లా మొదటి ఆరు నెలల కాలానికి ఓట్ ఆన్ అకౌంట్‌ను కోరుతున్నట్టు ముఖ్యమంత్రి తెలియజేశారు. సెప్టెంబరు లోగా పూర్తి బడ్జెటును సమర్పించగలనని పేర్కొన్నారు.

రాష్ట్ర బడ్జెటు

ముఖ్యమంత్రి బడ్జెటు ప్రసంగం పూర్తి పాఠం:

"1969_70 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ బడ్జెటును నివేదిస్తున్నాను. అయితే ప్రస్తుతం ఆరు నెలలకాలానికి అనగా 1969 ఏప్రిల్ ఒకటవ తేదీనుండి 1969 సెప్టెంబర్ ఆఖరుకు సరిపడే "ఓట్ ఆన్ అక్కౌంటు"ను మాత్రమే అర్థిస్తున్నాను. ఏ కారణాలవలన ఈపని చేయవలసివచ్చిందో, వాటిని ప్రస్తావిస్తాను.

(అ) అయిదవ ఆర్థిక సంఘం తాత్కాలిక తీర్పు ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వం 1969_70 ఆర్థిక సంవత్సరానికిగాను అదనంగా రూ. 7.55 కోట్లను పొందగలుగుతుందని గౌరవసభ్యులకు తెలుసు, రాజ్యాంగపు 275 (1) సూత్రం మాత్రం వర్తించే పన్నులు, డ్యూటీలు, గ్రాంటులవాటాగా ఈ అదనపు మొత్తం లభిస్తుంది. కాని రాష్ట్ర రెవిన్యూలోటును ఈ మొత్తం ఏ మాత్రమూ భర్తీ చేయలేదు. ఈ విషయమై గత జనవరి ఆఖరు వారంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘంతో సంప్రదింపులు జరిపింది, సంఘానికి తుది నివేదికనుగూడ సమర్పిం

ముఖ్యాంశాలు

* తెలంగాణా ప్రాంతం అభివృద్ధికిగాను రూ. 6.5 కోట్లు కేటాయించడం జరిగింది. (ఈ మొత్తాన్ని దరిమిలా రూ. 9 కోట్లకు పెంచడం జరిగింది)
* పోచంపాడు ప్రాజెక్టు మీదచేసే ఖర్చును రెట్టింపు చేయడం జరుగుతుంది.
* హరిజనులు, గిరిజనుల అభ్యుదయానికిగాను రూ. 100 లక్షలు కేటాయించడం జరిగింది.
* మూడు విశ్వవిద్యాలయాలకు కలిపి యిచ్చిన గ్రాంటుల మొత్తం రూ. 68 లక్షలలో పెద్ద మొత్తం-అంటే రూ. 37 లక్షలను-ఉస్మానియా విశ్వవిద్యాలయానికి యివ్వడం జరిగింది.

చింది. గడిచిన మూడు సంవత్సరాల వార్షిక ప్రణాళికలో నిశ్చయించుకున్న ఖర్చుతో సహా రాష్ట్ర ప్రభుత్వపు కనీస అవసరాలను తీర్చడానికిగాను పన్నులు, డ్యూటీల్లో ఇంకెక్కువ భాగాన్ని కేటాయించాలనీ, సహాయక గ్రాంటులను అధికం చేయాలనీ ప్రతిపాదించాం. ఆర్థిక సంఘం తుది నివేదిక రాష్ట్రపతికి 1969 జూలై నెలాఖరుకు నివేదింపబడగలదని అనుకుంటున్నాం. ఈ సంఘం చివర తీర్పుకింద, రాష్ట్రపు రెవిన్యూ లోటు పూర్తిగా భర్తీ కాగలదని ఆశిస్తున్నాం. ఈ చివరి తీర్పు తెలిసిన తర్వాత, మన ఆదాయాలను సమగ్రంగా అంచనా వేయడానికి వీలవుతుంది.

(ఆ) మన నాల్గవ ప్రణాళికా ముసాయిదా ప్రకారం మొత్తం వినియోగం రూ. 650 కోట్లు వుంటుంది. రాష్ట్ర ప్రణాళికకు కేంద్రం చేయగల సహాయం ఇంకా నిశ్చితం కాలేదు. కేంద్ర రాష్ట్రాల మధ్య కేటాయింపులను గురించిన కొన్ని విషయాలు ఇంకా పరిష్కారం అవవలసి వున్నవి. మన రాష్ట్రం కేంద్రానికి చెల్లించవలసిన ఋణభారం చాలా ఎక్కువగానే ఉంది. ఈ తిరిగి చెల్లింపుల పద్ధతి తేలితేగాని, ప్రణాళికకు రాష్ట్రం సమకూర్చుకోగలిగిన వసతుల విషయం పూర్తిగా అంతుచిక్కదు. నాల్గవ ప్రణాళిక యొక్క రూపు రేఖలు ఇంకా అనిశ్చితంగానే ఉన్నవి. అంతేకాదు, 1969_70 వార్షిక ప్రణాళికకూడా ఇంకా అనిర్దిష్టంగానేవున్నది. పై విషయాలన్నీ తేలితేగాని 1969_70 ప్రణాళిక ఖర్చును లెక్కించడానికి వీలుండదు.

(ఇ) 1969 జనవరి 19 వ తేదీన జరిగిన అఖిలపక్ష సమావేశంలో, వచ్చే అయిదు సంవత్సరాలలో తెలంగాణా అభివృద్ధికిగాను తెలంగాణామిగులు పూర్తిగా వినియోగంకావాలని అంతా అంగీకరించారు. ఈ విషయం గౌరవ సభ్యులకు తెలుసు. రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి చేకూరిన తెలంగాణా మిగులు ఎంత అనే, విషయం గురించి ఆడిటర్ జనరల్ ప్రతినిధి పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన తేలితేగాని, ఈ విషయమై ప్రత్యేకించి కేటాయింపులు చేయడానికిగానీ, ఆదాయ వ్యయాలను ప్రాంతీయ పద్ధతిన విడదీయటానికి గానీ వీలులేదు. నేను పైన వివరించిన కారణాల దృష్ట్యా ఆరు నెలల కాలానికి సరిపడ "ఓటు అక్కౌంటు"ను నివేదించటమే యుక్తమైన సాధనముగా శాసనసభ్యులు ఆమోదిస్తారని నమ్ముతున్నాను.

1967_68 రెవిన్యూ జమల మొత్తం రూ. 184.27 కోట్లు, రెవిన్యూ ఖాతాన ఖర్చు రూ. 189.82 కోట్లు. 1967_68 సవరించిన అంచనాల్లో ఊహించిన రూ. 2.58 కోట్లస్థానే, తరుగు రూ. 5.54 కోట్లు ఏర్పడింది. పరిస్థితి ఇంకా క్షీణించడానికి ప్రధాన కారణం భూమి రెవిన్యూ ఆదాయం తగ్గటం.

సవరించిన అంచనాలు

మొదట్లో అనుకున్న రూ. 199 కోట్ల స్థానే రెవిన్యూ ఖాతాన జమ రూ. 203.52 కోట్లకు పెరిగింది.

రెవిన్యూ ఖాతాన ఖర్చు మొదట్లో అనుకున్న రూ. 204.67 కోట్లనుంచి రూ. 239.67 కోట్లకు పెరిగింది.

1968_69 బడ్జెటులో మొత్తం పెట్టుబడి వినియోగం క్రింద రూ. 33.68 కోట్లు కేటాయించబడినై. సవరించిన అంచనా ప్రకారం ఈ మొత్తం రూ. 388.7 కోట్లు అని నిర్దేశించబడింది. పింఛన్లను కమ్యూట్ చేయటం, జాగిర్దారులకు చెల్లింపులు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి నిర్మాణాలు, పారిశ్రామిక అభివృద్ధి వగైరాల దృష్ట్యా ఇది అవసరమైంది.

పైన చెప్పిన వ్యవహారాల దృష్ట్యానూ; ఋణాలు, అడ్వాన్సులు, పబ్లిక్ ఋణాల డిపాజిట్ల దృష్ట్యానూ ఈ సంవత్సరం రూ. 45.94 కోట్ల తరుగు రొక్కపు నిలవలతో ముగియవచ్చునని అనుకుంటున్నాం.

1969-70 బడ్జెట్ అంచనాలు

1969_70 బడ్జెట్ అంచనాల్లో మొత్తం రెవిన్యూ 279.91 కోట్లు అనీ, రెవిన్యూ ఖర్చు రూ.లు 288.47 కోట్లు అనీ కేటాయించటం జరిగింది. వచ్చే సంవత్సరపు ప్రణాళికకు కేంద్ర సహాయం రూ. 64.58 కోట్లు ఉండగలదని భావిస్తున్నాం. ఇందులో కేంద్ర గ్రాంటు రూ. 5.13 కోట్లుఅనీ, రెవిన్యు ఖాతాన వినియోగం రూ. 13.66 కోట్లు వుండవచ్చుననీ అనుకుంటున్నాం. ప్రణాళికేతర ఆదాయానికి, వ్యయానికి మధ్యనున్న లోటును, అయిదవ ఆర్థిక సంఘం తీర్పుద్వారా లభించే సహాయక గ్రాంటుల మూలంగా పూర్తిగా భర్తీ చేసుకోగలమని అనుకుంటే ఇప్పుడు రెవిన్యూ ఖాతాన నికర తరుగు రూ. 8.5 కోట్లు వుంటుంది.

1969_70 లో మొత్తం పెట్టుబడి వినియోగం రూ. 40.19 కోట్లు అని అంచనా వేయబడింది. ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ మొత్తం రూ. 33.68 కోట్లు. సవరించిన అంచనాలప్రకారం రూ. 38.87 కోట్లు, ఋణాలు అడ్వాన్సుల క్రింద పంపిణీలకుగాను రూ. 18.11 కోట్లు మొత్తం కేటాయించబడింది.

1968_69 సంవత్సరం రూ. 4.3 కోట్ల రొక్కపు నిలవతో ప్రారంభమైంది. రూ. 45.94 తరుగు రొక్కపు తక్కువతో ముగియవచ్చు. రెవిన్యూ ఖర్చు, పెట్టుబడి వినియోగం, ఋణాలు, అడ్వాన్సులు, అప్పు, డిపాజిట్లు వగైరాల దృష్ట్యా, 1969_70 సంవత్సరం రూ. 45.94 కోట్ల తరుగు రొక్కపు నిలవతో ముగియవచ్చుననుకుంటున్నాం.

ప్రణాళికా వినియోగం

1968-69 వార్షిక ప్రణాళిక: 1968_69లో, రూ 72.13. కోట్ల ప్రణాళికా వినియోగానికి కేంద్ర సహాయం రూ. 53 కోట్లు వుండగలదని భావించాం. అయితే ప్రణాళికా సంఘం రూ. 56.05 కోట్ల వినియోగాన్ని మాత్రమే ఆమోదించింది. ఇందులో కేంద్ర సహాయం రూ. 37.3 కోట్లు. పూర్వపు ప్రణాళికకు సంబంధించిన కొరవ కార్యక్రమాలకైనా ఈమాదిరి ప్రణాళిక సరిపోదు. కేంద్ర సహాయపు తగ్గింపు విషయమై అసమ్మతిని తెలిపాం. సహాయాన్ని 1967_68 స్థాయికే కాకపోయినా కనీసం బడ్జెటులో భావించుకున్న రూ. 53 కోట్లకైనా పెంచవలసిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరాం.

ఆతర్వాత దేశంలోని కొన్ని యితర భారీ ప్రాజెక్టులలాగానే, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ. 5.5 కోట్లు సమకూర్చింది. దాని దృష్ట్యానూ, అడ్ హాక్ ఋణాల తిరిగి చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపిన సౌకర్యాల దృష్ట్యానూ ప్రణాళికను రూ. 73 కోట్ల స్థాయికి సవరించటం జరిగింది.

1969-70 వార్షిక ప్రణాళిక: 1969-70 వార్షిక ప్రణాళిక ప్రమాణాన్ని ఖచ్చితంగా నిర్ణయించటంలో గల ఇబ్బందులను ఇదివరకే వివరించాను. మన వసతుల పరిస్థితి గడ్డుగానే ఉంటున్నది. ఇందుకు ముఖ్య కారణం కేంద్ర ప్రభుత్వానికి తిరిగి చెల్లించ వలసిన అడ్ హాక్ ఋణాలు. అందుకని ప్రణాళిక వినియోగాన్ని రూ. 84.87 కోట్లకు పరిమితం చేయవలసివచ్చింది. కొనసాగించాలన్నా కనీసం ఈ మొత్తం అవసరం. ముఖ్యంగా విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, వీటికి సంబంధించిన కొరదలా కార్యకలాపాలను పూర్తి చేయాలి గదా. అయితే నాల్గవ ప్రణాళికా ముసాయిదా దృష్ట్యా చూస్తే యిది ఇంకెక్కువ గానే వుండవలసి ఉంది.

కొత్త సంక్షేమ కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు

మన ఆర్థిక పరిస్థితి కటకటగానే వుంటోంది. అయినా, కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపక తప్పదు. అందుకని ఈ క్రింది విధంగా ప్రత్యేకమైన కేటాయింపులు ప్రతిపాదింపబడినై.

1. గాంధీ శతజయంతి సంవత్సరంలో హరిజనులకు, గిరిజనుల ఉద్ధరణకు రూ. 100 లక్షలు.

2. అదనంగా 6 వేల వార్ధక్యపు పింఛనులను సమకూర్చటానికై (ఇపుడు ఏటా వుంటున్న 60 వేలు కాక) రూ.10 లక్షలు.

3. సైకిలు పన్నును, కొన్ని ఆదాయ వర్గాల వ్యక్తుల విషయంలో వృత్తి పన్నును, యజమానులే నడుపు రిక్షాలకు లైసెన్సు రుసుమును రద్దు చేసే ప్రతిపాదనల దృష్ట్యా పురపాలక సంఘాలకు కలిగిన నష్టానికి పరిహారం రూ. 30 లక్షలు.

4 రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలకు గ్రాంటు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం 37, ఆంధ్ర విశ్వవిద్యాలయం 20, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 11 68 లక్షల రూపాయలు.

5. పనికిరాని పోలీసు శకటాల బదులు కొత్తవాటి ఏర్పాటుకై రూ. 15 లక్షలు.

6. రాష్ట్రంలో పోలీసుశాఖలను బలపరచటానికై రూ.15లక్షలు.

7. హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాలలో సౌకర్యాల అభివృద్ధికై రూ. 40 లక్షలు.

8. విశాఖ పట్నం నగర సౌకర్యాల అభివృద్ధికై రూ.10లక్షలు.

9. వరంగల్, కాకినాడ, తిరుపతి వగైరా పట్టణాలోని ఆసుపత్రుల్లో, డిస్పెన్సరీలలో ఆహారానికీ, వైద్యానకీ, గ్రామీ డిస్పెన్సరీలను బలపరచటానికీ అదనపు కేటాయింపులు రూ. 24 లక్షలు.

సమగ్రమైన బడ్జెటును ఈ సెప్టెంబరులోగా సమర్పిస్తాను. ఆర్థిక సంఘం తుదితీర్పుకూడా ఈ లోపు ప్రకటింపబడుతుంది అలాచేసి నాల్గవ ప్రణాళిక రూపురేఖలు కూడా నిర్దిష్టం కావచ్చు తెలంగాణా మిగుళ్ళ లెక్కలూ తేలవచ్చు. ఈ విషయాలు దృష్టిలో వుంచుకొని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకొని, తుది బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించటం జరుగుతుంది. మనము అమలు జరుపుతున్న ముఖ్య కార్యక్రమాలను గురించి, విధానాలను గురించి అప్పుడు సావకాశంగా ప్రస్తావిస్తాను."

ఈ సంచికలోని వివిధ శీర్షికలను గురించి, ఇందలి రచనలను గురించి మీ అభిప్రాయాలు తెలుపండి. మీ సూచనలకు, సలహాలకు, విమర్శలకు స్వాగతం.

స్వాగత గీతం

—ముదిగొండ వీరభద్రమూర్తి

ఇదిగో కోయిల 'పోలీసు' యీలవేసె
నదిగో రివ్వున మలయానిలాఖ్య మొకటి
'కారు' వచ్చెను దిగె నధికారి సౌమ్యు
డైనఁ గాకున్న స్వాగత మాడవలయు.

విరిసిన తెలిదమ్మివిరుల నిర్మల జలా
శయము రంగొల్కు 'ట్రౌజర్ల' తోడ

పూలుపూలు నగిషీలుగ వోయిన యాట
తోఁట గాన్పించు 'బుష్కోటు' తోడ

సౌరభమ్మును గ్రోల సహకారమునఁ దుది
గ్రాలు తేఁటుల దీటు 'క్రాపు' తోడ

ఇన్నిట మిన్న లేయిగురాకుకన్న గ
న్నా కైన మెత్తందనమ్ము తోడ

చక్షురుత్సవ మిడు నీకు స్వాగతమ్ము
సమయకార్యాలయాధిపస్థాన నూత
నాగతనియంతృ చంద్రమా! స్వాగతమ్ము
సౌమ్యహాయనరత్నమా! స్వాగతమ్ము

ఎవరు తరిపివెట్టి యీక్షింతురో తమా
షాను వారి నైత్తిపైని బాయి
టోయి! నూతనాతిథేయాతిథాయి! స్వా
గతము నీకు సౌఖ్యశతము మాకు

ఆంగ్లవేషభాష లాశ్రయించిన మాకు
వారి సామయికత వారి యైక
మత్యశోభ యేలొ మనసునఁ బట్టదు
తెలుఁగులోన బుద్ధి దెలుపు మోయి!

పోవుచును బోవుచును నగ్గిపుల్ల గీచి
కీల రగిలించినాఁడోయి కీలకుండు
దాని జల్లార్పికొనఁగ మా తాతలు దిగి
వచ్చినారు సాయము నిన్ను తెచ్చినారు.

చంద్రగోళమ్మునకు వెళ్ళి జనము తిరిగి
వచ్చినంత సుఖవు గాదు వక్రగతిని
బట్టనీక దేశమును గాపాడుటలు న
వాబ్దవర! ఆశ మొల్చె నీ యాగమమున

పంట యెంత పండించిన బాగె గాని
కలసికట్టుతనమ్మను కంటనీరు
బెట్టనియకోయి! బిచ్చము బెట్టుకున్న
మానె కుక్కను బంధింపుమా! నవాబ్ద!

రెండు ప్రాంతాలకు చెందిన ప్రజలలోకూడా సమైక్యత వర్ధిల్లేందుకు ఆర్థికాభ్యున్నతి, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు జరిగే కృషి ప్రముఖంగా తోడ్పడుతుంది. సమైక్యతకు ఆర్థికాభ్యున్నతి కీలకమైందని వేరుగా చెప్పనక్కరలేదు. అందుకే సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానతలను తొలగించేందుకు దోహదపడే వివిధ కార్యక్రమాలను రూపొందించి, చేపట్టడం అనేది అటు ప్రభుత్వమూ, యిటు తత్సంబంధమైన సంస్థలూ నిర్వహించవలసిన కర్తవ్యంగా వుంటుంది.

వెనుకబడినతనం అనేది యిటు ఆంధ్ర, అటు తెలంగాణా ప్రాంతాలరెంటిలో కూడా లేకపోలేదు. ఈ బడుగుతనం తెలంగాణాలో తీవ్ర రూపంలో కనిపిస్తే, ఆంధ్రలో విస్తృత ప్రాంతంలో కన్పిస్తుంది. అంతే తేడా. ఉదాహరణకు రాష్ట్రంలో అనావృష్టి పీడిత ప్రాంతాలుగావుండే 71 తాలూకాలలో ఆంధ్రలో 49, తెలంగాణాలో 21 వున్నాయి. గ్రామీణ విద్యుదీకరణ, భూసార పరిరక్షణ, చిన్నతరహా పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, భూగర్భ జలాన్ని వెలికి దీసే కార్యక్రమాలు సత్వరం నిర్వహించడం ద్వారా నీటిపారుదల సౌకర్యాలను పెంపొందించడం లాంటి కార్యక్రమాలు తెలంగాణా ప్రాంతాభివృద్ధి విషయంలో వచ్చే ఐదు సంవత్సరాలలో ప్రధానంగా పరిగణించవలసిన విషయాలు.

ఒక నిర్ణీత ప్రణాళికా బద్ధంగా రాష్ట్రం మొత్తంమీద వుండే సహజ ఖనిజ సాధన సంపత్తులను వృద్ధిపరచుకొని జనశక్తినీ వినియోగించుకొని అభివృద్ధిని సాధించేందుకు కూడా కృషి జరగాలి.

నాలుగో ప్రణాళిక అమలు జరిగే కాలంలో పై విషయాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. తెలంగాణాలోని మిగులు నిధులను ఆ ప్రాంతంలోనే అభివృద్ధి కొరకు వినియోగించడమే కాకుండా ఈ ప్రణాళిక అమలు కాలంలో ఆ ప్రాంతానికి సంబంధించిన ప్రణాళికా పెట్టుబడుల కేటాయింపులను కూడా సరియైన పద్ధతిలో వెచ్చించడం జరగాలి.

ఇరు ప్రాంతాల మధ్య, ఆర్థిక సమానతలను నెలకొల్పే విషయంతోపాటే, భావసమైక్యత పెంపొందించేందుకు కవుల, మేధావుల, రచయితల సేవలను వినియోగించుకొనేందుకు చక్కటి కృషి జరగాలి. దీనివలన భావసమైక్యత పెంపొందడానికి చాల అవకాశంవుంటుంది. రాష్ట్రంలోని యిరుప్రాంతాల ప్రజల భావ సమైక్యతకు రచయితల సేవ అపూర్వమైనదిగా, అఖండమైనదిగా భావించవచ్చు. వీరు నిర్వహించే పాత్ర మిక్కిలి గురుతరమైనది. పెద్దఎత్తున ప్రజాసమూహంలో చైతన్యం కలిగించేందుకు వీరికృషి ఎంతగానో తోడ్పడగలదు. అయితే ఈ కార్యక్రమం నిర్వహించవలసిన పద్ధతిలో జరగాలి. తెలుగు పత్రికా రంగంకూడా ఈ విషయం సమానమైన ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను కలిగివుంటుంది. ఉపప్రాంతీయ అసంతృప్తులకు, అసమానతలకు సాధ్యమైనంతవరకు తక్కువ ప్రచారాన్నిచ్చి, అట్టిప్రాంతాల సారూప్యతలను విశేషించి వివరించేందుకు కృషి జరగడం అవసరం. మరి కొన్ని సంవత్సరాలవరకు పత్రికా రంగం రాష్ట్రంలో భావ సమైక్యతకు ప్రేరకంగా కృషిచేయవలసివుంటుంది.

సిబ్బంది బదిలీలు

సమైక్యత కొరకు మానసికమైన అనుకూల వాతావరణం ఏర్పడినప్పుడు, దానిని తెలంగాణా, ఆంధ్రప్రాంతాలకుచెందిన వివిధ హోదాలలోని పరిపాలనా సిబ్బందిని ప్రాంతీయ భావంలేకుండా పరస్పరం మార్చడంద్వారా పటిష్ఠం చేయాలి. పరిపాలనా సిబ్బందిని ముఖ్యంగా, నాన్ గెజిటెడ్ ఉద్యోగులను, ఈ విధంగా బదిలీ చేయడంపై నిర్బంధాలు వుండడంవల్ల సమైక్యతకు ప్రతిబంధకంగా వుంటున్నది. తెలంగాణాకు చెందిన అధికార్లను యితర సబార్డినేటు ఉద్యోగులను ఆంధ్ర ప్రాంతంలోనూ, యిదే విధంగా ఆంధ్రప్రాంతానికిచెందిన అధికార్లను సబార్డినేటు ఉద్యోగులను తెలంగాణా ప్రాంతంలోనూ అనేకమందిని నియమించడం వల్ల ఈ ప్రతిబంధకం తొలగిపోతుంది. ఇది ఆరోగ్యకరమైన పోటీ భావాన్ని కలిగించి, పరిపాలనా సామర్థ్యం పెంపొందడానికి దోహదంచేస్తుంది.

వర్తకం, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో అనేక విషయాలలో సదవగాహన, మైత్రీభావం వర్ధిల్లడం చాలా అవసరం. ఉభయ ప్రాంతాల ప్రజలలో ఈ విధమైన అవగాహనను, భావాన్ని పెంపొందించడానికి ఇప్పటి వరకు జరిగినకృషి స్వల్పం. ఇవి ఇదివరకే నెలకొనివున్నాయని భావించడం బహుశః దీనికి కారణం అయివుండవచ్చు ఇటీవల కలిగిన అనుభవంవల్ల వుండవలసినంత స్థాయిలో లేవనే వెల్లడైంది.

విద్యార్థులశక్తి సద్వినియోగానికై కృషి

సమైక్యతా సాధనకై, ఉభయప్రాంతాలలోని విద్యార్థుల సేవలనూ, కార్యోత్సాహాన్నీ సంపూర్ణంగా వినియోగించుకోవాలి. రాష్ట్రాభివృద్ధి కొరకు, సమైక్యతకొరకు యువతరం కృషి చేయడం అనేక విధాల అభిలషణీయమైనది. భావి మేధావి వర్గమైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, సాంఘికంగా సాంస్కృతికంగా అభివృద్ధిచెందడానికై అనువైన పరిస్థితులను సృష్టించడానికీ వీటినుంచి సత్ప్రయోజనాలు పొందడానికీ కూడా వీలువుంటుంది. యువతరంవారి సృజనాత్మకమైన, నిర్మాణాత్మకమైన శక్తి సామర్థ్యాలు ఇప్పుడు ఆందోళనా కార్యకలాపాలకు దుర్వినియోగం అవుతుండడం దురదృష్టకరం. తమభవిష్యత్తును గురించి వారికి కలిగిన తీవ్రమైన నిస్పృహ ఫలితమే ఈ కార్యకలాపాలు. నిస్పృహల నుంచి బయటపడడానికై వారికి సహాయ పడడంతోపాటుగా రాష్ట్రాభ్యున్నతికొరకు పాటుపడే దృక్పథాన్ని పెంపొందించడానికి కూడా తోడ్పడాలి.

యువతరం వారి ప్రతిభాసామర్థ్యాలను సృజనాత్మకమైన కార్యకలాపాలకు వినియోగింపజేయడం ఉభయ ప్రాంతాలలోని నాయకుల కర్తవ్యం. రాజకీయనాయకులు (ఆంధ్రప్రదేశ్‌లోనే

స్వాగత గీతం

—ముదిగొండ వీరభద్రమూర్తి

ఇదిగో కోయిల 'పోలీసు' యీలవేసె
నదిగో రివ్వన మలయానిలాఖ్య మొకటి
'కారు' వచ్చెను దిగె నధికారి సౌమ్యు
డైనఁ గాచున్న స్వాగత మాదవలయు.

విరిసిన తెలిదమ్మివిరుల నిర్మల జలా
శయము రంగొల్కు 'ట్రౌజర్ల' తోడ

పూలుపూలు నగిషీలుగ వోయిన యాట
తోఁట గాన్పించు 'బుష్కోటు' తోడ

సౌరభమ్మును గ్రోల సహకారమునఁ దుది
గ్రాలు తేఁటుల దీటు 'క్రాపు' తోడ

ఇన్నిట మిన్న లేయిగురాకుకన్న గ
న్నా కైన మెత్తందనమ్ము తోడ

చక్షురుత్సవ మిదు నీకు స్వాగతమ్ము
సమయకార్యాలయాధిపస్థాన నూత
నాగతనియంతృ చంద్రమా! స్వాగతమ్ము
సౌమ్యహాయనరత్నమా! స్వాగతమ్ము

ఎవరు తరిపివెట్టి యీక్షింతురో తమా
షాను వారి నెత్తిపైని ఱాయి
ఓయి! నూతనాతిథేయాతిశాయి! స్వా
గతము నీకు సౌఖ్యశతము మాకు

ఆంగ్లవేషభాష లాశ్రయించిన మాకు
వారి సామయికత వారి యొక
మత్యశోభ యేలొ మనసునఁ బట్టదు
తెలుఁగులోన బుద్ధి దెలుపు మోయి!

పోవుచును బోవుచును నగ్గిపుల్ల గీచి
కీల రగిలించినాఁడోయి కీలకుండు
దాని జల్లార్చికొనఁగ మా తాతలు దిగి
వచ్చినారు సాయము నిన్ను తెచ్చినారు.

చంద్రగోళమ్మునకు వెళ్ళి జనము తిరిగి
వచ్చినంత సుఖవు గాదు వక్రగతిని
బట్టనీక దేశమును గాపాడుటలు న
వాబ్ధివర! ఆశ మొల్చె నీ యాగమమున

పంట యెంత పండించిన బాగె గాని
కలసికట్టుతనమ్మును కంటనీరు
బెట్టనియకోయి! బిచ్చము బెట్టకున్న
మానె కుక్కను బంధింపుమా! నవాబ్ధి!

రెండు ప్రాంతాలకు చెందిన ప్రజలలోకూడా సమైక్యత వర్ధిల్లేందుకు ఆర్థికాభ్యున్నతి, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు జరిగే కృషి ప్రముఖంగా తోడ్పడుతుంది. సమైక్యతకు ఆర్థికాభ్యున్నతి కీలకమైందని వేరుగా చెప్పనక్కరలేదు. అందుకే సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానతలను తొలగించేందుకు దోహదపడే వివిధ కార్యక్రమాలను రూపొందించి, చేపట్టడం అనేది అటు ప్రభుత్వమూ, యిటు తత్సంబంధమైన సంస్థలూ నిర్వహించవలసిన కర్తవ్యంగా వుంటుంది.

వెనుక బడినతనం అనేది యిటు ఆంధ్ర, అటు తెలంగాణా ప్రాంతాలరెంటిలో కూడా లేకపోలేదు. ఈ బడుగుతనం తెలంగాణాలో తీవ్ర రూపంలో కనిపిస్తే, ఆంధ్రలో విస్తృత ప్రాంతంలో కన్పిస్తుంది. అంతేతేడా. ఉదాహరణకు రాష్ట్రంలో అనావృష్టి పీడిత ప్రాంతాలుగావుండే 71 తాలూకాలలో ఆంధ్రలో 49, తెలంగాణాలో 21 వున్నాయి. గ్రామీణ విద్యుదీకరణ, భూసార పరిరక్షణ, చిన్న తరహా పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, భూగర్భ జలాన్ని వెలికి దీసే కార్యక్రమాలు సత్వరం నిర్వహించడం ద్వారా నీటిపారుదల సౌకర్యాలను పెంపొందించడం లాంటి కార్యక్రమాలు తెలంగాణా ప్రాంతాభివృద్ధి విషయంలో వచ్చే ఐదు సంవత్సరాలలో ప్రధానంగా పరిగణించ వలసిన విషయాలు.

ఒక నిర్ణీత ప్రణాళికా బద్ధంగా రాష్ట్రం మొత్తంమీద వుండే సహజ ఖనిజ సాధన సంపత్తులను వృద్ధిపరచుకొని జనశక్తినీ వినియోగించుకొని అభివృద్ధిని సాధించేందుకు కూడా కృషి జరగాలి.

నాలుగో ప్రణాళిక అమలు జరిగే కాలంలో పై విషయాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. తెలంగాణాలోని మిగుల నిధులను ఆ ప్రాంతంలోనే అభివృద్ధి కొరకు వినియోగించడమే కాకుండా ఈ ప్రణాళిక అమలు కాలంలో ఆ ప్రాంతానికి సంబంధించిన ప్రణాళికా పెట్టుబడుల కేటాయింపులను కూడా సరియైన పద్ధతిలో వెచ్చించడం జరగాలి.

ఇరు ప్రాంతాల మధ్య, ఆర్థిక సమానతలను నెలకొల్పే విషయంతోపాటే, భావసమైక్యత పెంపొందించేందుకు కవుల, మేధావుల, రచయితల సేవలను వినియోగించుకొనేందుకు చక్కటి కృషి జరగాలి. దీనివలన భావసమైక్యత పెంపొందడానికి చాల అవకాశంవుంటుంది. రాష్ట్రంలోని యిరుప్రాంతాల ప్రజల భావ సమైక్యతకు రచయితలసేవ అపూర్వమైనదిగా, అఖండమైనదిగా భావించవచ్చు. వీరు నిర్వహించే పాత్ర మిక్కిలి గురుతరమైనది. పెద్దఎత్తున ప్రజాసమూహంలో చైతన్యం కలిగించేందుకు వీరికృషి ఎంతగానో తోడ్పడగలదు. అయితే ఈ కార్యక్రమం నిర్వహించవలసిన పద్ధతిలో జరగాలి. తెలుగు పత్రికా రంగంకూడా ఈ విషయం సమానమైన ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను కలిగివుంటుంది. ఉపప్రాంతీయ అసంతృప్తులకు, అసమానతలకు సాధ్యమైనంతవరకు తక్కువ ప్రచారాన్నిచ్చి, అట్టిప్రాంతాల సారూప్యతలను విశేషించి వివరించేందుకు కృషి జరగడం అవసరం. మరి కొన్ని సంవత్సరాలవరకు పత్రికా రంగం రాష్ట్రంలో భావ సమైక్యతకు పైరకంగా కృషిచేయవలసివుంటుంది.

సిబ్బంది బదిలీలు

సమైక్యత కొరకు మానసికమైన అనుకూల వాతావరణం ఏర్పడినప్పుడు, దానిని తెలంగాణా, ఆంధ్రప్రాంతాలకుచెందిన వివిధ హోదాలలోని పరిపాలనా సిబ్బందిని ప్రాంతీయ భావంలేకుండా పరస్పరం మార్చడంద్వారా పటిష్ఠం చేయాలి. పరిపాలనా సిబ్బందిని ముఖ్యంగా, నాన్ గెజిటెడ్ ఉద్యోగులను, ఈ విధంగా బదిలీ చేయడంపై నిర్బంధాలు వుండడంవల్ల సమైక్యతకు ప్రతిబంధకంగా వుంటున్నది. తెలంగాణాకు చెందిన అధికార్లను యితర సబార్డినేటు ఉద్యోగులను ఆంధ్ర ప్రాంతంలోనూ, యిదే విధంగా ఆంధ్రప్రాంతానికిచెందిన అధికార్లను సబార్డినేటు ఉద్యోగులను తెలంగాణా ప్రాంతంలోనూ అనేకమందిని నియమించడం వల్ల ఈ ప్రతిబంధకం తొలగిపోతుంది. ఇది ఆరోగ్యకరమైన పోటీ భావాన్ని కలిగించి, పరిపాలనా సామర్థ్యం పెంపొందడానికి దోహదంచేస్తుంది.

వర్తకం, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో అనేక విషయాలలో సదవగాహన, మైత్రీభావం వర్ధిల్లడం చాలా అవసరం. ఉభయ ప్రాంతాల ప్రజలలో ఈ విధమైన అవగాహనను, భావాన్ని పెంపొందించడానికి ఇప్పటి వరకు జరిగినకృషి స్వల్పం. ఇవి ఇదివరకే నెలకొనివున్నాయని భావించడం బహుశః దీనికి కారణం అయివుండవచ్చు. ఇటీవల కలిగిన అనుభవంవల్ల, వుండవలసినంత స్థాయిలో లేవనే వెల్లడైంది.

విద్యార్థులశక్తి సద్వినియోగానికై కృషి

సమైక్యతా సాధనకై, ఉభయప్రాంతాలలోని విద్యార్థుల సేవలనూ, కార్యోత్సాహాన్నీ సంపూర్ణంగా వినియోగించుకోవాలి. రాష్ట్రాభివృద్ధి కొరకు, సమైక్యతకొరకు యువతరం కృషి చేయడం అనేకవిధాల అభిలషణీయమైనది. భావి మేధావి వర్గమైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, సాంఘికంగా సాంస్కృతికంగా అభివృద్ధిచెందడానికై అనువైన పరిస్థితులను సృష్టించడానికీ వీటినుంచి సత్ప్రయోజనాలు పొందడానికీ కూడా విలువుంటుంది. యువతరంవారి సృజనాత్మకమైన, నిర్మాణాత్మకమైనశక్తి సామర్థ్యాలు ఇప్పుడు ఆందోళనా కార్యకలాపాలకు దుర్వినియోగం అవుతుండడం దురదృష్టకరం. తమభవిష్యత్తును గురించి వారికి కలిగిన తీవ్రమైన నిస్పృహ ఫలితమే ఈ కార్యకలాపాలు. నిస్పృహలనుంచి బయటపడడానికై వారికి సహాయ పడడంతోపాటుగా రాష్ట్రాభ్యున్నతికొరకు పాటుపడే దృక్పథాన్ని పెంపొందించడానికి కూడా తోడ్పడాలి.

యువతరం వారి ప్రతిభాసామర్థ్యాలను సృజనాత్మకమైన కార్యకలాపాలకు వినియోగింపజేయడం ఉభయ ప్రాంతాలలోని నాయకుల కర్తవ్యం. రాజకీయనాయకులు (ఆంధ్రప్రదేశ్‌లోనే

కాదు. అంతటాకూడా) "విద్యార్థిశక్తి"ని సాధ్యమైనప్పుడల్లా రాజకీయమైన, లేక వ్యక్తిగతమైన ప్రయోజనాలకు వినియోగించు కోవడం తప్ప సాంఘిక సేవచేయడం, ప్రజలలో ప్రబలంగా వ్యాపించివున్న నిరక్ష్యరాస్యతను, మూఢవిశ్వాసాలను నిర్మూలించ డం, శాస్త్రీయపరిశోధన సాగించడంవంటి వాంఛనీయమైన లక్ష్యాల వైపుకు మళ్ళించడంలో యిప్పటి వరకూ విఫలులయ్యారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడానికై తాము ఏమి ఆలోచిస్తున్నదీ వివరించ డానికై విద్యావంతులైన యువకులు, విశ్వవిద్యాలయ యువజను లతో ఒక సదస్సు జరపాలి.

ఈ సందర్భంలో ఒక ముఖ్యవిషయాన్ని గుర్తించుకో వడం అవసరం. ఏమంటే మనదేశంలో వెనుకబడిన ప్రజలకు, వెనుకబడిన ప్రదేశాలకు రక్షణలు యివ్వడం న్యాయసమ్మతమైన రాజ్యాంగబద్ధమైన చర్యకాగా వాటిని అనుభవించడానికి అలవాటు పడిన వారిలో సాధ్యమైనంతకాలం వరకు ఆ రక్షణలను పొందా లన్న మనస్తత్వంవుంటున్నది. రక్షణలు అమలులో వున్నప్పుడు వాటిని వెనుకబడిన ప్రాంతాలు, వర్గాల సత్వరాభివృద్ధికి తోడ్పడే టట్లుగానూ, వాటిపొడిగింపుకు ఆస్కారంలేని విధంగానూ అమలు పరచ వలసిన కర్తవ్యం, బాధ్యత ప్రభుత్వానికివుంది. కృతనిశ్చ యంతోగట్టిగా కృషిచేసి వెనుకబడివున్నామనే మనస్తత్వాన్ని విడనాడ వలసినఅవసరంకూడా ఈ వర్గాలవారికీ, ప్రాంతాలవారికీ వుంది. సమాజంలోని కొన్నివర్గాలవారికి, లేక ప్రదేశాలవారికి కల్పిస్తున్నయిటువంటి రాయతీలను, జాతీయ సమైక్యత దృష్ట్యానే కాకుండా ఆయావర్గాల ఆత్మగౌరవం దృష్ట్యాకూడా నిర్ణీత కాలం వరకు మాత్రమే లభింపజేయాలి.

ఆంధ్రప్రదేశ్ సమైక్యతకు, లేక భాషాప్రయుక్త రాష్ట్రాల సిద్ధాంతానికి భంగం ఏర్పడిందనీ, ప్రస్తుతం ఏర్పడిన అసంతృప్తి పరిస్థితికి తెలంగాణా వేరుకావడం పరిష్కార మార్గమనే భావాన్ని రాష్ట్రం వెలుపల కలిగించడానికి ఎవ్వరూ ప్రయత్నించకూడదు. ఆర్థికంగా నిలద్రొక్కుకొనకలిగిన పరిపాలనా ప్రాంతాలు మాత్రమే రాజకీయ అస్థిరత్వపు తాకిడిని తట్టుకొనగలుగుతాయనీ, ఆర్థికమైన వెనుకబడినతనాన్ని, సాంఘిక స్తంభనను అధిగమించ గలుగుతాయనీ, ఇంకాఅటువంటి వివిధ సమస్యలను పరిష్కరించ గలుగుతాయనే విషయాన్ని మనం అనుభవ పూర్వకంగా తెలుసు కున్నాము. ప్రత్యేక తెలంగాణా కానీ, లేక ప్రత్యేక ఆంధ్రకాని ఇట్టి పరిపాలనా ప్రాంతంగా నిలువలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో యిటీవల ఏర్పడిన పరిస్థితుల ఫలితం కొరకూ, తెలంగాణా రక్షణలను (ప్రత్యేకరాష్ట్రవాదులు వుండనే వున్నారు) అమలు పరచడం కోసం సాగుతున్న ఆందోళనను మనం ఏవిధంగా మాన్పించగలిగేదీ దానికొరకు దేశమంతా ఆసక్తి తో వేచిచూస్తున్నది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దక్షతతో వ్యవహరించాలి. ఎందుచేతనంటే ప్రస్తుత ఉద్యమం కొనసాగడం వల్ల దేశంలోని యితర ప్రాంతాలలోకూడా విచ్ఛిన్నకర శక్తులు బలాన్ని పుంజుకుంటాయి. ఇందువల్ల, యిప్పటికే కులతత్వం, ప్రాంతీయ తత్వం, భాషాతత్వం వంటి దురభిమానాలవల్ల ప్రమాదంలో పడినజాతీయ సమైక్యతకు మరింత హానికలుగుతుంది.

★

యాదగిరి గుట్టలో బ్రహ్మోత్సవం

యాదగిరిగుట్ట దేవాలయం తెలంగాణా ప్రాంతంలోని అతి పురాతన ఆలయాల్లో ఒకటి. ఇది నల్గొండ జిల్లాలోని రాయగిరి దగ్గరగా ఒక కొండమీద వున్నది. ఈ ప్రాంతం హైదరాబాదుకు సుమారుగా నలభై మైళ్ళదూరంలో వుంది. యాదగిరి గుట్ట క్షేత్రా నికి రోడ్డుమార్గంవుంది. రాయగిరి స్టేషను దీనికి దగ్గరలోవున్న రైల్వేస్టేషను. ఈ క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు వెలసి వున్నారు.

యాదగిరి గుట్ట చాలా కాలంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలనుంచీ అసంఖ్యాకంగా భక్తులను ఆకర్షిస్తున్నది. తెలం గాణా ప్రాంతంలోని చాలామంది పేర్లు నరసింహ అనో, నర్సిములు అనో వుండడాన్ని బట్టే యీక్షేత్ర ప్రాశస్త్యం అర్థం అవుతుంది.

రోజూ స్వామి వారి దర్శనార్థం అసంఖ్యాకులుగా వచ్చే భక్తులనిమిత్తం దేవాలయ అధికారులు అనేక కుటీరాలను యీకొండ మీద నిర్మించారు. యాత్రికులకు తాగడానికే గాక, స్నానానికి కూడా శుద్ధిచేసిన నీటిని అందించే సౌకర్యంగల క్షేత్రం బహుశా యిదొక్కటేనని ఈ దేవాలయ అధికారులు చెప్తారు ఇక్కడి స్నాన ఘట్టంలోని జలాన్ని ఏరోజుకారోజు తీసి వేసి దానిని మళ్ళీ శుద్ధిచేసి కొత్త నీటితో నింపుతారు.

యాదగిరి గుట్ట మీద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవం యీ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కన్నుల వైభవంగా జరిగినది. మొదటి నాలుగు రోజులు వేదపారాయణం తోను, భగవద్గీత, భాగవతాది పఠనాల తోను అతి వైభవంగా జరిగినది. హోమాన్ని కూడా ఘనంగా జరిపించారు. మిగిలిన దినాలలో కళ్యాణోత్సవం జరిగినది.

లక్ష్మీ నరసింహస్వామి వారి విగ్రహాన్ని నిలిపిన అందమైన రథాన్ని లక్షమంది భక్తులు భక్తి తన్మయత్వంతో, భజనతాళాలతో ఘనంగా ఊరేగించారు బాణాసంచా సామగ్రిని కాల్చారు.

సంగీత కచ్చేరీలు జరిగాయి. హరికథాగానాలు జరిగాయి. భక్తి బోధనలు, ప్రసంగాలు జరిగాయి. సాహిత్య చర్చలు కూడా జరిగాయి. ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వారు వచ్చి వీటిలో పాల్గొన్నారు. యాత్రికులకు ఏ విధమైన యిబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలనూ కలిగించారు. బీద బిక్కా జనానికి భోజనాలు పెటారు.

తెలుగు భాష ద్వారా ఉన్నత విద్యా బోధన

—కె. గంగారామ్

1969-70 విద్యా సంవత్సరమునుండి రెండేండ్ల క్రొత్త పి. యు. సి లేక ఇంటర్మీడియట్ తరగతిలో విద్యా బోధన తెలుగు భాష ద్వారా జరుపవలెనని ప్రభుత్వము నిర్ణయించుట సర్వజనవిదితము. పై తరగతిలో అన్ని శాస్త్రములను తెలుగుద్వారా బోధించుటకు ఏర్పాట్లు చేయబడుచున్నవి. పి. యు. సి సిలబసు మూడు విశ్వవిద్యాలయములకు ఏకీకృతము చేయబడుట మరియొక విశేషము. ప్రభుత్వమిదివరలోనే పి. యు. సి; బి. ఎ. పాఠ్యగ్రంథములు వ్రాయించుటకొరకు కమిటీ నేర్పరచియున్నది. మొన్న మొన్న క్రొత్తగా స్థాపించబడిన తెలుగు అకాడమీలో ఈ పాఠ్యగ్రంథముల తయారీ సంఘము విలీనము చేయబడినది. కళాశాల విద్యలయందలి వివిధ శాస్త్రములకు వలసిన ప్రత్యేక సాంకేతిక పదజాలమును సేకరించి సమకూర్చుట, సృష్టించుట ద్వారా తెలుగుభాషనభివృద్ధిజేసి విస్తృతమొనర్చుటకున్నూ, భాషా పరిశోధనల ఫలితముగా ప్రమాణీకరింపబడిన పదజాలమును ప్రత్యేక శాస్త్రములకు సంబంధించిన పత్రికలద్వారా ప్రకటించి ప్రచారము జేయుటకున్నూ ఈ అకాడమీ నియుక్తమైనదని ఊహింపతగును. శాస్త్రవిషయములందేగాక మాతృభాషయందు పాండిత్యము ప్రత్యేకజ్ఞతగల అనుభవజ్ఞులైన భాషా పరిశోధకులు, సహాయ పరిశోధకులు వివిధ శాస్త్రవిభాగములకు నియోగింపబడిరి. వారి పరిశోధనలు, వారిపరిశ్రమ ఏఫలితమునిచ్చునో, శాస్త్రగ్రంథముల తయారీకి వలసిన ప్రమాణభాష సృష్టికి ఎంతకాలము పట్టునో. కాని ప్రస్తుతావశ్యక పాఠ్యగ్రంథముల రచనలకు సంబంధించిన కొన్ని అంశములు మాత్రము గమనింపవలసియున్నది.

ప్రథమముగా. పాఠ్య గ్రంథములు గ్రాంథిక భాషలో వ్రాయబడవలెనా లేక వ్యావహారిక భాషలో వ్రాయబడవలెనా అను విషయముపై తెలుగు పండితులు భిన్నాభిప్రాయములు కలిగియున్నారు కేవలము గ్రామ్యమునుపయోగించి పెద్ద పెద్ద శాస్త్రగ్రంథముల నవలీలగా వ్రాయవచ్చునను అభిప్రాయమును వెలిబుచ్చువారు లేకపోలేదు. పాఠ్యగ్రంథములేతరహా తెలుగులో నుండవలెను? ఏ మాండలిక పదములను గ్రహింపదగును? రాష్ట్రములోని అన్ని ప్రాంతముల విద్యార్థుల అవగాహనయగు సాధారణభాషారీతి, లేక ప్రామాణికభాష ఏదైన ఒకటియున్నదా — ఈ ప్రశ్నలకు పండితుల సమాధానము లేకరీతిలో నుండవు. ఒకరి యభిప్రాయమును రెండవవారంగీకరింతురని రూఢిగా చెప్పజాలము. రాష్ట్రములోని వివిధ ప్రాంతములందలి విద్యార్థులు, వ్రాయబడిన పాఠ్య గ్రంథముల నెంతవరకు జదువగల్గుదురనునది అనుభవమునుబట్టిగాని తెలియదు.

శాస్త్రముల నాంగ్లమునుండి తెలుగు సేయుట సులభము కాదు. వృత్తి విద్యా శాస్త్రములను తెలుగుద్వారా బోధించుట ప్రస్తుతమునకసంభవము. పోస్టుగ్రాడ్యుయేటు తరగతులలోకూడ తెలుగుద్వారా బోధన ప్రస్తుతమునకు సాధ్యపడదు. గ్రాడ్యుయేటు తరగతులవరకు ప్రకృతి, సాంఘిక శాస్త్రములను తెలుగుద్వారా బోధించుటకవకాశములున్నవి. ఈ తరగతులకైనను పాఠ్యగ్రంథములు తయారుచేయుటకు చాలాకాలము పట్టును. ప్రతిశాస్త్రమునందుగల వేలకొలది మూలగ్రంథముల యాంధ్రీకరణకెన్ని దశాబ్దములు పట్టునో చెప్పజాలము. ప్రతి పాఠ్యగ్రంథము రచింపబడి, సవరణలు, పునః పరిశీలన పూర్తయినవెనుక ముద్రితమై అమ్మకమునకే వచ్చుటకు సగటున మూడు సంవత్సరముల కనీస కాలము కావలయును. ప్రతి శాస్త్రములో విభాగమునకొక పాఠ్యగ్రంథము వ్రాయబడవచ్చును. ఒక శాస్త్రవిభాగము నభ్యసించు విద్యార్థులందరు ఒకే పాఠ్యగ్రంథము చదివి ఒకేరీతిలో నుండు సమాధానములు పరీక్షలలో వ్రాయుదురుకదా! తమ తమ తరగతుల స్థాయిలోనున్న మూలగ్రంథములు అనువదింపబడనపుడు విద్యార్థులలో విజ్ఞాన వైవిధ్యమెట్లు వికసింపగలదు? సామర్థ్యముగల విద్యార్థులు మూల గ్రంథముల పఠింపనభిలషించుట సహజము కదా! అందువలన ప్రభుత్వము పాఠ్యగ్రంథముల తయారీపైననే దృష్టి కేంద్రీకరింపక వివిధ విశ్వవిద్యాలయ శాస్త్ర నిపుణులచే సత్వరము కొన్ని ప్రాథమిక మూల గ్రంథముల ననువదింపజేయవలయును.

వివిధ శాస్త్రముల సాంకేతిక పదజాలములు ప్రమాణీకరింపబడుటకు చాలా కాలమవసరము. ఈలోగా శాస్త్రగ్రంథకర్తల మధ్య అభిప్రాయభేదములు సంభవములు. ఒక గ్రంథకర్త అనుసరించిన భాషారీతి రెండవవానికి నచ్చకపోవచ్చును. ఒకరిపదము ఇంకొకరికి నచ్చకపోవచ్చును. లేదా పదములవేయైనను అర్థభేదములు సంభవములు. ఒకే శాస్త్రములో విరుద్ధ పద ప్రయోగములు తటస్థించిన గ్రంథ మగమ్యగోచరమగును. కాబట్టి సమన్వయరహితములగు స్వతంత్ర రచనలు జరుగకుండ ప్రభుత్వము తగు జాగ్రత్తలు గైకొనవలెను. లేకున్న పుఱ్ఱెకొకబుద్ధి జిహ్వకొక రుచి అనునదీ ఈ పాఠ్యగ్రంథముల రచనలవల్ల నిజమగు ప్రమాదము సంభవించును.

మనరాష్ట్రమునందలి మూడు విశ్వవిద్యాలయములకు చెందిన ఉన్నత విద్యాధికారులమధ్య పొత్తు, సహకారములుండవలెను. ఒకే విశ్వవిద్యాలయములోనున్న శాస్త్రవిభాగ పండితుల మధ్య పొత్తుకుదురుట అవసరము.

కాదు అంతటాకూడా) "విద్యార్థిశక్తి"ని సాధ్యమైనప్పుడల్లా రాజకీయమైన, లేక వ్యక్తిగతమైన ప్రయోజనాలకు వినియోగించుకోవడం తప్ప సాంఘిక సేవచేయడం, ప్రజలలో ప్రబలంగా వ్యాపించివున్న నిరక్షరాస్యతను, మూఢవిశ్వాసాలను నిర్మూలించడం, శాస్త్రీయపరిశోధన సాగించడంవంటి వాంఛనీయమైన లక్ష్యాల వైపుకు మళ్లించడంలో యిప్పటి వరకూ విఫలులయ్యారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడానికై తాము ఏమి ఆలోచిస్తున్నదీ వివరించడానికై విద్యావంతులైన యువకులు, విశ్వవిద్యాలయ యువజనులతో ఒక సదస్సు జరపాలి.

ఈ సందర్భంలో ఒక ముఖ్యవిషయాన్ని గుర్తించుకోవడం అవసరం. ఏమంటే మనదేశంలో వెనుకబడిన ప్రజలకు, వెనుకబడిన ప్రదేశాలకు రక్షణలు యివ్వడం న్యాయసమ్మతమైన రాజ్యాంగబద్ధమైన చర్యకాగా వాటిని అనుభవించడానికి అలవాటు పడిన వారిలో సాధ్యమైనంతకాలం వరకు ఆ రక్షణలను పొందాలన్న మనస్తత్వంవుంటున్నది. రక్షణలు అమలులో వున్నప్పుడు వాటిని వెనుకబడిన ప్రాంతాలు, వర్గాల సత్వరాభివృద్ధికి తోడ్పడేటట్లుగానూ, వాటిపొడిగింపుకు ఆస్కారంలేని విధంగానూ అమలు పరచ వలసిన కర్తవ్యం, బాధ్యత ప్రభుత్వానికివుంది. కృతనిశ్చయంతోగట్టిగా కృషిచేసి వెనుకబడివున్నామనే మనస్తత్వాన్ని విడనాడ వలసినఅవసరంకూడా ఈ వర్గాలవారికీ, ప్రాంతాలవారికీ వుంది. సమాజంలోని కొన్నివర్గాలవారికి, లేక ప్రదేశాలవారికి కల్పిస్తున్నయిటువంటి రాయతీలను, జాతీయ సమైక్యత దృష్ట్యానే కాకుండా ఆయావర్గాల ఆత్మగౌరవం దృష్ట్యాకూడా నిర్ణీత కాలం వరకు మాత్రమే లభింపజేయాలి.

ఆంధ్రప్రదేశ్ సమైక్యతకు, లేక భాషాప్రయుక్త రాష్ట్రాల సిద్ధాంతానికి భంగం ఏర్పడిందనీ, ప్రస్తుతం ఏర్పడిన అసంతృప్తి పరిస్థితికి తెలంగాణా వేరుకావడం పరిష్కార మార్గమనే భావాన్ని రాష్ట్రం వెలుపల కలిగించడానికి ఎవ్వరూ ప్రయత్నించకూడదు. ఆర్థికంగా నిలద్రొక్కుకొనకలిగిన పరిపాలనా ప్రాంతాలు మాత్రమే రాజకీయ అస్థిరత్వపు తాకిడిని తట్టుకొనగలుగుతాయనీ, ఆర్థికమైన వెనుకబడినతనాన్ని, సాంఘిక స్తంభనను అధిగమించ గలుగుతాయనీ, ఇంకా అటువంటి వివిధ సమస్యలను పరిష్కరించ గలుగుతాయనే విషయాన్ని మనం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాము. ప్రత్యేక తెలంగాణా కానీ, లేక ప్రత్యేక ఆంధ్రకాని ఇట్టి పరిపాలనా ప్రాంతంగా నిలువలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో యిటీవల ఏర్పడిన పరిణామాల ఫలితం కొరకూ, తెలంగాణా రక్షణలను (ప్రత్యేకరాష్ట్రవాదులు ఖండనే వున్నారు) అమలు పరచడం కోసం సాగుతున్న ఆందోళనను మనం ఏవిధంగా మాన్పించగలిగేదీ దానికొరకు దేశమంతా ఆసక్తితో వేచిచూస్తున్నది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దక్షతతో వ్యవహరించాలి. ఎందుచేతనంటే ప్రస్తుత ఉద్యమం కొనసాగడం వల్ల దేశంలోని యితర ప్రాంతాలలోకూడా విచ్ఛిన్నకర శక్తులు బలాన్ని పుంజుకుంటాయి. ఇందువల్ల, యిప్పటికే కులతత్వం, ప్రాంతీయ తత్వం, భాషాతత్వం వంటి దురభిమానాలవల్ల ప్రమాదంలో పడినజాతీయ సమైక్యతకు మరింత హానికలుగుతుంది.

★

యాదగిరి గుట్టలో బ్రహ్మోత్సవం

యాదగిరిగుట్ట దేవాలయం తెలంగాణా ప్రాంతంలోని అతి పురాతన ఆలయాల్లో ఒకటి. ఇది నల్గొండ జిల్లాలోని రాయగిరి దగ్గరగా ఒక కొండమీద వున్నది. ఈ ప్రాంతం హైదరాబాదుకు సుమారుగా నలభై మైళ్ళదూరంలో వుంది. యాదగిరి గుట్ట క్షేత్రానికి రోడ్డుమార్గంవుంది. రాయగిరి స్టేషను దీనికి దగ్గర్లోవున్న రైల్వేస్టేషను. ఈ క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు వెలసి వున్నారు.

యాదగిరి గుట్ట చాలా కాలంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలనుంచీ అసంఖ్యాకంగా భక్తులను ఆకర్షిస్తున్నది. తెలంగాణా ప్రాంతంలోని చాలామంది పేర్లు నరసింహ అనో, నర్సిములు అనో వుండాడన్ని బట్టే యీక్షేత్ర ప్రాశస్త్యం అర్థం అవుతుంది.

రోజూ స్వామి వారి దర్శనార్థం అసంఖ్యాకులుగా వచ్చే భక్తులనిమిత్తం దేవాలయ అధికారులు అనేక కుటీరాలను యీకొండ మీద నిర్మించారు, యాత్రికులకు తాగడానికే గాక, స్నానానికి కూడా శుద్ధిచేసిన నీటిని అందించే సౌకర్యంగల క్షేత్రం బహుశా యిదొక్కటేనని ఈ దేవాలయ అధికారులు చెప్తారు ఇక్కడి స్నాన ఘట్టంలోని జలాన్ని ఏరోజుకారోజు తీసివేసి దానిని మళ్ళీ శుద్ధిచేసి కొత్త నీటితో నింపుతారు.

యాదగిరి గుట్ట మీద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవం యీ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కన్నుల వైభవంగా జరిగినది. మొదటి నాలుగు రోజులు వేదపారాయణం తోను, భగవద్గీత, భాగవతాది పఠనాల తోను అతి వైభవంగా జరిగినది. హోమాన్ని కూడా ఘనంగా జరిపించారు. మిగిలిన దినాలలో కళ్యాణోత్సవం జరిగినది.

లక్ష్మీ నరసింహస్వామి వారి విగ్రహాన్ని నిలిపిన అందమైన రథాన్ని లక్షమంది భక్తులు భక్తి తన్మయత్వంతో, భజనతాళాలతో ఘనంగా ఊరేగించారు బాణాసంచా సామగ్రిని కాల్చారు.

సంగీత కచ్చేరీలు జరిగాయి. హరికథాగానాలు జరిగాయి. భక్తిబోధనలు, ప్రసంగాలు జరిగాయి. సాహిత్య చర్చలు కూడా జరిగాయి. ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వారు వచ్చి వీటిలో పాల్గొన్నారు. యాత్రికులకు ఏ విధమైన యిబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలనూ కలిగించారు. బీద బిక్క జనానికి భోజనాలు పెట్టారు.

తెలుగు భాష ద్వారా ఉన్నత విద్యా బోధన

—కె. గంగారామ్

1969–70 విద్యా సంవత్సరమునుండి రెండేండ్ల క్రొత్త పి. యు. సి లేక ఇంటర్మీడియట్ తరగతిలో విద్యా బోధన తెలుగు భాష ద్వారా జరుపవలెనని ప్రభుత్వము నిశ్చయించుట సర్వ జనామోదితము. పై తరగతిలో అన్ని శాస్త్రములను తెలుగుద్వారా బోధించుటకు ఏర్పాట్లు చేయబడుచున్నవి. పి. యు సి. సిలబసు మూడు విశ్వవిద్యాలయములకు ఏకీకృతము చేయబడుట మరియొక విశేషము. ప్రభుత్వమిదివరలోనే పి. యు. సి; బి ఎ. పాఠ్య గ్రంథములు వ్రాయించుటకొక కమిటీ నేర్పరచియున్నది. మొన్న మొన్న క్రొత్తగా స్థాపింపబడిన తెలుగు అకాడమీలో ఈ పాఠ్య గ్రంథముల తయారీ సంఘము మిళితము చేయబడినది. కళాశాల విద్యలయందలి వివిధ శాస్త్రములకు వలసిన ప్రత్యేక సాంకేతిక పదజాలమును సేకరించి సమకూర్చుట, సృష్టించుట ద్వారా తెలుగుభాష నభివృద్ధి జేసి విస్తృతమొనర్చుటకును, భాషా పరిశోధనల ఫలితముగా ప్రమాణీకరింపబడిన పదజాలమును ప్రత్యేక శాస్త్రములకు సంబంధించిన పత్రికలద్వారా ప్రకటించి ప్రచారము జేయుటకున్నూ ఈఅకాడమీ నియుక్తమైనదని ఊహింప తగును. శాస్త్రవిషయములందేగాక మాతృభాషయందు పాండిత్యము ప్రత్యేకజ్ఞతగల అనుభవజ్ఞులైన భాషా పరిశోధకులు, సహాయ పరిశోధకులు వివిధ శాస్త్రవిభాగములకు నియోగింపబడిరి. వారి పరిశోధనలు, వారిపరిశ్రమ ఏఫలితములనిచ్చునో, శాస్త్రగ్రంథముల తయారీకి వలసిన ప్రమాణభాష సృష్టికి ఎంతకాలము పట్టునో కాని ప్రస్తుతావశ్యక పాఠ్యగ్రంథముల రచనలకు సంబంధించిన కొన్ని అంశములు మాత్రము గమనింపవలసియున్నది.

ప్రథమముగా, పాఠ్య గ్రంథములు గ్రాంథిక భాషలో వ్రాయబడవలెనా లేక వ్యావహారిక భాషలో వ్రాయబడవలెనా అను విషయముపై తెలుగు పండితులు భిన్నాభిప్రాయములు కలిగియున్నారు. కేవలము గ్రామ్యమునుపయోగించి పెద్ద పెద్ద శాస్త్రగ్రంథముల నవలీలగా వ్రాయవచ్చునను అభిప్రాయమును వెలిబుచ్చువారు లేకపోలేదు. పాఠ్యగ్రంథములేతరహా తెలుగులో నుండవలెను? ఏ మాండలిక పదములను గ్రహింపదగును? రాష్ట్రములోని అన్ని ప్రాంతముల విద్యార్థుల అవగాహనయగు సాధారణభాషారీతి, లేక ప్రామాణికభాష ఏదైన ఒకటియున్నదా — ఈ ప్రశ్నలకు పండితుల సమాధానము ఏకరీతిలో నుండవు. ఒకరి యభిప్రాయమును రెండవవారంగీకరింతురని రూఢిగా చెప్పజాలము. రాష్ట్రములోని వివిధ ప్రాంతములందలి విద్యార్థులు, వ్రాయబడిన పాఠ్య గ్రంథముల నెంతవరకు జదువగల్గుదురనునది అనుభవమునుబట్టిగాని తెలియదు.

శాస్త్రముల నాంగ్లమునుండి తెలుగు సేయుట సులభము కాదు. వృత్తి విద్యా శాస్త్రములను తెలుగుద్వారా బోధించుట ప్రస్తుతమునకసంభవము. పోస్టుగ్రాడ్యుయేటు తరగతులలోకూడ తెలుగుద్వారా బోధన ప్రస్తుతమునకు సాధ్యపడదు. గ్రాడ్యుయేటు తరగతులవరకు ప్రకృతి, సాంఘిక శాస్త్రములను తెలుగుద్వారా బోధించుటకవకాశములున్నవి. ఈ తరగతులకైనను పాఠ్యగ్రంథములు తయారుచేయుటకు చాలాకాలము పట్టును. ప్రతిశాస్త్రమునందుగల వేలకొలది మూలగ్రంథముల యాంధ్రీకరణకెన్ని దశాబ్దములు పట్టునో చెప్పజాలము. ప్రతి పాఠ్యగ్రంథము రచింపబడి, సవరణలు, పునః పరిశీలన పూర్తయినవెనుక ముద్రితమై అమ్మకమునకే వచ్చుటకు సగటున మూడు సంవత్సరముల కనీస కాలము కావలయును. ప్రతి శాస్త్రములో విభాగమునకొక పాఠ్యగ్రంథము వ్రాయబడవచ్చును. ఒక శాస్త్రవిభాగము నభ్యసించు విద్యార్థులందరు ఒకే పాఠ్యగ్రంథము చదివి ఒకేరీతిలో నుండు సమాధానములు పరీక్షలలో వ్రాయుదురుకదా! తమ తమ తరగతుల స్థాయిలోనున్న మూలగ్రంథములు అనువదింపబడనపుడు విద్యార్థులలో విజ్ఞాన వైవిధ్యమెట్లు వికసింపగలదు? సామర్థ్యముగల విద్యార్థులు మూల గ్రంథముల పఠింపనభిలషించుట సహజము కదా! అందువలన ప్రభుత్వము పాఠ్యగ్రంథముల తయారీపైననే దృష్టి కేంద్రీకరింపక వివిధ విశ్వవిద్యాలయ శాస్త్ర నిపుణులచే సత్వరము కొన్ని ప్రాథమిక మూల గ్రంథముల ననువదింపజేయవలయును.

వివిధ శాస్త్రముల సాంకేతిక పదజాలములు ప్రమాణీకరింపబడుటకు చాలా కాలమవసరము. ఈలోగా శాస్త్రగ్రంథకర్తల మధ్య అభిప్రాయభేదములు సంభవములు. ఒక గ్రంథకర్త అనుసరించిన భాషారీతి రెండవవానికి నచ్చకపోవచ్చును. ఒకరిపదము లింకొకరికి నచ్చకపోవచ్చును. లేదా పదములవేయైనను అర్థభేదములు సంభవములు. ఒకే శాస్త్రములో విరుద్ధ పద ప్రయోగములు తటస్థించిన గ్రంథమగమ్యగోచరమగును. కాబట్టి సమన్వయరహితములగు స్వతంత్ర రచనలు జరుగకుండ ప్రభుత్వము తగు జాగ్రత్తలు గైకొనవలెను లేకున్న పుట్టెకొకబుద్ధి జిహ్వకొక రుచి అనునదీ ఈ పాఠ్యగ్రంథముల రచనలవల్ల నిజమగు ప్రమాదము సంభవించును.

మనరాష్ట్రమునందలి మూడు విశ్వవిద్యాలయములకు చెందిన ఉన్నత విద్యాధికారులమధ్య పొత్తు, సహకారములుండవలెను. ఒకే విశ్వవిద్యాలయములోనున్న శాస్త్రవిభాగ పండితుల మధ్య పొత్తు కుదురుట అవసరము.

మహాభారతము

తెప్పెగంటుల లక్ష్మణశాస్త్రి

యుధిష్ఠిరుడు చెప్పిన ధర్మవచనములను విని భీమసేనుడు ఇట్లు అనెను.

"మహారాజా! నీవు నురుగువలె నశించునట్టియు, పండువలె క్రిందరాలి పడునట్టియు, కాలము అనెడు బంధములో చిక్కుకొని యున్నట్టియు, మరణ స్వభావమున్ను గల మనుష్యుడవు. అట్లైనను, అందరకును వినాశము, మరణము కలిగించుచు, బాణమువలె వేగవంతమై, అంతము లేనిదై, కొలతకు వీలు పడనిదై, జలప్రవాహమువలె ప్రవహించుచుండు సుదీర్ఘ కాలమును నీవు సాకుగా పెట్టుకొని దుర్యోధనునితో సంధి చేసికొంటివి. అట్టి కాలము నీకు ఇప్పుడు ప్రత్యక్షముగా స్వాగతము ఇచ్చుచున్నట్లు భావించుచున్నావు. ఎంత అమాయకుడవు. క్షణక్షణము, సూదితో తీయు కాటుకపొడివలె, తెలియకుండ క్షీణించుచుండు ఆయువు గలిగి, క్షణభంగురమైన జీవితముగల మానవుడు కాలమును ఎట్లు ప్రతీక్షించి యుండగలడు. అనంతమైన ఆయుష్యము గలిగినవాడు గాని, లేక తన ఆయుష్యముయొక్క పరిమితిని ఎరిగిన వాడుగానీ, లేక భూత-భవిష్యత్-వర్తమానములగు అన్ని విషయములను ప్రత్యక్షముగా తెలిసికొనగలిగినవాడుగాని కాలమునకై వేచియుండగలడు. మనము వేచియుండవలసిన పదమూడు సంవత్సరముల దీర్ఘకాలము మన ఆయుష్యమును క్షీణింపజేసి మనలనందరిని మృత్యుముఖమునకు తోడుకొని పోవును. శరీరికి మృత్యువు శరీరమునందే సర్వదా నెలకొని యుండును కనుక మరణమునకన్న పూర్వమే రాజ్య సంపాదనమునకు ప్రయత్నింతముగాక. ఎవని శక్తి దాగి యుండునో, అతడు భూమికి భారభూతుడయి యుండును. అతడు జనులలో ఖ్యాతిని సంపాదించజాలడు. వైరమునకు ప్రతిక్రియ చేయజాలడు గనుక ఎద్దువలె ఇతరులు పెట్టుబాధలను అనుభవించుచు నుండవలసినవాడే యగును. అట్టివాని జన్మ అందరకును జుగుప్సా పాత్రమై నిష్ఫలమగును. రాజా! నీ బాహువులు హిరణ్యమయములు. కీర్తి పృథుచక్రవర్తి కీర్తివంటిది. కనుక శత్రువులను జయించి భుజబలముచేత సంపాదించిన రాజ్యము ననుభవించుము. రాజా! తనకు అపకారము చేసిన దుష్టుని చంపినందు వలన ఒకవేళ తనకు నరకము ప్రాప్తించినను అది స్వర్గముతో సమానము. క్రోధము వలన కలిగిన సంతాపము అగ్నికన్న తీవ్రమైనది. దానిచేత నేను రాత్రింబవళ్ళు పరితపించుచు నిద్రపట్టక ఉన్నాను. అర్జునుడుగూడ గుహలో చిక్కిన సింహమువలె మిక్కిలి తపించుచున్నాడు. దానిని ఎట్లో గజమువలె అణచుకొని యున్నాడు. మీ యాజ్ఞకు బద్ధులై యితరులు మూగవారివలె పలుకకుండనున్నారు. అందరికన్న నాకును, ద్రౌపదికిని ఎక్కువ సంతాపము గలదు. అందరును యుద్ధమునే అభినందించుచున్నారు.

"మనకంటె నీచులు మన రాజ్యమును గుంజుకొని అనుభవించుచుండుటకన్న హీనమైన బ్రతుకు మనకు మరియొకటి లేదు. రాజా! నీవు 'మంచి స్వభావము, కోమల హృదయము, దయ' ఇవి కలిగియుండుటచేత ఇంతటి ఘోరక్లేశమును గూడ సహించగలుగుచుంటివి కాని, యీ విషయములో నిన్ను ఎవరుగూడ ప్రశంసించుటలేదు. వేదమును అర్థజ్ఞాన రహితముగా గురువు చెప్పినట్లు వల్లించుచుండుట చేత బుద్ధి మందగిల్లిన శ్రోత్రియుని బుద్ధివలె నీ బుద్ధియు గురువు యొక్క ఆజ్ఞ ప్రకారము నడచుచు వివేకహీనమై తాను తెలిసికొనుటకు గాని, యితరులకు తెలుపుటకు గాని అసమర్థమైయున్నది. రాజా! నీవు దయాళువగు బ్రాహ్మణుని వలె నున్నావు. క్రూరులుపుట్టు క్షత్రియ జాతిలో నెట్లు జన్మించితివి. మహారాజా! మనువు చెప్పిన రాజ ధర్మములను నీవు వినియేయుందువు. అట్లైనను, క్రూరులూ, కపటులూ, మనకు అహితమును చేయువారూ, అశాంతచిత్తులూ, దురాత్ములునగు ధృతరాష్ట్రపుత్రులు చేయుచున్న అపరాధమును నీవు ఎందుకు క్షమించుచున్నావు? నీవు పురుష సింహుడవై బుద్ధి, శౌర్యము, శాస్త్రజ్ఞానము కలిగి ఉత్తమ కులములో పుట్టి, దానికి అనుగుణమగు శూరకర్మములు చేయక కొండ చిలువ (అజగరము) వలె ఎందుకు ఊరక కూర్చున్నావు?

"రాజా! అజ్ఞాత వాస సమయములో మమ్ము దాచియుంచ దలచుట జూడగా, ఒక పిడికెడు గడ్డిపోచలచేత హిమాలయ పర్వతము కనపడకుండ కప్పుటకు ప్రయత్నించుట వంటిది. ఆకాశములో సూర్యుడు దాగియుండజాలనట్లుగా నీవుగూడ అజ్ఞాతవాసమునందు భూమండలమున దాగియుండ జాలవు. మనచే వెడలగొట్టబడిన దుష్టరాజులు ఇప్పుడు దుర్యోధనుని చేరి యున్నారు. వారుగూడ మనను అజ్ఞాతవాసములో కనుగొని బాధించుటకు పూనెదరు. మన మిప్పుడు పదమూడు మాసములుగా ఈ వనములో నున్నాము. ఒక్కొక్క నెల ఒక్కొక్క సంవత్సరమునకు ప్రతినిధిగా భావించి మింకను మనమెంత కష్టమీ వనములో ననుభవించవలసి యున్నదో ఊహించుకొనుము. నిక్కముగా మాసము సంవత్సరమునకు ప్రతినిధియని పెద్దలు చెప్పుదురు. ఈ మన పాపము ఒక పెద్ద యెద్దునకు కడుపునిండుగా

నాహారము పెట్టినచో పోవునట్టిది. కనుక రాజా! ఇప్పుడు యుద్ధము చేయుట తప్ప నీకు గత్యంతరములేదు. అది క్షత్రియునకు ధర్మమైకూడ నున్నది". అని భీమసేనుడు చెప్పిన మాటలను విని యుధిష్ఠిరు డిట్లనెను :—

"తమ్ముడా! అతి సాహసముతో చేయబడిన కర్మలు దుష్పరిణామమును కలిగించును. బాగుగా విచారించి చేసిన పనులు సఫలములగును. అప్పుడు దైవముగూడ అనుకూలించును. నీవు బలదర్పముచేత ఇప్పుడే యుద్ధము చేయవలెననుచున్నావు. భీష్మ-ద్రోణ-కర్ణాదులు దుర్యోధనునకు సహాయకులుగ నున్నారు. వారందరు యుద్ధ తంత్ర విశారదులు. దుర్యోధనునకై ప్రాణములను గూడ విడుచుటకు సంసిద్ధులైయున్నారు. భీష్మాదులు ఒకవేళ మన యెడల గూడ సమాన ప్రేమగలిగియున్నను అతని అన్నమును తినుచున్నారు గాబట్టి ధర్మపరులై అతని వైపే పోరాడెదరు. వారందరిని జయించక, వారిచే రక్షింప బడుచున్న దుర్యోధనుని అసహాయుడవగు నీవు ఓడించ జాలవు. కర్ణుని పరాక్రమమును తలచినపుడెల్ల నాకు నిద్ర పట్టదు." అని చెప్పిన ధర్మరాజు మాటలకు భీముడు బదులు చెప్పజాలక క్రోధమును మ్రింగికొని ఊరకొండెను.

ఇట్లు ఆ యిరువురు మాట్లాడుచుండగనే వ్యాసమహాముని అక్కడికి విచ్చేసి పాండవులచేత పూజితుడై యుధిష్ఠిరునితో నిట్లనెను:—

"ధర్మరాజా! నీ హృదయమును కనుగొని వెంటనే యిక్కడికి వచ్చితిని. భీష్మ-ద్రోణాది మహావీరుల వలన నీవు భయపడవలసిన యవసరములేదు. నీకొక మంత్రమును ఉపదేశించెదను. దానిని అనుష్ఠించి సిద్ధిపొంది చింతను వీడుము. నీకు మంచికాలము సంప్రాప్తమైనది. ఇప్పుడు 'ప్రతిస్మృతి' అను విద్యను నీకు ఉపదేశించెదను. ఆ విద్య ద్వారా అర్జునుడు శివుని, ఇంద్రాది దేవతలను సులభముగా దర్శించి అనేక దివ్యాస్త్రములను సంపాదించగలడు. అర్జునుడు సామాన్యుడుగాడు. పూర్వపు నర-నారాయణమునులలో నితడు 'నరుడు'. ఇతడు అజేయుడు. ఈ విద్య ద్వారా అతడు అస్త్రశస్త్రములను సంపాదించి ఇతోధికముగా శక్తిమంతుడగును." అని చెప్పి వ్యాసభగవానుడు ధర్మరాజునకు 'ప్రతిస్మృతి' విద్యామంత్రమును ఉపదేశించి 'యీ ద్వైతవనమును' వీడి మీరు మరియొక వనమునకు పొండు. ఒకచోటనే చాలకాలము ఉండినచో ఇచటి మునులకు, పశుపక్షి మృగాదులకు మీ ఉనికివలన ఇబ్బంది కలుగును." అని చెప్పి వ్యాసుడు అంతర్ధానము చెందెను. ఆ విద్యను స్వీకరించి వ్యాసాజ్ఞ ప్రకారము యుధిష్ఠిరుడు ఆ వనమును విడిచి సపరివారముగా 'కామ్యక' వనమునకు పోయి యచట నివాస మేర్పరచుకొని నిత్యకృత్యములు, వేదోక్త ధర్మకార్యములు జరిపికొనుచు నుండెను.'

ఇట్లుండగా కొంతకాలమునకు ధర్మజుడు వ్యాసముని చెప్పిన మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని అర్జునుని ఏకాంతమునకు తోడుకొని పోయి యిట్లనెను:—"నాయనా! భీష్మ-ద్రోణ-కృప-అశ్వత్థామల యందు ధనుర్విద్య పూర్తిగా నాలుగు పాదములతో నిలిచియున్నది. వారు, దైవము-బ్రాహ్మము-మానుషము' అను మూడు విధములగు అస్త్రప్రయోగములను నేర్చినవారు. అట్టి వారితో పోరాడుటకు అంతటి శక్తిగలవానికే సాధ్యమగును. తదితరులు గూడ అతి సమర్థులు. దుర్యోధనుని వైపు యుద్ధము చేయుటకు సంసిద్ధులై యున్నారు. వారినందరిని అతడు మిక్కిలి పూజా భావముతో ఆదరించుచున్నాడు. కనుక అట్టి వారిని జయించుటకుగాను నీవు వ్యాసముని ప్రసాదించిన మంత్రము చేత ఇంద్రుని గూర్చి తపస్సు చేసి, దేవతలందరు వృత్రాసుర సంహార కాలమునందు అతని యందు నిక్షేపించియున్న దివ్యాస్త్రములన్నియు పొందుము. ఇంద్రుడు ప్రసన్నుడై ఆ యస్త్రములన్నియు నీకు ఇచ్చును. ఇప్పుడే నీవు దీక్షగొని వెడలిపొమ్ము." అని చెప్పి ధర్మరాజు అర్జునునకు 'ప్రతిస్మృతి' మంత్రమును ఉపదేశించి పంపెను. అర్జునుడు పెద్దలకు నమస్కరించి బ్రాహ్మణాశీర్వాదములుగొని ఆయుధములను ధరించి బయలుదేరుచుండగా, ద్రౌపది అతనితో నిట్లనెను:—

"ధనంజయా! నిన్ను కనినప్పుడు కుంతి యెట్టి కోరికలను మనస్సులో నిన్నుగూర్చి కలిగి యుండెనో, ఎట్టి కోరికలు నీ మనస్సులో నున్నవో వాటిని నెరవేర్చు సమయము ఆసన్నమైనది. నిండు సభలో నన్ను జూచి దుర్యోధనుడు 'గోవు' అని పిలిచెను. అనగా, 'అనేక పురుషులు ఉపభోగించు జంతువు' అని అర్థముగదా! ఇంకను అనేక దుర్భాషలాడెను. మా ఆశలన్నియు నీయందే పెట్టుకొని యున్నాము. మనకు గలిగిన అవమానమును శత్రువులతోసహా తుడిచివేయుము. పొమ్ము. నీకు శుభమగు గాక. సమస్త దేవతలు నిన్ను రక్షించుదురుగాక" అని చెప్పెను.

అర్జునుడు మంత్రబలముతో ముందుకు నిర్విఘ్నముగా సాగుచుపోయెను. తపస్విజనసేవితమైన హిమాలయమును చేరెను. అచ్చటి నుండి 'గంధమాదన' పర్వత మార్గముగా 'ఇంద్రకీల' పర్వతమును చేరగనే "ఇక్కడనే నిలువుము" అని ఆకాశవాణి అతనికి వినపడెను. అది విని అర్జునుడు నలువైపుల పరికించి చూచెను. ఒక చెట్టు క్రింద తపస్సు చేయుచున్న ముని కనపడెను. అతడు అర్జునునిచూచి, 'నాయనా! ఎవరు నీవు? ఆయుధములేల ధరించితివి? ఈ పర్వతము శాంతులైన తపస్వులకు, బ్రహ్మవేత్తలకు నివాసమేకాని, ధనుర్ధారులకు కాదు' అని నవ్వుచు ననెను. కాని, అర్జునుడు ధైర్యము వీడక ఆయుధములను దిగవిడువలేదు. అప్పుడు ఆ ముని ప్రసన్నుడై 'ఓ వీరుడా! నేను ఇంద్రుడను. వరము కోరుకొనుము' అని యనెను. అది విని అర్జునుడు పరమానంద భరితుడై 'వెదకబోయిన పెన్నిధి నా యెదుటనే లభించినది' అనుకొని 'నాకు సమస్త దివ్యాస్త్రములను అనుగ్రహించుము' అని యింద్రుని వేడెను. అప్పుడు ఇంద్రుడు 'నీకు అస్త్రములతో నిక్కడ పనియేమి? ఉత్తమగతిని, సుఖమును, సమస్త వైభవములను కోరుకొనుము. ఇచ్చెదను' అనెను. ఆ మాటకు అర్జునుడు. 'నా సోదరులను అడవులపాలుచేసి, శత్రు విజయమును సాధించక, నాకు త్రిలోకాధిపత్యము, చివరకు శాశ్వత సుఖము అబ్బినను అక్కరలేదు. ఈ లోకములో సదా

అపకీర్తిపాలు కాగోరను' అని చెప్పెను. ఆ మాట విని యింద్రుడు 'పరమేశ్వరుని దర్శించుము. అప్పుడు నీకు దివ్యాస్త్రము లన్నియు ఇచ్చెదను. ఆ మహాదేవుని దర్శనార్థమై యత్నించుము' అని చెప్పి అంతర్ధానము చెందెను. అర్జునుడు తపస్సు చేయుటకు పూని ఆ యింద్రకీల పర్వతము నుండి ఘోరము, సుందరమునైన అడవిని దాటి హిమాలయ భాగమునుచేరి దీక్షతో పరమేశ్వరుని గూర్చి తపస్సు చేయుటకు ఆరంభించెను.

మొదటి నెలలో మూడు దినముల కొకమారు, రెండవ మాసములో ఆరు దినముల కొకమారు, మూడవ నెలలో పక్షమున కొకమారున్ను ఫలములను తినుచు తపస్సు చేసెను. నాలుగవ నెలలో కేవలము వాయుభక్షణము చేయుచు ఊర్ధ్వబాహువై, కాలి బొటనవ్రేలిమీద నిలబడుచు తపస్సు చేసెను. అతని ఘోర తపస్సును జూచి మహర్షులందరు భయపడి పరమేశ్వరునికడకుపోయి 'దేవా! ఈ యర్జునుని ఉగ్రతపస్సును మేము భరించజాల కున్నాము. అతని తపోగ్నిచేత ఈ ప్రాంతమంతయు తపించు చున్నది. కనుక అతనిని తపస్సు నుండి వారింపుడు' అని వేడు కొనగా, ఉమాపతియైన భగవంతుడు 'మీరు భయపడకుడు. అర్జునుడు, స్వర్గాది సుఖములనుకోరి తపస్సు చేయుటలేదు. అతని మనోగతమును నేనెరుగుదును. అతని కోర్కెను తీర్చెదను. మీరు వెడలిపొండు' అని చెప్పెను. వారందరును భగవంతుని యాజ్ఞప్రకారము సంతుష్టులై తమ తమ స్థానములకు పోయిరి.

కిరాతార్జునుల యుద్ధము

ఆ మునులు పోయిన తరువాత భగవంతుడైన శివుడు కిరాత వేషమును ధరించి అర్జునుని తపోవనమునకు వచ్చెను. పార్వతీదేవి కూడ కిరాతస్త్రీ వేషము ధరించి, అట్టి రూపమునే ధరించిన వేలకొలది స్త్రీలతో పరమేశ్వరుని అనుసరించి వచ్చెను. ఆ మాయ కిరాతుడు అర్జునుని సమీపించగా అప్పుడు 'మూక'అను రాక్షసుడు అడవి పంది యాకారముతో అర్జునుని సంహరింప బూను చుండెను. అప్పుడా వరాహముపై అర్జునుడు బాణప్రయోగము చేయుచుండగా, మాయా కిరాతరూపియగు భగవంతుడు అర్జునుని ఆపి, 'ఈ వరాహమును నేను తరుముకొని వచ్చినాను. నాకు గురియైన దీనిని నీవెట్లు కొట్టెదవు?' అని యనెను. అర్జునుడు ఆ మాటలను లక్ష్యపెట్టక పందిని కొట్టెను. ఏకకాలమునందే మాయా కిరాతుడు గూడ దానిపై బాణమును విడిచెను. ఆ రెండు దెబ్బలు తగిలి వరాహరూపధారియగు రాక్షసుడు క్రిందపడి మరణించెను. అప్పుడు మాయా కిరాతునకు అర్జునునకు, ఇట్లు సంవాదము జరిగెను:-

అర్జు:- ఈ వనమునందు స్త్రీ సహితుడవై నిర్భయముగా తిరుగుచున్న నీ వెవడవు? నా లక్ష్యమైన పందిని ఏల కొట్టితివి? ఇది తొలుత నాకడకు వచ్చి నాకు వశమైయుండెను. నాకుగురియైన దానిని నీవు కొట్టితివి. ఈ యపరాధమును సహించను. ఇది వేటకాని ధర్మముకాదు. నీవు అటవికుడవైనను నిన్ను విడువను, చంపెదను.

కిరా:- ఇదిమాకు నివాసస్థానము గనుక ఈ క్రూరాటవిలో నివసించుటకు మాకు భయములేదు. కాని, నీవు ఇక్కడికి ఎట్లువచ్చి నివసించుచుంటివి? సుకుమారుడవు ఏకాకిగా ఇక్కడికేల వచ్చితివి?

అర్జు:- నాకు గాండీవ ధనుస్సు, అగ్ని గోళముల వంటి బాణములు సహాయములు. వీటితో నిర్భయముగా నేనెక్కడనైనను ఉండగలను. మృగరూపమును ధరించిన రాక్షసుడు నన్ను చంపుటకు రాగా నేను వానినే చంపితిని.

కిరా:- తొలుత నా దెబ్బచేతనే ఈ పంది చచ్చెను. ఇది నా వశములో నాకు గురిగా వచ్చినది. కనుక మూర్ఖుడా! నీ తప్పులను ఇతరులపై రుద్దుటకు జూచెదవు. నీకు మిక్కిలి బలగర్వమున్నది. నా నుండి తప్పించుకొని పోజాలవు. స్థిరముగా నిలిచి నా బాణముల నెదుర్కొనుము.

అప్పుడు అర్జునుడు క్రోధముతో కిరాతుని బాణముల నెదిరించి యతనిపై బాణప్రయోగము చేసెను. ఆ యిరువురకు ఘోరముగా యుద్ధము జరిగెను. అర్జునుడెన్ని దెబ్బలు కొట్టినను కిరాతుకుడు గాయపడక అచలమువలె నిలుచుండెను. తన బాణ వర్షము కిరాతుని యెడల వ్యర్థమగుట చూచి యర్జునుడు ఆశ్చర్య పడి "ఆహా! నా గాండీవ నిర్ముక్త బాణములు నెదరించగలవాడు లేడు. అయినను ఇతడు కించిత్తుగూడ బెదరక పర్వతమువలె నిశ్చలముగా నిలుచున్నాడు. ఇతడు సామాన్య కిరాతుడుగాడు. దేవుడై యుండును. పరమశివుడు దప్ప నా బాణముల దెబ్బకు తట్టుకొనువాడు ఎవడు? దేవుడైనను, దేవదేవుడైనను సరియే నేను ఈతనిని చంపెదను." అని తలచి యతనిపై తీవ్రముగా బాణప్రయోగము చేసెను. ఆ బాణములను భగవంతుడు ప్రసన్నుడై స్వీకరించెను. అది పర్వతముపై పాషాణ వర్షము వలె కిరాతునకు గాయములుగాని, ఎట్టి బాధగాని కలిగించకుండెను. క్షణకాలములో అర్జునుని అక్షయములగు అమ్ముల పొదులు శూన్యము లయ్యెను. అదిచూచి అర్జునుడు అగ్నిదేవుని స్మరించి, ఆ దేవుడు పూర్వము ఖాండవవన దహనకాలములో తనకిచ్చిన 'అక్షయ తూణీరములు' ఇట్లు శూన్యములగుటకు చింతించి, 'ఈ కిరాతుడే నా బాణములన్నియు మ్రింగెను.' అని కోపముతో ఏమియుతోచక భయగ్రస్తుడై వింటి కొనతో కిరాతుని కొట్టెను. దానిని గూడ పరమేశ్వరుడు లాగు కొనెను. అర్జునుడు కత్తితోకొట్టెను. అది మొక్కవోయెను. తిరిగి వృక్షములతోను, పాషాణములతోను కొట్టెను. అవియు వ్యర్థము లయ్యెను. పిదప ఇరువురకు ముష్టియుద్ధము జరిగెను. దానిలో మాయా కిరాతుని ముష్టి ప్రహారములచేత శిథిలాంగుడై అర్జునుడు బాధపడెను. అప్పుడు తన ఆరాధ్య దైవమగు శివుని పార్థివ రూపమును (మట్టితో చేసిన లింగము) చేసి పూజించి పుష్పమాలను ఆలింగముపై సమర్పించెను. ఆ మాల కిరాతుని తలపై ప్రకాశించుటను చూచి అర్జునుడు ఆశ్చర్యపడి, 'దాసోహ' మని కిరాతుని పాదములపై పడెను. అప్పుడు పరమేశ్వరుడు ప్రసన్నుడై యిట్లనెను:-

"అర్జునా! నీ భక్తికి, శౌర్యమునకు నేను సంతుష్టుడనైతిని. నీతో సమానుడగు క్షత్రియుడులేడు. ఇప్పుడు నీకు నాతో సమానమైన తేజస్సు కలిగినది. నీకు దివ్యదృష్టిని ప్రసాదించితిని. నా దివ్యరూపమును చూడుము నీవు పూర్వము 'నరుడు' అను మునివిగా నుంటివి అట్టి నీ పూర్వరూపమును గూడ చూడుము. నీవు శత్రువుల నందరిని జయించగలవు. దేవతలుగూడ నిన్ను ఎదిరించజాలరు. ఇప్పుడు నీకు 'పాశుపతాస్త్రము'ను ఇచ్చెదను. దానిని ధరించు శక్తిని గూడ నీకు ప్రసాదించెదను."

ఆమాటలకు అర్జునుడు ఉప్పొంగి ఆ దేవదేవునకు సాష్టాంగముగా ప్రణమిల్లి ఆ దేవుని యెదుట తలవంచి నిలిచి యిట్లు ప్రస్తుతించెను:-

"మహాదేవా! నీవు సమస్త జగత్తునకు కారణభూతుడవు. నీవే విష్ణుస్వరూపుడవు. విష్ణువు నీ రూపము. మీ యిరువురిలో భేదములేదు మహాదేవుడగు నీ యెడల నేను చాల అపచారము చేసితిని. నన్ను క్షమించుము నిన్ను దర్శించవలెనను ఆకాంక్షతో ఈ వనమునకు వచ్చితిని. నీ భక్తుడను. అజ్ఞానముచేత అపరాధము చేసితిని. నిన్ను శరణు జొచ్చితిని క్షమించి అనుగ్రహించుము." అదివిని భగవంతుడు అర్జునుని చేయిపట్టుకొని 'చింత చేయకుము. నిన్ను అనుగ్రహించుటకే యిక్కడికి వచ్చి నీ శక్తిని పరీక్షించుటకు నీతో యుద్ధము చేసితిని. నిన్ను క్షమించుటకు నీ యపరాధ మిందేమియు లేదు' అని చెప్పి అర్జునుని గాఢముగా ఆలింగనము చేసికొని తిరిగి అతనితో నిట్లనెను:-

"అర్జునా! నీవు పూర్వము 'నర-నారాయణ'మహామునులలో 'నరు' డను వాడవు. మీ యిరువురి తేజస్సు చేతనే ఈ జగత్తు నిలిచియున్నది ఇంద్రుని పట్టాభిషేక సమయమునందు నీవు, కృష్ణుడు ఏ ధనుస్సుతో రాక్షసులను వధించితిరో అదియే యీ గాండీవము దీనినీ, నీకు అగ్నిదేవుడిచ్చిన అక్షయతూణీరములనూ నేను గ్రహించి నిన్ను నిర్వీర్యునిచేసి నీశరీరమును గాయపరచితిని. ఇప్పుడు నీగాయములన్నియు మాని నీవు వజ్రకాయుడవయ్యెదవు. నీ యెడల ప్రసన్నుడనైతిని నిన్ను ఎదిరించగల సమర్థుడు త్రిలోకములలో నెవడును నుండజాలడు. వరము కోరుము. ఇచ్చెదను" ఆ మాటలకు అర్జునుడు మిగుల ఆనంద పరవశుడై దేవదేవునకు నమస్కరించి యిట్లనెను:-

"దేవా! నన్ను 'అనుగ్రహించి నాకు పాశుపతాస్త్రమును ప్రసాదించుము. దాని చేతనే నీవు ప్రపంచ ప్రళయమును సాధించెదవు కదా! అదియే 'బ్రహ్మశిరోస్త్రము' అన బడునుగదా! దాని సహాయముతో నేను యుద్ధములో భీష్మద్రోణాది మహావీరులను జయించెదను. భూతప్రేత పిశాచాదులను దహించెదను ఆ యస్త్రమునుండి వేలకొలది శూలములు, ఉగ్రములగు గదలు, సర్పములవంటి బాణములు పుట్టును. నీ యనుగ్రహముచేత ఆ యస్త్రమును గొని తిరిగిపోయి కురువీరుల నందరిను జయించెదను." ఆ మాటలు విని భగవంతుడు ప్రసన్నుడై యిట్లనెను:-

"పాండుకుమారా! నాకు పరమప్రియమైన పాశుపతాస్త్రమును నీకు ఇచ్చెదను. దీనిని ధరించుటకు, ప్రయోగించుట, ఉపసంహరించుటకును నీ వొక్కడవే సమర్థుడవు. దేవతలలో నెవరుగూడ దీనిని ధరింపజాలరు. నీవు దీనిని అల్పశక్తిగల పురుషునిపై ప్రయోగించినచో నిది ప్రపంచమును దహించివేయును దీని ప్రయోగముచేత వధ్యుడుకాని వాడెవడును మూడు లోకములలో లేడు దీనిని మనస్సుచేత, దృష్టిచేత, వాక్కుచేత సంకల్పించికొని, దీనితో బాణమును అభిమంత్రించికొని ప్రయోగించినచో నిది శత్రువులను నశింపజేయగలదు"

ఆ మాటలు విని అర్జునుడు త్వరగా శుచియై యేకాగ్రచిత్తముతో ఆ మహామంత్రమును స్వీకరించుటకు సంసిద్ధుడై యుండెను. పరమేశ్వరుడు 'పాశుపతమును' రహస్యముగా అతనికి ఉపదేశించెను. అప్పుడు భూమి కంపించెను. దిక్కులయందు శంఖ దుందుభులు మ్రోగెను. ఆ యస్త్రము శరీరధారియై అర్జునుని ప్రక్క నిలిచియుండుటను దేవతలు చూచిరి. భగవంతుడు అర్జునుని శరీరమును స్పృశించి నంతనే అతని అశుభములన్నియు నశించెను 'ఇక నీవు స్వర్గమునకు పొమ్ము' అని యాజ్ఞాపించగనే అర్జునుడు ఆ దేవునకు ప్రణమిల్లి నిలిచెను. అప్పుడతనికి భగవంతుడు 'గాండీవము'ను అక్షయతూణీరములను ఇచ్చి అతడు చూచుచుండగనే అంతర్ధానము చెందెను.

అర్జునుని స్వర్గలోక యాత్ర

అర్జునుడు, తనకు పరమేశ్వర సాక్షాత్కారము లభించి అతని దర్శన భాగ్యమును, స్పర్శసుఖమును పొందినందుకు తనను తాను ధన్యునిగా తలచెను. భగవంతుడనుగ్రహించి యిచ్చిన వరమునకు ఉప్పొంగెను. ఇట్లుండగా నచటికి, వైడూర్యమణి వర్ణముగల వరుణ దేవుడు జలజంతు పరివారముతోను విమానములో కుబేరుడు యక్షగణముతోను, యముడు పితృగణముతోను, ఐరావతముపై ఇంద్రుడు శచీదేవితో, దేవగణముతోను అర్జునుని చూచుటకు వచ్చిరి. అప్పుడు యముడు, "అర్జునా! నీకు దివ్యదృష్టిని ఇచ్చితిని, దిక్పాలకులమగు మమ్ము చూడుము. నీవు భగవంతుడైన శివుని అనుగ్రహమును సంపాదించితివి " నీకు కొరత లేదు. భీష్మాది యోధవరులను, రాక్షసాంశసంభూతులగు నివాతకవచకాలకేయాదులను నిర్జించగలవు. నీవు, కృష్ణుడు ఇరువురును భూభారమును తగ్గించగలరు నీ. నేనిప్పుడు 'దండాయుధమును' ఇచ్చెదను దీనిని తీసికొని నీవు గొప్ప గొప్ప కార్యములను సాధించగలవు" ఆ మాటలు విని అర్జునుడు సంతుష్టుడై సమంత్రకముగా నాయస్త్రమును స్వీకరించెను. అట్లే వరుణదేవుడు 'పాశములను' కుబేరుడు 'అంతర్ధానము' అను పేరుగల అస్త్రమును ఇచ్చిరి వానినన్నిటిని స్వీకరించి అర్జునుడు ఆ దేవతలకు నమస్కరించెను. అప్పుడు ఇంద్రుడు అర్జునుని మిగుల ప్రశంసించి, 'తన రథములో స్వర్గపురికి రమ్ము, అక్కడ నీకు అనేక దివ్యాస్త్రముల నిచ్చెద' నని చెప్పెను. దిక్పాలకు లందరును అంతర్ధానము చెందిరి.

అర్జునుడపుడు స్వర్గపురికి పోవదలచి యింద్రుని రథమును స్మరించగనే అది మాతలియుక్తముగా వచ్చి యతని యెదుట నిలిచెను. ఆ రథ ధ్వనిచే దిక్కులు పిక్కటిల్లు చుండెను. దానిలో, ఖడ్గములు, శక్తులు, గదలు మొదలైన అనేక దివ్యాస్త్ర శస్త్రము లుండెను. శ్వేత-పీతవర్ణములుగల పదివేల గుఱ్ఱములు దానిని వహించి యుండెను. నీలవర్ణముగల "వైజయంత" ధ్వజము ఆకాశమున భాసిల్లుచుండెను. అప్పుడు సారథియగు మాతలి అర్జునునకు నమస్కరించి. "ఇంద్రాజ్ఞయైనది. అర్జునా! ఈ రథములో నీవు దేవలోకమునకు బయలుదేరుము. అచట ఇంద్రాది దేవతలు నీ కొరకై నిరీక్షించుచున్నారు" అని చెప్పెను.

అప్పుడు అర్జునుడు మాతలిని తొలుత రథముపైకూర్చుండి అశ్వముల పగ్గములను పట్టుకొనుమనెను మాతలి తొలుత ఎక్కెను. పిదప అర్జునుడు ఇన్నాళ్లుగా తనకు ఆశ్రయమిచ్చిన హిమాలయపర్వతమునకు నమస్కరించి దానిని స్తుతించి, దాని నుండి సెలవుగైకొని రథమెక్కెను అంతరిక్షములో పోవునప్పుడు అర్జునునకు సూర్యుడుగాని, చంద్రుడుగాని, అగ్నిగాని మరియే యితర తేజోమూర్తులున్నట్లు కనపడలేదు అచటి ప్రతి వ్యక్తియు స్వప్రభ చేతనే వెలుగుచుండెనగాని సూర్యాదుల వెలుగుచేత ప్రకాశించకుండెను మనకు చిన్నవిగా కనపడు నక్షత్రములక్కడ పెద్దవిగా నీతనికి గోచరించెను. ఆ వైభవమును చూచి అర్జునుడు విస్మయమునంది, 'పుణ్యము చేసినవారు ఈ నక్షత్ర రూపములో నిచట నుండెదరు' అని మాతలి వలన తెలిసికొనెను. స్వర్గపురిని చేరుచు పుర ద్వారమునందు, కొమ్ములుగల కైలాస పర్వతమువలె నున్న 'ఐరావత' గజమును చూచి, పూర్వము మాంధాతరాజు వలె నతడు స్వర్గపురములో ప్రవేశించెను. సిద్ధులు, మునులు సర్వదా అచట నుందురు. అన్ని ఋతువుల పుష్ప ఫలము తో విరాజిల్లు నందనవనము కలదు. అది చూచి ఆనందించెను. అచటినుండి ముందుకు సాగిపోవుచు అమరావతీ పత్తనములో అనేక సిద్ధ సాధ్యాది దేవగణములను, మునిగణములను దర్శించుచు ఇంద్ర భవనమును చేరెను ఇంద్రుడు మిక్కిలి ఆదరించి యతనిని తన యర్ధాసనమున కూర్చుండ బెట్టుకొనెను. అప్పుడా సింహాసనము, ఆయిరువురిచే, కృష్ణపక్ష చతుర్ధశినాడు సూర్యచంద్రులు ఏక కాలములో నుదయించినప్పటి ఆకాశమువలె ప్రకాశించెను. అర్జునుడు అచట గంధర్వులు, తుంబురులు చేయుగానములను వినుచు, రంభాది దేవకాంతలు చేయుచున్న నృత్యములను తిలకించుచు ఆనందపరవశుడై యుండెను అతడక్కడ నివసించుచు ఇంద్రుని నుండి సమస్తదివ్యాస్త్రములను గ్రహించుచుండెను. ఇంద్రునియోగముపై చిత్రసేనునినుండి గీతవాదిత్రాములను నేర్చెను. నృత్యమును నేర్చెను. ఇన్ని ఆనందములు, స్వర్గసుఖము ననుభవించుచున్నను అర్జునుడు తన తల్లిని, సోదరులను తలచికొని విచారపడుచుండెను.

అర్జునుని మనస్సు ఊర్వసిపై లగ్నమైనట్లు ఇంద్రుడు కనిపెట్టి చిత్రసేనుని ఏకాంతమునందు పిలిచి యిట్లనెను!—
"నీవు వెంటనే పోయి ఊర్వశిని అర్జునుని సేవకొరకు సిద్ధము చేయుము. నేను అతనిని దివ్యాస్త్రకోవిదునిగా చేసితిని. నీవు గాంధర్వ విద్యలో నిపుణునిగా చేసితివి. ఇప్పుడు ఆ విధముగానే అతడు స్త్రీ సంగమంలోగూడ చతురుడగునట్లు ఊర్వశిద్వారా ప్రయత్నించుము." ఆ మాట విని చిత్రసేనుడు ఊర్వశి కడకు పోయి ఆమెచేత సత్కృతుడై "దేవతలలోను, మానవులలోను, ప్రఖ్యాతములగు సుగుణములు గలవాడు, సంపద, శీలము, రూపము, శమము దమము, వర్చస్సు, తేజస్సు, ఓర్పును గలిగి, మాత్సర్యము లేనివాడై, సాంగవేదములను అభ్యసించిన వాడై గురుశుశ్రూషా నిరతుడై, మేధావియై, బ్రహ్మచర్యము, కార్యదక్షత గలిగి యింద్రునివలె విరాజిల్లుచున్న అర్జునునికడకు నీవు పోయి అతనిని సంతుష్టి పరచుము ఇది యింద్రాజ్ఞ. నీ యెడల అర్జునుడుకూడా ప్రసన్నుడై యున్నాడు" అని చిత్రసేనుడు చెప్పగా విని ఊర్వశి చిరునవ్వుతో "చిత్రసేనా! నివు అర్జునునిగూర్చి చెప్పినదంతయుసత్యమే. నేను ఇంతకు పూర్వమే అతని గుణగణములు విని అతనిపై ప్రేమ గలిగి అతనికై వ్యథ చెందుచున్నాను. కనుక ఇంద్రునియాజ్ఞ, నీ సద్భావము, అతని గుణగణములు ఈ మూటిచేత అతని యెడల నాకు కామము గలిగినది. ఇక నీవు వెడలిపొమ్ము. నేను యధేచ్ఛగా అవకాశ మును చూచుకొని అర్జునుని కడకు పోయెదను." అని చెప్పెను.

ఆనాడు సాయంకాలము ఊర్వశి శుచి స్నానముచేసి గంధ మాల్యాద్యలంకరణములచేత సుశోభితయై తన శయ్యామందిర మును సుసజ్జితముచేసి అర్జునుడు తన సమీపమున తనతో ఆ శయ్యపై క్రీడించుచున్నట్లుగానే తలచి యువ్విళ్ళూరుచు చంద్రో దయ కాలమునందు మునిమాపున పార్థుని భవనమునకు బయలు దేరి పోయెను. తన ముఖకాంతి ప్రకాశించుచుండగా మధురాలాప ములను చేయుచు ఊర్వశి కనుబొమ్మలు అదరించుచు చంద్రుని ఆక్షేపించుచున్నట్లు పోవుచుండగా సుందర ముక్తాహారములచేత శోభిల్లుచున్న ఆమె స్తనమండలము కదలాడుచుండెను కూర్మ రాజుకు పీఠములవలెనున్న ఆమె పాదములు గల్లు గల్లుమను గజ్జెల రవముతో శోభిల్లుచుండెను కించిన్మధు పానముచేసి కామావేశ ముతో, వివిధ విలాసములతో పోవుచున్న ఊర్వశి మిక్కిలి దర్శ నీయురాలుగానుండెను మేఘవర్ణముగల ఉత్తరీయమును కప్పికొని పోవుచున్న ఊర్వశి మేఘావృతమగు చంద్రరేఖవలె సిద్ధచారణ గంధర్వాదులకు అతి సుందరముగా గోచరించుచు వాయువేగ మనో వేగములతో నడచి క్షణ కాలములో అర్జునుని భవనమును చేరుకొనెను.

అప్పుడు అర్జునుడు ద్వారపాలకుల ద్వారా ఊర్వశి రాకను విని ఆమె కడకు శంకించుచు వచ్చి ఆ రాత్రి ఆమెను చూడగనె లజ్జచే కన్నులు మూసుకొని ఆమెకు నమస్కారముచేసి గురుజనో చితమైన పూజచేసి యిట్లనెను.

"దేవీ! నమస్కారములు. నీకు సేవకుడను. ఏమియాజ్ఞ?" అది విని ఊర్వశి "అర్జునా! సమస్త మునిదేవ సంఘముతో

ఇంద్రుడు కొలువుదీరి యుండగా రంభాదులైన అప్సరసలు నాట్య గానములు చేయుచుండగా నీవు ఆ కొలువులో నాపై ఏకాగ్రదృష్టి నిలిపి చూచితివి. అది కనిపెట్టి యింద్రుడు చిత్రసేనునిద్వారా "నిన్ను సేవింపు" మని నాకు ఆజ్ఞ పంపెను. ఎన్నినాళ్ళుగానో నిన్ను కోరుచున్న నా మనస్సు ఇంద్రాజ్ఞచే ఉప్పొంగి యిపుడు నీ వద్దకు వచ్చితిని" అని చెప్పెను. ఆ మాటలు విని అర్జునుడు చెవులు మూసికొని లజ్జితుడై "సౌభాగ్యవతీ! నీవు చెప్పుచున్న మాటలు వినుటగూడ దుఃఖకరము. నీవు నాకు గురుపత్నితో సమానము. నాకు కుంతీదేవి, ఇంద్రపత్నియగు శచీదేవి వలెనే నీవు కూడ తల్లివి. నిన్ను సభలో ఏకాగ్ర దృష్టితో చూచుటకు కారణమేమనగా, నీవు మా పురువంశమునకు జననివి. పురూరవ చక్రవర్తికి భార్యగా నుంటివి. అతడు మా వంశకర్త. మా వంశమును వృద్ధిచేసిన దానవు. కనుక గురువుకంటెను గౌరవము గల దానవను అనుభవముతో చూచితిని" అని చెప్పెను. ఆ మాటవిని ఊర్వశి "ఓ అర్జునా! మేము అప్సరసల మందరము స్వర్గవాసులందరకు 'అనావృతలము'. అనగా అందరకు ఉపభోగయోగ్యము. అట్టి నన్ను గురుస్థానములో ఉంచి నీవు పూజింపదగదు. మీ పురువంశము నావలన ఉత్పన్నమైనను, ఆ వంశములో పుట్టిన పుత్రపౌత్రాదులందరు తపస్సుద్వారా, యుద్ధములలో మరణముద్వారా ఇక్కడికి వచ్చి మాతో సుఖించినవారే సుమా! ఇందులో దోషములేదు. కనుక కామార్తురాలనై వచ్చిన నీభక్తురాలిని అనుగ్రహించి స్వీకరింపుము". అది విని అర్జునుడు, 'ఊర్వశీ! నాకు కుంతి, మాద్రి, శచీదేవిలవలెనే నీవుగూడా తల్లివి. నీవు నా పురువంశమునకే జననివి. తలవంచి నీకు నమస్కరించుచున్నాను, నన్ను నీ పుత్రునిగా తలచివెడలిపొమ్మ' అని చెప్పగనే ఊర్వశి మిక్కిలి కోపించి, 'నీ తండ్రియగు యింద్రుని ఆజ్ఞపైనే నీ యింటికి కామార్తనై వచ్చిన నన్ను నిరాకరించితివి. కనుక నీవు నర్తకుడవై స్త్రీలమధ్యలో నపుంసకునివలె పౌరుషహీనుడవై సంచరించుచుండుదువు గాక' అనిశపించి తిరిగి తన యింటికి పోయెను.

ఆ తరువాత అర్జునుడు అతిత్వరగా చిత్రసేనుని యింటికి పోయి అతనికి ఊర్వశితో తనకుజరిగిన వృత్తాంతమును, ఊర్వశి శాపమును గూర్చి చెప్పెను. చిత్రసేనుడా వృత్తాంతమును ఇంద్రునకు తెలిపెను. ఇంద్రుడు ఏకాంతమునందు అర్జునుని పిలిపించి, 'పుత్రా! నీ వలన కుంతి సుపుత్రవతురాలయ్యెను. నీ యింద్రియ నిగ్రహముచేత ఋషులనుగూడ జయించితివి. నీకు ఊర్వశి యిచ్చిన శాపము ప్రయోజనకారి కాగలదు. మీరు పదుమూడవ యేడు అజ్ఞాతవాసము చేయుచున్నప్పుడు నీవు నపుంసకుడవుగా నర్తనవేషములో విహరించుచు ఆ యేడు దాటగనే తిరిగి పుంసత్వమును పొందెదవు.' అని యింద్రుడుచెప్పిన మాటలకు ప్రసన్నుడై అర్జునుడు శాపమువలన గలిగిన చింతను మానెను. చిత్రసేనునితో హాయిగా స్వర్గపత్తనమునందు విహరించుచు కాలము గడపెను.

అర్జునుని యీ వృత్తాంతమును వినినవారి మనస్సు పాపపూర్ణములైన కామేచ్ఛలయందు, విషయభోగేచ్ఛలయందు ప్రవర్తిల్లదు.

ఒకానొకప్పుడు 'లోమశు' డను ముని పర్యటనచేయుచు ఇంద్రసభకు వచ్చి యింద్రునకు నమస్కరించి యతనిచేత సత్కృతుడై కూర్చొని యింద్రుని యర్ధాసనమున కూర్చొనియున్న అర్జునునిచూచి. 'ఈ మానవపతి యే పుణ్యకర్మచేత అనన్యసాధ్యమయిన యింద్రుని అర్ధాసనమును పొందగలిగెను' అని ప్రశ్నించెను. ఆ మాటకు యింద్రుడు "ఓ బ్రహ్మర్షిసత్తమా! అర్జునుడు కేవల మానవుడుకాడు. పూర్వము నాకు కుంతియందు పుట్టిన కొడుకు. దివ్యాస్త్ర సంపాదనకొరకు ఇక్కడికి వచ్చెను. ఇతడు పురాణ మునిసత్తముడు. ఇతనినిగూర్చి నీ వెరుగవు చెప్పెదను వినుము పూర్వము 'నర నారాయణులు' అను మునులు ఇప్పుడు కృష్ణార్జునులుగా నా నియోగముచేత భూభారావతరణార్థమై భూలోకములో నవతరించిరి. వీరి అవతారముచేత ఒక విశిష్టకార్యము సాధించవలసియున్నది. వీరు దేవతలకుగూడ చూడ నలవికాని గంగకు జన్మస్థానమైన బదరికాశ్రమములో తపస్సు చేయుచుండిరి. వీరివలన, నివాతకవచాది దానవులు నశించి భూభారము తగ్గవలసియున్నది ఆ రాక్షసులు బలదర్పితులై పాతాళము నాశ్రయించియున్నారు. వారిని దేవత లెవ్వరుగూడా జయింపజాలరు. దేవతలనుచంపుటకు వారు ప్రయత్నించుచున్నారు. ఇప్పుడు అవతరించిన శ్రీకృష్ణుడే పూర్వము 'కపిల' మహామునిగాగూడ నుండెను. అతడే పాతాళమును త్రవ్వుచున్న సగర పుత్రులను నూర్వురను భస్మముచేసెను. ఈ కృష్ణార్జునులు సామాన్య మానవులుకారు వీరిచేత భూలోకములో మహాకార్యములు నెరవేరవలసి యున్నవి. నివాత కవచాది రాక్షసులను చంపగలవాడు ఈ అర్జునుడే. అట్టి అల్పకార్యముకొరకు భగవంతుడగు కృష్ణుని ప్రోత్సహించగూడదు. అతడు ప్రజ్వరిల్లినచో లోకములన్నియు దహించును. కొంత కాలమునకు అర్జునుడు తిరిగి భూలోకమునకు పోవును. కనుక మహాత్మా! నీవు ఇప్పుడే భూలోకములో కామ్యకవనమునకు పోయి యుధిష్ఠిరునితో 'అర్జునుడు కుశలముగా నున్నాడు. అస్త్రవిద్యలో నిపుణుడై త్వరలోనే రాగలడు. ఇతడావిద్యలో సమర్థుడుకానిచో యుద్ధములో భీష్మ ద్రోణాది వీరులను జయించజాలడు అస్త్ర విద్యతోపాటు గాంధర్వ విద్యయందుగూడ నిపుణుడై రాగలడు నీవుగూడ ఈలోపల సమస్త తీర్థయాత్రలుచేసి పరిశుద్ధుడవై రాజ్యపాలనకు అర్హుడవై యుండుము. బ్రాహ్మణోత్తమా! నీవుగూడ భూమండలములో తిరుగుచుండినపుడు తీర్థయాత్రలు జరుపుచున్న యుధిష్ఠిరుని అపాయములనుండి రక్షింపుము." అని చెప్పెను. తరువాత అర్జునుడుగూడ ధర్మరాజును రక్షించుచుండు'మని లోమశుని ప్రార్థించెను. ఇంద్రార్జునుల కోరికపై లోమశుడు భూలోకములోని కామ్యకవనమునకుపోయి అచట సపరివారుడుగా నున్న యుధిష్ఠిర మహారాజును జూచెను.

[సశేషము]

తెనుగునాడు మనది ఐననాడు

- కాళోజి -

ఆనాడూ ఈనాడూ
ఏ నాడును లోటులేదు.
వ్యక్తి వ్యక్తి స్నేహానికి
మనిషి మనిషి శ్రేయానికి
సర్వజనుల సౌఖ్యానికి
భారత సౌభాగ్యానికి
ఆ ఈ నాడుల మధ్య
లంకె కుదిరి మెలగునాడు
ఆంధ్రుని అభ్యుదయానికి
ఏ నాడును లోటులేదు.

ప్రకృతిమాత ఆర్ద్రహృదయ
కరువు కాటకాల తోడ
ప్రజలు తల్లడిల్లుచుండ
ఆమెకు నిద్దుర పట్టదు :

ప్రకృతిమాత ఆర్ద్రహృదయ
పుడమి పాప పసినోటికి
అందగ చేపెడి చన్నులు
ఆర్ద్రత పై కుబికి పొంగు
కొండల రొమ్ముల తిన్నెలు :

తిండి కరువు రూపుమాపు
పాటిమన్ను విత్తనాలు
కర్రు పదునుగల కాపు
కండరాల చెమట జాలు
ఏ దేదని వెదకి కొనుచు
సహ్యాద్రి గుండె పగుల
యుగ యుగాలనుండి కృష్ణ
కడుపు చెరువుగా ఏడ్వగ
కడలిదాక ఒకేధార.

యుగ యుగాల తృష్ణతోడ
దరిదాపుల పుడమి తాను
మాగాణిగ మారలేక
నెర్రెల నిట్టూర్పులతో
మండుటాలి నింగిదాక :—

లోయల్లో చేరి దూరి
డొంకలో దాగి పారి
పర్రల్లో గెంతె పాకి
అడ్డమైన గట్లుదూకి

"అయ్యో నా జీవనమ్ము
పుష్కరాల తీర్థాలక ?
అయ్యో నా తీరమంత
అపర కర్మ కాండకేన ?"

అని ఏడ్చెడి కృష్ణనీరు
ఇన్ని నాళ్లు కడలిపాలు.

మున్నీటిని చేరనీని
ఆనకట్ట వుంచెవాలు
జీవనదుల పారునీరు
సస్యాలకు చనుబాలు

ఈనాడా ఏనాడో
వేలాది ఏండ్లక్రింద
ఆ గుట్ట ఈ గుట్ట
సాగి కలసి నిలిచినట్లు
కట్టలు పోసెను ఆంధ్రుడు.
పాకాల, లక్నారం
రామప్పవంటి వెన్నో
సాగరాల బోలు చెర్లు.

పుట్టు గుణమో, మట్టి గుణమో ?
నీటి గుణమో, గాలి గుణమో ?
అన్నపూర్ణ నామాంకిత
ఆంధ్రావని సౌభాగ్యమొ ?
సేద్యమంటె సంబరపడు
కాపుబిడ్డ తెనుగువాడు.

చెట్టుకొట్టి మొట్టుతవ్వి
కంప పొదల నరికి కాల్చి
పుడమి దున్ని పండించిన

మొదటి వాడు తెలుగు వాడు
పసరులున్న వాడొక్కడె
పుడమి కరువు తీర్చగలడు.

శ్రీరాములు ఆత్మార్పణ
ఫలితం భారతి శ్రీమతి
మాటమ్మను కొలువ నిచ్చి
వేడ్కలు. సత్తికి పరపతి.

రకరకాల సభ్యతల
ప్రభల వెలయు [illegible]నగరి
భక్తుల దోసిళ్ల నింపు
మార్గళి పులగ. తోసరి.

ఎద పదును కంటి పదును
'గలబీదలు పడుపాటులు
నుదుల తీపి తేట తెల్ల
మొనరించెడి పనిపాటలు.

అక్షరమగు చేతి జేయ
నోపిన లక్షల చేతులు
ఏండ్లు పూండ్లు కట్టడితో
గుట్టల వరుసగ కట్టిన
ఆనకట్ట ఫలితంగా
రస సిద్ధుని నాటి కలలు
నిజముచేయ పనిబూని
'నాగార్జున' సాగరమై
వెలయుచుండె కృష్ణవేణి.

ఆకలితో అకుల పడు పనిలేదిక
భారతాంబ తిరిపమెత్తు పనిలేదిక.

తెనుగన్ని విద్దెలను గరిపెడి బాసగా అయిననాడు మనది తెనుగునాడు
తెల్లరెలై నిట్టూర్చు నేలచేరెడుగూడ లేనినాడు మనది తెనుగునాడు

పనిదొంగలకు బ్రతుకుతెరువులన్నియు బందు అయిననాడు మనది తెనుగునాడు
పనిమంతుడెవ్వడును ఏలేమికిని గురికానినాడు మనది తెనుగునాడు
భారతావని ప్రగతి భావనా బలముతో మెలగునాడు మనది తెనుగు నాడు
ఆంధ్రాభ్యుదయమ్ము అందరి మేలులోగన్ననాడు మనది తెనుగునాడు
దేశమంటే మట్టికాదు మనుషులు అన్న మొదటినాడు మనది తెనుగునాడు
మనిషి మనిషిగ బ్రతుకవీలు సౌకర్యమ్ము ఉన్ననాడు మనది తెనుగునాడు
బ్రతుకు మంగళసూత్రబద్ధ బతకమ్మయై వెలయునాడు మనది తెనుగునాడు
తెనుగునాడు మనది మనది ఈ నాడు వేరు వేరగు నాడు వేరు ఈ నాడు
కొదువ పూజ్యమ్ము. గొడవకు తావులేదు. ముదము మురిపము పబ్బాల సంబరమ్ము
అన్నపూర్ణమ్మ మన ఆంధ్రి పూర్ణకుంభ. సుజల సుఫల సస్య శ్యామలాంబ.

లోటేమున్నది
ఆంధ్రిని అభ్యుదయానికి
భారతి సౌభాగ్యానికి
లోటేమున్నది ?

కలిసి నిలచి గర్వముగా శిరములెత్తి అందామా! నింగి దద్దరిల్లి పోగ
కలసి నిలచి భక్తితోడ గళములెత్తి పాడుదామా ? పాడుదాము!

వందే మాతరమని
సుజలాం సుఫలామ్మని
సస్య శ్యామలామ్మని
వందే మాతరమని
పాడుదాము పాడుదాము
తెనుగునాడు మనది అయిన నాడు
'జై హింద్'
వందేమాతరం

పసరులున్న సీమ తెనుగు సీమ

అతి ప్రాచీన కాలమునుండి నేటివరకు భారతదేశమందు, ముఖ్యముగ ఆంధ్రదేశమందు అభివృద్ధిచెందిన నృత్యకళను ఐదు విధములుగా విభజింపవచ్చును.

1. ఆలయాల్లో దైవసాన్నిధ్యంలో దేవతల పూజ సమయములందు, ఆగమశాస్త్రముల ననుసరించి చేయబడేఆరాధనానృత్యములు.

2. రాజుల ఆస్థానములందూ, పండిత సభలందూ చేయబడు సాంస్కృతిక నృత్యరీతులు.

3. సామాన్య ప్రజలకు హైందవమతము, నాగరికత సంస్కృతి, పురాణేతిహాసములు ప్రబోధములు చేయుటకుగాను ప్రదర్శింపబడిన నృత్య నాటక పద్ధతులు.

4. పల్లె ప్రజలచే చేయబడే జానపద నృత్యవిన్యాసములు.

5 అరణ్యములలో నివసించే ఆటవిక తెగలకు జెందినవారు చేసెడి నృత్యములు.

ఈ ఐదు రీతులందునూ—ఆరాధనా నృత్యములు, సాంస్కృతిక నృత్య సంప్రదాయములు, నృత్యనాటక రీతులు శాస్త్రీయ పద్ధతికి జెందినట్టివి.

ఈ నర్తనరీతులన్నింటిలోనూ, ఆలయ నృత్యములు అతి ప్రాచీనమైనట్టివి. పూర్తిగా శాస్త్రముపై ఆధారపడి రూపొందినట్టి 'మార్గి' పద్ధతికి చెందినట్టివి.

ఈ నృత్యములు శైవ సంప్రదాయము, వైష్ణవసంప్రదాయమునకు జెంది రెండువిధములుగా అభివృద్ధి జెందినవి. శివుడు 108 కరణములను నర్తనమాడినట్లు భరతుడు నాట్యశాస్త్రములో పేర్కొన్నాడు. ఆ కరణములు చాలా వరకు ఆలయ సాంప్రదాయములో

మన నృత్యకళ

— నటరాజ రామకృష్ణ

ప్రదర్శింపబడును. ఉదయము మేల్కొలుపు మొదలుకొని రాత్రి పవ్వళింపు సేవవరకు వివిధ సమయాల్లో జరిగే ఉపచారములందు వివిధ కరణములు ప్రదర్శింపబడును. ఈ నృత్యములు సాధారణముగా వాడబడే తాళములందేగాక అపూర్వ తాళములందు ప్రదర్శితమగును.

నటరాజమూర్తి – ఆనంద, సంధ్య, కలిక, విజయ, గౌరి ఉమ, సంహారతాండవములనే సప్తతాండవములనేగాక ; శుద్ధ, దేశీ, పేరిణి, ప్రేంఖణ, దండిక, కుండలి, కలశ అను సప్తతాండవములను వేరొకరీతిని ప్రదర్శించినాడు. వీటినే 'దేశిసి' తాండవములందురు. ఈ తాండవములుగూడ ఆలయనర్తనములందు ప్రదర్శింపబడును. ఈ నర్తనములన్నియూ రసభావములు లేక తాళ



96–4

లయలననుసరించి ప్రదర్శింపబడే కరాణాంగహార విన్యాసముగా పేర్కొనవచ్చును.

శివాలయములందు యెన్నియో రకములైన నృత్యములు ప్రదర్శింపబడిననూ—శివునికి అత్యంత ప్రీతికరమైనట్టిది 'భుజంగ త్రాస'—ఈ నృత్యము సంధ్యా సమయములందు ప్రదర్శింప బడును. 'విళంబిత కరణము' దీనినే 'ఊర్ధ్వ' తాండవమందురు. ఈ నృత్యము ముఖ్యముగా శివరాత్రినాటిరాత్రి లింగోద్భవ సమయ మందు ప్రదర్శింతురు. ఆలయ నృత్యములన్నియు ముఖ్యముగా స్త్రీలచే చేయబడిననూ ఈ నర్తనము మాత్రము పురుషులచే చేయ బడును.

ఈ నర్తనమును గూర్చి ముచ్చటైన ఒక కథ ఉన్నది.

పూర్వమొకప్పుడు శివపార్వతులిద్దరూ వాదించుకున్నారు. తానే గొప్ప నాట్యకళావేత్తయని శివుడు, తానే గొప్ప నర్తకీమణి యని పార్వతి తర్కించుకున్నారు. ఆ తగవు తీర్చుటకు దేవతలు, గంధర్వులు, యక్షులు, కిన్నెరలు, కింపురుషులు యిత్యాది దేవగణము కైలాసముపై సభ జేసినారు. శివుడు నాట్యమాడ నారంభించాడు. అంబ అతనిని అనుసరించినది. అంబ నర్తన విన్యాసములు కోమలమై రమణీయతతో గూడి కన్నుల పండువుగా వుండుటచే అందరు అంబకే విజయము చేకూరిన దని నిశ్చయించినారు. శివుడు తాను ఓడుతున్నట్లు గ్రహించి వున్నట్లే ఉండి అకస్మాత్తుగా కుడికాలును పైకెత్తి శిరము వద్దకుతెచ్చి ఒంటికాలుపై నర్తనమాడ మొదలిడి నాడు. సభ్యతాలోపముగా నెంచి ఉమ ఆ భంగిమను పట్టక నిల్చినది. అంతట దేవతలు శివునే గొప్ప కళాకారునిగా నిర్ణయించినారు. ఇదియే 'ఊర్ధ్వ' తాండవము. ఇది శివునికి అత్యంత ప్రీతికరమైనదిగా శాస్త్రములందు చెప్పబడుటచే శివరాత్రినాడు విధిగా ప్రదర్శింతురు. పార్వతి చేయ నిచ్చగించలేదుగాన ఈ నర్తనము పురుషులచేతనే చేయబడును.

అదే విధముగా విష్ణుదేవునికి ముఖ్యమైనది భ్రమరనర్తనము. పార్వతీదేవికి ప్రీతికరమైనట్టిది "తలపుష్పపుట". ఈ నాట్యములు గాక అష్టదిక్పాలుర ఆరాధన సమయములందు ప్రదర్శింపబడునట్టివి కొన్ని నాట్యములున్నవి. వీటినే 'నవసంధి' – 'బలిహరణ' నృత్యములందురు.

రాత్రి సమయములందు స్వామికి పవ్వళింపు సేవ ముగిసిన తరువాత ఆలయాన్ని అష్టదిక్పాలురకు అప్పగించుతూ చేయబడే నాట్య సాంప్రదాయమొకటున్నది. దానికే 'ప్రహరీ' నర్తనమని పేరు. అందు గద్యలు, ఏలలు, అర్ధచంద్రికలు ఇత్యాది దేశీ రచనలు గూడా గానము చేయబడును. ఈ ఆలయ నృత్యములు సుమారు దెబ్బది వరకు ఉన్నవి. ఇవన్నియూ 101 తాళములందు ప్రస్తారము చేయబడి కేళిక జేయబడును. పై నృత్యములన్నియు ఆలయములో మూల విరాట్టు సన్నిధిని చేయబడునట్టివి. ఇవిగాక ఉత్సవమూర్తి కళ్యాణమంటపమువద్ద కొలువుదీరినప్పుడు చేయ బడు నర్తనరీతి ఒకటున్నది. దీనినే 'కేళిక' యందురు.

ఆరాధనయందు రసభావములేని శుద్ధనృత్తము ప్రదర్శింప బడిననూ, స్వామి దర్బారులోని కేళికయందు నృత్యము అభినయముగూడా ప్రదర్శితమగును. ఈ నర్తనము 'పేరిణి'- పద్ధతి ననుసరించి యుండును. పేరిణి ఐదు అంగములు గల్గి- నృత్తము నృత్యము అభినయముప్రదర్శించుటకు అనువైనట్టి సంప్రదాయము.

సాంస్కృతిక నృత్యరీతులు

ఈ నాట్యరీతిగూడా శాస్త్రీయమైననూ మార్గి, దేశి రెండు విధానములు యిందు మిళితమైయుండును.

ఈ నృత్య సంప్రదాయమునుగూర్చి పూర్తిగా అర్థము చేసుకోవలెనన్న మనము నృత్తము, నృత్యము, అభినయము, లాస్యము, తాండవముల గూర్చికొంతవరకు తెలిసికొనుట అవసరము. ఈ నృత్యరీతిలో వీటన్నింటిని మనము చూడగలము. పైనదెల్పిన అన్నిభాగములు ఒక నర్తకిగాని, నర్తకుడుగాని ప్రదర్శించుటకు అనువైన రీతిని ప్రాచీననాట్య కళావేత్తలు ఈ పద్ధతి ఆటను రూపొందించారు ప్రాంతము మారిననూ, ప్రదేశము మారిననూ, భాషమారిననూ, సంప్రదాయము వేరైననూ, భారతీయ శాస్త్రీయ నృత్యములో మనము ముఖ్యముగా చూచేవి యీ అంశములు మాత్రమే. ఇంతకుమించి విశేషములేదనియే చెప్ప వచ్చును.

రసభావములులేక తాళలయల ననుసరించి చేయబడేహస్త పాద విన్యాసములు నృత్తము.

రసభావములతో కూడియుండి తాళలయల ననుసరించి ఒక గీతార్థములు తెల్పుటకుగాను చేయబడే హస్తపాద విన్యాసము నృత్యము.

ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికములని అభినయము నాల్గు విధములు.

ఒక పాటయొక్కగాని, పద్యగద్యములయొక్కగాని అర్థాన్ని తెల్పుటకు చేయబడే అభినయము ఆంగికము.

ఆయా రసములు పోషింపబడు రీతిని గానముచేయుట వాచికము. నాట్యములో ఆయా ఘట్టములకు తగినరీతిని అలంకారములు ధరించుట ఆహార్యము.

ఒకపాటయొక్కగాని పద్యముయొక్కగాని భావాన్ని తెల్పుటకు చేయబడేఅభినయము సాత్వికము.

ఉద్ధత గంభీరభావ ప్రకటనగల్గి పురుషులచే చేయబడే నర్తనము తాండవమనియు, కోమల కరణాంగహార విన్యాసముకలిగిన నర్తనము లాస్యమనియు పిలువబడును. నర్తకీమణి కూర్చొని సాత్విక సంచారి భావములను అభినయించుట లాస్యమనియు, నిలబడి నృత్త, నృత్యములుప్రదర్శించుట తాండవమనిగూడా పిలువబడును.

శాస్త్రీయ నృత్యములో ఈ అంశములన్నియూ వుండును. ఈ నర్తనము ఏక పాత్ర నర్తనరీతిగాను బహుపాత్ర నృత్య రీతిగాను గూడ అభివృద్ధిగాంచినది. స్త్రీలచే ప్రదర్శింపబడురీతి ఒక విధముగా, పురుషులచే ఆరాధించబడురీతి వేరొక విధముగాను వృద్ధిచెందినది.

అనేక రాజుల ఆస్థానములందు ప్రదర్శింపబడిన రాజ నర్తకీ సంప్రదాయ నృత్య పద్ధతి, ప్రస్తుతకాలములో భరతనాట్య మని పిలువబడే నాట్యరీతి ఈ సంప్రదాయానికి చెందినట్టిదే. ఆంధ్రప్రాంతములోని కార్వేటి నగరము, కాళహస్తి, వేంకటగిరి, పిఠాపురము, పెద్దాపురము, విజయనగరము, బొబ్బిలి మొదలైన సంస్థానములందు ఈ నర్తన రీతి యెక్కువగా పోషింపబడినది. ముఖ్యముగా స్త్రీలచే ఆరాధింపబడిన నాట్యరీతి భరతనాట్యము.

ఈ కళాకారులు అభినయమును ఒక ప్రత్యేక కళగా అభివృద్ధి పరిచినారు. అలంకార శాస్త్రమునందు తెల్పబడినట్టి నాయికా నాయకులు వారి సాత్విక సంచారులు, చేష్టలు, వ్యాపారములు అభినయించుట ఒక ప్రత్యేక కళగా విశేషించి ఆంధ్రదేశములో మాత్రము ప్రచారములోవున్నది.

సామాన్య ప్రజలందు మన సంస్కృతి ప్రచారమునకు వుపయోగపడినట్టి నర్తనరీతియే భాగవతమేళము. ఇది నృత్య నాటక సంప్రదాయము. అనేకులు యిందు పాల్గొని ఒకకథలోని అనేక పాత్రలుగా రూపొంది, నృత్యనృత్త అభినయములద్వారా ఒక ప్రసిద్ధపౌరాణిక గాథను ప్రజలకు ఎరుకజేయుటయే ఈ సంప్రదాయములోని ముఖ్యవిశేషము- ఈ కళ సంప్రదాయనర్తన రీతి. శాస్త్రముకంటే దేశీయతపాళ్లు యెక్కువగా యిందుండును.

వీధినాటకములు, యక్షగానములు, కలాపములుగా ఈ విద్య మూడురీతులుగా ప్రచారములోవున్నది.

బహుపాత్రలతో గూడిన నృత్యనాటకమే వీధినాటకము. యక్షగానము బహుప్రాచీనమైన నృత్యనాటక శైలి. ఒకకథ గానము చేయబడి అందలి వివిధ పాత్రలను కళాకారులు అభినయించుట యిందలి ప్రత్యేకత. వీధినాటకమునకు యక్షగానమునకు ఆట పాటలందు చాలాభేదమున్నది.

ఒకేపాత్ర వివిధ రసములను అభినయించుటకు అనువైన రీతిని రూపొందించినట్టి ప్రబంధ రచనయే కలాపము. ప్రాచీన కళాకారులు ఈ మూడు విధములైన నృత్యరీతులద్వారా మన పురాణేతిహాసములను ప్రజల్లో ప్రచారంచేసెడివారు.

ఈ వీధినాటకముల నాడువారిని నాట్యమేళములనియూ, భాగవతులనియూ, యక్షులనియూ, భరతులనియూ పిలుతురు. అతిప్రాచీనమైన యక్షగాన, వీధినాటక ఆటక్రమము ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణా ప్రాంతంలో నేటికినీ ప్రచారములోనున్నది. ప్రాచీన ధ్రుపదగాన, నర్తనరీతి తూర్పు ప్రాంతంలో, అనగా విశాఖ, శ్రీకాకుళం జిల్లాలందు అభ్యాసములోవున్నది. కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లోని ఆటలో కాలక్రమేణ యెన్నియో మార్పులు చేయబడి ఒకనూతన రూపంలో ప్రదర్శిత మవుచున్నది. భాగవత కేళికయందు కర్నాటక సంగీత బాణి కంటే, దేశీయబాణి యెక్కువగా ప్రయోగించబడును. స్వరజతులు, స్వరపల్లవులు, వర్ణములు, పదములు, తిల్లానలు, యిత్యాది సంగీత రచనల గానమూ, వాటికి నృత్యఅభినయాదులు ప్రదర్శించుట కర్నాటకమనబడును.

ద్విపద, ద్విపదార్ధము, కందము, కందార్థము, దరువు ధవళము, ఏల, హెచ్చరిక, అర్ధచంద్రిక, తిపుడ, తోహర యిత్యాది రచనల గానఅభినయనములు. భాగవత సంప్రదాయంలో యెక్కువగా ప్రయోగమందుండును. గనకనే భాగవత, వీధిభాగవతములను దేశి బాణియందురు.

జానపద నృత్యరీతులు

పల్లె ప్రజలు తమ వినోదార్థము చేసేనాట్యములే జానపద నృత్యములు. ఇందు స్త్రీలచే ప్రత్యేకంగా చేయబడునవి కొన్ని, పురుషులచే ప్రత్యేకించి చేయబడునవి కొన్ని యున్నవి.

గొబ్బి ఆట కోస్తా జిల్లాలందు విశేషముగా స్త్రీలచే చేయబడు నట్టి నృత్యము. అట్లే బతకమ్మ ఆట తెలంగాణ స్త్రీలచే చేయబడును. ఈ రెండునూ దేవీ ఆరాధనకు సంబంధించిన బృందనృత్యములుగా పేర్కొనవచ్చును. తప్పెటగుండు విశాఖ జిల్లాలోని ఒక ప్రత్యేక జానపద నర్తనము అట్టిదే 'సేవ' నృత్యము. ఈ రెండును పురుషులచే చేయబడును. కోలాటము ఆంధ్రదేశమంతటను ప్రచారముననున్నది. ఇది జానపదకళయేగాక శాస్త్రీయ నాట్యములో ఒక భాగముగా ప్రదర్శింపబడు చున్నది. సుమారు ముప్పది నలుబది రకములైన కోపులను వేయు వారు తెలంగాణా ప్రాంతమందున్నూ, తూర్పు గోదావరి జిల్లాలోనూ ఉన్నారు.

'కారవమేళ' మను పేరుతో తూర్పు గోదావరి జిల్లాలో ఒక ప్రత్యేక నర్తనము ప్రచారములో వున్నది.

దీనిని నట్టువమేళముల వారు ఆడుదురు. అది కృష్ణ, గోపికల రాసక్రీడకు సబంధించిన బృందనర్తనము.

గరగల నృత్యము ప్రత్యేకించి తూర్పు గోదవారి జిల్లాలో చూడగలము.

బవనీలు అనే ఒక ప్రత్యేక తెగవారూ ఉగ్గు గొల్లలూ మల్లదేవుని కథలను గానము చేయుచూ నర్తనమాడు సంప్రదాయము తెలంగాణంలో వున్నది. ఇదియునూ జానపద నర్తనమే.

అన్నింటి కంటే మిక్కిలి చిత్రమైన నర్తనమొకటి యిచ్చట పేర్కొనుచున్నాను. తెలంగాణా ప్రాంతములో హరిజనుల తెగలకు చెందిన వారెవరైన కాలము చేసి, శవము శ్మశాన వాటికకు తీసుకొని పోవునప్పుడు అద్భుతమైన జానపద నర్తనము చేయబడును. ఆ ఆట పేరు "జోగాట". ఆ ఆటను ప్రదర్శించు వారిని జోగువారందురు. డప్పుల వాద్య సహకారముతో యీ నాట్యమాడబడును. తాళలయల్లో ఈనర్తకులు అత్యద్భుత విన్యాసములుచేయుచూ నర్తనమాడుదురు. ఆదిలాబాదు జిల్లాలో వున్న ముఖ్యమైన రెండు నర్తనములు (1) డప్పుల నర్తనము (2) తమాషా. డప్పులను వాయిస్తూ వాయిద్యకులు అనేక విధములైన

పాదవిన్యాసముల చేయుచూ నర్తనమాడుదురు. ఇది కొంత వరకు మణిపుర ప్రాంతములోని "పుంగ్‌చోలన్" ఖోల్ వాయిద్య నర్తనమువలే నుండును.

తమాషా మహారాష్ట్రదేశానికి చెందిన ప్రత్యేక జానపద వినోద నర్తనరీతి. ఆదిలాబాదు మహారాష్ట్ర ప్రాంతమును చేరి యుండుటచే తమాషా నర్తనము కూడా ఈ ప్రాంతములో యెక్కువగా ఆదరించ బడుచున్నది.

ఆంధ్రదేశములోని అరణ్యాల్లోని సవరలు, గదబలు, చెంచులు, కోయలు, సుగాలీలు, గోండులు, మాథారే గోండులు, కొండరెడ్లు యిత్యాది యెన్నో తెగలవారు నివసించుచున్నారు. వారందరుయెన్నో విధములైన నృత్యములు చేయుదురు. ఇవన్నియు ముఖ్యముగా బృంద నర్తనరీతులు. కొన్ని స్త్రీలు చేయునట్టివి, కొన్ని పురుషులు చేయు ప్రత్యేకనాట్యములు మరికొన్ని స్త్రీలుపురుషులు కలిసిచేయునట్టివి.

వీరి నృత్యములలో కొన్ని వనదేవతలు, ప్రకృతి, ఆరాధనకు సంబంధించినట్టివి. కొన్ని కేవలమువినోదము కొరకు చేయబడునట్టివి. ఇవన్నియూ లయప్రాధాన్యత గల్గిన శుద్ధనర్తనరీతులు.

పదాభినయము

భారతీయ నృత్య కళకు మకుటాయ మానముగా పేర్కొనదగినట్టిది, ప్రపంచములోని మరియే ఇతర ప్రాంతములందు గానరానట్టి ప్రత్యేక కళారూపము–అభినయము. దీనినే సాత్వికాభినయ మందురు. ఈ అభినయమునకు ఒక విశిష్టత కళారూపముగా అభివృద్ధి పరిచిన వారు ఆంధ్రకళాకారులు. క్షేత్రయ్య అనే కృష్ణభక్తుడు, కవి, గాయకుడు, నర్తకుడు, "మువ్వగోపాల" మకుటములో కొన్ని వేల పదములు రచన జేసినాడు. ఆ పదములు శృంగార రసనీయములు. దక్షిణాదిని అభినయము ఒక విశిష్ట కళగా అభివృద్ధి పొందుటకు క్షేత్రయ్య పదములే ముఖ్యకారణముగా పేర్కొన వచ్చును. ఈ పదముల నభినయించుటలో ఆంధ్రదేశంలోని దేవదాసీకళాకారులు ప్రసిద్ధులు.

క్షేత్రయ్య మువ్వపురి నివాసి. మువ్వలోని గోపాలునికి అంకితముగా పదములు రచన జేసినాడు. గనుకనే ఆరచనలు మువ్వ గోపాల పదములుగా ప్రసిద్ధి గాంచినవి. ఈ మువ్వ కృష్ణాజిల్లాలో వున్నది. మువ్వకు చేరువనే కూచిపూడి అగ్రహారము వున్నది. ఈఅగ్రహారములోని బ్రాహ్మణులు భాగవతము ఆటలో ప్రఖ్యాతి గాంచినవారు. సిద్ధేంద్రుడనే యోగిపుంగవుడు శ్రీకృష్ణా సత్యాభామల ప్రణయకలహమును ఒక చక్కని ప్రబంధముగా రచన జేసి, ఈ కూచిపూడి భాగవతులకు శిక్షణనిచ్చి వారిచే ఆడించినాడు. అదియే నేటి కాలములో 'భామాకలాప' మనే పేరుతో ప్రచారములోనున్నది. క్షేత్రయ్య మువ్వపురిలోనే వుండక తంజావూరు, మధుర, గోల్కొండ యిత్యాది రాజాస్థానములను సందర్శించినాడు. తన పదకవితచే అచ్చటి ప్రభువులను మెప్పించినాడు. వారి ఆస్థానములందలి రాజనర్తకినులు ఆ పదములను అభ్యసించి, తద్వారా సాత్వికాభినయమును ఒక ప్రత్యేక కళగా ఆరాధించినారు. ఈ విధముగా దక్షిణాదిని పదాభినయము వ్యాపించినది.

సిద్ధేంద్రుడు గోల్కొండ పాదుషాల వద్దనుండి కూచిపూడి యినామును ఆ వూరి కళాకారులకు యిప్పించినారు. నాటినుండి ఆ కళాకారులు కృష్ణభక్తిని, భాగవత కళను ప్రచారము చేసినారు బనగానపల్లి నవాబుగారు కర్నూలు జిల్లాలో భాగవత కళా ప్రచారమును ప్రోత్సహించినారు. కోటకొండ కవత్రాల గ్రామమును భాగవతులకు నవాబుగారు దానమిచ్చినారు.

శాస్త్రీయ నృత్యకళ

పూర్వకాలంనుండి ఆలయములు, సంస్థానములున్నచోట్ల శాస్త్రీయ నృత్యకళ విరివిగా అభివృద్ధిగాంచినది. శ్రీశైలము, అహోబిలము, అలంపురము, ధర్మపురి, శ్రీకూర్మము, కాళహస్తి యిత్యాది పుణ్యక్షేత్రములందు ఆరాధనా నృత్యకళ–శైవ, వైష్ణవ సంప్రదాయానికి జెందినట్టిది–విరివిగా వృద్ధిజెందినది.

శాతవాహనులు, ఇక్ష్వాకులకాలంనాటి నృత్యకళారూపములు మనకు పూర్తిగా మిగులకపోయిననూ, కొన్ని జతులు మాత్రము నేటికినీ ఆలయ నర్తనరీతిలో ప్రదర్శింపబడుచున్నవి– పంచభూత ఆరాధన జాతులనే పేరుతో. కాకతీయులకాలంలో శైవసంప్రదాయ నాట్య రీతులెన్నో రూపొందించబడి ప్రచారములోనికి వచ్చినవి. అదేవిధముగా విజయనగర సామ్రాజ్యంలో యెన్నో వైష్ణవ సంప్రదాయ నాట్యములు ప్రచారములోనికి వచ్చినవి. ఈ నాట్య రీతులే రెడ్డిరాజుల ఆస్థానములందునూ, వెలమదొరల దర్బారులందునూ, క్షత్రియ పాలకుల సంస్థానములందునూ. కొద్ది మార్పులతో ప్రదర్శింపబడినవి.

క్షేత్రయ్యపదములు అభినయమునకు భామాకలాపమునృత్య అభినయముల అభివృద్ధికి దోహదం కల్గించినట్లే–యతి నారాయణ తీర్థులవారి తరంగములు – లయతాళవిన్యాసములతోగూడిన నృత్త విద్యాభివృద్ధికి తోడ్పడినవి. నారాయణ తీర్థులవారు శ్రీ కృష్ణుని బాల్యం మొదలుకొని రుక్మిణీ కల్యాణంవరకు కథను శ్రీకృష్ణలీలా తరంగిణి అనే పేరుతో అనేక తరంగములుగా రచన చేసినారు. ఈ తరంగములు నృత్తానికి ఉపకరించునట్టి రచనలు.

నట్టువమేళము, నాట్యమేళమని భారతీయ నృత్యకళ రెండు విధములు.

స్త్రీలచే ప్రదర్శింపబడునట్టి విద్య నట్టువమేళము పురుషులచే ప్రదర్శింపబడునట్టిది నాట్యమేళము, లేక భాగవత మేళము. రాజుల ఆస్థానములందు, పండిత సభలందు, దర్బారులందు స్త్రీలు ప్రదర్శించు విద్యారీతి నట్టువమేళము. ప్రచారనిమిత్తము ఊరూరా తిరుగుతూ భారతీయ పురాణేతిహాసములకు జెందిన కథలను నృత్య నాటకములుగా ఆడుట భాగవతమేళము.

భారతదేశమందెచ్చటనూ భాగవత మేళములో స్త్రీలు పాల్గొనరు అదికష్టతరమైనవిద్యఅయితే ఆంధ్రదేశంలో మాత్రము భాగవత విద్యలోగూడ స్త్రీలు ప్రఖ్యాతి గాంచినారు. పురుషులకు మాత్రము సాధ్యమైన యీ విద్యను అభ్యసించి ప్రదర్శించుటయేగాక ఈ విద్యలో యెందరో ప్రసిద్ధులై పురుషకళాకారులతో సమాన స్థాయిలో ప్రదర్శించే పాండితీ ప్రతిభ గల్గినవారున్నారు. ఇది తెలుగువారికెంతో గర్వకారణము.

"తెనుగు, దక్షిణ ప్రాంతపు సాంస్కృతిక భాష" యని పండితుల అభిప్రాయము. మృదుమధురమైన పదజాలముతోకూడిన తెనుగు భాష దక్షిణాది సంగీత రచన కెంతగానో వుపయోగపడినది. గనుకనే దక్షిణాపదములోనూ నృత్యసంగీత రచనలు నూటికి తొంబది పాళ్ళు తెనుగు భాషయందే చేయబడినవి. తెనుగువారేగాక అన్యప్రాంతీయులుగూడా యీ భాష నభ్యసించి తెనుగున రచనలు జేసినారు. అందువల్లనే దక్షిణాదిని ఏ ప్రాంతమునకు వెళ్ళినా ఆ ప్రాంతీయ భాష యేదైనప్పటికీ తెనుగు పాటనే వింటాము. తెనుగు నాట్యమునే చూస్తాము.

తెనుగువారు శృంగారప్రియులు. వీరి నాట్యవిద్య కౌశికీ వృత్తి ప్రాధాన్యతగల్గి శృంగార రసభరితమై కోమలకరణాంగహార విన్యాసములతో రమణీయ అభినయ పద్ధతితోగూడి హృదయాహ్లాదకరముగా వుండును. అందువల్లనే ఈ నాట్యరీతి అన్య ప్రాంతీయులను విశేషముగా ఆకర్షించినది.

తోలుబొమ్మలాటగూర్చి తెల్పనిదే ఆంధ్రుల నృత్యకళా చరిత్రపూర్తిగాదు. ఇదిఅతి ప్రాచీనమైననృత్యరీతి. ఆంధ్రదేశం నుండే తూర్పుదేశాలకు, తూర్పుదీవులకు ప్రచారమైనట్లు చరిత్రకారులు తెల్పుదురు. ప్రస్తుతకాలంలో వుత్తమ శ్రేణికి జెందిన ఈ కళాకారులు రాయలసీమలోనూ, తూర్పు గోదావరి జిల్లాలోనూ వున్నారు. ఈ విద్య జానపద తరగతికి జెందినదియైననూ "అమరము" జదువని తోలుబొమ్మల ఆటగాండ్రను అరుదుగా చూస్తాము.

ఇన్ని విధములుగా, శాస్త్రీయ కట్టుబాట్లతో భరత విద్య తెనుగు దేశంలో అనాదినుండి అభివృద్ధిజెంది ప్రచారములోనికి వచ్చిననూ గడిచిన మూడు నాల్గు దశాబ్దాలుగా అనేక రాజకీయ, సాంఘిక, ఆర్థిక కారణాలవల్ల ఈ కళ చాలా వరకు మరుగున పడి పోయినది. ఎందరో ఉత్తమ శ్రేణికి జెందిన కళాకారులు ఈ కళారాధనను విరమించినారు. మరికొందరు గతించినారు. ఎన్నియో అపూర్వ నర్తనరీతులు అంతరించిపోయినవి. మరల స్వరాష్ట్రము లభించినప్పటినుండి నృత్యకళకు ప్రభుత్వంద్వారా ప్రోత్సాహము లభించుచున్నది. త్వరలోనే పూర్వపుటౌన్నత్యాన్ని అందుకోగలదని ఆశించుదాము.

ఆశాకిరణం

\- మధురాంతకం దొరస్వామి

విశ్వమ్మున నీవొక ఆశా కిరణమ్మవు....
బాధిత పీడిత జనతకు
ప్రబలమ్మగు___తేజో రేఖవు...
భారత సీమకు బాముల బాపెడి
కోమల హృదయపు సీమపు బాలవు
మోహన కృష్ణుని మురళీ గానపు
వాహినిలో యెద పరవశింపగా
యమునా తటిపై విమల గాత్రివై
నటనను సల్పెడి రాధవు_భారత జనతపు గాథవు

ఊర్ధ్వమ్మున....అమరావతి....
నటనా సౌధమ్మును దిగిక్రిందికి
దిగివచ్చే ఊర్వశివా? తిలోత్తమవా?
యనబరగితి....

దిగిరమ్మిక దివినుండిక
ఓసౌమ్యమ శ్రీ సౌమ్యమ!
చిరుగజ్జల రవళి యదే చిందులుద్రొక్కగ
ఘలు ఘల్లున మెలమెల్లన
దివినుండిక దిగిరమ్మిక
ఓసౌమ్యమ శ్రీసౌమ్యమ!
కోకిలబాకాలవే 'కుహూకుహూ!' యన
చిలుకల పలుకులవే 'కువకువ' యన___
శారికల'యింపుల నడకలవే' రయ్యన!
చిగురాకుల యందలి పూవులలో
"ఝు-ఝు!" మ్మని నాదమ్మొసరించెడి తుమ్మెదలవె_
వనమయూరికల క్రేంకారాలవె_
ఉపవనమున నడయాడెడి దుహితల
జామాతల వలపుసొలపులవే_
కమ్మని రాగాలాపన గావించెడి
కలకంఠుల కంఠాలవె__
విశ్వాసము జనతను పాదుకొల్పి
వశ్యమ్మొనరింపగ శాత్రవతతి
భారతమొక త్రాటిపైన
బలీయముగ నడిపింపగ
రారమ్మిక_ ఓసౌమ్యమ
దివినుండిక దిగిరమ్మిక
ఓసౌమ్యమ శ్రీసౌమ్యమ_

మనం - మన సంగీతం

— మంచాళ జగన్నాథరావు

సంగీతం లలితంగా ఉండకపోతే దానికి " ఆపాతమధురం " అనే ప్రఖ్యాతి రానేరాదు. అంటే వినగానే శ్రోతల మనసులు ఆకర్షించి ఆకట్టుకునే సంగీతమే సంగీతమని నా అభిప్రాయం.

ఇప్పుడు మనదేశం అంతటా లలిత సంగీతం అని ఆకాశవాణి వారు నామకరణంచేసిన ఒక సంగీత శాఖ ప్రచారంలోకి వచ్చింది. ఇది నిజానికి కొత్త దేమీకాదు. వ్యాకరణ బద్ధమైన పద్యకావ్యాలు చదువుకుని, లేక రచించి ఆనందించే, ఆనందింపచేసే విద్యావంతుల సంఖ్య ఎలాగయితే తక్కువగా వుంటుందో అలాగే శాస్త్రసంబంధమైన కొన్నికట్టుబాట్లతో వినిపించగల సంగీతం విని ఆనందించగల శ్రోతల సంఖ్యకూడా తక్కువగానే వుండడం సహజం. జానపదులు సులభమయిన వాక్యనిర్మాణంతో అతిగంభీరములయిన విషయాలను కూడా పాటలుగా, పదాలుగా అల్లుకుని దానికి తగిన విధంగానే చిన్న చిన్న వరుసలు కట్టుకుని పాడుకోవడం ఈ దేశంలో—ఈదేశంలో ఏమిటి? ఎక్కడా ఎప్పుడూ అనాదిగా వస్తున్న పరిపాటే.

ఈ జానపదుల సంగీతం సాహిత్యం విద్యావంతుల సంగీత సాహిత్యాలతోటి, వర్ణచిత్రాలకు రేఖా చిత్రాలవలె దగ్గిరసంబంధం అనుబంధం కలిగి వుంటూనే వున్నాయి.

ఒకప్పుడు సంగీత సాహిత్యాలను, నాట్యాలను ప్రదర్శించుకోవడానికి మనకి పండుగలు, పర్వాలు, జాతరలు, తిరునాళ్ళు, ధనవంతుల ఇళ్ళలో జరిగేశుభకార్యాలు, జమిందారులు, ప్రభువులు మొదలయిన వారి సంస్థానాలు మొదలయినవి ముఖ్యమయిన సందర్భాలను సావకాశాలను కలిగించేవి. అటువంటి సందర్భాలలో తదనుగుణమయిన సంగీత సాహిత్య నృత్యాదులు విని, తెలుసుకుని చూసి ఆనందించే ప్రజాబాహుళ్యం యొక్క మానసిక స్థాయికి అనుగుణంగా తీర్చి దిద్దుకుని కళాకారులు తమవిద్యని ప్రదర్శిస్తూండేవారు.

చక్కటి కవిత్వంగాని సంగీతంగాని విని ఆనందించాలంటే పెద్దవారి ఇళ్ళలో జరిగే విద్యాగోష్ఠులుతప్ప వేరేమార్గం ఆరోజులలో వుండేదికాదు. మరి ఈనాడో! ఒక్క మన ప్రాంతంలోనే కాకుండా ప్రపంచలోని అన్నిమూలలనుంచి కూడా మన ఇష్టమయిన సంగీతాన్ని, మనకిష్టమయిన భాషలో కవిత్వాన్ని ఇంకా ఎన్నెన్నో విషయాలను మనం మన ఇంట్లోనే కూర్చుని కాలుకదపకుండా విని ఆనందించగల అవకాశం విజ్ఞానశాస్త్రం ఈనాడు మనకు ప్రసాదించింది. అందుకే క్రొత్త క్రొత్త పోకడలు ఎన్నివచ్చినా, అవి మనకి రెండవ రోజుకి పాతవే అయిపోతున్నాయి. ఇప్పుడు సినిమాలు, గ్రామఫోనులు రేడియోలతోపాటు టెలివిజన్ మొదలయినవి వచ్చి మన ఆనందానుభవాన్ని ఇంకా ఇంకా కొత్త దారుల వెంబడి నడిపిస్తున్నాయి. సామాన్య ప్రజానీకం అని, మనం వ్యవహరించుకోవలసిన వారు తగుమాత్రంగా సంగీత సాహిత్యాలు తెలిసినవారే వుంటారు. వీరికి రోజంతా పనిచేసి అలసి ఇంటికి వచ్చేటప్పటికి కాస్తంత మానసికానందాన్ని ఆలోచనామృతపు బరువులు లేకుండా ఇవ్వగల సంగీతంకావాలి. వీటిని ఇవ్వడానికే ఈ నాడు లలితసంగీత రచయితలు, గాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సంగీత పరమావధి

సంగీతానికి లక్ష్యం ఆత్మానందం. దానితో పాటు భగవదారాధన ప్రధానంగా వుండేవి ఒకప్పుడు. గాయకులు తమ భావనాబలంతో వారిశ్రోతలను కూడా అలౌకిక మార్గాల వెంట తీసుకువెళ్ళగలిగే వారు. గనుకనే ఈ దేశంలో త్యాగరాజ స్వామి వారు, ముత్తుస్వామిదీక్షితులవారు, క్షేత్రజ్ఞులవారు, శ్యామ శాస్త్రిలవారు, రామదాసులవారు మొదలయిన వాగ్గేయకారులు వారిరచనలతో మనమధ్య చిరంజీవులుగా వున్నారు. ఇప్పుడు లౌకిక వ్యాపారాల మధ్య మనకి భగవచ్చింతనకు భక్తిపారవశ్యానికి అంతగా సమయంచిక్కడం లేదు. మనచుట్టూవున్న ప్రకృతి లీలలు తేలికగా చూసి విని ఆనందించడమే మనకి ఎక్కువగా అవసరంగా కనబడుతోంది.

చూడండి: "చీమలో, బ్రహ్మలో" శివకేశవాదులలో అనే కీర్తన అతిశ్రావ్యంగా పాడుతున్నప్పటికీ నూటికి ఐదుగురుశ్రోతలు కూడా వుండరు వినడానికి. "అటుజాబిలి–ఇటునువ్వు" అనే ఒక ప్రేమ గీతం ఎలాపాడినా వినడానికి నూటికి రెండు వందలమంది సిద్ధంగా వుంటారు. ఇదీ యుగ పరిణామం! ఇందులో ఎవరి తప్పు లేదు. ఈనాడువినబడే లలితసంగీతంలో ప్రేయసీప్రియులు, చందమామ, మేఘాలు, మలయ మారుతం సకృత్తుగా కోయిల మొదలైన విషయాలను చుట్టూఅమర్చివ్రాసినవి తప్ప ఇంకేవీవుండవు. కారణం సినిమాలో ప్రేయసీ ప్రియులు కలుసు కున్నప్పుడో, విడిపోయి నప్పుడో పాడుకున్న పాటలు, అలాంటివే భావాలుగల పాటలు వింటూ తమని తాము మరచిపోయి అటువంటి సన్నివేశాలలో విహరించడమే ఈ నాటి శ్రోతలకి కావాలి. ఇదే లలితసంగీతంగా రూపొందు తోంది. ఇది తప్పనగలమా?

ఇక పోతే శృంగారం తప్పంటామా! కాదు. సృష్టి స్థితి లయాదులు మూడింటికి శృంగారం ఆదికారణం. అగ్ని, వాయు, జలస్థలాది పంచభూతాలు ఎలాగయితే ప్రాణికోటి జీవించడానికి అవసరమో అలాగే శృంగారం కూడా ప్రాణికోటికి అవసరము అయితే "అతిసర్వత్ర వర్జయేత్" అన్న ఆర్యోక్తిని మనం మర్చిపోతే చిక్కుల్లో పడిపోతామేమో!

సంగీతధోరణులు నవ్యంగాను, పాతవాటికంటె విలక్షణంగాను వుండాలని రకరకాల వాద్యాలతో కూడిన వాద్యగోష్ఠుల సహాయాన్ని

లలిత సంగీతంలో మనం వాడుకుంటున్నాం. నిజానికి ఎంతో సమర్థులయిన సంగీతదర్శకులు కాని ఈ వాద్యగోష్ఠి విలువని నూరు పయాపైసలు వాడుకోలేరు. లలితసంగీతం అనేది నిజంగా రక్తి కట్టాలంటే క్షీరనీర న్యాయంగా కవి సంగీతదర్శకులు, గాయకుడు వాద్యగోష్ఠివారు అందరూ కలిసి వొకరి కష్టనిష్ఠూరాలు ఒకరు బాగా అర్థంచేసుకుని ఎవరి సహాయం వలన ఏలోటు సరుకోవడానికి వీలవుతుందో తెలుసుకుంటూ అందరూ అన్నివిధాల సహకరించుకుంటూవుంటే చక్కటిపాటలు సృష్టించగలిగి ప్రజలకందించగలుగుతారు.

హృదయ సౌరళ్యంకోసం సంగీతం

శాస్త్రీయ సంగీతాన్ని తెలుసుకొని ఆనందించడానికి లలిత సంగీతం ఒక సోపానంగా వుండాలని ఈనాటి లలిత సంగీత నిర్వాహకులలో చాల మంది అభిప్రాయం. దీనితో నేనుకూడా ఏకీభవిస్తాను. ఇక లలిత సంగీతం పాడేవారు సక్రమంగా తగు మాత్రంగానయినా శాస్త్రీయ సంగీతం తెలుసుకుని ఉండకపోతే వారికి కొన్ని కొన్ని సందర్భాలలో చాలా ఇబ్బంది కలుగుతుంది. శాస్త్రీయ పరిజ్ఞానం వున్నవారు పాడగలిగినంత సుళువుగా వీరు కొన్ని కొన్ని రచనలు పాడలేకపోవచ్చు. గనుక శాస్త్రీయ పరిజ్ఞానం కొంత అందరికీ వుండడం అవసరమే. అక్షరజ్ఞానం ప్రజలందరిలోను వుండాలని ఎంత దృఢంగా ప్రచారం చేస్తున్నామో అంత దృఢంగానూ సంగీతపరిజ్ఞానంకూడా యువతరం వారికి సక్రమంగా కలిగించడానికి అన్నివిధాల ప్రయత్నించడం ఎంతయినా అవసరం. ఎందుకంటారా, సంగీతసాహిత్యాలు రెండింటిలోనువున్న ఆనందాన్ని అర్థం చేసుకుని అనుభవించలేని వాడు "కొమ్ములు తోకలేని పశువని" పెద్దలన్నారు. అనేక సందర్భాలలో నిష్పాక్షికంగా ఆత్మవిమర్శన చేసుకుంటే మన మెవరమో మనం తెలుసు కోవచ్చును. గనుక విద్య అంటే గుమాస్తాలను, న్యాయవాదులను, వైద్యులను ఇంజనీర్లను తయారు చేయడం ఒకటే కాదు. ఆలోచనామృతంతోపాటు, ఆ పాతమధురంలోవున్న మానసిక ప్రబోధాన్నికూడా పెంపొందించగల సంగీతాన్నికూడా కొంతంత మన కళాశాలల్లోను అక్కడ అక్కడ వినిపించే, నేర్పించే వసతులు మనం కలిగించుకోవాలి. ఈ శాస్త్ర విజ్ఞాన విహీనుల సంఖ్య కొంతయినా అప్పుడు తగ్గించిన వాళ్ళమై ఆర్ద్ర హృదయులను; పెద్దలయందునా దేవుని యందునా భక్తిభావం, లలితములైనమనఃప్రవృత్తివున్న మనుష్యలని ఎక్కువగా తయారు చేయగలుతాము!


ఇదివరకటి రోజుల్లోనే అక్షరాస్యత తక్కువగా వున్నప్పటికీ బుర్రకథలు, వీధినాటకాలు, జంగంకథలు, భాగవతమేళాలు, హరికథలు, పురాణపఠనాలు, రంగస్థలనాటకాలు మొదలైనవి ఎన్నోవిధాలుగా ప్రజలకు మన సంస్కృతికి అతి ముఖ్యములయిన పురాణేతిహాసాలను తెలుసుకోవడానికి అవకాశం వుండేది. ప్రజాబాహుళ్యంముందు పైన చెప్పిన ఏ విద్యాప్రదర్శనం ఇవ్వాలి అన్నా, ఆ వ్యక్తి చక్కటిసంగీత సాహిత్య పరిజ్ఞానం వుండితీరాలి. అన్నిటికన్నా ముఖ్యం చిన్నతనంనుంచి తనచుట్టూ కనబడుతూ, వినబడుతూవుండే వాతావరణమే పసిపిల్లకు భావిజీవితం తీర్చిదిద్దుతుందని మన శాస్త్రవేత్తలు చెబుతారు. ఇప్పటికి మన ఇళ్ళల్లోని పరిస్థితి ఎవరిమట్టుకు వారు సమీక్షించుకుంటే చాల విషయాలు మన మట్టుకు మనకే అర్థం అవుతాయి. చక్కటి సాహిత్యం కనబడదు. మంచి సంగీతం వినబడదు. మానసిక వాతావరణాన్ని ఉన్నతశిఖరాలలో నడిపించగల శక్తివంతములయిన చర్చలు వినబడవు. ఎంత సేపూ ఏ సినిమాలో ఎవరు నటించారు? ఎవరు ఎవర్ని ఏమేమిచేశారు? లేకుంటే ప్రమోషన్లు ఇంక్రిమెంట్లు మొదలయిన విషయాలు తప్పించి మనం చర్చించుకోము. మన పిల్లలు వినే అవకాశంకలిగించము.

పదిరూపాయలు ఖర్చుపెట్టి సినిమాకి పిల్లల్ని పంపుతామే కాని ఒక చక్కటి నాటకానికి గాని, చక్కటి సంగీతసభకు గాని వెళ్ళమని ప్రోత్సహించం. ఏ కొద్దిమంది పిల్లలకో సరదగా వుండి సంగీతసాహిత్యాలలో కృషి చేయ్యాలనుకుంటే వాళ్ళని చెయ్యనివ్వం. ఎందుకంటే ఇవి, కూడుగుడ్డ ఇచ్చే విద్యలుకావని మన అభిప్రాయం.

జీవనోపాధికి పనికిరాని విద్యలుగా మన లలితకళలను చూసినన్నాళ్ళు మనుష్యులలో మార్పులు ఊర్ధ్వముఖంగా కాకుండా అధోముఖంగానే సాగుతూవుంటాయి. మానవ సహజమయిన కళాపిపాస పరిస్థితుల ప్రాబల్యం వల్లనే నేర్చుకునేవాళ్ళల్లోను, వినేవారిలోను అణగత్రొక్క వేయబడడం జరుగుతున్నది. దీని వలన సరైన శిక్షణ, సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల ఈ తృష్ణ వెర్రితలలు వెయడంలో ఆశ్చర్యం ఏముంది?

తెలుగుభాష తీయదనం కర్నాటక సంగీతానికి ప్రాణం

ఆధునిక చిత్రకళ



చలసాని ప్రసాదరావు

ఏనాడేదయినా చిత్రకళా ప్రదర్శనాన్ని దర్శిస్తున్న సమయాన ప్రేక్షకుల్లోంచి ఆ యా చిత్రాలను గురించి, వాటి విలువలను గురించి ఆశ్చర్యంతో, అనుమానంతో, విసుగుతో, హేళనతో కూడుకున్న వ్యాఖ్యానాలు వినవస్తూండడం అనేది సర్వ సాధారణంగా ఉండటం మనం గమనిస్తున్నాం.

ఇందుకు ప్రధాన కారణం నేటి చిత్రకారులలో అధిక సంఖ్యాకులు, మనం గతంలో బాగా అలవాటు పడిఉన్న పద్ధతిలో గాక పాశ్చాత్య చిత్రకళా రంగంలోని వివిధ ధోరణులు, విధానాల వలన ప్రభావితులై ఆ స్థాయి అందుకోయత్నిస్తున్న స్థితిలో వారి చిత్రాలు రూపొందుతూ ఉండటమూ, నేడు జరుగుతూ ఉన్న వివిధ చిత్రకళా ప్రదర్శనల్లోనూ ఈ తరహా చిత్రాలకే గౌరవ స్థానం లభిస్తూ, అవే అధిక సంఖ్యలో ప్రదర్శితమవుతూ ఉండటమూను.

ప్రేక్షకులొక చిత్రాన్ని దర్శిస్తూన్నపుడు ఆ చిత్ర సృష్టిలో కళాకారుడు ప్రదర్శించిన ప్రతిభనో, సూచించదలచిన విషయాన్నో, దాని వెనుకగల భావాన్నో, కనీసం ఆచిత్రకారుడు తాను స్వయంగా అనుభవించి తన చిత్రంలో రేఖా, వర్ణ రూపకంగా గుప్పపరచిన అనుభూతినో గ్రహించాలనీ, తానూ ఆ అనుభూతిని అనుభవించగలగాలనీ తాపత్రయ పడటం, ఆ ప్రయత్నంలో వారు సఫలీకృతులుకాని పక్షాన నిరుత్సాహపడటం సహజం.

సరిగా ఈ స్థితిలోనే కళారంగంలో చిరకాలంగా వాదోపవాదాలతో నలిగిపోతున్న 'కళ కళ కోసమా ? ప్రయోజనం కోసమా ?' అనే అనంతమైన చర్చ ఇక్కడా ప్రత్యక్ష మవుతుంది. నేటి చిత్రకళలోని విభిన్న ధోరణులపై, కళాకారులపై ఈ వాదాల ప్రభావం ఏదో ఒక రూపంలో బలంగానే ఉంది. నేటి కళలో అధిక భాగం మానవుడ్నీ, అతనికునికి పట్టయిన సమాజాన్ని విస్మరించి మానసిక వికృతుల ఊహాజగత్తులో విహరిస్తూ, సామాన్యులకేగాక మేధావులకు కూడా దూరదూరంగానే ఉండిపోయిందని అనేక మంది విమర్శించటానికి గల అవకాశాలకు మూలం ఏ చిత్రాలైతే ఈ విమర్శకు గురవుతున్నాయో ఆయా చిత్రకారులపై ఈ వాదాల ప్రభావం బలంగా ఉండటమే.

అసలు కళ అనేది అత్యున్నత స్థాయి నందుకున్న మానవ మేధస్సు మాత్రమే సృష్టించగల ఒక అపూర్వవరమనీ, దానిని కళాకారుడు తన శక్తి సామర్థ్యాలతో మరింత ఉన్నత స్థితికి తీసుకుపోకుండా సామాన్యులకోసం దాని నుద్దేశించి, వారి వారి మానసికావరణాల పరిధిలోనే నిలబెట్టు జూడటం కళకు ద్రోహమూ, కళాభివృద్ధికి తీరని అపచారమూ, కళాకారులుగా తమ ఔన్నత్యాన్ని సంకుచితపరచుకోవటమూగా భావిస్తూ కళ కళకోసమేనని నమ్మేవారు ఆ ధోరణి కనుగుణంగా తమ కళా సృష్టిని కొనసాగిస్తున్నారు.

అలాగే కళలో మానవుడ్ని ఉత్తేజితుడ్నీ, ఉన్నతుడ్నీ చేయగల అపూర్వ శక్తి ఇమిడి ఉందనీ, అలాంటప్పుడు సమాజంలో ఒకడుగా ఉంటూ, సామాజిక జీవితం నుండీ, జీవిత సంఘర్షణనుండీ, సంఘర్షణ ఆ ఫలితమైన మానసికానుభూతుల నుండీ ఉత్తేజాన్ని పొందుతూకూడా కళాకారుడు తన చిత్రణా పద్ధతిని మాత్రం తన తోటివారికి దుర్గ్రాహ్యంగా రూపొందించటం



జీవితం చిత్రకారుడు: ప్రేమానంద్ ప్రతోలి

చిత్రకారుని శ్రమకు సాఫల్యాన్నివ్వదనీ, పైగా విపరీతమైన మానసిక సంఘర్షణ, శ్రమల ఫలితంగా రూపొందుతున్న ఈ కళాసృష్టి ఎవరినీ ఏ రూపంలోనూ కదిలించలేక పోతున్నప్పుడు దానికి సార్థకత ఏమిటనీ రెండవ వర్గంవారి వాదం.

ఈ వాదాలీనాడు పుట్టుకువచ్చినవిగావు. వీటి మధ్యగల సంఘర్షణ ఇప్పట్లో సమసిపోయేదిగాదు. కనుకనే వాటినలా ఉంచి ఎవరి విశ్వాసాల కనుగుణంగా వారు తమ చిత్ర సృష్టిని కొనసాగిస్తున్నారు.

ఈ పరిస్థితిలో ఈనాడున్న చిత్రకళ నంతటినీ ఆధునిక కళగానే గుర్తించటం, అసంతృప్తులైన ప్రేక్షకులు మొత్తంగా ఈ ఆధునిక కళగా చలామణీ అవుతున్న దానినే విమర్శించటం సహజం.

వేగంగానూ, సులభంగానూ మార్పులకు గురవుతూన్న నేటి పరిస్థితుల్లో కళాకారుడు తన భావాలను, సందేశాన్ని వర్ణ రేఖామాపకంగా వెలిబుచ్చడానికి ఆధునిక శైలులతోగల సౌలభ్యం, సౌకర్యం, అనుకూలత మన మీనాటికీ అలవాటు పడి ఉన్న వాస్తవ చిత్రణా మార్గంలో అంతగా లభ్యం గాదుకూడా.

ఉదాహరణకు, ఈ కాలపు ఏ చిత్రకారుణ్ణిగాని, అతని భావాలను గురించిగాని ప్రశ్నించనక్కర లేదు. మన పురాణ ప్రసిద్ధమైన "ముక్కంటి" అనే భావాన్ని తీసుకుందాం.

శివునికి గల మూడో నేత్రం నుండి ఉద్భవించి ది ఈ సంబోధన. అయితే కేవలం అదనంగా మరో నేత్రాన్ని కలిగి ఉండటం వలన మాత్రమే పుట్టలేదీ పేరు. బ్రహ్మకూ ఎనిమిది కళ్ళున్నాయి



కాంపోజిషన్ — చిత్రకారుడు : గౌరీశంకర్

గాని అయన్నెవరూ అష్టనేత్రుడని సంబోధించటంలేదు. 'ముక్కంటి' అనగానే మనకు స్ఫురించేది శివుడూ, ఆయన మూడోకన్ను కన్నా ప్రధానంగానూ బలంగానూ ఆ మూడో కంటిలో దాగివున్న లోకాన్ని మసిచేయగల అపూర్వశక్తి మాత్రమే.

ఈ భావాన్నే తీసుకొని సాధారణ చిత్రణా పద్ధతిలో శివుణ్ణి, ఆయన మూడు నేత్రాలనుగానీ, లేదా ఆ మూడో నేత్రం తెరుచుకొని తత్ప్రభావ ఫలితంగా ధ్వంసమవుతున్న పరిసరాలనుగానీ నైపుణ్యంతో చిత్రించినా సంతృప్తికర ఫలితాలను సాధించటం కష్టం. భావనలోని గాంభీర్యతకూ, విపులార్థానికీ తగిన న్యాయం చేకూరదు కూడా. ఇందుకు కారణం సాధారణ చిత్రణాపద్ధతిలో గల సాంకేతికమైన పరిమితులే. ఈ కోవకు చెందిన చిత్రాలనేకం మనమిప్పటికే చూసిఉన్నాం.

అదే ఆధునిక పద్ధతుల్లో అయితే చిత్రకారుడీభావానికి ప్రాణంపోయటమేగాక నూతన విలువనూ, విపులార్థాన్ని కూడా ఇవ్వగలుగుతాడు. ఎందుకంటే, సాధారణ చిత్రణా మార్గంలో ఉన్నమెలుపులూ, పరిమితులూ ఈ ఆధునిక చిత్రణా పద్ధతిలో విస్మరింపబడుతాయి ఏహద్దులూ చిత్రకారుడినిక్కడ అదుపు జేయవు.

కాలానుగుణంగాను, చిత్రకారుని భావనావైఖరి, అతని చిత్రణావస్తువు, పరికరాలు, ప్రేక్షకులసాయిలలో వచ్చిన మార్పు మూలకంగాను; కళలోనూ అనేక పద్ధతులూ, మార్గాలు నూతనంగా రూపొందుతూవచ్చాయి. అవే మార్పులకు చేర్పులకు గురై అభివృద్ధి జెందుతూ ఈ నాటి స్థితికి వచ్చాయి.

మార్పు ఎల్లప్పుడూ ఆశించదగినదే. చిత్రకారుని కానాడు చుట్టూగల ప్రకృతి, అందులోని కొండలూ, చెట్లూ, ఆకాశం, ఇత్యాది వాస్తవ రూపాలతో పాటు ఊహలోని పురాణ ఘట్టాలు వగైరా చిత్రిత వస్తువులయినాయ్ చిత్రించగా, చిత్రించగా అవి పాతబడినాయ్. ఈ స్థూల జగత్తు నిత్యం మనం దర్శిస్తున్నదే. చిత్రకారుడు మాత్రం ఈ స్థూల జగత్తును యథాతథంగా చిత్రించి ఎంతకాలం అందులోంచి అదనపు ఆకర్షణను, అందాన్ని సృష్టించగలడు? భావాత్మక చిత్రాల్లోనైనా అందులోని భావమెంత ఉన్నతమైనదైనా చిత్రిత రూపాలు మాత్రం ఇవే అయినపుడు అదనపు అంద మేమంత ఎక్కువగా స్ఫురించదు కూడా. అందువలననే ప్రారంభమయింది నూతన మార్గాలకోసం అన్వేషణ. చిత్రణలో చిత్రిత వస్తువులో విశిష్టతకోసం తహతహా ఈ ప్రయత్నంలో పెంపొందినదే ఆధునిక చిత్రకళ.

ఈ దశలోనే చిత్రకళా రంగంలో రక రకాల సిద్ధాంతాలు కొంత కాలం పాటు విశృంఖలంగా విహరించాయ్. అయితే పాశ్చాత్య చిత్రకారుల్లో అనేకమంది ఈ గొడవలలోపడి "అసలు కళాభివృద్ధి కొరకే సౌలభ్యతకే చిత్రకారుని సిద్ధాంతాలనే" విషయం విస్మరించి "ఆయా కళా సిద్ధాంతాల స్పష్టీకరణకే" కళ అనేటంతగా వ్యవహరించారు. అందుకే ఆధునిక చిత్రకళా ప్రపంచంలో ఇంత గజిబిజీ, కళాభిమానులలో ఈ అయోమయత. ఈ విషయంలో చిత్రకారులే చాలా వరకు నయం.

ఈ తెలుగు నాట చిత్రకారులు ఏమంత తక్కువ సంఖ్యలో లేరు. వారి కృషి కొన్ని పరిమితులున్నప్పటికీ సగర్వంగా చూసుకోగల స్థాయిలోనే ఉంది. మన రాష్ట్రంలో చిత్రకారుల కృషి, ఉత్సాహమూ ఏస్థాయిలో ఉన్నాయంటే, మద్రాసులో సంగీత కచేరీలెంత విరివిరిగా జరుగుతుంటాయో హైదరాబాదులో చిత్రకళా ప్రదర్శనలంత విరివిగా జరుగుతుంటాయని ఆ మధ్య ఓ ప్రముఖ కళా విమర్శకుడు సిద్ధాంతీకరించారు.

ఇది చాలావరకూ నిజమే. హైదరాబాదులో అన్ని హంగులూగల లలిత కళల కళాశాల ఉంది. రాజమండ్రిలోనూ, విజయనగరంలోనూ మరో రెండు చిత్ర కళాశాలలున్నాయి. ఈనాడు మన చిత్రకళారంగంలో నిర్విరామంగా కృషిచేస్తున్న వారిలో అధిక సంఖ్యాకులు ఈ కేంద్రాల్లో తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకున్నవారే. ఈ కళాశాలల్లో ఇంతకు ముందెన్నడూ లేనంత ఎక్కువ సంఖ్యలో ఈనాడు చిత్రకళా విద్యార్థులుండటం కూడా మన చిత్రకళారంగం పెద్దదవుతూందనాన్నే సూచిస్తుంది.

అన్నిచోట్లా కాకపోయినా కొన్ని ముఖ్యమైన జిల్లా కేంద్రాలలోగల కళాసంస్థలు ఏటా చిత్రకళా ప్రదర్శనలు జరిపి బహుమతులిచ్చి ప్రోత్సాహాన్నిస్తూ ఉన్నాయి. రాజధానీనగరంలో ప్రతి ఏడూ లలితకళా అకాడమీ రాష్ట్రంలోని చిత్రకారుల కళా ప్రదర్శనలను ఏర్పాటు చేస్తూంటే, మరో రెండు ముఖ్యమైన సంస్థలు భారత కళా పరిషత్, హైదరాబాద్ ఆర్టు_సొసైటీలు_అఖిల భారత స్థాయిలో చిత్రకళా ప్రదర్శనలను ఏర్పాటుచేసి బహుమతులనిస్తున్నాయి. ఈ బహుమతుల మొత్తాలు ఈనాటి పరిస్థితులలో ఏమంత చెప్పుకోదగినవి కానప్పటికీ మన చిత్రకారులు అధిక సంఖ్యలో ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారంటే మన చిత్రకారుల్లోగల ఉత్సాహం, కృషి ఎలాంటివో గ్రహించవచ్చు.

మొత్తంమీద ఒక దశాబ్దం క్రితంగల పరిస్థితులతో పోలిస్తే ఈనాడు మన చిత్రకళారంగం చాలా అభివృద్ధిలోకి వచ్చిందనే చెప్పుకోవాలి. చిత్రకారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దాని నొక హాబీగా కాక లక్ష్యంగా పెట్టుకుని చిత్రించేవారు ఎక్కువయ్యారు. వారిలో చాలామంది స్థిరపడిపోవటం కూడా జరిగింది. అనేక పరిమితులున్నప్పటికీ వారి కృషిని పదుగురకూ చూపగల అవకాశాలు పెరిగాయి.

కాని, అతి ముఖ్యమైన అంశమేమంటే ఇట్టి పరిస్థితిలో కూడా నేటి చిత్రకళా ప్రదర్శనలు కేవలం చిత్రకారులకే పరిమితమైపోతున్నాయి. ఎవరేర్పాటుచేసినా, ఎలాంటి కళా ప్రదర్శన కయినా ప్రేక్షకులనే వారెప్పుడూ ఒకే సంఖ్యలోనే, పరిమితంగానే ఉండటమనేది సర్వసాధారణంగా జరిగిపోతూంది. ఈ కొద్ది మంది ప్రేక్షకుల్లోనూ చిత్రకారులే అధిక సంఖ్యాకులు కావటం గమనించదగినది. ఇతరులకు ఈ రంగంపట్ల ఆసక్తి లేకపోవటం వలననే ప్రేక్షకులలో వారి సంఖ్య అల్పంగా ఉందనుకోవటం పొరపాటు, వారి నిర్లిప్తతకు కారణం 'కళ' తమకు దూరమైపోయిందని వారు భావించటమూ, ఆ భావాన్ని దూరంచేసి వారిని కళకుగాని, కళను వారికిగాని సన్నిహితం చేయగల ప్రయత్నాలు జరగక పోవటమూను.

ఈ విధంగా ప్రేక్షకులనబడేవారికి ఈనాటి కళ దూరంగావటానికి కారణం ఈ వ్యాసారంభంలో పరామర్శింపబడిన పరిణామాలే.

ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ఈ పరిణామాల, వాదాల, వివిధ ఇజాల ప్రభావం నేటి మన యువతరం చిత్రకారులపై ఎంతోకొంత వుంది.


పదిమంది చిత్రాలనూ ఒకచోట చేర్చినపుడు ఆ ప్రదర్శనలో వైవిధ్యాన్ని ఆశించటం సహజం. పైగా అలాంటి వైవిధ్యత అనేది లేకపోవటం జరిగితే అదొక పెద్దలోపం కూడా. కాని, ఈనాటి మనకళా ప్రదర్శనలలో పెద్దసంఖ్యలో చిత్రకారులు పాల్గొంటున్న స్థితిలోకూడా ఈ వైవిధ్యత అనేది దాదాపు కనుపించటమే లేదని చెప్పాలి. చిత్రకారుల్లో ఒక్కొక్కరూ ఒక్కొక్క రకమైన ఆలోచనాధోరణిని కలిగిఉండవచ్చు. వారి భావపరంపరలోనూ ఆ వైవిధ్యం ప్రత్యక్షంగా వుండవచ్చును. కాని చిత్రాల వద్దకు వచ్చేసరికి ఏకొద్ది మందో తప్ప తమ ప్రత్యేకతను గాని, స్వంత వ్యక్తిత్వాన్ని గాని ప్రముఖంగా ప్రదర్శించ లేకపోవటం అనేది కొట్టవచ్చినట్లు ఈనాడు కనబడుతుంది.



రెడ్ చైర్ చిత్రకారుడు : జయంత్

ఈ లోపానికి కారణంగా కొందరు చెప్పే సంజాయిషీ ఒకటిఉంది. ఇది ఈనాటి చిత్రకారునికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆవిధంగా చిత్రకారుడుగా తన సామర్థ్యాన్ని చూపదలచటమే ప్రధానం గాని, ఏదో ఒక భావానికి తన సృష్టిని పరిమితం చేయటం గాదనేది ఈ వాదం. ఇలాచెప్పేవారు సంఖ్యలో అధికంగానే ఉన్నారు.

కాని, వేరొక విషయం విస్మరిస్తున్నారు. సాంకేతిక విభవలనేవి చిత్రకారుడు తాను చెప్పదలచిన, లేదా చిత్రించదలచిన విషయాన్ని అర్థవంతంగానూ, శక్తివంతంగానూ ప్రదర్శించటానికి తోడ్పడే సాధనాలేగాని అవే సర్వమూగాదు, ప్రధానమూగాదు. అలాగే నేటి కళా ప్రపంచంలో కనుపించే మరో పెద్దలోప చిత్రకారులైన వారిలో తమకూ, తామున్న సమాజానికీ మధ్య



సాంధ్యరాగం — చిత్రకారుడు-యస్. వి. రామారావు.

గల, లేదా ఉండవలసిన సంబంధాలను గురించి గానీ, బాధ్యతలను గురించిగానీ కనీసం పరిమిత రూపంలోనైనా అవగాహన అంటూ ఎలాంటిది గానీ గోచరించక పోవటం.

ఇలాంటి అవగాహన అనవసరమని ఈనాటి చాలామంది చిత్రకారుల వాదం. కాని, తెలియకో తెలిసో తిరిగి వారే ఈ సమాజం తమ కృషివిలువను సరిగా గుర్తించటం లేదని బాధపడి పోవటము జరుగుతున్నది. తమ చుట్టూ ఉన్నవారు తమ కషాన్నీ, సృష్టినీ గుర్తించాలనీ, గౌరవించాలనీ కోరుకునేవారు తప్పనిసరిగా తాముా ఆరకమైన గుర్తింపును ఇవ్వవలసి వుంటుంది. అది లోపించటం వలననే నేడు గతంతో పోల్చినపుడు మరేనాడూ లేనంతగా పెరిగి పెద్దదైనట్లు మన చిత్రకళారంగం కనిపిస్తున్న స్థితిలో కూడా ఇతర కళారంగాలతో పోల్చినపుడు ఈ చిత్రకళారంగం పదుగురకూ దూరంగానూ, పరిమిత పరివారంలోనూ ఉండిపోయింది.

అకాడమీల అవార్డులతోనే కళాకారుని కృషిసాఫల్యత జెందిపోదు. అతని అనంతమైన కళాజీవితంలో అలాంటివి కొన్ని ప్రోత్సాహకరమైన సోపానాలేగాని అవే సర్వమూగావు. తన చుట్టూ గల ప్రపంచంలోనూ గుర్తింపునూ, ప్రశంసనూ పొందగలిన నాడే అతని శ్రమకు సార్థకత. కాని, దురదృష్టవశత్తూ మన కళాకారుల ఈఅవగాహనకు ఇంకా చేరుకోక పోవటమే గాక చాలా దూరానఉండి పోయారుకూడా.

ఇది జరగాలన్నా, మన కళాకారుల శ్రమ సఫలం కావాలన్నా మన కళారంగంలోని వారిలో వారి ఆలోచనాధోరణిలో పెద్ద మార్పురావలసిఉంది. అలా రావటమనేది ఆలస్యమైనప్పటికీ అది తప్పని సరిగా జరగవలసివున్న అత్యంత సహజమైన పరిణామం.

ఒక తరం కథ

చరిత్రలో అత్యంత ప్రధానమైన సమయంలో నివసిస్తున్నాం మనం. ఈనాడు భారత దేశం ఆదర్శవంతమైన లౌకికరాజ్య సృష్టిలో నిమగ్నమై వుంది. విపులంగా పరిశీలించి, చర్చించి, నిర్ణయాలు తీసుకొనవలసిన అనేక జాతీయ, అంతర్జాతీయ సమస్యలు నేడు మనముందు నిలిచి వున్నాయి.

మనం సృష్టిస్తున్న ఈ మహోజ్జ్వల చరిత్రను గూర్చి మీరు తెలుసుకోవాలంటే

ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాస పత్రిక చదవండి

ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ, హిందీ భాషలలో ప్రచురింప బడుతున్నది.

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ

— దేవులపల్లి రామానుజరావు

తెలుగు ప్రజల సాంస్కృతిక జీవిత రంగమునందు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ స్థాపన ఒక చరిత్రాత్మక సంఘటన. ఆంధ్ర ప్రదేశ్ రూపు దాల్చిన తరువాత తొమ్మిది మాసాలకే సాహిత్య అకాడమీ స్థాపన జరిగినది ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రప్రథమముగా ప్రారంభమైన అకాడమీ సాహిత్యానికి సంబధించినది. 1957 సంవత్సరము ఆగష్టు 7వ తేదీన, రవీంద్ర కవీంద్రుని వర్ధంతినాడు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీకి అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభోత్సవము గావించినారు. స్వతంత్ర భారతదేశపు ప్రథమ రాష్ట్రపతి ఆంధ్ర ప్రదేశ్ లోని తొలి అకాడమీకి పచ్చతోరణము కట్టి ప్రారంభోత్సవము జరుపడము తెలుగు వారి అదృష్టము.

అకాడమీ ఆశయాలు

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ స్థాపన జరిగి పదకొండు సంవత్సలములు గడచినవి, పన్నెండవ సంవత్సరము నిండుచున్నది. ఈ పన్నెండు సంవత్సరాల ప్రగతిని పరిశీలించుటకు ముందు అకాడమీ ఆశయాలనుగూర్చి తెలుసుకొనవలసియుండును. తెలుగు భాష, సాహిత్యాల అభివృద్ధి కొరకు సాహిత్య వేత్తల మధ్య సహకారమును పెంపొందించడము, ఆధునికమైన, శాస్త్రీయమైన పద్ధతులలో. నిస్తృతమైన తెలుగు నిఘంటువును, ప్రామాణిక మైన తెలుగు వ్యాకరణాన్ని సిద్ధపరచడము. విజ్ఞాన కోశాలు, నిఘంటువులవంటి ప్రాతిపదిక పరిశోధనాగ్రంథాల సంకలనము చేయడము రచయితలకు, సాహిత్య సంస్థలకు సహాయపడడము. ప్రతిభావంతులైన రచయితలకు బహుమతులిచ్చి, గౌరవ సత్కారములు జరిపి ఉత్తమ సాహిత్య సృషిని ప్రోత్సహించడము, తెలుగు భాషలో, సాహిత్య పరిశోధనను ప్రోత్సహించడము, ప్రజలలో ఉత్తమ సాహిత్య పఠనాభిలాషను పెంపొందించడము ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రధాన ఆశయాలుగా నున్నవి. ఈ ఆశయాలు సాఫల్యము కొరకు గడచిన పదకొండు సంవత్సరాల స్వల్ప కాలములో అకాడమీ అవిరళముగా కృషి జరిపినది. ఈ పదకొండు సంవత్సరాల స్వల్పకాలములో తన ఆశయ సిద్ధికొరకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ జరిపిన కృషి బహుముఖమైనదీ, విస్తృతమైనదీఅని చెప్పినచో యెంతమాత్రము అతిశయోక్తికాదు. గడచినపదకొండుసంవత్సరాల వ్యవధిలో అకాడమీ నిర్వహించిన కార్యక్రమాలను, అందించిన ప్రచురణలను పరికించినచో అకాడమీ ఆశయాలు అందులో ప్రతిబింబించుచున్నట్లు స్పష్టము కాగలదు.

ప్రాతిపదిక కృషి

విపులమైన నిఘంటు నిర్మాణానికి, ప్రామాణికమైన వ్యాకరణ రచనకు ముందుగా జరుగవలసిన ప్రాతిపదిక కృషి చాల ఉన్నది. అందువలన సాహిత్య అకాడమీ యీ ప్రాతిపదిక కృషి పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించినది; యిందు నిమిత్తము పలు రకాలైన పథకాలను రూపొందించి అమలు జరిపింది. సామెతలు నుడికారాలు మనజాతీయ జీవనానికి దర్పణాలేగాక మనభాషా సాహిత్యాలకు ఆయువు పట్టులు; తెలుగువారి జీవితపు తీరు తెన్నులకు తెలుగు భాషలోని తీయందనాలకు మన సామెతలు, నుడికారాలు ఆటపట్టులు. కావుననే సాహిత్య అకాడమీ సామెతలను సేకరించినది, నుడికారాలను ఒకచోట ప్రోగుచేసి పదబంధ పారిజాతాల దండలు కట్టినది. ఈ సామెతలు, నుడికారాల సంపుటాలలో నిఘంటువుల కెక్కని పదసంపద పుష్కలముగా నున్నది. అకాడమీ జరుపుచున్న అకుంఠిత కృషివలన యీ పద సంపదను తెలుగు శబ్ద సంచయములో భద్రపరచుటకు అవకాశము యేర్పడినది. దీనితో పాటు పదప్రయోగ కోశాలు ప్రామాణిక నిఘంటు నిర్మాణానికి, వ్యాకరణ రచనకు మిక్కిలి అక్కరయిన సామగ్రులు. ఈ కారణముచేత నన్నయ పద ప్రయోగ కోశము, నన్నెచోడ పద ప్రయోగ కోశము శ్రీనాథ పదప్రయోగ కోశము మొదటి సంపుటమును సాహిత్య అకాడమీ ప్రచురించినది. శ్రీనాథ పద ప్రయోగ కోశము రెండవ సంపుటము, తిక్కన పదప్రయోగ కోశములతోపాటు మాండలిక పదకోశము అచ్చులో నున్నవి. ఈ

పద ప్రయోగ కోశాలు ఆంధ్రభాషా వికాసానికి సూచికలు, వ్యాకరణ రచనకు ప్రాతిపదికలు, నిఘంటు నిర్మాణానికి కరదీపికలు. తెలుగు సీమలో వివిధమైన వృత్తులున్నవి. వ్యవసాయము, చేనేత, గృహ నిర్మాణము, మత్స్యపరిశ్రమ, కమ్మరము, కుమ్మరము, స్వర్ణకార వృత్తి మొదలగునవి యీ వృత్తులలో ముఖ్యమైనవి. ఈ వృత్తులను అవలంబించు జనుల నాలుకల మీద నాట్యమాడు పదజాలము కొంత నిఘంటువుల కెక్కలేదు. కాను తెనుగు జాలువారు యీ పదజాలమును సేకరించనిదే నిఘంటు నిర్మాణ కార్యక్రమము ప్రారంభించుట ప్రయోజనకరమైన పద్ధతి కాదు. సాహిత్య అకాడమీ మొట్టమొదట యీ వృత్తి పదకోశాలను ప్రకటించవలెనని నిశ్చయించినది. ఈ నిశ్చయము ప్రకారము వ్యవసాయవృత్తి పదకోశము, వాస్తువృత్తి పదకోశము ప్రకటితమైనవి. చేనేత పదకోశము అచ్చులోనున్నది. మత్స్య పరిశ్రమ, కుమ్మరము కమ్మరము మొదలయినవృత్తుల పదకోశాలు ప్రచురణకు సిద్ధమగుచున్నవి. మనదేశ భాషలలో తమిళ, కర్ణాటకములతోపాటు తెలుగుకూడ మిక్కిలి ప్రాచీనమైనది. నన్నయకు చాల పూర్వమునుండి తెలుగులో రచన జరుగుచున్నట్లు శాసనాధారాలున్నవి. ఈ శాసనాలలో ప్రయోగించిన శబ్దజాలము కొంత మన నిఘంటువులలో కనుపించుటలేదు. అందుచేత శాసన పదకోశము సాహిత్య అకాడమీ సిద్ధముచేయించి ప్రకటించినది. 11వ శతాబ్దమువరకు దొరికిన తెలుగు శాసనాలను పదవివరణతోపాటు ప్రకటించవలెనని నిర్ణయించనైనది. ఒరియా, కర్ణాటకము, తమిళము, మరాఠీ, హిందీ, ఉర్దూభాషలలో తెలుగు మాటలతో దగ్గరి చుట్టరికము గల శబ్దాల కోశమును ప్రకటించవలెననిగూడ అకాడమీ అభిప్రాయపడుచున్నది.

ప్రాచీన సాహిత్య ప్రచురణ

తెలుగుభాష, సాహిత్యాలలో శాస్త్రీయమైన ఆధునిక పద్ధతుల ద్వారా పరిశోధనను, విమర్శను పెంపొందించడమే గాక ప్రజలలో తెలుగు భాషాభిరుచిని విస్తరింపజేయుట గూడ అకాడమీ ఆశయాలలో అతిప్రధానమైనది. ఈ ఉద్దేశముతో తెలుగులోని ఉత్తమ వాఙ్మయాన్ని చక్కగాముద్రించి సరసమైన వెలకు లభింపజేయవలెనని అకాడమీ నిర్ణయించినది. ఈ కార్యక్రమానికి తొలిమెట్టుగా పోతన మహాభాగవతము నాలుగు సంపుటాలలో ప్రకటితమైనది. ఈ ఉద్దేశముతోనే తెలుగు ప్రబంధాలను, కావ్యాలను సరసమైన ధరకు, తెలుగు పాఠకలోకానికి అందించవలెనని అకాడమీ నిర్ణయించినది. ఈ నిర్ణయానికి అనుగుణముగా యీ వరుసలో మనుచరిత్రము, పాండురంగ మాహాత్మ్యము, విజయవిలాసము, పారిజాతాపహరణము, వసుచరిత్రము, ప్రభావతీ ప్రద్యుమ్నము, శతక సంపుటాలు మొదలైన తెలుగు ప్రబంధాలను, ముప్పది అయిదింటిని యిప్పటివరకు అకాడమీ ప్రచురించినది. సరసమైన వెలకు అకాడమీ అందించిన యీ విలువైన గ్రంథాలకు తెలుగు పాఠకలోకము ఆదరణ లభ్యమైనది. ఈ వరుసలో మొత్తము యేబది ప్రబంధాలను ప్రచురించవలెనని అకాడమీ నిర్ణయించినది. తక్కిన ప్రబంధాలుగూడ త్వరలోనే తెలుగు ప్రజల చేతులలోనికి రాగలవు. భారత, భాగవత, రామాయణాలను సంగ్రహించి ప్రకటించవలెనని సాహిత్య అకాడమీ ఉద్దేశించుచున్నది. ఈ వాఙ్మయ ప్రచురణ కార్యక్రమములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అకాడమీకి సహాయ సహకారాలు లభ్యమైనవి. బ్రౌన్ జీవిత చరిత్ర, రసగంగాధరము ఆంధ్రానువాదము, ఆంధ్ర గద్య చంద్రిక, ఆంధ్రదేశ చారిత్రక భూగోళమువంటి ఉత్తమ గ్రంథాలను అకాడమీ ప్రచురించినది.

బ్రౌన్ నిఘంటువు

తెలుగు భాషలో మొట్ట మొదటి ఉత్తమ నిఘంటువు బ్రౌన్ నిఘంటువు. బ్రౌన్యమును అకాడమీ యథాతథముగా ప్రకటించినది. బ్రౌన్ నిఘంటువు ప్రచురణము అకాడమీ కార్యక్రమాలలో గణనీయమైనదిగా పేర్కొనవచ్చును. తెలుగు భాష ద్వారా అన్ని విజ్ఞాన శాస్త్రాలను పఠించు విద్యార్థులకు ఉపయోగించునట్లు తెలుగు–తెలుగు నిఘంటువు నొకదానిని సాహిత్య అకాడమీ సిద్ధము చేయించి ముద్రణ కావించినది. సాహిత్య అకాడమీ పక్షాన ప్రామాణిక నిఘంటు నిర్మాణానికి కావలసిన సాధన సామగ్రి సేకరణ దాదాపుగా సంపూర్ణమగుచున్నది. ఈ సాధన సామగ్రి వ్యాకరణ రచనకు గూడ ఉపయోగకారిగా ఉండగలదు.

అకాడమి గ్రంథాలయము

ఆంగ్లములోనికి బ్రౌన్ అనువదించిన వేమన పద్యాలను సాహిత్య అకాడమీ పునః ప్రకటించినది. మెకంజీకైఫియతులను, బ్రౌన్ లేఖలను యెత్తివ్రాయించినది. వీటిని గవ్వాల సంస్థానము వారి తాళపత్ర గ్రంథాలతోపాటు అకాడమీ గ్రంథాలయములో భద్రపరచుట జరిగినది. ఈ సంపుటాలకు ఒక వివరణ పట్టిక సిద్ధమగుచున్నది. సాహిత్య అకాడమీ కార్యాలయములో పండితులకు, పరిశోధకులకు ఉపయోగించునట్లుగా ఉత్తమ గ్రంథాలయము నొకదానిని నెలకొల్పుటకు అవసరమయిన సన్నాహాలు జరుగుచున్నవి.

సభలు, సాహిత్యోపన్యాసాలు

తెలుగు భాషను సుసంపన్నము కావించుటకు, తెలుగు సాహిత్యానికి వినూత్నమైన వికాసము కల్గించుటకు తమ జీవితాలను అంకితముచేసి సంస్తవనీయమైన కృషిజరిపిన మహనీయుల సంస్మరణ సభలను సాహిత్యఅకాడమీ యేర్పాటుచేయుచున్నది. క్షేత్రయ్య, చిన్నయసూరి, గిడుగు రామమూర్తి, వేదము వేంకటరాయశాస్త్రి, పిఠాపురం మహారాజు స్వర్గీయ వేంకట సూర్యారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు కాశీనాథుని నాగేశ్వరరావుగార్ల సంస్మరణ సభలను సాహిత్య అకాడమీ నిర్వహించినది. ఈ సంస్మరణ సభల సందర్భమున యిచ్చిన ఉపన్యాసాలను సాహిత్యఅకాడమీ సంపుటాలుగా ప్రకటించినది. ఉత్తర భారత సాహిత్యములను దక్షిణ భారత సాహిత్యములను తెలుగుపాఠకులకు పరిచయముచేయు ఉద్దేశముతో అందుకు సంబం

ధించిన రెండు సంపుటాలను సాహిత్య అకాడమీ ప్రచురించినది. ఉర్దూ సాహిత్య చరిత్రలను, ఉర్దూకథానికలను అకాడమీ తెలుగు పాఠకులకు అందజేసినది. అమ్జద్ కవిరుబాయీల కొన్నింటిని ఆంధ్రీకరింపజేసి ఆయన కవితారీతిని తెలుగుపాఠక ప్రపంచానికి యెరుక పరచుట జరిగినది. మహాకవి గురజాడ శతవార్షికోత్సవాలలో, టాగూరు శతవార్షికోత్సవాలలో సాహిత్య అకాడమీ సమధికోత్సాహముతో పాలు పంచుకొన్నది. టాగూరు శతవార్షికోత్సవాల సందర్భమున ఒక విశేష సంచికను. స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ స్మృత్యర్థము మరొక విశేష సంచికను సాహిత్య అకాడమీ ప్రకటించినది సుప్రసిద్ధ మహారాష్ట్ర రచయిత హరి నారాయణ ఆప్టే శతవార్షికోత్సవాన్ని 1965 జనవరిలో సాహిత్యఅకాడమీ హైదరాబాదులో యేర్పాటు చేసినది.

గాంధీజీ, గాలిబు కార్యక్రమాలు

భారతజాతిపిత మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాలలో పాల్గొనవలెనని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్ణయించినది. ఈ నిర్ణయానికి అనుగుణముగ యీ సంవత్సరము 'గాంధీజీ రచనల సమీక్ష' అను విషయము మీద రెండువేల రూపాయల బహుమతికొరకు అకాడమీ తెలుగు రచయితలనుండి వ్రాత ప్రతులను కోరినది; యీ సంవత్సరము అకాడమీ ప్రకటించిన రెండు వేల రూపాయల బహుమతులు రెంటిలో ఇదొకటి. డాక్టర్ సుశీలా నయ్యర్ వ్రాసిన 'కస్తూర్బా జీవితచరిత్రము'లు తెనిగించి ప్రకటించుటకు గూడ సాహిత్య అకాడమీ నిర్ణయించినది ఈ సారి పిల్లల కొరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రచయితుల సలహాసఘము ప్రకటించిన బహుమతుల పోటీలో కస్తూర్బా జీవితముగూడ చేర్చనైనది ఈసందర్భములోనె శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు వ్రాసిన 'మహాత్మా కథ'కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రెండు వేల రూపాయల ఆర్థిక సహాయమును అందించినది. ఉర్దూ కవి సార్వభౌముడు గాలిబ్ శత వర్ధంతి ఉత్సవాలు అఖిల భారత స్థాయిలో అత్యంత వైభవముగా జరుగుచున్నవి గాలిబ్‌ను గౌరవించుటలో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్యఅకాడమీ అగ్రశ్రేణిలో నిలచియున్నది. గాలిబ్ జీవితమును గూర్చి ఉర్దూలో నాటకాల పోటీ యేర్పాటుచేసి ఉత్తమ రచనకు వేయినూట పదహార్ల బహుమతిని అకాడమీ ప్రకటించినది. ఈ పోటీలో ఢిల్లీ విశ్వవిద్యాలయ ఉర్దూశాఖ రీడరు డాక్టర్ మహమ్మద్ హసన్‌గారికి బహుమతి లభించినది. గాలిబ్ జీవితము, ఆయన రచనలను గూర్చిన ఒక సమీక్షా గ్రంథమును వ్రాయించి అకాడమీ యిటీవలనే ప్రకటించినది. ఇంతేగాక, గాలిబ్ కవితా ఖండికలను గూడ యేరి కూర్చి తెలుగు అనువాదముతో ప్రకటించుటకు అకాడమీ ప్రయత్నించుచున్నది.

బహుమతులు

పరిశోధనకు ప్రోత్సాహము సాహిత్య అకాడమీ ఆశయాలలో ఒక ప్రధానమైన అంశము ప్రతి సంవత్సరము తెలుగులో వివిధ విషయాల మీద పరిశోధనను ప్రోత్సహించు ఉద్దేశముతో రెండువేలరూపాయల విలువగల రెండు బహుమతులను సాహిత్య అకాడమీ ప్రకటించుచున్నది. ఇప్పటివరకు నన్నెచోడుని కవిత్వము, పందొమ్మిదవ శతాబ్దములో తెలుగుసాహిత్యము, తెలుగు భాషలోని ఛందోరీతులు, ఆంధ్రసారస్వత మండలి వీర రసము, సాంఘిక నాటకము, ఆంధ్ర కర్ణాటక భాషల పరస్పర ప్రభావము, తిరుపతి వేంకట కవుల సాహిత్య సమీక్ష, కట్టమంచి రామలింగారెడ్డి జీవిత చరిత్ర, వీరరస ప్రధాన కావ్యము, విజయనగర సంస్థానములో సారస్వత పోషణ, షేక్స్పియర్ సాహిత్యసమీక్ష, తెలుగు కావ్యాలలో ఋతువర్ణనలు, తెలుగు సాహిత్యముపై ఉర్దూ పారసీల ప్రభావము, ఆంధ్రసంస్థానాల సాహిత్య పోషణ, తెలుగులో తిట్టుకవిత్వము, ఆంధ్రకావ్యాలలో అవతారికలు అను విషయాలమీద యీ పథకము క్రింద ఉత్తమ రచనలకు బహుమతుల నిచ్చుట జరిగినది. బహుమతులను పొందిన యీ గ్రంథజాలాన్ని గమనించినచో తెలుగు భాషలో పరిశోధనాకృషిని ప్రోత్సహించుటకు, సాహిత్యమును సుసంపన్నము చేయుటకు అకాడమీ బహుముఖముగా జరుపుచున్న ప్రయత్నము సువ్యక్తము కాగలదు

ఆధునిక రచనలకు ప్రోత్సాహము

సమకాలిక, ఆధునిక సాహిత్యపు సర్వతోముఖ అభివృద్ధి కొరకు గూడ అకాడమీ అవిరళముగా కృషి చేయుచున్నది. నవల, కథానిక, విమర్శ, కావ్యము అను సాహిత్య ప్రక్రియలో ఒక్కొక్క దానికి వేయినూట పదహార్ల బహుమతిని ప్రతిసంవత్సరము అకాడమీ ప్రదానము చేయుచున్నది. ప్రత్యేకముగా మహిళా రచయితలను ప్రోత్సహించు ఆశయముతో ప్రతి సంవత్సరము ఒక రచయిత్రిని వేయినూట పదార్ల బహుమతితో అకాడమీ సత్కరించుచున్నది 1965 మార్చి నెలలో అఖిల భారత రచయిత్రుల మహాసభను హైదరాబాదులోను, 1966 ఏప్రిల్ నెలలో తెలుగు రచయిత్రుల సమావేశాన్ని గుంటూరులోను, 1967 లో ఏలూరు లోను, 1968 ఫిబ్రవరి నెలలో తిరిగి తెలుగు రచయిత్రుల సమావేశాన్ని వరంగల్లులోను ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ విజయవంతముగా నిర్వహించినది. తెలుగులో గ్రంథ రచన గావించుచున్న సమకాలిక రచయితలకు ప్రచురణలో సహాయపడు నిమిత్తము సాహిత్యఅకాడమి ఆర్థిక సహకారమును యిచ్చుచున్నది. తెలుగు భాషా వికాసము కొరకు అమూల్యమైన తమ జీవితాలను అంకితముజేసిన సారస్వత మూర్తులకు జనరల్ కౌన్సిల్ లో విశిష్ట సభ్యత్వమిచ్చి అకాడమి వారిని సముచితముగా సన్మానించుచున్నది. జాతీయ సమైక్యతను పటిష్ఠము చేయుటలో సాహిత్య ప్రయోజనమును గూర్చి ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు; ఈ రంగములో గూడ సాహిత్య అకాడమీ యథాశక్తి కృషి చేయుచున్నది. ఆంధ్ర ప్రదేశ్, ప్రత్యేకించి హైదరాబాద్ బహు భాషల సంగమ స్థానము; భారతీయ సంస్కృతికి యిది అచ్చమయిన ప్రతిబింబము. హైదరాబాద్‌లోని వివిధ భాషల వారితో అకాడమీకి సన్నిహితమైన స్నేహ సంబంధాలున్నవి. అకాడమీ ఆశయాలలో, కార్యక్రమాలలో యీ స్నేహ సంబంధాలు స్పష్ట

ముగా గోచరించు చున్నవి. భారత దేశములోని వివిధ భాషలను విద్యార్థికులైన తెలుగు వారు నేర్చు కొనవలెనని నిర్ణయించి అందు కొరకు నెలకు 250 రూ. ఉపకార వేతనమును ఒక సంవత్సరము వరకు యీయవలెనని, యీ ఉపకార వేతనముతో ఆయా భాషా ప్రాంతాలకు వెళ్లి తెలుగు విద్యార్థులు యితర భాషలను నేర్వవలె నని అకాడమీ తీర్మానించినది. సంవత్సరానికి ఒక భాష ప్రకారము యీ పథకము అమలు జరుగు చున్నది.

ఇతర భాషలతో సహకారము

హిందీలో రచనలు గావించు తెలుగు రచయితల సదస్సు నొక దానిని 1965 లో అకాడమీ యేర్పాటు చేసినది. ఈ సదస్సులో యేబది మందికి పైగా పాల్గొని తమ రచనలను చదివి వినిపించినారు. ఈ రచనలన్నిటిని 'పద్మాకర్' అను పేరుతో ఒక సంపుటముగా అకాడమీ ప్రకటించినది. పోతన భాగవతములోని ప్రహ్లాద చరిత్రము, గజేంద్ర మోక్షము, వామన చరిత్రము, రుక్మిణీ కల్యాణము, అంబరీషోపాఖ్యానాలను హిందీలోనికి అనువదింప జేసి అకాడమీ ప్రచురణ కావించినది. మను చరిత్రము, భాగవత దశమ స్కంధము గూడ త్వరలోనె అకాడమీ పక్షాన హిందీలో ప్రకటితము కాగలవు. తెలుగు కథలను యేరికూర్చి హిందీలోనికి అనువదించి వానిని అకాడమీ పుస్తక రూపములో ప్రకటించినది. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షాన సంస్కృతములో గూడ కొన్ని ప్రచురణలు వెలువడు చున్నవి. తెలుగు శతకాలను, ఆంధ్రదేశ హాస్య కథలను సంస్కృతీకరించి సాహిత్య అకాడమీ ప్రచురించినది. ఉత్తర రామ చరిత్రమును స్వ్యాఖ్యానముగా సాహిత్య అకాడమీ తెలుగులో ప్రచురించినది ; కృష్ణదేవరాయలు వ్రాసిన జాంబవతీ కల్యాణముతోపాటు మనుచరిత్ర కళాపూర్ణోదయముల సంస్కృత అనువాదములు సాహిత్య అకాడమీ పక్షాన తెలుగువారి సంస్కృత రచనలను ప్రచురించు కార్యక్రమము అకాడమీ చేపట్టినది. ఉర్దూలో యీ శతాబ్దపు రచయితల గద్య పద్య సంపుటాలను నాలుగింటిని సాహిత్య అకాడమీ ప్రచురించినది. మోమిన్ కవి సాహిత్య సమీక్షతో పాటు కొన్ని తెలుగు కథల ఉర్దూ అనువాదాన్ని అకాడమీ ప్రచురించినది. దక్కనీ ఉర్దూ వాఙ్మయపు గద్య పద్య సంపుటాలు, దక్కనీ ఉర్దూ శబ్ద కోశము అకాడమీ పక్షాన ప్రచురిత మగుచున్నవి. ఉర్దూ రచయితలకు గూడ సాహిత్య అకాడమీ ఆర్థిక సహకారము నిచ్చుచున్నది. ఈ విధముగా హిందీ, ఉర్దూ, మరాఠీ సాహిత్య కార్య క్రమాలతోను, ఆ సాహిత్య సంస్థలతోను సన్నిహిత సంబంధాలను కల్పించుకొని భాషా సామరస్యానికి, జాతీయ సమైక్యత పరి పుష్టికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ చక్కని బాటలు వేసినది.

ప్రచురణ కానున్న గ్రంథాలు

సమాన వ్యతిరేకార్థ పద నిఘంటువు (ఇంగ్లీషు – తెలుగు) సాహిత్య శబ్దాల నిఘంటువు, తాళ్లపాక పద ప్రయోగ కోశము తెలుగు శాసనాల సంపుటము, సాహిత్య వ్యాసాల సంపుటాలు రెండు జానపద వాఙ్మయము – తెలుగు వారి సాంఘిక చరిత్ర, తెలుగు భాషా చరిత్ర, అమరవాణి వ్యాసాల సంపుటము, కన్యా శుల్కము ప్రామాణిక ప్రతి, మెకంజీ కైఫియతులు – వివరణాత్మక పట్టిక, అన్నమాచార్యుల పదాలు, మత్స్య పరిశ్రమ వృత్తి పదకోశము, కమ్మరము, కుమ్మరము మొదలైన వృత్తుల పదకోశము వంటి గ్రంథాలు సాహిత్య అకాడమీ అధ్వర్యాన త్వరలోనె ముద్రణ పొంది తెలుగు ప్రజల ముందుకు రానున్నవి. రూప కల్పనలో నున్న పథకాలు మరికొన్ని ఉన్నవి.


ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్య క్రమాలకు యిది కేవలము రేఖా మాత్రపు సమీక్ష. అత్యల్పమైన కాలములోనే సాహిత్య అకాడమీ తన ఆశయాలకు అనుగుణముగా అపారమైన కృషి జరిపి భవిష్యత్తు కొరకు పటిష్టమైన పునాదులను నిర్మించు కొనినదని యీ సమీక్షను అవలోకించిన వారికి స్పష్టము కాగలదు.

తేనెలొలుకు భాష తెలుగు భాష

సీరియల్ :

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి



17

పార్థసారథి ఒంటిమీద చెయ్యివేసి చూస్తున్నాడు. జ్వరంలో రవ్వంతయినా మార్పు కనబడలేదు. శూన్యదృష్టితో కిటికీలోనుంచి కనబడుతున్న వినీల విశాలాకాశంవైపు పరిశీలించాడు. చూస్తుండగానే నలువైపుల నల్లనల్లని మబ్బులలుముకొన్నాయి. క్రమక్రమంగా సన్నని జల్లుపడింది. మరికొన్ని నిమిషాలు గడిచిన తరువాత తలుపు నెమ్మదిగా తీసుకుని రాఘవ లోపలికి వచ్చి అతనికెదురుగా కుర్చీలో కూర్చొని విపరీతమయిన ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి ప్రశ్నించాడు.

'ఇదేమిటి పార్థసారథీ! ఇలాగున్నావు! జ్వరంగానివచ్చిందా? ఎప్పటినుంచి ఈ జ్వరం?'

అతనిని చూడగానే పార్థసారథికి రవంత గుండె దిటవు కలిగింది. నీరసంగా నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

'ఏమి చెప్పను రాఘవా? ఇంచుమించుగా ఇంటిదగ్గిర బయలుదేరినప్పటినుంచి కొంచెం పులకరంగానే ఉంది. ఆc! అదేతగ్గిపోతుందని మొండికెత్తి బయలుదేరి వచ్చాను. మొన్నటినించి మరింత ఎక్కువయింది. ఇంటిదగ్గిర అంతాకులాసానా? ఎప్పుడు బయలుదేరి వచ్చావు? ఎక్కడదిగావు?'

రాఘవ అతనివైపు రెప్పవాల్చకుండా చూశాడు.

'ఆc! అందరు కులాసాగానే ఉన్నారు! ఈ వేళ పొద్దున్నే మెయిలులో వచ్చి గోల్డెన్‌లాడ్జిలో దిగాను. అసలు నువ్వుతిరిగి వచ్చావేమో అని నిన్న మీ ఇంటికి వెళ్లివచ్చాను. ఇంకారాలేదన్నారు. ఏదయినా తొందరపనిమీద ఇక్కడ ఉండి పోయావేమో అనుకున్నాను.

రాఘవ మరి మాట్లాడలేదు. పార్థసారథి అతని ధోరణి ఒకకంట కనిపెడుతూనే ఉన్నాడు మంచి హుందాగా దుస్తులువేసుకున్నాడు. కళ్లకి రిమ్‌లెస్ చలవజోడు పెట్టుకున్నాడు. స్ఫోటకం మచ్చలెక్కడా కనబడకుండా ముఖానికంతటికి దట్టంగా పౌడరు పట్టించుకున్నాడు. క్రాప్ సున్నగా దువ్వుకున్నాడు. జాస్మిన్ సెంటుతో ఘుమఘుమలాడిపోతున్నాడు! త్రికాసిల్ సిగరెట్టు ముట్టించి హేలగా పొగవదలుతున్నాడు. రాఘవ సినిమాలో జేరడానికి వచ్చినట్టు క్షణంలో పసికట్టి వేశాడు పార్థసారథి. తను, వెంకటకృష్ణయ్య పోట్లాడుకున్నట్టు తెలిసినా అది తనకేమి తెలియనట్టే నటిస్తున్నాడని కూడా గ్రహించి వేశాడు. అయినా ఉండబట్టలేక క్షీణస్వరంతో నసిగాడు.

'ఈ మధ్యన ఇక్కడ జరిగిన గొడవంతా విన్నావా?'

'ఆc విన్నాను. కొంచెం సంగ్రహంగా వెంకట కృష్ణయ్యే చెప్పాడు. నువ్వుచాలా తొందరపడి మోటుగా మీదపడి కొట్టినట్టు

జరిగిన కథ

పార్థసారథి రాఘవ నాట్య కళామండలి ద్వారా నాటకాలు వేస్తుండేవాడు. ఒకసారి ఆయన ఏలూరులో శ్రీకృష్ణతులాభారం నాటకం వేశాడు. ఆ నాటకంలో పాల్గొనవలసిన సరోజ రాకపోవడము వల్ల నాటకం వాయిదాపడింది. తిరిగి స్వగ్రామం వచ్చిన పార్థసారథికి సరోజ మద్రాసు వెళ్ళినట్టు తెలిసింది. పార్థసారథికూడా మద్రాసు వెళ్ళి సరోజ బసచేసిన హోటలులో ఆమెను కలుసుకున్నాడు. సోమనాథం అనే సినిమా ప్రొడ్యూసర్‌తో సరోజ, ఆమె మేనమామ పేకాట ఆడుతుండగా పార్థ సారథి వెళ్ళాడు. సరోజను ఏలూరు నాటకానికి పంపడానికి వీలు కాదనడంతో అతనికీ వెంకటకృష్ణయ్యకూ మధ్య రాద్ధాంతం జరిగింది, పార్థసారథి ప్రవర్తనకు సరోజకూడా కోపగించుకుంది. రూముకు చేరుకున్న పార్థసారథికి జ్వరం వచ్చింది.

తప్పంతానీదేఅయినట్టు మాట్లాడాడు. అయినా నేనది నమ్మలేదనుకో! ఆఁ! ఒక్కనాటికి సరోజని పంపిస్తే ఏంపోయింది? వట్టిమూర్ఖుడు'

రాఘవ ఆవిధంగా ఉట్టి పడుతున్న సానుభూతితో మాటాడిన తరువాత పార్థసారథికి మరింతగా ధైర్యం కలిగింది.

'నీకూ అలాగే అనిపించిందా. నాకు అందుకే ఆశ్చర్యం కలిగింది. చాల మర్యాదగా బ్రతిమాలుకున్నాను. ఎంతచెప్పినా వినడే! ససేమి నావల్లకాదన్నాడు. నాకు ప్రాణం విసిగి పోయింది. కాని పాపం, సరోజ రావాలనే అనుకుందిసుమా!'

రాఘవ పెదవిమీద విపరీతమైన వెటకారంతో చిరునవ్వు చెంగలించింది.

'పార్థసారథీ! అసలు రహస్యం నీకింకా తెలియనేలేదన్నమాట! ఎంత అమాయకుడవోయ్ నువ్వు! ఉన్నసంగతి కాస్త బయట పెడతాను గాని ఏమి అనుకోవుగదా!'

'అదేమిటిరాఘవా! నేనెప్పుడయినా నీమాటమీద అపోహ పడ్డానా? ఏమిటది?'

'అసలు ఈ గొడవకంతటికి ఆ సరోజే మూలకారణం! చాలాకాలంనించి ఏదయినా సినీమాలో చేర్పించమని మేనమామని అదేపనిగా పట్టుకుని కాల్చుకుని తింది. ఇదంతా నాకీమధ్యనే తెలిసింది మొట్టమొదట నాతోకూడా ఆ గొడవ కొంచెమయినా చెప్పకుండా దాచివేసిందిలే! కానిఎప్పటికయినా అసలు రహస్యం బయట పడక పోతుందా. ఆ నాటకానికి రాకుండామానివేసిందికూడా తనే!'

పార్థసారథికి నెత్తిమీద ఒక పెద్దపిడుగు పడినట్లనిపించింది నిలువునా నిర్ఘాంతపడి అడిగాడు.

'నాతో మేనమామ బలవంతం మూలానే సినిమాలోచేరినట్లు ఎన్నెన్ని విధాలప్రయత్నించినా నాటకానికి అందుకోలేక పోయినట్లు చెప్పిందే. ఇప్పుడుకూడా ఏలూరు రావడానికి ఎంతో ఉబలాట పడుతున్నట్టే మాట్లాడిందే!'

రాఘవ హేలగా నవ్వి లీలగా సిగరెట్టు పొగ విడిచి పెట్టాడు.

'ఆఁ! అదంతా వట్టినటన. లేకపోతే తనకిష్టంలేనట్లు మాట్లాడుతుందేమిటి? సరోజ నీ మీద ఏదో భరించలేనంత మమకారంతో పడిచచ్చిపోతుందని అనుకుంటున్నావుగాని అదంతా వట్టిభ్రమ. ఇలాగంటున్నానని మరోలా అనుకోకు! మొట్టమొదటినించి సరోజ తీరే అంత'

పార్థసారథికింకా ఆమె జటిల మనస్తత్వం పూర్తిగా అవగాహన కాలేదు. నీరసంగా మూలిగి అడిగాడు.

'అంత మొట్టమొదటినించి సినిమాలో చేరాలని ఉబలాట పడుతూంటే కాస్త నాచెవిని వేస్తే ఎంపోయింది? నేనేమన్నా కాదంటానా? ఊరికే ఉత్త పుణ్యానికవి నన్నింత ఇబ్బందిపెట్టి బాధ పెట్టడ మెందుకు?'

'ఆఁ ఏముంది వీలయితే కొంతకాలందాకా నాటకాలలోను, సినీమాలలోను చెరోకాలుపెట్టి ఒకఆటఆడాలని చూసింది! ఆవెంకటకృష్ణయ్య ససేమిరా వల్ల కాదని అడ్డుపడగానే నిమ్మకి నీరెత్తినట్టు మాట్లాడకూరకుంది. అంతే! దీనిలో పెద్ద ఆశ్చర్యం ఏమిఉంది?'

పార్థసారథిరెండుమూడు క్షణాలవరకు మౌనంవహించి తన మనస్సు లోలోపల తొలిచివేస్తున్న జిజ్ఞాస వెల్లడించాడు.

'సరేగాని రాఘవా! ఎప్పుడులేనిది మేనమామఅంటే సరోజ అంత అగ్గగలాడి పోతుందేమిటి? సినీమాలో చేర్పించి నంత మాత్రాన అతనంటే అంత అడుగులకి మడుగులొగ్గుతూ హడలిపోవలసినంత అగత్యం ఏమి వచ్చింది? కాస్త స్వతంత్రించి నాటకానికి వెడతానంటే వెంకటకృష్ణయ్య కాదని అడ్డుకోగలడా?'

రాఘవ ఆ ప్రశ్నమీద రవంతసేపు నిర్ఘాంతపడి సన్నని చిరునవ్వుచిందించాడు.

'ఇదేమిటి? ఇలాగడుగుతున్నావు! అసలు రహస్యం నీకింకా తెలియనే లేదన్నమాట! నీతోవాళ్లు చెప్పి ఉంటారని అనుకున్నానే.'

'ఏమిటా అసలు రహస్యం? యింకా యింతకన్నా పెద్ద రహస్యం నాతో ఏవయినా చెప్పకుండా దాచివేశారా?'

పార్థసారథి మరింతగా ఆశ్చర్యపడి ఆందోళన భరిత స్వరంతో ప్రశ్నించాడు.

'సరిపోయింది! నీకింకా తెలియనే లేదన్నమాట! సరోజ వెంకటకృష్ణయ్య రిజిస్టర్ మారేజ్ చేసుకున్నారు. ముందునెలలో తిరుపతిలో ఆ ఏడుకొండలవాడి సమక్షంలో శాస్త్రోక్తంగా, సలక్షణంగా వివాహమహోత్సవం జరిపించుకోవాలని కూడా సన్నాహాలు చేసుకుంటున్నారు అది అయ్యేదాకా ఆ రహస్యం బయటపెట్టడ మెందుకని సరోజ నీతో కూడా చెప్పకుండా అతిగుంభనగా దాచివేసి ఉంటుంది. అంతే!'

రాఘవ వెకిలిగానవ్వాడు. పార్థసారథి తన కన్నులే నమ్మలేక మరింతగా నిర్ఘాంతపడ్డాడు.

'ఆఁ! ఆఁ! నిజంగానేనా? ఎప్పుడు జరిగింది రిజిస్టర్ మారేజి?'

'అదంతా ఈ మధ్యనే. ఆరోజు మద్రాసువచ్చిన తర్వాతే జరిగింది. నిజంకాకపోతే నీతో అబద్ధం కల్పించి చెప్పవలసి వచ్చినంత అవసరం ఏమి వచ్చింది?'

అకస్మాత్తుగా విరుచుకుపడిన, ఆ తీవ్రాతితీవ్ర మానసికాఘాతం తట్టుకోలేక, పార్థసారథి ఆపైన నాలుగైదు క్షణాల వరకు రవంతయినా పెదవి కదపలేక పోయాడు! రాఘవ ఆ వ్యవహారం అంతవిస్పష్టంగా విప్పిచెప్పినా అతనికింకా పూర్తిగా నమ్మకంకలగలేదు! 'నిజంగానేనా? నాతో వేళాకోళం ఆడుతున్నావా? ఎవరు చెప్పారు నీకీ సంగతి'

ఆ వెంకటకృష్ణయ్య స్వయంగా నాతో చెప్పాడు! వచ్చేటప్పుడు రంగనాయకికూడా ఈశుభవార్త కొంచం సూచనగా నా చెవిని వేసింది!

పార్థసారథికిక నమ్మక తప్పలేదు.

"ఒకసారి సరోజ తన కసలు వివాహ సంకల్పమేలేనట్టు నాతో చెప్పిందే ! వెంకటకృష్ణయ్యకూడా పైసంబంధాలేవో చూస్తున్నట్టు తెలిసిందే !"

'అదంతా పట్టి కపటనాటకం! నిన్న ఈసంగతి విన్నతర్వాత నేనూ నీలాగా విభ్రాంత పడ్డాను ! అసలు లోలోపల జరిగిన కథ అంతా చెబుతాను విను! వెంకటకృష్ణయ్యా బాగా ఆస్తిపాస్తులున్న వాడన్న ఆ కొద్ది అతనికే అమ్మాయినిచ్చి పెళ్ళి చేయాలని ఈ మధ్యన కొంతకాలంనించి రంగనాయకి ఉబలాటపడింది. క్రమ క్రమంగా అతనికికూడా అటువంటి సంకల్పమే కలిగింది....'

"మరి సరోజ దానికంగీకరించిందా ?"

పార్థసారథి మధ్యలో అడ్డుకుని ఎంతో ఆత్రంగా అడిగాడు.

'ఆఁ అదే చెబుతున్నాను ! నన్ను కడకంటా చెప్పనీ ! మొట్టమొదట సరోజ దానికంతగా ఉత్సాహపడలేదు ! కొంచం బెట్టుసరిచేసింది ! అయితే వెంకటకృష్ణయ్యా సరోజ సినిమాలో చేరాలని బాగా ఆరాటపడుతున్నదని పసికట్టాడు ! ఆ ఎరచూపించి చల్లచల్లగా బుజ్జగించి పెళ్ళి చేసుకున్నాడు. ఏదో రవంత వయసుపై బడినదన్నమాటేగాని అతనికి మాత్రం లోటేముంది, నన్నడిగితే సరోజ తన పరిస్థితి అంతా గ్రహించుకుని అన్నివిధాల చాలా తెలివయిన పనే చేసిందంటాను !'

పార్థసారథి మరి మాట్టాడలేదు! అటు, ఇటు దొర్లుతూ నీరసంగా మూలగడం మొదలుపెట్టాడు.

'అదేమిటి? పార్థసారథీ ! అలాగ మూలుగుతున్నావు! తల నొప్పిగా ఉందా ? లేకపోతే లోపల ఏదయినా బాధ బయలుదేరిందా?

'గుండెల్లో ఏదో గునపంతో పొడుస్తున్నట్టు యమ యాతనగా ఉంది.'

"అయ్యో పాపం ! అలగా? మందేమయినా పుచ్చుకుంటు న్నావా ?"

'లేదయ్యా! ఇక్కడ నాకు మందెవరు తెస్తారు? ఏమో నాలుగు అనాసిన్ మాత్రలు, రెండు సి. ఎ ర్య. బిళ్ళలు మింగాను! అంతే?'

పోనీ నేను ఏ డాక్టరు దగ్గిరకయినా వెళ్ళి మందు తీసుకురానా ?'

'అక్కర లేదులే? అదే తగ్గిపోతుంది!' మరి కొన్ని క్షణాలలో పార్థసారథి మూలుగుతగ్గింది. నిశ్చల నేత్రాలతో కొంచం తెరిపి ఇచ్చిన నీలాకాశంవైపు చూశాడు.

'ఏమిటలాగ తీవ్రంగా ఆలోచిస్తున్నావు. కాస్త నాతో చెప్పరాదూ? అంత మథన ఎందుకు?'

రాఘవ ఆత్రంగా అడిగాడు. పార్థసారథి ఉసూరుమని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు.

'ఏమిలేదు. ఇంత జరిగినా ఆ వెంకటకృష్ణయ్యకు ఒక సారి నీచేత చెప్పించి ఎలాగో అలాగ ఏలూరులో ఆ నాటకం ఆడిద్దామని అనుకున్నాను. ఇక లాభంలేదు. వెంటనే పాపం ఆగుప్త పేర ఒక టెలిగ్రాం పంపించు. నేనే పంపిద్దామనుకుంటే అసలు మంచంమీద నించే కదలలేకపోయాను! సరే, సమయానికి నువ్వువచ్చావు ! కాస్త ఈఉపకారం చేసిపెట్టు! ఏదయినా నష్టం వస్తే నేను అచ్చుకుంటానని ప్రత్యేకంగా వేరే ఒక ఉత్తరంకూడా రాయి! నీకు అనవసరంగా శ్రమ ఇస్తున్నాను, ఏమి అనుకోకు!'

'అదేమిటి అలాగ మాట్లాడతావు పార్థసారథి! దీనిలో అంతశ్రమ ఏమి ఉంది? నువ్వు చెప్పినట్టు టెలిగ్రాం కొట్టి, వేరే ఉత్తరంకూడా రాస్తానులే. అనవసరంగా నువ్వేమి కంగారు పడకు'

పార్థసారథి తిరిగి సన్నగా మూలగడం ప్రారంభించాడు. రాఘవ అతని పరిస్థితి ఆత్రంగా పరిశీలించాడు.

'ఇదేమిటి పార్థసారథీ! ఇక్కడికివచ్చి ఇలాగా పడి పోయావు? మరి నీ ప్రయాణం మాటేమిటి ?'

'అదే నేనూ ఆలోచిస్తున్నానయ్యా! అసలు ఆపేశే వెళ్ళి పోతామనుకున్నాను. పోనీ కాస్త జ్వరంతగ్గాక వెళ్ళకూడదా అని పించింది. కాని ఆజ్వరం క్రమక్రమంగా ఎక్కువయింది గాని ఇక తగ్గలేదు : పోనీ, కాస్త నన్ను మెయిలులో ఎక్కించు; ఎలాగో అలాగ కళ్ళుమూసుకుని ఇంటికి వెళ్ళిపోతాను !'

'చాలా నీరసంగా ఉన్నావే! ఒక్కడవు ఎలాగ వెడతావు ?'

'ఏమిచెయ్యను రాఘవా ! నన్నెవరు దిగబెడతారు !'

అతడు నాలుగయిదు క్షణాలదాకా సమాధానం చెప్పలేదు. నెమ్మదిగా నసిగాడు.

'నా కిక్కడ ఈ సినిమా బెడద వచ్చిపడింది గాని లేకపోతె నేనే తీసుకు వెడుదునయ్యా ! ... పోనీ, ఒకపనిచేస్తే ?"

ఏమిటది ? అన్నట్టు బొమముడి విరిచి పార్థసారథి అతని వైపు పరీక్షగా చూశాడు.

'పోనీ మీ కృష్ణమూర్తి పేర ఒక టెలిగ్రాం కొడితే ?'

'అంతవరకు నేనిక్కడ పడి ఉండగలనా ?'

'దీనిలో పెద్ద ఆలస్యమేమి అవుతుంది ? గుప్తకి పంపించి నప్పుడే కృష్ణమూర్తి పేరకూడా ఒక అర్జెంటు టెలిగ్రాం పంపిస్తాను! అది ఈ వేళ సాయంకాలంలోగానే అతనికి అందుతుంది! వెంటనే మెయిలులో బయలుదేరి రేపు ఉదయానికే ఇక్కడికి వచ్చేస్తాడు. తిరిగి మీరిద్దరు రేపు సాయంత్రమే మెయిలులో వెళ్ళిపోవచ్చును ! అప్పటికి నీ జ్వరంకూడా కొంచెం తగ్గుతే తగ్గుకుందేమో ! ఏం టెలిగ్రాం కొట్టమన్నావా ?'

'అవును! అదే మంచి పద్ధతి ! అంతకంటె వేరేమార్గమేమి కనిపించడంలేదు ! సరేకానీ!'

'అయితే మరి నేను వెళ్లనా ?'

రాఘవ లేవబోయాడు.

'వెళుదువుగాని లే రాఘవా ! ఇంకొక పదినిమిషాలపాటు కూర్చో ! నాకిక్కడ బొత్తిగా ఏమితోచడం లేదయ్యా !'

పార్థసారథి తిరిగి ప్రతిమాలుకున్నాడు. రాఘవ కాదనలేక తిరిగి కూర్చున్నాడు. పార్థసారథి నాలుగయిదు క్షణాలపాటు మాట్లాడకూరుకుని ఉబుసు పోకకోసం వేరే ఇంకొకవిషయం ప్రశ్నించాడు. 'మన ఊళ్లో విశేషాలేమిటి రాఘవా ? ఈ మధ్యన ఏమన్నా మంచి సినిమాలు చూశావా ?'

'ఉద్దరే! మన ఊరికి మంచి సినిమాలెక్కడినుంచి వస్తాయి! అంతా తాతలనాటి పాతసరుకు ! అన్నట్టు మన రామసుబ్బయ్య ప్రభాటాకీస్ అమ్మివేస్తున్నాడు తెలుసునా ? నన్ను కొనుక్కోమని బలవంతపెట్టాడు. పన్నెండు వేలకి ఇచ్చివేస్తానన్నాడు. నినేప్పుడు కొనదలుచుకోలేదన్నాను. కాస్త నీతోచెప్పమన్నాడు. పోనీ నువ్వు అవి కొనరాదూ ? చాలా చవగ్గావెళ్లిపోతుంది ?'

పార్థసారథి అతని మాటలు అంతగా పట్టించుకోలేదు. ఆ పైన క్షణకాలం నిశ్చలంగా రాఘవకేసి చూశాడు.

'ఏమిటో ! ఈ నాటకాల వ్యసనహారం ఇలా తగలబడింది కదా ! ఇక ఆ సినిమాహాలుమాత్రం తగంబెట్టేది ఏమి ఉంది ? ఇంతకి ఆ రామసుబ్బయ్య ఎందుకమ్మివేస్తున్నాడు ? నష్టం వస్తూంది ?'

'అబ్బే ! అంతగా నష్టం రావడంలేదయ్యా ! అతనేవో పాతఅప్పులు తీర్చివెయ్యాలని అమ్మివేస్తునట్టున్నాడు అంతే! ఇదీ గాక తిన్నగా లాభసాటిగా నడిపించుకోలేకపోతున్నాడు కూడాను ! ఇక నీచేతిలోపడిందంటే అది బంగారం పండుతుంది ! నామాటవిని కొంచం జాగ్రత్తగా ఆలోచించుకో ! చాలా లాభసాటిబేరం ! చెయ్యిదాటిపోనివ్వకు !'

'సరేలే ! ఇంటికి వెళ్లాక కాస్త నింపాదిగా ఉన్నతరువాత ఆలోచిస్తానులే ! అన్నట్టు సినిమాహాలంటే జ్ఞాపకంవచ్చింది ! నువ్విక్కడ సినిమాలోచేరడం ఎంతవరకు వచ్చింది ?'

'అంతా పూర్తిఅయినట్టే ! ఇక రేపో, ఎల్లుండో కంట్రాక్టుమీద సంతకం పెట్టడమే తరవాయి. హీరో వేషం కాదనుకో! ఇంచుమించుగా అలాంటిదే. తొమ్మిదివేలకి ఒప్పుకున్నాను, ముందుసారికి ఇంకా ఎక్కువఇస్తామని మాటయిచ్చారు.'

'అలాగా! చెప్పావు కావేం! చాలాబాగుంది!'

పార్థసారథి అంటీ అంటనట్టుగా అభినందించాడు. 'బంగారు నౌక'ను గూర్చి, అతని వేషాన్ని గురించి ఇంకాకొన్ని వివరాలడిగాడు అది అచ్చంగా జానపద చిత్రమని చెప్పి, దానిలో తాను మాంత్రిక వేషం వేస్తున్నట్టు వెల్లడించాడు రాఘవ. అయితే మొట్టమొదటగా మాంత్రిక వేషంతో సినీమాల్లో జేరడం తన కంతగా ఇష్టంలేనట్టు మాట్లాడాడు.

'పార్థసారథీ! ఏదో ఒప్పుకున్నానన్న మాటేకాని నాకేమి ఉత్సాహంగాలేదు. నాలుగు ఐదు ఏళ్లనుంచి ఈ నాటకాల కోసమని మనం ఇద్దరము వెర్రెత్తినట్టు తిరిగాము! చేతులు కాలుతున్నా లక్ష్యపెట్టక నడుము బిగించి పనిచేశాము! కాని చిట్టచివరికి వాటివల్ల లాభమేమిలేదని తేలిపోయింది! చెప్పద్దూ! ఇందుచేతే కాస్త ముందుచూపుతో జాగ్రతపడ్డాను! లేకపోతే ఇకవేరే దారిఏమి ఉంది చెప్పు! పాపం నువ్వుకూడ ఏదయినా సినిమాలో చేరిపోతే బాగుండును! నీపరిస్థితి చూస్తే నాకు చాలా బాధగాఉంది! ఈనాటకాల కోసమని ఎంతోఅవస్థపడ్డావు ! నష్టపడ్డావు! సరేలే ముందు ముందు ఇక్కడ సినిమాల్లో ఏదయినాకాస్త అవకాశం దొరక్కపోతుందా? నేనుకూడా ఇప్పటినుంచి శాయశక్తులా ప్రయత్నిస్తానులే'

ఆ సానుభూతి పార్థసారథిని అతని దుస్సహ పరిస్థితికన్న మరింతగా మనశ్చాంచల్యం లావేధించింది. అయినాఅదంతా అంతర్యంలోనే నిగ్రహించుకుని మర్యాదగా మాటతప్పించివేశాడు.

'సరేలే! అలాగే ప్రయత్నం చేద్దువుగాని! కాస్త నా ఆరోగ్యం తిన్నబడనీ ., అయితే రాఘవా! నాఎడ్రస్ ఇంత తేలికగా నీకెలాగా తెలిసింది? వెంకటకృష్ణయ్య చెప్పాడా?'

'అబ్బే! అతనుచెప్పలేదు. అసలు వాళ్ళిద్దరు నువ్వువెంటనే తిరిగి ఇంటికి వెళ్ళిపోయావనే అనుకున్నారు నేను నువ్వు ఇంటికి తిరిగి రాలేదనిచెప్పి, ఎక్కడ దిగావని అడిగాను. సరోజ నీఅడ్రస్ చెప్పింది. ఏం? ఎందుకలా అడిగావు?'

'అబ్బే! ఇంత తొందరగా ఇక్కడికి ఎలాగ రాగలిగావా అని అడిగాను. అంతే!'

పార్థసారథి కొంచెం నీరసంగా మూలిగాడు. రాఘవ రిస్టువాచీకేసి చూశాడు.

'మరినేను వెడతాను! అప్పుడే బాగా ఆలస్యమయినట్టుంది! త్వరగా టెలిగ్రాం పంపించకపోతే కృష్ణమూర్తికి రేపటికిక్కడికి రావడానికివీలుపడదు. ఎలాగో అలాగ వీలుచేసుకుని సాయంత్రం మళ్ళీ వస్తానులే!'

రాఘవ లేచినిలుచున్నాడు.

'అన్నట్టు పాపం గుప్తమాట మరిచిపోకేం!' తిరిగిఎంతో ఆత్రంగా జ్ఞాపకం చేశాడు పార్థసారథి.

'ఎంతమాట, అతని సంగతి మరచిపోతానా?'

రాఘవ తలుపు దగ్గిరగావేసి తొందర తొందరగా వెళ్ళిపోయాడు. అతను చెప్పినవన్ని ఆలోచిస్తూంటే పార్థసారథికి మరింతగా దుస్సహమయిన వ్యథ కలిగింది. అన్నివిధాల చితికిపోయిన తన నౌకసారి పరామర్శించి అవిధంగా తన ఘనత చాటుకోవడానికే రాఘవ ప్రత్యేకంగా పనికట్టుకుని వచ్చినట్టు పసికట్టివేశాడు. పైపైకి చాలాబాధపడుతున్నట్టే నటించాడు. కాని అతనికళ్లలోలోపల విపరీతమయిన అహంభావము, గర్వము, ఈసడింపు విస్పష్టంగా ప్రతిఫలించాయి! మనుష్యుల సానుభూతిలో

ఒక్కొక్కప్పుడెంతటి దారుణమయిన కాలకూట విషం బుసకొడుతుంది. పార్థసారథి అదంతా తలుచుకుని ఎంతో బాధపడ్డాడు

సరోజ వివాహం వ్యవహారంలో రాఘవ వెళ్లగక్కిన అక్కసు తలుచుకుంటే పార్థసారథికి మొట్టమొదట ఎంతయినా ఆశ్చర్యం కలిగింది. కాని ఆ తరవాత దాని అంతరార్థం అంతా గ్రహించుకున్నాడు. ఆమె తన వివాహ రహస్యం ఏమంతయినా రాఘవకి తెలియనీయలేదు కనకనే అంతటి అసూయతో, ఈర్ష్యతో అక్కసుతో అసంతృప్తి బయటపెట్టాడు కాని పైపైకి మాత్రం చాలా మంచిపనే చేసిందని మెచ్చుకున్నాడు అటువంటి వ్యక్తి తిరిగి సాయంకాలం తనదగ్గరికివచ్చి పలకరించకపోయినా బాగుండునని అనిపించింది అయితే రాఘవ ఆసదవకాశం జారవిడవడని నిశ్చయించుకున్నాడు

అదే క్షణంలో పార్థసారథికి తనజీవితం అంతా అకస్మాత్తుగా 'ఒక్కమారుగా ఏదో అనూహ్యమయిన అగాధంలో కూలిపోతునట్టనిపించింది. చాలా కాలంనించి ఎంతగానో ఆశ పెట్టుకుని, కష్టపడి చమటోడ్చి కట్టుకున్న కృష్ణతులాభార నాటక సౌధం అంతా ఒక్కమారుగా నేలమట్టంగా కూలిపోయింది. దానికి గట్టి పునాదులవంటి సరోజ, రాఘవ ఇద్దరు కాస్త సూచనగా నయినా తనతో చెప్పకుండా ఒకేసారి సినీమాలో చేరిపోయారు? ఇక వాళ్లిద్దరు తిరిగి వచ్చేఅవకాశం ఎక్కడ కనిపించలేదు. ఆపైన తనకిప్పుడేదో పాడుజ్వరం పట్టుకుని అదేపనిగా వేధించుకుని తింటూంది.

సరోజ తనకే మాత్రము అందకుండా అంతదూరంగా వెళ్లిపోయినదంటే అతని కింతవరకు గట్టినమ్మకం కలగలేదు. అసలామె వివాహం చేసుకోగలదనే అనుకోలేదు. రెండు, మూడు సారులు ఆ ప్రస్తావన వచ్చినప్పుడు 'మిమ్మల్నే వివాహం చేసుకుందామని అనుకున్నాను. అది ఈ జన్మలో సాధ్యపడేది కాదు. కనక మరి నేనా మాట తలపెట్టదలచుకోలేదు.' అని ఖచ్చితంగా చెప్పివేసింది. పోనీలే మేన మామని వివాహం చేసుకున్నా నాటకాల్లో వేషాలు వెయ్యడానికి అడ్డంకి ఏమిఉండదుగదా!' అనికొంతవరకు సమాధాన పడ్డాడు. కాని వెంకటకృష్ణయ్యకి తనమీద ఏర్పడ్డ విపరీత మయిన అసూయవల్ల, అనుమానంవల్ల, కోపం వల్ల ఇక ఆమాట తలపెట్టడానికి వీలులేకపోయింది.

అంతేకాదు. ఎప్పుడయినా చుట్టపు చూపుగా వెళ్లి పలకరించడానికికూడా వీలులేకుండాపోయింది. 'ఇక ఈ క్షణంతో నీకూనాకూ సరి!' అన్నట్టు సరోజ ఒక్క నమస్కారంపెట్టి పోపొమ్మని కసిరికొట్టింది. అవమానించింది, అంతటి తలవంపు జరిగినతరవాత ఇకతానేముఖం పెట్టుకుని ఆమె ఎదట పడగలడు అంతరాంతరాలలో అతనికి ఒంటరిగా ఆమెదగ్గిరకి వెళ్లి ఒక్కసారి తన మనోవ్యథ అంతా వెళ్లబోసుకోవాలనే అనిపించింది. దానివల్ల ఫలితం ఉన్నాలేకపోయినా పాపం ఒకేఒక్కసారి ఆమె ఎదటపడి వెంకటకృష్ణయ్యకి తనకు జరిగిన కొట్లాట కేవలం తలవని తలంపుగానే జరిగిందని వెల్లడించి, అధమం రవంత సానుభూతి అయినా సంపాదించుకుంటే బాగుండునన్న ఆలోచన కలిగింది.

కాని అంతలోనే అవన్నీ కేవలం వ్యర్థాలోచనలనికూడా అనిపించింది.

అదే సమయంలో అతనికి ఊళ్లోలేనప్పుడు సరోజ ఒకసారి తనపేర రాసిన ఉత్తరం సంగతి జ్ఞాపకం వచ్చింది. దానిలో ఆమె 'మిమ్మల్ని విడిచిపెట్టి నేనొక్కక్షణంకూడా ఉండలేకపోతున్నాను, వెంటనే నిలుచున్న పళంగా రెక్కలు కట్టుకుని బయలుదేరిరండి. ఒక్కసారి మీ గుండెమీద వాలి కళ్లుమూసుకుని నిద్రపోవాలనిఉంది.' అని ఎంతోఆప్యాయంగా తన అనురాగం వెల్లడించింది. ఆ తరువాత మరికొంతకాలానికి రాసిన ఇంకొక లేఖలో 'ఆజన్మాంతము మీ సరసన సత్యభామగా నటించడంకన్న నాకింక కోరుకోవలిసినదేది లేదు' అని తన ప్రగాఢ కృతజ్ఞత వెల్లడించుకొన్నది. ఇంకొకసారి తాను ఊళ్లోలేనప్పుడు ఏమేమో కొన్ని ఇబ్బందులలో చిక్కుకొని 'ఇక్కడ నాకన్నీ చికాకులే! గొడవలే! నేనివి భరించలేకుండా ఉన్నాను. విషంతాగి హాయిగా మీఒళ్లోపడుకుని ప్రాణాలు విడిచిపెట్టాలనిఉంది. ఇదే నా తుది కోరిక అని ముగించింది. పార్థసారథి ఆ ఉత్తరాలు మూడు తామర పువ్వులాంటి లక్కబరిణిలోపెట్టి ఎంతో భద్రంగా దాచుకున్నాడు.

ఆ ఉత్తరాలురాసిన వ్యక్తేనా నేటి సరోజ. అతనికిప్పుడు రాఘవ చేసినమోసమేకాక సరోజ కృతఘ్నత కూడా చాలావరకు స్పష్టంగా బోధపడ్డాయి. అయినా ఎన్నెన్ని విధాల ప్రయత్నించినా అతని మనస్సు ఆవంతయినా సరోజనుండి మరలలేదు. పైగా అనుక్షణము సత్యభామ వేషంలో ఎంతో జాజ్వల్యమానమయిన ఆమెస్వరూపమే సమక్షంలో సాక్షాత్కరించింది. ఇదేమిటి? నాకేమయినా మతిగానిపోతుందా? – అనుకుని ఆలోచనలన్నీ ఒక్కమారుగా మనస్సులోనుంచి విదిలించివేసుకున్నాడు! ఇకఆమెసంగతి తలపెట్టకూడదని ఒక దృఢ ప్రతిజ్ఞ స్వీకరించాడు. కాని మరుక్షణంలోనే ఆమె ఎన్నడో విసిరిన ఒక ఛలోక్తి జ్ఞాపకం వచ్చి ఆ చాకచక్యం గుర్తుకు తెచ్చుకుని లీలగా నవ్వుకున్నాడు, ఒకవేళ జ్వరంవల్ల తనకటువంటి మానసికపరిస్థితి కలుగుతున్నదేమో అనుకుని పక్కనే బల్లమీదఉన్న పేపరుతీసి శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు. దానిలో ప్రతిపంక్తిలోను నిరంతరంగా 'సరోజ' అన్న అక్షరాలే సాక్షాత్కరించాయి. ప్రాణం విసిగి కళ్లు రెండు గట్టిగా మూసుకున్నాడు. సరోజ స్వరూపం మరింత స్పష్టంగా మనోజ్ఞంగా ప్రత్యక్ష మయింది. కనుగొలుకుల నుండి లేసిలేసి కన్నీటి బిందువులొకటి రెండు మెల్లగా చెక్కిళ్ల మీదికి దిగజారాయి. ఆ తరవాత అలసటవల్ల విపరీతమయిన మనోవేదన వల్ల అతనికి మగత నిద్రపట్టింది. మరికొంత సేపటికి కొంతగాఢ నిద్రగా మారింది. అలాగ ఎంత సేపు నిద్రపట్టిందో అతనికేమీ తెలియలేదు. (సశేషం)

అహింస నాదూ నేదూ

—దివాకర్ల వేంకటావధాని

అహింస యనుపదము 'హింస్' ధాతువునుండి యేర్పడిన హింసయను పదమునకు వ్యతిరేక రూపము. హింస్ ధాతువునకు ప్రహరించుట, కొట్టుట, హానిచేయుట, బాధించుట, చంపుట, సంపూర్ణముగా ధ్వంసము చేయుట యనునర్థములున్నవి. హింస యను పదము బాధించుట, చంపుట యనునర్థములందే తఱుచుగా వాడఁబడుచున్నది. హింస కాయికము, వాచికము, మానసికము అని మూఁడు విధములు. హింసన సందర్భమున మనఃకాయములు కరణ కర్మములుగను, వాక్కు కరణ మాత్రముగను ఉండుట కవకాశమున్నది. ఒకఁడు తన శరీరముచే నన్యుని శరీరమును హింసింప వచ్చును; మనస్సుచే అనఁగా మానసికములైన యాలోచనలచే నన్యుని మనస్సును హింసింప వచ్చును; వాక్కుచే నొప్పించి యన్యుని హింసింపవచ్చును. కాయికముగాఁగాని మానసికముగాఁగాని, వాచికముగాఁగాని యన్యుల హింసింపకుండుట కహింస యనిపేరు. "అహింసా పరమోధర్మః" అను వచనమువలన నది యుత్కృష్టమైన ధర్మమని తెలియుచున్నది. బుద్ధిజ్ఞాన క్షమాసత్యశమదమ భయాభయ సుఖదుఃఖాహింసా సమతాతుష్టి తపోదానాది భావములు పృథగ్విధములైనవి తన వలననే భూతములకుఁగలుగుచున్నవని భగవానుఁడు భగవద్గీతా దశమోధ్యాయమునఁ జెప్పియున్నాఁడు.

ఆచరణములో నెట్లున్నను సిద్ధాంతములోఁ బ్రపంచ మందలి మతములన్నియు నహింస నపరిహార్య ధర్మముగాఁజెప్పుచున్నవి. హింస మానవత్వమునకే వ్యతిరేకము కావున దానిని బోధించు మతము మానవ ప్రపంచమున నుండఁజాలదు. వేదములు భూత హింస చేయరాదని కంఠోక్తిగాఁజెప్పుచున్నవి. పశుహింసా ప్రధానమైన యజ్ఞాచరణమును సమర్థించు వేదములు హింసను నిషేధించుట స్వవచన వ్యాఘాతమునకు నిదర్శనము కాదాయని కొందరాక్షేపింపవచ్చును. బౌద్ధులును జైనులును మొదటినుండియు యజ్ఞములను ఖండించుచునే యుండిరి.

యూపం కృత్వా పశూన్ హత్వా కృత్వారుధిరకర్దమం
యద్యేవం గమ్యతే స్వర్గే నరకే కేన గమ్యతే.

(యూపమును నాటి, పశువులను జంపి, వానినెత్తుటిచే బురదను గల్పించి, యీవిధముగా స్వర్గమునకుఁబోఁగలిగినచో నింక నరకమునకరుగువాఁడెవ్వఁడు) అని ధనపాలకవి తిలకమంజరిలో యజ్ఞపశువిశసనము కంటెఁ గ్రూరతరమైనకర్మ మింకొకటిలేదని వ్యక్తముచేసెను. వేదప్రామాణ్యము నంగీకరింపని బౌద్ధాదుల మాటయటుండ వేదోక్త కర్మకలాపములందు శ్రద్ధాభక్తులు కల మాధ్వులు సైతము పిష్టపశువుతో యజ్ఞముల నాచరించుచు జీవత్పశు విశసనమును వర్జించిరి. శ్రీవైష్ణవులలో నొక తెగవారు యజ్ఞము లనావశ్యకములని పరిహరించిరి. ఇది వారి హింసావృత్తి వైముఖ్యమునకు దృష్టాంతము. యజ్ఞములలోని పశువిశసనము హింసకాదని శాస్త్రములు చెప్పుచున్నవి. యజ్ఞపశువుల కుత్తమగతులు కలుగునని యవికావించు సమర్థనము. ఈ విషయము మనకు ప్రత్యక్షమగునది కాదు. అందుచే నందలి సత్యాసత్యములను మనము నిర్ణయింపఁజాలము. ఈ సందర్భమున దప్పనన్య సందర్భములలో హిందూ మత మేవిధమైనజీవహింసను అంగీకరింపదు. "విను మహింస ధర్మవితతికెల్లను మేటి యవియు సత్య యుక్తమైన వెలయు" నని మహాభారతము ఘోషించుచున్నది.

బౌద్ధము - అహింస

బౌద్ధమహింస కగ్రస్థానమొసంగినది. యజ్ఞపశువిశసనమును గూడ నది హింసగానే పరిగణించును. బుద్ధుని జీవితమును జూడ నతఁడు మానవులయేకాక తిర్యక్కులయు హింస సహింపఁడయ్యెనని తెలియవచ్చును. బౌద్ధమతము నవలంబించిన మహారాజులలో నశోకుఁడగ్రగణ్యుఁడు. అతఁడు బౌద్ధమునవలంబించుటకు కళింగ యుద్ధమున జరిగిన హింసాకాండను జూచినప్పుడు కలిగిన వైమనస్యమే కారణము. అతఁడప్పటినుండియు హింసామయమైన యుద్ధము, మృగయ, మాంస భక్షణము

మున్నగు వానిని వర్జించెను. అతఁడు ప్రచారము చేసిన బౌద్ధ ధర్మములలో నహింస ప్రముఖమైనది. జైనులహింస విషయమున మఱింత శ్రద్ధ వహించునట్లు కన్పించును. వారిలో నొక తెగవారు పీల్పుగాలి ద్వారమున నల్ప క్రిములు లోనికి బోయి మరణించునేమోయని నాసిక కడ్డముగా గుడ్డ కట్టుకొందురఁట; నడుచునపుడు కాళ్ళ క్రిందఁబడి పిపీలికాదులు మరణించునేమోయని ముందు నడువవలసిన నేల శుభ్రముగా దుడిచికొని నడవ నారంభింపరఁట: దీపములచే నాకర్షింపఁబడి శలభములందుఁబడి మ్రగ్గునేమోయని దీపముతో నవసరము లేకుండ మునిమాపుననే భోజనము ముగించుకొని శయనమునకు సిద్ధమగుదురఁట! ఇది వారికి గల హింసావైముఖ్యజీవకారుణ్యముల వలెనే యహింసవిషయమున గల యతివాదమును గూడ సూచించుచున్నది.

భారత కాలములోఅహింస

అరణ్యపర్వమందలి ధర్మవ్యాధోపాఖ్యానమును బట్టి భారత కాలము నాఁటి అహింసాస్వరూపము నెఱుఁగవచ్చును. అందు ధర్మవ్యాధుఁడు కౌశికునకహింసా స్వరూపమును దెలియఁజెప్పెను. పతివ్రతాప్రేరితుఁడైన కౌశికుడు ధర్మవ్యాధదర్శనలాలసుఁడై మిథిలా నగరమున కరిగెను. ధర్మవ్యాధుఁడల్ప మృగమాంస ఖండములం గడింబచరించి యమ్ముచుండెను. కౌశికుఁడతిజుగుప్సితమైన యాసూనాపణము చూడనొల్లక తొలంగి యొక్క యెడ నిలఁబడెను. తరువాత ధర్మవ్యాధుఁడని రాక నెరింగి యతనిఁ గలసికొని తన గృహమునకు గొనిపోయెను. కుశల ప్రశ్నానంతరము కౌశికుడు ధర్మవ్యాధుని "ధర్మవిదుఁడవైన నీవు జీవహింస జీవనముగానడపుట యుక్తమగునా" యని ప్రశ్నించెను. ధర్మ వ్యాధుఁడు తపస్స్వాధ్యాయాదులు విప్రులకును,దండనీతి రాజులకును,కృషి పశుపాలనాదులు వైశ్యులకును. శుశ్రూష శూద్రులకును బరమ ధర్మము మైనట్లు కిరాతులైన తమకు మృగయోప జీవనము పరమ ధర్మమనియు, నది తమకు వంశ క్రమాగతమైన యాచారమనియుఁ, దమరాజైన జనకుఁడాత్మ కర్మములు విడుచువానిఁ బుత్త్రునైన దండితు నొనరించునుఁగావునఁ దాను నిజకర్మ పరిత్యాగము చేయనోడుననియుఁ దాను జీవహింస యెన్నఁడును జేయక యొరులు చంపి తెచ్చిన మాంసము విరిచి తగిన వెలకమ్మి యా ధనమున బ్రదుకుచుండు ననియు బదులు పలికెను.

తరువాత నహింసాస్వరూపము నాతఁడిట్లు తెలియజెప్పెను. "హింసాహింసల విభాగించి చెప్పుట కెవ్వరికిని శక్యముకాదు భూతములు తమ చేసిన కర్మము చేతనే నశించుచుండును. చంపెడువాఁడు నిమిత్త మాత్రమే. బ్రహ్మ భూతములకు ఫలమూలౌషధి శాకములను బశు మృగాదులను భక్ష్యములుగా నొనరించెను. మున్ను శిబిచక్రవర్తి నిజగాత్రమును హింసించి యింద్రాగ్నులకు మాంసమొసంగెను. రంతిదేవుఁడను రాజు దినమునకు రెండువేల చొప్పున వేయివత్సరములు గోవులను వధించెను. నియతాత్ములైన ధరణీసురులధ్వరములందుఁ బశువులనుఁ బశువరింతురు. అగ్నులు మాంసార్థులని శ్రుతుల వినఁబడును. అందుచే వారెవ్వరికిని ఉత్తమ గతులు తొలఁగియుండ లేదు. పితృ దైవత కార్యములు మాంసమిడుట యర్హమనియుఁ దచ్ఛేషము భోజ్యమనియు మునులు చెప్పుదురు."

"కర్షకుఁడు భూమిని దున్నుచుండఁగా లాంగలాగ్రము సోకి పెక్కుప్రాణులు మరణించును. మానవులు భూమిపైఁ జరించునప్పుడు వారి కాళ్ళక్రిందఁబడి పెక్కు జంతువులు నశించును. ఇదంతయు హింసకాదనఁదగునా? పృథివీజలాకాశములు సర్వమును జంతుమయములగుటచే సర్వకర్మలందును హింస యుప్పతిల్లును. హింస లేకుండ దేహయాత్ర సాగించుటయే దుర్ఘటము ఇదంతయుఁ దలఁపక కొందఱు తాము హింస చేయుటలేదనియే తలంచుచుందురు. అహింసయే వ్రతముగాఁ గొని వనముల వసించు మునులకుఁ గూడ ఫలమూల శాక నిపీడనమున హింస కలుగక మానదు. అందుచే నీజగమున హింస చేయని వాఁడొక్కడైననుండడు. మానవులు తమతమ యోపినట్లు హింసామార్గమున కెడ గల్గియేగుటయే యహింస యన నతిశయిల్లును."

ధర్మవ్యాధుని పై వాక్యములను బట్టి కిరాతులకు మృగయోపజీవనము హింస కాదనియుఁ దాము జీవ హింస యొనర్పక యితరులు చంపి తెచ్చిన మాంసము కొని రమ్మి జీవించువారు హింసాపాపమునకు గుఱికారనియు,బ్రహ్మ నిర్ణిత ప్రకారము భూతములు తిర్యగాదులను భక్షించుటయు, యజ్ఞములందుఁ బశువులను విశసించుటయు పితృదేవ కార్యములందు భక్తిమై మాంస మిడుటయు హింసాకృత్యములుగాఁ బరిగణింప బడవనియు, నేలయు, నింగియు, నీరును జంతుమయములగుటచే సర్వ కర్మములందును హింసయావహిల్లుననియు, హింసకు దొలగి జీవయాత్ర సాగించుట దుర్లభమనియు, హింస చేయని వాఁడీజగమునఁ నెవ్వఁడు నుండఁడనియు, నందుచే మానవులు తమ శక్తి కొలఁది హింసామార్గమున కెడగల్గి యుండుటయే యహింసయై యొప్పారుననియు వ్యక్తమగుచున్నది.

వేమన సిద్ధాంతము

వేమన నాటి కీ సిద్ధాంతములు కొంత మార్పు చెందెను. " జీవి జీవిఁజంప శివుని జంపుటెయగు" నని భావించి యతఁడు యజ్ఞాదుల దలి పశు హింసను గూడఁదీవ్రముగా ఖండించెను. యజ్ఞముల పేరు చెప్పి నోరు లేని జంతువులను హింసించుటచే కాక చేఁజిక్కిన శత్రువును గూడ జంపుట యతనికి సమ్మతము కాదు. " చంపఁదగిన యట్టి శత్రువు తనచేత చిక్కెనేని కీడు చేయరాదు. పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు" నని యతని సిద్ధాంతము. శత్రువునుగాక శత్రుత్వమును రూపుమాప యత్నించుట యుచిత తరమని యాతని భావము.

ఆధునిక యుగమున నహింసా సిద్ధాంతమున కఖండ ప్రచారము కావించినవాఁడు గాంధీమహాత్ముఁడు. ప్రపంచము పుట్టినదాది మానవుఁడు క్రమముగా నహింస దెసకే సాఁగిపోవుచున్నాడనియు లేనిచో మానవజాతి యీ పటికే నశించి యుండుననియు నాయన యభిప్రాయము. తనలోఁ బశుత్వము ప్రకాశించుచుండు నంత పఱకే మానవుఁడు హింసాత్మకములైన తలఁపులకుఁ దావిచ్చుననియు నాత్మ ప్రబుద్ధమైనపుడింకనతఁడ హింసను గూర్చి తలంపలేఁడనియు నాయన దృఢ నిశ్చయము. "సహాయ నిరాకరణము, సత్యాగ్రహము మున్నగు నాయుధములు హింసకంటెఁగూడ నుత్తమ ఫలము లొసంగును. సత్యాగ్రహమనఁగా

బాధలకు లోఁబడినమైన మానవుఁడు తన హక్కులను దాను నిల్పుకొనుటయే. ఎల్లరకు మేలు కలుగవలయుననుట అహింసావాదిపరమ సిద్ధాంతము. తత్సంసిద్ధికై యాతఁడు ప్రాణములు వీడుటకైన వెనుదీయఁడు. మానవుఁడవసరమైనచో మానవ కృతమైన యొక సంప్రదాయమును మార్కొనవచ్చును గాని మానవునెన్నఁడును మార్కొనరాదు. ఒక ప్రాణిని హింసించుట ప్రపంచమంతను హింసించుటే. రాజకీయముగాఁ గాని, ఆర్థికముగా గాని నిస్సహాయులై యున్న జాతుల కహింస యొక్కటే రక్షకము. అది యెంతయపాయరహితమో యంత శక్తిమంతము. సత్యము, ప్రేమ యనునవి యహింస యొక్క మాఱట రూపములు. అహింసా వ్రతులు శత్రువునైనను ప్రేమించి తీరుదురు. అట్లొనరించుట భయము చేతఁ గాదు ఔదార్యము చేత. అహింస యనగా దౌర్మార్గ్యము నెదిరించి పోరరాదనెడిది కర్మ సన్యాసము కాదు. దానిని బ్రతిఘటించి పోరుటకు సిద్ధపడుటయే యహింస. ప్రతీకార చింత కంటెఁ బ్రతిఘటనమే చాలా మేలైనది. ఆత్మరక్షణార్థమెదిరిని చంపుటకుఁదగిన బలమునుకాక తాను చచ్చుటకుఁ దగిన బలము వాంఛింపవలయును. చావఁ గోరుట హెచ్చుకొలంది చంపగోరుట తగ్గుచుండును. ప్రేమమయములైన పల్కులుచ్చరించుచు ధైర్యముతో నాత్మార్పణము కావించు మహనీయులు కఠిన హృదయులను గూడ మార్చ గలిగిరనుట కనేక నిదర్శనములు చూపవచ్చును

సంకల్పబలము

పామైనను గఱచుటకు మీఁదికి వచ్చినప్పుడు దానిని గఱవనీయవలెనుగాని చంపగూడదు. ఇట్లు చేయుటకెంతో ధైర్యము, నిర్భయత్వము, ఆత్మ నిగ్రహము కావలయును. అహింసా పూర్వకమైన ప్రతిఘటన వ్యాపారమున నేసు క్రీస్తును, గౌతమ బుద్ధుఁడును మానవులకాదర్శప్రాయులు. అహింసకును భీరుత్వమునకును బొత్తు కుదురదు. భయరాహిత్యము లేనిచో యథార్థమైన యహింస నవలంబించుట యసాధ్యము. అహింసావలంబమునకు దేహబలము కంటె సంకల్ప బలమెక్కువ యవసరము. ఆటంబాబుద్వారా ప్రపంచమున నహింసా ధర్మము వ్యాపించుననుకొనుట పొరపాటు. దాని మూలమున హింసను రోసిన ప్రపంచ మారోఁత తగ్గగానే యినుమడించిన యుత్సాహముతో మరల హింసకెగబడు" నని ఆయన తన రచనలలోఁ బెక్కుసారులు వ్యక్తము చేసియుండెను.

ప్రపంచమున జీవించు వారేదో యొక్క విధముగా హింస నాచరించుచునే యుందురనియు, హింస చేయకుండ జీవించుట దుర్లభమనియు, నందుచే సాధ్యమైనంతవఱకు హింస తెరువునకేగక జీవించుటయే యహింసయనియు భారతీయులవలెనే గాంధీజీయుఁ జెప్పియుండెను. ధర్మ వ్యాధుఁడెవ్వరో చంపి తెచ్చిన మాంసము నమ్మి జీవించుచుఁ దానహింసా వ్రతమునే యాచరించుచుండెనని సంతృప్తిపడెను. మహాత్ముఁడందు కంగీకరింపఁడు. బందిపోటు దొంగలును వారికి బండితోలి సాయపడు వారును సమానముగనే యపరాధులని యాయన యభిప్రాయము. అట్టే యుద్ధము చేయువారును, యుద్ధమున క్షతగాత్రులకుపచారములు చేయువారును హింసాతత్పరతలో నొకరికొకరు తీసిపోరని యాయన భావించియుండెను. వేమనవలె శత్రువును గూడఁ బ్రేమింపవలెనని యాయన తలంచెను.

ప్రకృతి శాస్త్ర పరిశోధనల నెపమునను, మానవ రక్షణ వ్యాజమునను మూగ జీవులను జంపుట క్షమింపరాని దోషమని మహాత్ముఁడు భావించెను. ఆయన యహింసా సిద్ధాంత మొక్కొక్కప్పుడాశ్చర్యము కలిగించును. ప్రతి క్రియారహితమైన వ్యాధికి గుఱియై నిత్యయాతన ననుభవించు ప్రాణి మానవుఁడైనను తిర్యగ్జాతియైనను మందుచే తజ్జీవితకాలమును బెంచి యాతనను వృద్ధి చేయుటకంటె దానిని వెంటనే తుదముట్టించుట మేలని యాయన నిశ్చయము. హింసాహింసలకు మేరలేర్పరుచుట దుష్కరమనియు దేశకాల పరిస్థితులనుబట్టి యొకప్పుడు పాపమైన దింకొకప్పుడు కాకపోవుననియు నాయన భావించెను. చేతులార నొకడొకఁ బ్రాణిని జంపుటకును, హింసాభీతిచే ఇతరులచేఁ జంపించుటకును భేదమేమియులేదని యాయన బోధించెను.

మహాత్ముని బోధ

ఇట్లహింసను బరమ ధర్మముగా బోధించినను మహాత్ముడు భీరుత్వమును, నిర్వీర్యతను బ్రశంసించియుండలేదు. జాతి నిర్వీర్యమైపోవుటకంటె హింసనైన నవలంబించి బ్రతుకుట వేయిరెట్లు మేలని యాయన వ్రాసియుండెను. నెహ్రూ పండితుఁడు కూడ కొన్ని యేండ్ల క్రింద పాకిస్తాను ప్రధానామాత్యుని గలసికొనుటకు ముందు "నైతిక శక్తిచే మేమఖండ విజయమును సాధించితిమి. ఇప్పుడు దానిని విసర్జించినచో నిదివఱకు చేసినదానిని నిష్ఫలమొనరించుటే గాక ప్రపంచమున గౌరవమును గూడఁ గోల్పోదుము. అందుచే యుద్ధమునకుఁ గాలుద్రవ్వుట మాకు సమ్మతము కాదు. అయ్యును అపరిహార్యమగుచో మేము యుద్ధమొనరించుటకు సిద్ధమే" యని పల్కియుండెను.

నేటి కాలమున యజ్ఞయాగాదులాచరించువారే యపురూపము. ఎవ్వరైన చేయదొడంగుచోఁ బశు విశసనము నరికట్ట యత్నించు సంఘములు కొన్ని యున్నమాట సత్యమే. అట్లే గోవధాదులను, మాంస భక్షణమును నిషేధించువారక్కడక్కడఁ గనిపింతురు. కాని మొత్తముమీద నహింసా ధర్మము పదమాత్రశేషముగానే యున్నదని చెప్పవచ్చును. గోవధ నిరంతరాయముగ సాగుచునే యున్నది. మాంసభక్షణము చేయఁగూడదని వారుకూడఁ దదాసక్తులై వర్తించుచుండుటచే మేకలు, గొఱ్ఱెలు, కోళ్ళు ప్రతి దిన మసంఖ్యాకముగా వధింపఁబడుచున్నవి. నాగరికత ప్రబలిన యీ రోజులలో సైతము పశుబలులు వినఁబడుచునే యున్నవి. స్వార్థమును, రాజ్యతృష్ణయుఁ బెచ్చు పెరిగి పోవుటచే దేశములెల్ల మారణాయుధములను సిద్ధముచేసి యన్య దేశములను కబళించుట కువ్విళూరుచున్నవి. వేలకొలఁది ప్రాణులను క్షణకాలమున సంహరింపఁగల యీయాయుధములెన్నో యుత్పాదింపబడుచున్నవి. ఇంక నహింసకు దావెక్కడ ? ఆత్మబలముపై నభిమానము సన్నగిలిపోవుచున్నది. హింసా ప్రధానమైన పశుబలము ప్రాముఖ్యము వహించుచున్నది. ఈ పరిస్థితి శాంతికి స్వస్తి చెప్పి ప్రపంచమునే విధ్వంసోన్ముఖము కావించుచున్నది. గాంధీజీ చెప్పినట్లు సత్యాహింసలు ప్రపంచమున నెల్లెడ ధర్మపాలనము సాగించినప్పుడు కాని శాంతికి స్థానము లేదు. దేశనాయకులు యథార్థముగా శాంతిస్థాపనమునే వాంఛించుచో సత్యాహింసాశ్రయమైన యహింసా సిద్ధాంతమునే యవలంబింపవలయును.

బాలసాహిత్యం

—అడపా రామకృష్ణరావు

పసిబిడ్డను జో కొడుతూ తల్లి పాట ప్రారంభిస్తుంది,

" లాలనుచు పాడరమ్మా ! ఈబిడ్డ
లక్ష్మి విలాసుడమ్మా !"

అంటూ. ఏదేశంలోనైనా పిల్లలకు మొదట వినిపించే సాహిత్యం ఈ జోల పాటలే. తెలుగులో బాల వాఙ్మయంలో మనకు మొదట కనిపించేవికూడా ఈ పాటలే. తరతరాలుగా వస్తున్న జోలపాటలు మనకు చాలావున్నవి. " రామా లాలీ ! మేఘ శ్యామా లాలీ ! " అంటూ ఒకతల్లి బిడ్డను లాలిస్తే, మరోతల్లి

" లాలి శంకర ! సదా లాలితకుమారా !
లాలి పట్టుతాండవోల్లాస ఘనధీరా ! "

అని పాడుతుంది. పుట్టినబిడ్డ ఆడపిల్ల అయితే,

" లాలి బంగరుబొమ్మ ! లాలి మాయమ్మా !
లాలి ముద్దులగుమ్మ ! లాలి సీతమ్మా !"

అనేపాట సరిపోతుంది. తల్లి పాటతో శ్రుతి కలుపుతూ పుత్ర రత్నంకూడా రాగం మొదలుపెడితే,

" ఏడవకు, ఏడవకు వెఱ్ఱినాతండ్రి !
ఏడిస్తే నీకళ్ళు నీలాలుగారూ !"

అనేపాట ఉండనే వుంది. అదే సంగీతం అమ్మాయి ఆరంభిస్తే,

" అమ్మణ్ణి కన్నులు తమ్మిపువ్వుల్లూ,
తమ్మిపువ్వులలోని తమ్మతేనెల్లూ "

అని పాడుకోవచ్చు. ఈ విధంగా తెనుగునాట నలుగురికి తెలిసిన జోల పాటలలో ఏ పాటను ఎవరు ఏనాడు అల్లారో ఎవరికీ తెలియదు. ఒక్క

" జో అచ్యుతానంద ! జోజో ముకుందా !
రార పరమానంద ! రామగోవిందా !"

అన్నపాట మాత్రం తాళ్ళపాక అన్నమయ్యగారి రచన అని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు గుర్తించి, చెప్పారు.

పిల్లలకోసం పెద్దలు సృష్టించిన సాహిత్యంలో మొదటివి జోల్పాటలు. తరువాత బిడ్డ క్రమంగా ఎదుగుతున్నప్పుడు ప్రతి దశకూ వేరువేరుగా పాటలున్నై. వీటిని గురించి డాక్టర్ బి. రామరాజుగారు జానపద గేయ వాఙ్మయానికి సంబంధించిన పరిశోధన గ్రంథంలో వివరంగా వ్రాశారు. ఉగ్గు పట్టేటప్పుడు, పాపాయి చేతులూపుతూ చప్పట్లు కొట్టినప్పుడు, గోరుముద్దలు తినిపించేటప్పుడు-ఈవిధంగా ప్రతి సందర్భానికీ తగిన పాట లేర్పడినై. వీటిలో

" తారంగం తారంగం
తాండవకృష్ణా తారంగం "

అనేపాటా,

" చందమామ రావె
జాబిల్లి రావె "

అనే పాటా ఆంధ్రదేశంలో అన్నిప్రాంతాలలోనూ వినిపించేవే. "చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ " అంటూ బాలకృష్ణుని మధుర మూర్తిని వర్ణించే గేయంకూడా తెలుగుపిల్లలకు పరిచితమే.

ఇక ఆటలకు సంబంధించినవి " కాళ్ళా గజ్జీ కంకాళమ్మా" " చెమ్మచెక్క చారడేసి మొగ్గ ," "గుడుగుడుగుంచం గుళ్ళో రాగం, " " కొండమీద వెండిగిన్నె, కొక్కిరాజు కాలువిరిగె " వంటి పాటలు చాలా ఉన్నై. ఈ పాటలలో కొన్నింటిలో ఉన్న ఆయుర్వేద రహస్యాలను వేదాల తిరుమల రామానుజస్వామిగారూ, సురవరం ప్రతాప రెడ్డిగారూ వెల్లడించారు. పండుగలకు సంబంధించిన గేయాలలో " సుబ్బిగొబ్బెమ్మా సుఖమూలియ్యావే " అనే గొబ్బిపాటా, " ఓ బొజ్జగణపయ్య నీబంటునేనయ్య " అనే వినాయక చతుర్థినాటిపాటా, " అయ్యవారికిచాలు అయిదువరహాలు " అనే దసరా పదమూ అందరికీ తెలిసినవే.

ఈ పాటలన్నీ ఆనోటా ఆనోటా ప్రచారంలో ఉండగా అచ్చువచ్చింది. 1847లో పెద్దబాలశిక్ష అచ్చయింది. పిల్లలకు పాఠ్యపుస్తకాలసృష్టి ప్రారంభమయింది.

" అక్కరకు రానిచుట్టము,
మ్రొక్కిన వరమీనివేల్పు, మోహరమున దా
నెక్కిన బారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ "

అంటూ శతకాలు పిల్లలకు హితబోధ చేశాయి. వీటిలో వేమన పద్యాలూ, సుమతి శతకమూ, కుమారీ శతకమూ, కృష్ణ శత

కమూ ఎక్కువగా ప్రచారం పొందాయి. అయితే ఈ శతకాలలో పద్యాలకు ఎవరైనా ప్రతిపదార్థ తాత్పర్యాలు చెపితేనే గాని భావం పిల్లలకు బోధపడదు.

యం. యన్. వెంకట స్వామిగారు కొన్ని బాలగేయాలను సేకరించి, 1906 మే నెలలో "The Indian Antiquary" అనే పత్రికలో ప్రకటించారు. బహుశా తెలుగులో పిల్లల పాటలను సేకరించి పత్రికలకు ఎక్కించినవారిలో వారే మొదటి వారేమో ! వారు చూపినదానిని తరువాత చాలామంది అనుసరించారు. "పాతపాటలు" అనే పుస్తకంలో చేకుమళ్ళ కామేశ్వరరావుగారూ, "సెలయేరు" అనే పుస్తకంలో నేదునూరి గంగాధరంగారూ తాము సేకరించిన పిల్లల పాటలనుకూడా అచ్చువేశారు.

పూర్వపు పాటలను సేకరించి ప్రకటించడంతోపాటు సొంతంగా పిల్లలకోసం పాటలు, కథలూ వ్రాయడంకూడా ప్రారంభమయింది. డాక్టర్ అయ్యగారి వీరభద్రరావుగారు "చిలుక చెప్పిన కథ" అనే పుస్తకం అచ్చువేశారు. వేంకట పార్వతీశ్వర కవులు "బాలగీతావళి"ని వ్రాశారు. కవి కొండల వెంకటరావుగారు పిల్లలకోసం చాలా విడిపాటలూ, కథలపాటలూ వ్రాశారు. "చదువులదుత్త" "కుమారకంఠం" అనే పుస్తకాలలో ఇవి చేరాయి. చేకుమళ్ళ కామేశ్వరరావుగారు ప్రకటించిన "మిణుగురు పురుగులు" "పాలపిట్ట" అనే పుస్తకాలలో ఎన్నో బాలగేయాలున్నాయి.

తెలుగులో బాలవాఙ్మయ సృష్టికి కృషిచేసిన పెద్దలలో చింతా దీక్షితులుగారికి ప్రత్యేకస్థానంవుంది. పిల్లల మనస్తత్వాన్ని చక్కగా అర్థంచేసుకుని, వాచకాల భాషవేరు పిల్లలు మాట్లాడే భాషవేరు అన్నసంగతి గుర్తించి, దీక్షితులుగారు రసవంతమైన పాటలు వ్రాశారు. వీరి బాలగేయాలు "లక్కపిడతలు" అనే పుస్తకంగా అచ్చయ్యాయి. దీక్షితులుగారి పాటలలో ఒక విశేషమేమిటంటే, వాటిలో అంతటా తెలుగు వాతావరణం, తెలుగు పలుకుబడీ కనిపిస్తాయి. ఆవు దూడమీదిపాట చూడండి :

"తువ్వాయి తువ్వాయి ఏమి తువ్వాయి ?
తువ్వాయి తువ్వాయి మంచితువ్వాయి.
తువ్వాయి మెళ్ళోను ఏమి ఉన్నాయి ?
తువ్వాయి మెళ్ళోను మువ్వలున్నాయి.
తువ్వాయి కాళ్ళల్లొ ఏమి ఉన్నాయి ?
తువ్వాయి కాళ్ళల్లొ పరుగులున్నాయి.
తువ్వాయి నోట్లోను ఏమి ఉన్నాయి ?
నోట్లోను తెలిపాల నురుగులున్నాయి.
తువ్వాయి తువ్వాయి ఎవరి తువ్వాయి ?
ఆవుగారి తువ్వాయి అసలు మా తువ్వాయి."

ఇది "లక్కపిడతలు" పుస్తకంలో అచ్చయిన పాట. ఆ పుస్తకంలో ఇంకా ఎన్నో పాటలు.

"చిట్టి చిట్టి కమలాలు
చెరువులోని కమలాలు
నవ్వేటి కమలాలు
నాకు తెచ్చిపెట్టే
అమ్మ తెచ్చిపెట్టే
ఆడుకొంటాను"

అంటూ తామరపువ్వుల మీదా,

"గంధం మెడకూ పూసుకొనీ,
పసుపూ కుంకం రాసుకొనీ,
కంటికి కాటుక పెట్టుకునీ,
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !"

అంటూ అమ్మణ్ణి మీదా,

"పొన్నలు ఎక్కే కృష్ణమ్మా
వెన్నలు మెక్కే కృష్ణమ్మా
వేణువు నూదే కృష్ణమ్మా"
గోవులు కాసే కృష్ణమ్మా"

అంటూ బాలాకృష్ణుడి మీదా దీక్షితులుగారు వ్రాశారు. పాటలేకాదు, పిల్లలకోసం వారెన్నో చిన్నకథలూ, "లీలాసుందరి" అనే పెద్ద కథా వ్రాశారు.

డాక్టర్ గిడుగు సీతాపతిగారు కూడా పిల్లలకోసం చాలా పాటలు వ్రాశారు. వీరి పాటలలో "రైలుబండి" "చిలుకమ్మ పెండ్లి," "ఎలుకా—పిల్లి" మొదలైనవి పత్రికలలో అచ్చయ్యాయి. తరువాత పుస్తకాలకెక్కాయి. "చిలుకమ్మ పెండ్లి" పాటలో చిలుకపెళ్ళికి పక్షులూ, జంతువులూ అన్నీ ఒక్కొక్క వాద్యం వాయించడం, పెళ్ళి సన్నాహాలు చెయ్యడం ఎంతో ముచ్చటగా వర్ణించారు. ఆ పాటకు పిల్లలలో చాలా ప్రచారమూ, ఆదరమూ లభించాయి.

పిల్లల ప్రత్యేక కార్యక్రమం

1939లో తెలుగులో బాలసాహిత్య చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం ప్రారంభమయింది. ఆయేడు ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం నుంచి తెలుగులో పిల్లలకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటయింది. బాలసాహిత్యవ్యాప్తి కుపకరించిన సాధనాలన్నిటిలోనూ రేడియో చాలా ఆకర్షణీయమైనదీ, ఆదరణీయమైనదీను. ఎందుచేతనంటే – పుస్తకాలు చదివి పాటలూ, కథలూ నేర్చుకోవాలంటే పిల్లలకు కొంత వయస్సు రావాలి. కాని రేడియోలో ప్రసారమయ్యే పాటలూ, కథలూ, నాటకాలూ ఇంకా అక్షరజ్ఞానంలేని చిన్న పిల్లలు కూడా విని ఆనందించే అవకాశముంది. పైగా స్టూడియోలో అభినయించేటప్పుడైనా, ఇంటిదగ్గర వినేటప్పుడైనా పిల్లలంతా కలిసి పాల్గొనే అవకాశముంది. రేడియోలో ఏదైనా కథగాని,

నాటకంగాని ప్రసారమవుతున్నప్పుడు సమయోచితంగా ధ్వనులను కూడా చేర్చి, కథను రక్తి కట్టించవచ్చు. అందుచేత రేడియోలో బాలానంద కార్యక్రమం పిల్లల్ని చాలా ఆకర్షించింది.

మొదట్లో కొన్నాళ్లు దుర్గాబాయిగారు ఈ కార్యక్రమం నిర్వహించారు. తరువాత న్యాయపతి కామేశ్వరిగారి నిర్వహణలో ఈ కార్యక్రమ ప్రసారం సాగింది. కామేశ్వరిగారిని రేడియో అక్కయ్యగానూ, రాఘవరావుగారిని రేడియో అన్నయ్యగానూ తెలియని రేడియో శ్రోతలేరు. బాలానంద కార్యక్రమంలో వీరిద్దరూ తెలుగు పిల్లలచేత పాత పాటలూ కొత్త పాటలూ పాడించారు. కథలు చెప్పించారు. నాటకాలాడించారు. పొడుపు కథలూ, చిక్కుప్రశ్నలు వేయించారు, విన్పించారు. అంతేకాదు, రేడియోలో ప్రసారాని కనుకూలంగా వీరిద్దరూ పాటలూ, నాటకాలూ వ్రాశారు. వాటిలో కొన్ని "బడిగంట" అనే పుస్తకంగానూ, "చిట్టి నాటికలు" అనే పుస్తకంగానూ అచ్చయ్యాయి.

"బడిగంట" పుస్తకంలో

"పూచినపూలూ ఏమన్నాయీ ?
విచ్చినపూలూ ఏమన్నాయీ ?

పిల్లల్లారా రమ్మన్నాయీ !
లచ్చికి దండలు గుచ్చన్నాయీ !"

వంటి చక్కటి బాలగేయాలున్నై.

తరువాత కొన్నాళ్లకు విజయవాడ, హైద్రాబాద్ రేడియో కేంద్రాల నుంచికూడా తెలుగులో పిల్లలకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొత్తంమీద ఈ మూడుకేంద్రాలనుంచీ పిల్లల రేడియో కార్యక్రమాలు సాంప్రదాయిక గేయాలనూ, కొత్తపాటలనూ బాలశ్రోతలకు సన్నిహితంచేశాయి. సాహిత్యంలోని ప్రసిద్ధ పాత్రలను వారికి పరిచయంచేశాయి. యాలిస్, సిందరెల్లా, యులిసిస్, అలావుద్దీన్, దిలీపుడూ, రఘువూ, కౌత్సుడూ, నాచికేతుడూ, ఇంకా ఎందరెందరిని గురించో ఈ కార్యక్రమాలద్వారా పిల్లలు తెలుసుకోవడానికి వీలయింది. పిల్లలకోసం కృష్ణశాస్త్రిగారు వ్రాసినపాటలు ఈ కార్యక్రమాలలో ప్రసారమయ్యాయి. రేడియోకోసం రజనీకాంతరావుగారు "జేజి మామయ్య పాటలు" వ్రాశారు. తరువాత అవి పుస్తకంగాకూడా వెలువడ్డాయి.

"చిట్టీ చిట్టీ రేగిపళ్ళూ
చిట్టీ తలపై భోగిపళ్ళూ
ఎంతో చక్కని భోగిపళ్ళూ
ఎర్రా ఎర్రని రేగిపళ్ళూ"

అని ఒకటీ,

"పిచికమ్మా, ఓ పిచికమ్మా
కిచకిచమంటూ ఏమీకథలూ
పిచికమ్మా చెపుతావో, మరి చెప్పమ్మా"

అని మరొకటీ, ఇటువంటి చక్కటి పాటలెన్నో "జేజి మామయ్య పాటలు" లో ఉన్నవి. శ్రీవాత్సవగారు "జల్తారు జాబిలి" అనే అద్భుత కథను పిల్లలకోసం రాశారు.

బాలల పత్రికలు

ఇక పత్రికల సంగతి చూద్దాం. పెద్దవాళ్ళ కోసం ఏర్పడిన పత్రికలలో పిల్లలకోసం కూడా కొంత చోటు ప్రత్యేకించే ఆచారం చాలాకాలంగా వుంది. 1884 లోనే మదరాసునుంచి వెలువడిన "జన వినోదిని" అనే పత్రికలో "చిట్టి పొట్లకాయ" "రంగు రంగు బిళ్ళ" మొదలైన బాల గేయా లచ్చయ్యాయి. నందిరాజు చలపతిరావుగారు తమ "గృహలక్ష్మి" పత్రికలో బాల విజ్ఞాన శీర్షికను నడిపారు. తరువాత కేసరిగారి "గృహలక్ష్మి" పత్రికలోనూ, "భారతి" లోనూ పిల్లలకోసం ప్రత్యేక శీర్షికలు ఏర్పడాయి. అనిశెట్టి సుబ్బారావుగారు, గిడుగు సీతాపతిగారు వీటిలో పిల్లలకోసం రచనలు ప్రకటించారు. అయితే 1945 వరకు తెలుగులో పిల్లలకోసం ప్రత్యేకంగా పత్రిక లేదు. ఆ లోపం తీర్చడానికి 1945 లో న్యాయపతి రాఘవరావుగారూ, కామేశ్వరిగారూ "బాల" పత్రిక ప్రారంభించారు. కొద్ది నెలలలోనే దానికి విశేష ప్రచారం కలిగింది. తరువాత తెలుగులో పిల్లల పత్రికలు చాలా వెలిశాయి— "చందమామ" "బాబు" "పాపాయి" "బాలమిత్ర" "బాలబంధు" మొదలైనవి. ఐతే వీటిలో కొన్నిటికి బాలారిష్ట దోషాలు తప్పలేదు.

మొత్తానికి ఈ పిల్లల పత్రికలుకూడా బాల సాహిత్య వికాసానికి చాలా తోడ్పడ్డాయి. ముఖ్యంగా పిల్లలకూ, తల్లులకూ పత్రికలు చదివే అలవాటు నేర్పాయి. ప్రఖ్యాత రచయితలు పిల్లలకోసం ప్రత్యేకంగా ఈ పత్రికలలో వ్రాశారు. శ్రీశ్రీ గారు "కప్పవైద్యుడు" అనే గేయ కథ వ్రాశారు.

"అనగా అనగా ఒక కప్ప
అది తానొక గొప్ప
వైద్యుడని భావించింది
వైద్యం చేస్తానని చాటించింది"

అంటూ ప్రారంభమవుతుందాపాట. ఆరుద్రగారు "చీమలరాజ్యంలో సీత" అనే పిల్లలకథ వ్రాశారు. వి. యస్. శర్మగారు జర్మన్ కథలను తెలుగులో వ్రాశారు. ముద్దా విశ్వనాథంగారు చాలా కథలూ, పాటలూ కూర్చి ప్రకటించారు. మొట్టమొదట ఒక పిల్లల పత్రికలో ఆనాడు రచనా సంవిధానం నేర్చుకున్న బాలుడు ముళ్ళపూడి వెంకటరమణగారు ఈ నాడు ప్రఖ్యాత కథకులైనారు.

ఈ సందర్భంలో "బాలప్రభ" పత్రికను గురించి ప్రత్యేకించి చెప్పాలి. దీనిని 1952 ప్రాంతాల్లో పాటిబండ మాధవశర్మగారు విజయవాడనుంచి పిల్లల వారపత్రికగా నడిపారు. దాదాపు 30 సంచికలు వచ్చాక, ఈ పత్రిక ఆగిపోయింది. దీనిలో కథలతో బాటు పిల్లల మనస్సుకెక్కే ప్రపంచవార్తలు, విజ్ఞాన విశేషాలు; ఆటపాటలను గురించిన వర్తమానం అచ్చయ్యేవి. "బాలప్రభ" కోసం ప్రత్యేకంగా విశ్వనాథ సత్యనారాయణగారు "పిల్లల రామాయణము" "సారథి బాల్యం" అనే పేరుతో కథారూపంలో స్వీయ చరిత్రా వ్రాశారు.

స్వాతంత్ర్యానంతర వికాసం

మనకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సాంస్కృతిక రంగంలో కలిగిన నవచైతన్యం బాల సాహిత్య వికాసానికి కూడా దారి తీసింది. పిల్లలకోసం రంగురంగుల బొమ్మలతో, పాటలతో, కథలతో పుస్తకాలచ్చువేయడానికి పాఠకుల ఆదరణతో బాటు, ప్రభుత్వపు ప్రోత్సాహంకూడా లభించింది. బాల సాహిత్య రచనలలో పాటించవలసిన మెళుకువలను నేర్పడానికి ప్రభుత్వపు తోడ్పాటుతో శిక్షణ తరగతులు నడిపారు. తెలుగు భాషా సమితి వారు బాల సాహిత్యానికి కూడా బహుమతుల నిచ్చారు. బహుమతుల నందుకొన్న పుస్తకాలలో గిడుగు సీతాపతిగారి "బాలానందం" మాగంటి బాపినీడుగారి "తెలుగుతల్లి" కవిరావుగారి "బొమ్మరిల్లు" ఎంచదగినవి. తరువాత కేంద్రప్రభుత్వమూ రాష్ట్ర ప్రభుత్వాలూ ఏటేటా ఉత్తమ బాల సాహితికి బహుమతుల నిస్తున్నవి. న్యాయపతి రాఘవరావుగారి "బడిగంట" నటరాజ రామకృష్ణగారి "నర్తనబాల" విస్సా అప్పారావుగారి "ఆకాశం" ఏ. వి. యస్. రామారావుగారి "అంతరిక్ష విజయం" మొదలైన పుస్తకాలు కేంద్ర ప్రభుత్వపు బహుమతిని పొందాయి. బుజ్జాయి గారి "పిల్లలు_పువ్వులు" నారాయణరెడ్డిగారూ, దాశరథిగారూ కలిసి వ్రాసిన "బాల భారతము" ఉత్పల సత్యనారాయణాచార్య గారి "ఉత్పలమాల" రాష్ట్ర ప్రభుత్వపు బహుమతి నందుకున్నాయి.

ఈ నాడు తెలుగులో బాల సాహిత్య వికాసానికి కృషి చేస్తున్న రచయితలు చాలామంది ఉన్నారు. బి. వి. నరసింహారావుగారు స్వయంగా ఎన్నో బాల గేయాలు వ్రాశారు. వ్రాయడమే కాదు, బాల సాహితికి వారు ముఖ్య ప్రచారకులుకూడా. నార్ల చిరంజీవిగారు, కె. సభాగారు, ఇల్లిందల సరస్వతీదేవిగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, భాస్కరభట్ల కృష్ణారావుగారు పిల్లలకోసం వ్రాశారు. నండూరి రామమోహనరావుగారు మార్క్‌ట్వెయిన్ నవలలను తెలుగు పిల్లలకు పరిచయం చేశారు. విస్సా అప్పారావుగారూ, వసంతరావు వెంకటరావుగారూ కఠినమైన శాస్త్ర విజ్ఞానాన్ని సులభమైన భాషలో పిల్లలకు అందించారు. శ్రీ వాత్సవగారు "తెల్ల గులాబి" "రాజుగారి రామచిలుక" మొదలైన నాటికలను పిల్లలకోసం పుస్తక రూపాన ప్రకటించారు. గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారు గాంధీజీ జీవిత చరిత్రను పిల్లలకోసం వ్రాశారు. ఇట్లా చెప్పుకుంటూపోతే ఈ పేర్లకు అంతుండదు.

మొత్తానికి తెలుగులో ఈ నాడు బాలసాహిత్యం బహుముఖాల విజృంభిస్తున్నది. ఇందులో కొంత వ్యాపార దృష్టితో మాత్రమే వెలువడుతున్నదీ, మరికొంత కేవలం పై తళుకువల్లా రంగుబొమ్మల రమ్యతవల్లా చలామణీ అవుతున్నదీ లేకపోలేదు. అయితే పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా, వారికి అర్థమయ్యే భాషలో ఉత్తమ సాహిత్యంకూడా కొంత ఈ నాడు వెలువడుతున్నది. ఈ సాహిత్యశాఖ ఇంకా పుష్టిని పొందడానికిది సహాయపడుతుందని మనం ఆశపడవచ్చు.

భావిభారత పౌరులు

విశ్వకవి రవీంద్రు కవితా విరిదోటల నాటలాడి
గాంధితాత నీతికథా బోధామృత మారగించి
చాచాజీ వాత్సల్యపు జ్యోత్స్నల దోబూచులాడి
శాంతిసమర సవ్యసాచి శాస్త్రీజీ సంస్మరించి
మువ్వన్నె పతాక నీడ ముందుకురుకు బాలలు
నవభారత నాయకులు, నవచరిత్ర కారకులు
భారతీయ బాలలు, భావి భారత పౌరులు
పుణ్యచరిత భరతజనని కంటిలోని వెలుగులు.

చైతన్యమూర్తులు

బులుసు సాంబమూర్తి

(జననం : 4 మార్చి, 1886)

గాంధీ యుగంలో జన్మించి, మాతృదేశాభిమానంతో అతి ధైర్యంగా అవధులు లేని రాజకీయ పారావారంలోకి దూకిన సాహసులలో బులుసు సాంబమూర్తిగారు ఒకరు. గాంధీజీ ప్రభావంవల్ల సంపద సమృద్ధులకు నిలయమైన, ఉజ్వలవంతమైన లాయరుజీవితం నుంచి జాతీయపోరాటమనబడే త్యాగమయ, నిరాడంబర శ్రామిక జీవన పథంలోకి ప్రవేశించారు. సన్యాసిలాగ ఆడంబరాల్ని కాదని కఠినమైన జీవితాన్ని గడిపారు. సిల్కు వస్త్రాల్ని విడిచి ఖద్దరు బట్టల్ని ధరించారు.

సహాయ నిరాకరణోద్యమంలో, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో, శాసనోల్లంఘనలో సాంబమూర్తిగారు పాల్గొన్నారు. అనేకసార్లు కారాగార వాసం అనుభవించారు. చాలాసార్లు లాఠీచార్జీలకు గురయ్యారు.

మాతృదేశం గురించి తమ సర్వస్వాన్ని అర్పణచేసిన ఆదర్శ త్యాగమయ జాతీయ యోధుల కోవలోనివారు సాంబమూర్తిగారు.

1923లో అఖిల భారత కాంగ్రెసు సమావేశం కాకినాడలో జరిగింది. సాంబమూర్తిగారు అదే సమయంలో తమ ఏకైక పుత్రుని కోల్పోయారు. అయినప్పటికి ఆయన ఏమాత్రం చలించక ఆహ్వాన సంఘం తరఫున అతిథులందరికీ జరపాల్సిన ఏర్పాటన్నీ తు. చ. తప్పకుండా నిర్వర్తించడంలో మునిగిపోయారు. సరోజినీ వంటి వారి మెప్పుకు పాత్రమయ్యారు.

గాంధీ గారు కాకినాడ వచ్చినప్పుడు కాకినాడ మహిళలు తమ ఆభరణాలను గాంధీ గారికి ఇవ్వ తలచుకున్నారు. సాంబమూర్తిగారి అర్ధాంగిచేతులకు రెండే రెండు బంగారు గాజులున్నాయి. వాటిని విరాళంగా ఇవ్వడానికి ఏ మాత్రం సందేహించవద్దనీ, తమవద్దవున్న కట్టకడపటి బంగారాన్ని గాంధీజీ చేతులలో వుంచడమే ఒక అదృష్టమని సాంబమూర్తిగారు తమ అర్ధాంగికి నచ్చచెప్పి విరాళంగా యిప్పించారు.

సాంబమూర్తి గారు నెల్లూరు జైలులో వున్నప్పుడు నాటి మద్రాసు గవర్నరు సాంబమూర్తి గారిని జైలు సూపరింటెండెంట్ ఆఫీసులో కలుసుకోదలచినట్లు తెలియజేసినప్పుడు సాంబమూర్తిగారు యిలా అన్నారు. "ఇదే నా గది. గవర్నరుగారు యిక్కడికేవచ్చి నన్ను కలుసుకోవచ్చు. ఆయనతో నాకు పనేమీ లేదు. ఒకవేళ నాతో ఆయనకు పనేమన్నా వున్నట్టయితే ఆయనే ఇక్కడ నా గదికి వచ్చి నన్ను కలుసుకోవటం ఉచితం." సాంబమూర్తిగారి ఆత్మాభిమానం అలాంటిది.

సాంబమూర్తిగారు భయమెరుగని స్వాతంత్ర్య యోధుడు. సాటిలేని మేటి కార్యకర్త. గొప్ప మాతృదేశాభిమాని. మహిళల సంక్షేమానికీ, హరిజనుల సంక్షేమానికీ, ఆయన విశేషంగా కృషి చేశారు. మద్రాసు శాసనసభ స్పీకర్‌గా ఆయన అనేక కొత్త పద్ధతులను, ప్రమాణాలను ప్రవేశ పెట్టారు.

డా. బూర్గుల రామకృష్ణారావు

(జననం 13, మార్చి 1899)

బూర్గుల రామకృష్ణారావుగారు చిన్నప్పటినుంచీ చదువులో చాలా తెలివైన విద్యార్థిగా వుండేవారు. క్లాసులో ఎప్పుడూ అందరికన్నా ఎక్కువ మార్కులు వస్తుండేవి. చిన్ననాటినుంచీ ఆయనకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలన్నా, ఆటపాటలన్నా అమితమైన ఆసక్తి వుండేది. హైదరాబాదులోగల నిజాం కళాశాల తాలూకు యువజన సంఘాన్ని స్థాపించిన వారిలో ఆయన ఒకరు. దానికి తొలి కార్యదర్శి ఆయనే. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారి వంటి నాయకులవల్ల బూర్గుల రామకృష్ణారావుగారు యువకుడిగా వున్నప్పుడు ప్రభావితుడై ప్రజాసేవ, త్యాగనిరతి, వినయశీలము మొదలగు లక్షణాలను పుణికి పుచ్చుకున్నారు.

పర్షియా భాషను బోధించే ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ న్యాయశాస్త్ర సాయం కళాశాలలో చదువుకొని ప్లీడరుగా నమోదయ్యారు. ఆయన వ్రాసేరచనలూ, చేసేచేతలూ ఆయనను జాతీయవాదిగా చెప్పక చెప్పేవి. వెనకటి హైదరాబాదు సంస్థానంలో బూర్గుల రామకృష్ణారావుగారు అనేక సాంస్కృతిక కార్యక్రమాలను, ప్రజాఉద్యమాలను ప్రారంభించారు. ఎన్నిటినో అభివృద్ధిపరిచారు. మరింకెన్నిటిలోనో పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలోని దేవరకొండలో జరిగిన ఆంధ్ర మహాసభ ద్వితీయ వార్షికోత్సవానికి బూర్గుల రామకృష్ణారావుగారు అధ్యక్షత వహించారు. ఆ సభలోనే ప్రజా ఉద్యమానికి గట్టిగా వత్తాసు పలికారు. హైదరాబాదు రాజకీయ మహాసభను ఏర్పాటు చేసిన వారిలో ఆయన ఒకరు. హైదరాబాదు పౌరహక్కుల సంస్థకు కార్యదర్శిగా వ్యవహరించారు. 1937 లో జరిగిన హైదరాబాదు ప్రజా సదస్సుకు కార్యదర్శిగా వున్నారు.

హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు ఏర్పాటులోకూడా ఆయన ప్రధాన పాత్ర వహించారు. సత్యాగ్రహం కావించారు. కారాగారవాసం అనుభవించారు. న్యాయాధిపతి పదవిగాని, మంత్రి పదవిగాని ఆయనకు వ్యామోహాన్ని కలిగించలేకపోయాయి. జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకే ఆయన అంకితమై పోరాడాలని నిశ్చయించారు

వెల్లోడీ మంత్రి మండలిలో చేరాలని కాంగ్రెసు నిశ్చయించిన పిమ్మటనే ఆయన మంత్రి పదవికి అంగీకరించారు. విద్యా, రెవిన్యూ శాఖల మంత్రిగా ఆయన అనేక ముఖ్యమైన సంస్కరణలను ఆ శాఖలలో ప్రవేశపెట్టారు. మధ్యంతరంగా ఏర్పడిన ఆపద్ధర్మ ప్రభుత్వం అనంతరం అన్ని హంగులతో కూడిన సమగ్ర ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆ మంత్రి మండలికి బూర్గుల రామకృష్ణారావుగారు నాయకత్వం వహించారు. 1956 లో హైదరాబాదు రాష్ట్రం మూడుగా విభజింపబడి తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలు ఆంధ్ర రాష్ట్రంతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

హైదరాబాదు సంస్థానం భారత దేశంలో చేర్చేందుకేగాక అది భారత రిపబ్లిక్‌లో అంతర్భాగం కావడంలోకూడా బూర్గుల రామకృష్ణారావుగారు ప్రముఖ పాత్ర వహించారు. హైదరాబాదు రాష్ట్రం విడిగావుండి వున్నట్లయితే దానికి ఆయనే ముఖ్యమంత్రిగా వుండి వుండేవారు. అయితే దేశ శ్రేయస్సు దృష్ట్యా హైదరాబాదు విలీనం చేయడానికే ఆయన కృషి చేసి సాధించగలిగారు.

జాగీర్దారీ విధానాన్ని రద్దుచేసే విషయంలో కూడా ఆయన యిటువంటి త్యాగాన్నే ప్రదర్శించారు. ఒక జాగీరుదారుగా ఆయన యీ విషయమై చంచల బుద్ధితో డోలాయమాన మానసుడుగాకాక దృఢ బుద్ధితో జాగీర్దారీ విధానం రద్దు చేయడానికే పూనుకున్నారు.

డా. ఆల్బర్ ఐన్‌స్టీన్

(జననం : 14, మార్చి 1879)

ఆధునిక కాలంలో అగ్రగణ్యులిద్దరిని పేర్కొనమని జార్జ్ బెర్నార్డ్‌షాని ఒకాయన ప్రశ్నిస్తే ఆయన వెంటనే యిలా అన్నారు. "ఒకరు-నేను, మరొకరు ఐన్‌స్టీన్" అని బెర్నార్డ్‌షా స్వోత్కర్ష విషయం వొదిలేస్తే ఐన్‌స్టీన్ ప్రపంచ ప్రముఖ శాస్త్రజ్ఞులలో ఒకరన్నదాంట్లో అతిశయమేమీ లేదని చెప్పవచ్చు.

చిన్నప్పుడు ఐన్‌స్టీన్‌ను అంత చురుకైన కుర్రవాడుకాదని అంతా అనుకునేవారు. అలాంటిఐన్‌స్టీన్ తన 26వ యేట శాస్త్రీయ దృక్పథంలో విప్లవాత్మకమైన ఆలోచనను రేకెత్తించే మూడు వ్యాసాలను వ్రాశారు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఇది శాస్త్రీయ రంగంలోనే ఒక గొప్ప విప్లవాన్ని తీసుకొని వచ్చింది. 1921లో భౌతికశాస్త్రంలో ఆయనకు నోబెల్ ప్రైజు బహూకరించబడింది.

ఐన్‌స్టీన్ రూపొందించినసూత్రాన్ని ఆధారం చేసుకునే ఆటంబాంబు నిర్మించబడింది. హిరోషిమా నాగసాకీలమీద ఆటంబాంబులను ప్రయోగించడాన్ని ఐన్‌స్టీన్ తీవ్రంగా ఖండించారు.

ఐన్‌స్టీన్ శాంతి కాముకులు, తొలి ప్రపంచ సంగ్రామ కాలంలో ఎనభై ముగ్గురు మేధావులు బలవంతంగా మేనిఫెస్టోమీద సంతకాలు చేయవలసి వచ్చినప్పుడు ఐన్‌స్టీన్ జర్మన్ మిలటరీ చర్యలను సమర్థించడానికి ఏ మాత్రం అంగీకరించలేదు.

ఇజ్రాయేలును ఆయనబలపరచారు. అంతర్జాతీయవాది ఆయన. ఏక ప్రపంచ ప్రభుత్వంమీద ఆయనకు నమ్మకంవుంది. ఇజ్రాయేలు తొలి అధ్యక్షుడు వైజ్‌మన్ మరణించినప్పుడు జ్యూవంశం వాడైన ఐన్‌స్టీన్‌ను ఆ పదవిని అలంకరించమని ఆహ్వానిస్తే ఆయన నిరాకరించారు.

"శాస్త్రపరమైన సమస్యలే నాకు తెలుసు. మనుషుల సమస్యలను పరిష్కరించే స్వాభావికమైన శక్తిగానీ, అనుభవంగానీ నాకులేవు" అని అన్నారు.

నియంతృత్వ ప్రభుత్వానికి ఆయన వ్యతిరేకి. బానిసలఎడ ఆయనకు అమితమైన సానుభూతి. ఆత్మగౌరవంమీద నమ్మకం ఎక్కువ. గాంధీజీ సైతం ఆయన శాస్త్రీయపరిజ్ఞానాన్ని అమితంగా మెచ్చుకున్నారు. భారతప్రజల స్వాతంత్ర్య సమరంఎడ ఆయన ఎంతో ఆసక్తిని కనబరిచారు.

ఐన్‌స్టీన్ అతి నిరాడంబర జీవితాన్ని గడిపారు. వైలిన్, పియానో సంగీతంలో ఆయనకు ప్రవేశం వుంది. మతం, శాస్త్ర విజ్ఞానాలమధ్య సమన్వయాన్ని ఆయన కోరేవారు. "మతంతో ప్రమేయంలేని శాస్త్రవిజ్ఞానం మనగలగడంకల్ల, శాస్త్రవిజ్ఞానంతో ప్రమేయంలేని మతం ఒకవిధంగా గ్రుడ్డిదే"అనిఅన్నారు ఆయన.

మహాత్ముల అడుగుజాడలలో నడుద్దాం, అభ్యుదయాన్ని సాధిద్దాం

పండుగలూ పర్వదినాలూ

హోలికోత్సవం

హోలికా పూజా విధానం పురాణాలలో చెప్పబడింది. ఎండు కర్రలు, పిడకలు మొదలైనవి తెచ్చి కుప్పవేసి దాని మధ్య ఒక చెట్టుకొండాన్నికాని, కొమ్మనుకాని ప్రతిష్ఠించి నిప్పు అంటించాలి. ఆ నిప్పు హరిజనుల ఇళ్లనుంచి కాని, బాలెంత యింటినుంచి కాని బాలల చేత తెప్పించాలనికూడా విధింపబడింది. ఈ హోలికాపూజ ఢుంఢా రాక్షసి పీడను పరిహరించడానికని చెప్పబడింది.

అస్పృశ్యులను స్పృశించాలని, అస్పృశ్యుల యిళ్లనుంచీ, బాలెంతల యిళ్లనుంచీ నిప్పుతీసుకొని రావాలని విధించడంవల్ల అంటుసొంటుల అలవాటులు పక్కకు నెట్టే చక్కని ఆచారం ఈ పండుగలో కనిపిస్తోంది.

ఈనాడు నవాన్నేష్టి యజ్ఞంగా కూడా పరిగణింపబడుతూ ఉంది. గోధుమలు మొదలైన కొత్తగా పండిన ధాన్యాలు మొదట యజ్ఞంచేసి భగవంతునికి అర్పించాలని ఉద్దేశం. అడవినుంచి కొమ్మలతో సహా కొట్టి తీసుకొనివచ్చి చెట్టును గంధాదులతో పూజించి గ్రామం పడమటిదిక్కున పాతుతారు. ఈచెట్టును యజ్ఞ స్తంభంగా పరిగణించాలి అంటారు.

శిశిరం క్షీణించి వసంతం అంకురించే సమయంలోవస్తుంది హోళీపండుగ. శీతకాలంలో వృద్ధిపొంది పేరుకుపోయిన కఫం వసంతంలో సూర్యతేజస్సువల్ల ప్రకోపించి శరీరాన్ని బాధిస్తుందని ఆయుర్వేదం చెప్తుతోంది. హోలీలో చల్లుకొనే వసంతమూ, బుగ్గంది మొదలైనవి కఫాన్ని ఉద్రిక్తపరుస్తాయి. వసంతం రాక ముందు శిశిరాంతంలోనే కఫాన్ని ఉద్రిక్తపరిచి నివారించడం మంచిది. లేకపోతే వసంతంలో కఫం మరీ తీక్షణమై రోగాలు వస్తాయి.

ఉగాది

ఉగాది అంటే సంవత్సరాది. అన్ని ఋతువులూ దేనిలో వసిస్తాయో అది సంవత్సరం అని వ్యుత్పత్తి. అన్ని ఋతువులూ ఒక్కసారి సమాప్తమైపోయి వాటి పునరావృత్తి ప్రారంభం ఐనప్పుడు ఒక సంవత్సరం అంతమై ఇంకొక సంవత్సరం మొదలవుతుందన్నమాట

ఐతే సంవత్సరం ఏ ఋతువునుంచి ప్రారంభిస్తే సముచితంగా ఉంటుంది? వసంతఋతువుతో ప్రారంభించడం సమంజసం. ప్రాణులు సుఖంగా ఉండేసమయం అని వసంతానికి వ్యుత్పత్త్యర్థం. అందుచేత కొత్తగా సంవత్సరంవసంతంలో ప్రారంభం చేసుకోవడం యుక్తమే.

వసంతం సకలఋతురాజంఅని అడిదంసూరకవి వర్ణించాడు. బాటసారుల నిట్టూర్పుల వేడిమిని చూపి వేసవి వినయంతో భజింపగా, మకరంద ధారల నెపంతో జడివాన కురిపించి వర్షఋతువు సేవింపగా, వికసించిన పుష్పాల తెల్లదనాన్ని కనబరిచి శరదృతువు కొలుస్తూఉండగా, మలయ పవన మిషతో శైత్యాన్ని సమర్పించి హేమంతం సామంతం కాగా, శుకపికాల రెక్కలతో ఎగరగొట్టబడిన పుష్పరజ రూపంలో హిమబిందువులను కప్పంగా ఇచ్చి శిశిర ఋతువు ఆశ్రయింపగా వసంతం సకల ఋతురాజమై ఒప్పుతుంది అని కవి చమత్కరించాడు.

చైత్రశుద్ధ పాడ్యమినాడు ఉగాది. ఈ తిథినాడే బ్రహ్మ సృష్టికార్యం ప్రారంభించాడట. కృతయుగారంభంకూడా ఈ నాడే జరిగింది. ఈనాడు ఆరోగ్యవ్రతమూ, సూర్యధ్యానమూ, విద్యావ్రతమూకూడా చెప్పబడ్డాయి. చైత్రశుద్ధపాడ్యమి కల్పాదులలో ఒకటి. ఉగాదినాడే వసంత నవరాత్రి ప్రారంభంకూడా. చలివెందరలు అప్పుడే పెడతారు.

జీవితానుభవం షడ్రసోపేతంగా ఉంటుందనడానికి చిహ్నంగానే ఆనాడు వేపపూవుపచ్చడి తింటాం. లేతవేప ఆకులూ, పువ్వులూ చూర్ణంచేసి అందులో మిరియాలు, లవణం, ఇంగువ, జీలకర్ర, వాము కలిపి తింటే రోగశాంతి అవుతుంది. ఇందులో ప్రతి వస్తువు రోగ నివారణ గుణంకలదే. వేపఆకు నేత్రాలకు మంచిది. క్రిములు, పిత్తం, విషాన్ని హరిస్తుంది. అరుచినీ కుష్ఠరోగాన్నీ పోగొట్టుతుంది. మిరియాలు ఆకలిని పెంచుతాయి. క్రిములను హరిస్తాయి. లవణం ఆకలి పుట్టిస్తుంది. జీర్ణశక్తి వృద్ధి చేస్తుంది, వీర్యవృద్ధిచేస్తుంది. వాత పిత్త కఫదోషాలను హరిస్తుంది. ఇంగువ జీర్ణశక్తిని ఇస్తుంది. వాతకఫాలను పోగొట్టుతుంది. మలమూత్ర బంధరోగాలను పోగొట్టుతుంది. ఇట్టి ఆరోగ్యదాయకమైనపచ్చడి సేవించడంతో కొత్తసంవత్సరంలో అడుగు పెట్టడం ఎంతమంచిది!

శ్రీరామ నవమి

శతకోటి ప్రవిస్తరమైన రామచరిత్రలోని ఒక్కొక్క అక్షరమూ మహాపాతక నాశనం అంటే ఆ చరిత్ర ఎంత పవిత్రమైనదన్నమాట!

శ్రీరాముడు పూర్ణపురుషుడు. ఆయన గుణాలలో ప్రతి ఒక్కటీ మానవుడైనవాడు అనుకరింపదగదే. పూనికతో, సాధనతో ఆ గుణాలు మానవులు సిద్ధింపజేసుకోవచ్చునని నిరూపించడానికే రాముడు ఆదర్శ ప్రాయుడయ్యాడు.

లోకారాధనకోసం ప్రాణసమానమైన భార్యను మహాపతివ్రత ఐన సీతమ్మను పరిత్యజించాడు. అశ్వమేధయాగం చేసినప్పుడు ద్వితీయపత్నిని పరిగ్రహించడం దోషంకాకపోయినా

అలా చేయక సువర్ణసీతామూర్తిని నెలకొల్పి ఆ యాగం పరిసమాప్తి చేసిన ధర్మజ్ఞుడు.

“తెలిసినకాని తెలియకకాని తల్లులకు కాని తండ్రికికాని అప్రియమైన వాక్యం ఒకటికూడా చేసినట్లు గుర్తులేదు” అన్నాడు ఎంతటి మాతాపితృభక్తి!

నిషాదరాజు శృంగబేరి పురంలోకి రమ్మని రాముణ్ణి ఆహ్వానించినప్పుడు ఆయన పట్టణంలో ప్రవేశించడానికి నిరాకరిస్తాడు. తమసానది ఒడ్డున విడిదిచేసిన రామునికి భక్ష్యభోజ్యాదులు, రమణీయశయ్యలు అర్పించడానికి తెచ్చాడు గుహుడు. తాపస ధర్మం నిర్వహిస్తున్న రామచంద్రుడు ఎట్టి భోగ్యవస్తువునూ స్వీకరించలేదు. ఏమి నియమపాలనం!

శ్రీరాముడు అత్యంత వినమ్రుడై పలుమార్లు ప్రణామం చేసి భవిష్యత్తులో రాబోయే పాలకులందరికీ విజ్ఞాపన చేశాడు ''నాచే నిర్మింపబడిన ఈ ధర్మ సేతువును రక్షించండి'' అని.

శ్రీరామ నవమినాడు లోకోత్తరగుణ నిధి ఐన ఆ అవతారమూర్తి గుణగానం సకల శుభదాయకం.

మొహరం

మొహరం ముస్లిమ్ పంచాంగరీత్యా మొదటినెల. ఆనెల మొదటి పదిరోజులను కూడా మొహరం అంటారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హుసేన్ దారుణ మరణానికి జ్ఞాపకార్థంగా సంతాపాన్ని ప్రకటించే రోజులు అవి.

మహమ్మద్ ప్రవక్తనిర్యాణం చెందిన తరువాత నలుగురు ఖలీఫాలు అయ్యారు.ఖలీఫాలంటే మతాధిపతులు. నాల్గవ ఖలీఫా అలీ. ఆయన మహమ్మద్ప్రవక్తఅల్లుడు, అలీ హత్యచేయబడ్డాడు.ఆయన పెద్ద కుమారుడు హసన్ ఖలీఫాఅయ్యాడు. ఐతే హసన్త్వరలోనే పదవీత్యాగం చేయవలసి వచ్చింది. మువావియా అనేవ్యక్తి ఇస్లామ్ మతపీఠాధిపతి అయ్యాడు. మువావియా మరణానంతరం అలీరెండవ కుమారుడు హుసైన్ ఖలీఫా కావాలని ఒడంబడిక కుదిరింది. కొద్దికాలానికి హసన్ విషప్రయోగంవల్ల చనిపోయాడు.

మువావియా 680లో చనిపోయాడు. ఒడంబడికకువిరుద్ధంగా అతని కుమారుడు యజీద్ తాను ఖలీఫానని ప్రకటించుకున్నాడు. హుసైన్, యజీద్ అధికారాన్ని గుర్తింపలేదు. కూఫానగరవాసులు హుసైనుకు వర్తమానం పంపారు. తమను యజీద్ దౌష్ట్యంనుంచి రక్షింపమన్నారు. కూఫాకు బయలుదేరివస్తే తాము హుసైన్కు సహాయం చేస్తామన్నారు.

హుసైన్ బయలుదేరివచ్చాడు. ఆయనకు సహాయం చేసేవాళ్ళు ఎవరూ కనబడలేదు. ఆయన సకుటుంబంగా వచ్చాడు. ఏదో ద్రోహం జరిగిందని గ్రహించి యూఫ్రిటీస్ నది పడమటి గట్టున కర్బలామైదానంలో విడిది చేశాడు. యజీద్ సైన్యం ఆయనమీద విరుచుకు పడింది.శత్రువుల బలం నాలుగువేలు. హుసైన్ పరివారం ముప్పయి ఇద్దరు అశ్వికులు, నలభై మంది కాల్బలం. లొంగిపోవడంకానిలేక చనిపోవడంకాని ఇంకేమార్గమూకనపడలేదు. తన తోడివారిని వెళ్లిపొమ్మన్నాడు హుసైన్. తాత గారికి మేము విచారణదినంనాడు ఏమని సమాధానం చెప్పగలం?” అంటూవారందరూ హుసైనును విడిచిపెట్టడానికి నిరాకరించారు.

అది యుద్ధమా? వందమందికూడా లేని హుసైన్ పరివారం మీద నాలుగువేలమంది అత్యాచారమా? ఘోరాతిఘోరమైన సంఘటన. ఆ మహాయోధులు ఒకరి తరువాత ఒకరుగా నేలకు ఒరిగిపోయారు. హుసైన్, శిశుప్రాయుడైన ఆయన కుమారుడు మిగిలారు. ఆయన నేలమీద కూర్చున్నాడు. చంటిబాలుని తన చేతులలో పట్టుకొన్నాడు. ఒక బాణం వచ్చి పిల్లవానికి తగిలింది. బిడ్డప్రాణం పోయింది. శవాన్నిభూమిమీద పెట్టి “దేవుని నుంచి వచ్చాము. దేవుని దగ్గరికేతిరిగిపోతాము. ఈ ఆపదలను భరించేశక్తి ప్రసాదించుప్రభూ”అన్నాడు నీళ్ళుతాగడానికి వంగగా ఒక బాణం వచ్చి నోటిలో గుచ్చుకొంది. శత్రువులు ఆయనను నిర్దాక్షిణ్యంగా హతమార్చారు.

ఈ దారుణ మారణహోమాన్ని జ్ఞాపకి తెచ్చుకొని హృదయ విదారకంగా రోదించే పదిరోజులవేదనే మొహరం.

మహావీర జయంతి

క్రీస్తు పూర్వం 599 సంవత్సరం. ఆనాడు చైత్రశుద్ధ త్రయోదశి జ్ఞాతవంశీయుడైన సిద్ధార్థరాజు ధర్మపత్ని త్రిశలాదేవిగర్భంలో ఒకబాలుడు జన్మించాడు ఆయనే తీర్థంకర మహావీరుడు.

ఆ బాలునికి తల్లిదండ్రులు పెట్టినపేరు వర్ధమానుడు. వర్ధమానుడు క్షత్రియోచిత విద్యలను అభ్యసించాడు. యుక్తవయస్సులో యశోదాదేవితో వివాహం అయింది ఆమె సమర వీర నాముడైన నరేంద్రుని కుమార్తె.

భూతదయ, అహింసాసిద్ధాంతాలను మహావీరుడు బోధించాడు. వర్ణాది భేదాలు లేకుండా అందరికీ ఆయన ధర్మబోధ చేశాడు.రాజగృహం, శ్రావస్తి, వైశాలివంటి ప్రముఖ స్థానాలలో ఆయన చాతుర్మాస్యాలు జరిపాడు. వంగ మగధ విహార ప్రాంతాల ప్రజలు ఆయన శిష్యులయ్యారు. ఎందరో రాజేంద్రులు ఆయన ఉపదేశాన్ని స్వీకరించారు. ముప్పయి ఏళ్లపాటు జైనధర్మాన్ని ప్రచారం చేసి పావాపురిలో ఆయన నిర్యాణం చెందాడు.

ప్రపంచంలోని సర్వానర్థాలకూ రాగద్వేషాలే కారణం- వీనినుంచి తప్పించుకొని ముక్తిపొందడమే మానవుని ధ్యేయం కావాలి. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం వీటిని అవలంబించాలని, సాధనచేసి ముక్తిని పొందవచ్చునని మహావీరుడు బోధించాడు.

జి. కె.



గాంధీ మహాత్ముడు- సామాజిక పరిణామాలు

- జగ్జీవనరామ్

ఒక స్వతంత్ర జాతిగా రూపొంది రెండు దశాబ్దాలకుపైగా గడిచిన పిమ్మట వెనుదిరిగి చూసుకున్నప్పుడు, మనమింకా సంపూర్ణంగా సంఘటితులమవలేదనీ, మనమందరం ఏక కుటుంబ సభ్యులం, ఒకరి కొకరు కావలసినవారం అన్న భావం మనలో ఇంకా బలపడవలసి ఉన్నదనీ తోచకమానదు. సంప్రదాయ వ్యతిరేక ధోరణులు దీర్ఘకాలంపాటు వ్యాప్తిలో ఉండటం నుంచి, హిందూ మతావలంబకులలో విభిన్న వర్గాలను ఒకటిగా కలిపిఉంచే శక్తులు సన్నగిల్లాయి. హిందూ మతమన్నది ఈనాడు సమతా సూత్రాన్నీ, యావత్తు సమాజం పట్ల తమకు విధ్యుక్త ధర్మాలనేవి కొన్ని ఉన్నాయన్న భావాన్నీ ప్రజలలో పెంపొందింపవలసి ఉన్నది. రాజ్యాంగ చట్టం ద్వారా సంక్రమించిన ప్రాథమిక హక్కులు, వారసత్వానికి, వివాహానికి సంబంధించిన శాసనాలలో సంస్కరణలు, ఇంతకాలం అణగారి ఉన్న వర్గాలు ఆర్థికంగానూ, రాజకీయంగానూ పైకి రావటం వంటి వాటి మూలంగా, సమతా సిద్ధాంతం కొంత పుంజుకున్నది.

అడ్డుగోడలు

హిందూమత విశ్వాసాలలో ప్రధానమయిన కుల తత్వం అన్నది, విభిన్న వర్గాలవారు ఒకే సమాజంగా సంఘటితులవడానికి ప్రతిబంధకంగా తయారయింది. ఒకదానితో ఒకటి పొత్తు ఏదీ లేకుండా ఎడ ఎడంగా ఉంటూ, పంక్తి భోజనాలు కానీ అంతర్వివాహాలు కానీ లేకుండా, ఒకరికంటె ఒకరు అధికులమని భావిస్తూ గడిపే కులాలు అనేకం ఉన్నంతకాలం, సుసంఘటితమైన సమాజం ఏర్పడ జాలదు. కులతత్వం మూలంగా, ప్రజలలో తామంతా ఒకటే అన్న భావం మరుగున పడజొచ్చింది. అందుచేత కులాల బెడదను సడలించుకోలేక పోయినట్లయితే ప్రజలలో సోదర భావాన్ని పెంపొందింప జేయడానికి నూతన మార్గాలను అన్వేషించటం కష్టమవుతుంది. కాని ఆశ్చర్యమేమంటె, కుల వ్యవస్థను రద్దుచేయటం ఎంతో అవసరమే అనిపించినా, మతాన్నీ సంప్రదాయాలనూ బట్టి మనలందరినీ కలిపి ఉంచే శక్తులు కొన్ని సన్నగిల్లి పోవటంతో, ప్రజలు కులాలని పట్టుకు ప్రాకులాడవలసి వస్తున్నది. ఎన్నికల సందర్భంలో దాదాపు అన్ని రాజకీయ పక్షాలవారూ, అందరు రాజకీయవాదులూ కులవ్యవస్థను తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నవారే.

ప్రజలంతా ఏకజాతిగా నిలబడటానికి దోహదం చేసే అంశాలు హిందూమతంలో ఏ నాడైనా ఉన్నాయా? మన సంప్రదాయాలు ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థా స్థాపనకు అనుకూలమైనవేనా? ఈ సందర్భంలో మనం గతాన్ని స్థూలంగా పునశ్చరణ చేసుకోవచ్చు.

ఆదిలో విభిన్న వర్గాలవారు మనదేశంలో నివసిస్తూ ఉండేవారు. ప్రధానంగా పశువుల కాపరులైన ఆర్యుల సామాజిక వ్యవస్థలో మూడు వర్ణాలు ఉండేవి. శూద్రులను చేర్చటంతో ఆ సమాజం దరిమిలా 'చాతుర్వర్ణ్యం' అయింది. ఆర్యులు కాక, ప్రధానంగా పట్టణ వాసులైన నాగరికులు 'దస్యులు' అనేవారు ఉండేవారు. ఇంకా మరికొన్ని తెగలవారు కూడా నివసిస్తూ వుండేవారు.

క్రమంగా ఈ వర్ణాలనేవి గౌరవ ప్రతిష్ఠలకు కేంద్రాలుగా తయారైనాయి. కులాలంటూ రూపొందాయి. కొన్ని వర్గాలవారు ఇతరులపై పెత్తనం చేయటం మొదలయినది. చాతుర్వర్ణ్య సమాజంలో స్థానం పొందలేని కొందరు, గ్రామ పొలిమేరల్లో ఇతరులకు ఊడిగం చేస్తూ గడపవలసిన ఆచారం మొదలయింది.

కాయకష్టం చేయనవసరం లేని బ్రాహ్మణులు విద్యను సముపార్జించడానికి పూనుకున్నారు. తత్వశాస్త్రం, కర్మసిద్ధాంతం వంటివి రూపొందాయి. మానవ జీవితాన్ని చతుర్విధ ఆశ్రమాలుగా వర్గీకరించటం, కుల వ్యవస్థను కర్మ సిద్ధాంతంతో ముడి పెట్టడం, తద్వారా సమాజంలో 'అంతస్తుల' ను సర్వజనామోదయోగ్యం చేయచూడటం వంటివి జరిగిపోయాయి. ఈ ఊహలూ, సిద్ధాంతాలూ దేశంలో అన్నివర్గాలకూ, తెగలకూ వ్యాపించాయి. వాటిని అనుసరించి ఎన్నో సంప్రదాయాల్నూ, ఆచారాల్నూ, నమ్మకాలూ బయలుదేరాయి. ఆర్య, ద్రావిడ సంస్కృతులు రెండూ కాలక్రమేణా పెనవేసుకుని పోయి, దేశప్రజలందరిలోనూ ఉమ్మడి సంస్కృతి, నాగరికతలు ప్రస్ఫుటం కాజొచ్చాయి.

ఆయా వర్గాలను పురస్కరించుకుని కాలానుగుణంగా సమాజంలో చాలా మార్పులు కలిగాయి. వివాహాలు, ఆస్తిపాస్తుల

పంపిణీ, సంఘంలో కట్టుబాట్లు వంటి అనేక వ్యవహారాలలో ఎన్నో నియమ నిబంధనలు బయలుదేరాయి. తక్కువ కులాల పేరిట చెలామణి అయ్యేవారు ఇతరులకు ఎంతో దూరమైనారు. రకరకాల అనర్హతలకు గురి అయినారు.

వర్ణాశ్రమ ధర్మాలనేవి అమలులోకి వచ్చి వేర్వేరు వర్ణాల మధ్య తారతమ్యాలను పాటించవలసిన అవసరం ఏర్పడింది. బ్రాహ్మణులు ఏకాయెకి మోక్షానికి అర్హులైనప్పటికీ, క్రిందికులాల వారు మాత్రం కొన్ని జన్మలెత్తేవరకు అర్హులు కారన్న సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది.

ఇలాంటి నమ్మకాలూ, ఊహలూ సమాజంలో క్రమంగా జీర్ణించుకు పోయినాయి. ఇవన్నీ ఒకానొక సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశించి ఏర్పడినవే. ఆయా కులాల వారి యోగ్యతలనో లక్షణాలనో ఆధారంగా చేసుకుని రూపొందినవి కాదు. సమాజంలో ఒక విధమైన సుస్థిరతను సాధించడానికి ఉపకరించేవి. ఈ ఆచారాలూ నమ్మకాలూ దైవ దత్తమయినవేవీ కాకపోయినప్పటికీ వాటిని ఆ విధంగానే చిత్రించటం జరిగింది. అవి హిందూ ప్రజా జీవనంలో అంతర్భాగాలై పోయినై. గౌతమ బుద్ధుని మొదలు వివేకానందులవరకు ఎందరో జ్ఞానులు, సంఘ సంస్కర్తలు ప్రయత్నించినప్పటికీ మన సాంఘిక కట్టుబాట్లలో, నమ్మకాలలో గణనీయమైన మార్పు ఏదీ కలుగలేదు. సనాతన ధర్మ వ్యవస్థ పట్టు వీడలేదు. హిందూ సమాజంలో ఉన్న ఈ బలహీనతలే సామ్రాజ్యాల స్థాపనకు బహుశ దారితీశాయనవచ్చు.

మహాత్ముని అవతరణ

పరిస్థితులు ఈవిధంగా ఉన్న తరుణంలో నిరాడంబరుడూ వినయశీలుడూ, యోగిసదృశుడూ అయిన మోహనదాస్ కరమ్ చంద్ గాంధి, రంగంలో అడుగు పెట్టారు. పర పరిపాలన క్రింద మనం అణగారి ఉండటానికి మనలోని లోపాలే తప్ప బ్రిటిష్‌వారి ఆధిక్యత కారణం కాదని ఆయన గుర్తించారు. కుల వ్యవస్థ, ప్రాంతీయ దురభిమానాలు, సంఘంలో అన్యాయాలు, నిరక్షరాస్యత వంటి వాటివల్ల కలిగే బలహీనత లేమిటో ఆయన తెలుసుకున్నారు. ఆయన ఎంతో నిష్ఠగల హిందువు అయితే ఆయన అనుసరించే హిందూ మతం సంకుచితమైనది కాదు. ఆయన విషయంలో బోధలకూ ఆచరణకూ తేడా ఏదీ ఉండటానికి వీలుండదు. ఏపని అయినా త్రికరణ శుద్ధిగా చేసేవారు. ఆయన దృష్టిలో రాజకీయాలకూ, నీతి నియమాలకూ అవినాభావ సంబంధం ఉంది. ఆయన చెప్పిన ఏ విషయంలోనైనా చిత్తశుద్ధి ప్రస్ఫుటమవుతూ ఉండేది.

కొత్తకొత్త అనుభవాల దృష్ట్యా ఆయన తన ఊహలను సవరించుకుంటూ విస్తృతపరచుకుంటూ ఉండేవారు. ఆత్మసాక్షిగా వ్యవహరించేవారు. తోటి మానవుల పట్ల ఆయనకు గల ప్రేమాభిమానాలే ఆయన వైఖరిని తీర్చిదిద్దేవి. అవసరమని తోచినప్పుడు, వెనకటి తమ అభిప్రాయాలను, భావాలను సవరించుకునేందుకు ఎన్నడూ జంకేవారు కాదు. మానవసేవ ద్వారా దైవ సాక్షాత్కారం పొందాలని అభిలషించేవారు.

ప్రజల ఆర్థిక జీవనం, వస్తూత్పత్తి, వాణిజ్యం వంటి కార్య కలాపాల ప్రభావం, మొత్తం మీద రాజకీయాలపైనా సామాజిక జీవనంపైనా వ్యక్తమయ్యేమాట నిజమే అయినా ఆర్థికరంగమొకటే అత్యంత ప్రధానమైన దన్నవాదంతోమాత్రం ఆయన ఏకీభవించ లేదు. అహింసాసిద్ధాంతాన్ని కేవలం ఒక విధానంగా ఆయన స్వీకరించలేదు. హింసావాదం కంటె ఎంతో ఉపయోగకరమైనదని భావించడంచేతనే అహింసా విధానాన్ని అవలంబించారు.

ఈ శతాబ్దంలోని రెండు, మూడు దశాబ్దాలలో గాంధీజీ, మన ప్రజలను మరింతబాగా సంఘటిత పరచడానికి మార్గాన్ని అన్వేషించడంలో నిమగ్నులైనారు. మన దేశంలో వేర్వేరు భాషలుమాట్లాడే ప్రాంతాలకు మంచి చరిత్ర ఉన్నదనీ, ఎన్నో సంప్రదాయాలు యీ ప్రాంతాలలో వెలిశాయనీ యావత్తు దేశశ్రేయస్సు అతి ముఖ్యమైనదన్న విషయాన్ని ప్రతివారూ ఒకసారి గుర్తించాక, యిటువంటి వేర్వేరు భాషల వికాసానికి ఆయా ప్రాంతాల సాంప్రదాయాల పరిరక్షణకు అటు జాతీయవాదానికి మధ్యవైరుధ్యం ఏది ఉండనక్కర లేదన్నారు. జాతీయభాష భాషాప్రయుక్త రాష్ట్రాలు రెండూ దేశానికి అవసరమే అని భావించారు.

అంటరాని తనాన్ని నిర్మూలించటం ద్వారాకూడా దేశవాసులలో ఐక్యతనూ, భావసమైక్యతనూ పెంపొందించాలని ఆయన అభిలషించారు. జన్మతః మానవులంతా సరిసమానులే, అయితే పుట్టుకతోనే ఒక్కొక్కరి వైఖరి, అభిమతం, తత్వం, అభిరుచి ఒక్కొక్కరకంగా ఉంటుంది. మానసికంగా వారివారి స్థాయిలలో కూడా తారతమ్యాలంటూ ఉంటాయి. అలాంటప్పుడు సంఘర్షణ, పోటీ ద్వారా ఈ వ్యత్యాసాలు ఏవి ఏమిటో వర్గీకృతమయ్యేట్లు చూడడంకంటే చాతుర్వర్ణ్య వ్యవస్థనూ, వారసత్వాన్నీ, స్థితిగతులనూ చక్కదిద్ది సహజసూత్రంగా ఆమోదించడం మంచిదికాదా అని గాంధీజీ వాదించారు. ఇదే అంశాన్నిగురించి 'యంగ్ ఇండియా' 'హరిజన్' పత్రికల్లో పదేపదే ప్రస్తావించారు. అస్పృశ్యులను గురించి ఆయన ఇలాచెప్పారు.

"సాంఘికంగా వారు కుష్ఠురోగుల వంటివారు. ఆర్థికంగా వారి పరిస్థితి మరీ అధ్వాన్నంగావుంది. మతం బట్టిచూస్తే మనం దేవతాగృహాలనిపిలిచే స్థలాల్లోకి ప్రవేశించటానికి వారికి అర్హత లేదు.

ఈ అస్పృశ్యతను తుడిచిపెట్టకపోతే మనం ఈ భూమండలం నుంచే తుడిచిపెట్టుకపోతాము.

నాలుగు "వర్ణాలు" ప్రాథమికమైనవి, ప్రకృతి సిద్ధమైనవి. ఇవి అవసరంకూడాను. అయితే అసంఖ్యాకంగావున్న ఈ కులాలు, ఉప కులాలు, వదనంమీద వ్రణములవంటివి. మానవశక్తి పరిరక్షణకు సంబంధించిన ప్రకృతి నిబంధనలకు సరియైన ఆర్థిక సిద్ధాంతాలకు ఈ వర్ణ పద్ధతి అనుగుణంగా వుంటుంది. వ్యక్తుల సంస్కృతి వికాసాన్ని బట్టి వివిధ పద్ధతుల వర్గీకరణమే ఈ కుల వ్యవస్థ. సాంఘిక స్థిరత్వానికీ, అభివృద్ధి సాధనకూ ఇది ఉత్తమ మార్గం. ఒకవిధమైన జీవితాన్ని గడిపే వారిని ఒక వర్గంలో చేర్చటానికి దీనిలో ప్రయత్నం జరుగుతుంది. వారసత్వ సిద్ధాంతానికి ఇది అంటి పెట్టుకొనివుంటుంది. ఇది సాంస్కృతిక విధానం మాత్రం కావడంతో ఒకవ్యక్తికానీ, ఒక కుటుంబంకానీ తన జీవిత విధానాన్ని మెరుగు పరచ నిర్ణయించిన తర్వాతకూడా ఒకే వర్గంలో వుండవలసివచ్చినప్పుడు వారికి అన్యాయంజరుగుతుందని అనడానికి దీనిలో అవకాశంలేదు. సాంఘికజీవితంలో మార్పులు అతి మెల్లగా వస్తాయి. మార్పులకు అనుగుణంగా కొత్తవర్గాల యేర్పాటుకు కులవ్యవస్థలో అవకాశముంది. ఈ మార్పులు ప్రశాంతంగాను, సులభంగాను జరుగుతాయి. కులమన్నది ఆధిక్యతనుగానీ, హీనతను గానీ సూచించదు. వివిధ దృక్పథాలను, వాటికి అనుగుణంగావుండే జీవిత విధానాలను మాత్రమే అది తెలుపుతుంది. కులవ్యవస్థ అన్నది స్వయం సంస్కృతితాలూకు వివిధ విధానాల వర్గీకరణం మాత్రమే. కుటుంబ సిద్ధాంతానికీ, దీనికీ పోలికలున్నాయి. రెంటిలోనూ రక్త సంబంధాన్నీ, వారసత్వ సిద్ధాంతాన్నీపాటిస్తారు. ఆర్థిక విషయాల దృష్ట్యా దీనికి అధికంగా విలువుంది. జీవితంలో అదిపోటీని తగ్గించింది. దరిద్రుడు కాకుండా వుంటానికిఇది పరిష్కారమార్గం. ట్రేడ్ గిల్డ్స్ ఏర్పాటుకు దీనిలో అవకాశముంది. సాంఘిక సర్దుబాటుకు మానవుడు చేసిన ప్రయత్నం ఇది. దీన్ని మనం విజయవంతం చేస్తే ప్రపంచంలో నిర్దాక్షిణ్యమైన పోటీతత్వానికి పరిష్కార మార్గంగా దీన్ని మనం ప్రపంచానికి అందజేయవచ్చు.

వర్ణం అన్నది మానవ ప్రకృతిలోనేవుంది. హిందూమతం దాన్ని శాస్త్రంగా రూపొందించింది. కులమన్నదానికి ఇప్పుడు అపార్థం కల్పించ బడుతున్నది. ఈ అపార్థాన్ని తొలగించటానికి చేసే ప్రయత్నంలో మనం అసలు అర్థం పోయేట్టు చేయరాదు. ఇది మానవుడు కొత్తగా కనిపెట్టినదికాదు, మార్పులేని ప్రకృతి విధానం అది.

గాంధీజీ దృష్టిలో కులం

మహాత్మాగాంధీ 'వర్ణము' 'కులము' అన్న పదాలను ఒకే అర్థంలో ఉపయోగించారు. మానవులందరినీ స్థూలంగా నాలుగు వర్గాల క్రిందకు వర్గీకరించవచ్చునీ, బోధకులు, పరిరక్షకులు, సంపదవృద్ధి పొందించేవారు, కాయకష్టం చేసేవారు అన్నవే ఆ నాలుగు వర్గాలని ఆయన నమ్మకం.

కుల, 'వర్ణ' సిద్ధాంతాన్ని గురించి తన భావమేమిటో మహాత్మాగాంధీ వివరించి చెప్పారు. అస్పృశ్యతా నివారణ వెంటనే అవసరమని ఆయన భావించారు. మత ప్రాతిపదికమీద రాజ్యాంగాన్ని రూపొందించటానికిగాను రామ్సే మాక్డొనాల్ తయారుచేసిన పథకానికి నిరసనగా 1932 సెప్టెంబరు 20వ తేదీన మహాత్మాగాంధీ నిరాహారదీక్ష ప్రారంభించటం చారిత్రాత్మక సంఘటనగా పేర్కొనాలి. పూనాలో జరిగే చర్చలలో జాతీయ దళిత వర్గాలవారికి నేను ప్రాతినిధ్యం వహించవచ్చని తెలుపుతూ షహబాదులోని కాంగ్రెస్‌వారు మహాత్మాజీకి ఒక తంతి పంపారు. మా అన్న జబ్బు పడటంతో నేను వాటికి హాజరు కాలేకపోయాను. అయితే, నేను మహాత్మాజీకి కోపంగా ఉత్తరం వ్రాశాను. రౌండ్ టేబుల్ సమావేశంలోనే ఆయన సీట్ల రిజర్వేషన్‌ను ఆమోదించి నిరాహార దీక్షవలన కలిగిన ఈ బాధకు గురికాకుండా ఉండాల్సిందని ఆ ఉత్తరంలో వ్రాశాను. ఆ వేర్పాటు ఏవిధంగా జరిగినా అది హిందువులకు, అస్పృశ్యులకు ఉభయులకు నష్టమేనని గాంధీజీ భావిస్తారని ఆయన కార్యదర్శి నాకు సమాధానమిచ్చారు.

సీట్ల రిజర్వేషన్‌కు నిరసనగా తాను నిరాహారదీక్ష పూనటం లేదని ఆయన స్పష్టంచేసినప్పటికీ, సీట్ల రిజర్వేషన్‌ను ఆమోదించాల్సి వచ్చినందుకు ఆయన బాధ పడ్డారు. ఆయన ఆమోదించంది ప్రత్యేక నియోజక వర్గాలు. పూనా ఒప్పందంలో వాటికి పూర్తిగా స్వస్తిచెప్పబడినపుడు ఆయన సంతోషించారు. నిరాహార దీక్ష ఫలితంగా హిందువుల భావాలలో పెద్దమార్పు కనిపించింది. అస్పృశ్యతకు ప్రజామోదం పోయింది.

ప్రజల భావాలలో వచ్చినమార్పు ఫలితమే 1932 సెప్టెంబరు 30వ తేదీన అస్పృశ్యతా నివారణసంఘం యేర్పాటు. 'హరిజన్' అన్న క్రొత్త పదాన్ని గాంధీజీ సృష్టించింతర్వాత దానికి హరిజన్ సేవక సంఘ్ అన్న పేరుపెట్టారు. సవర్ణ హిందువులలో చాలా మందికి అసంతృప్తి కలిగింది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన ప్రారంభించబడింది. భారత ప్రభుత్వ చట్టంలో ఆ ఒప్పందాన్ని చేర్చకుండా అరికట్టటమే ఆ ఆందోళనల లక్ష్యం అయివుంటుంది.

నా విద్యార్థి దశనుంచి నేను నా తోటి కులస్తులకోసం పాటు పడుతునే వున్నాను. అస్పృశ్యత నివారణ అన్నది సాంఘిక, ఆర్థిక క్రమంలో పూర్తిగా మార్పు వచ్చినపుడుమాత్రమే వీలౌతుందని నేను ప్రచారం చేస్తునేవున్నాను. ఇంతవరకు కనీ వినని బ్రహ్మాండమైన విప్లవాన్ని-సాంఘిక, ఆర్థిక రాజకీయ విప్లవాన్ని-అది సూచిస్తుంది. బీహార్ అస్పృశ్యతా నివారణ సంఘం ప్రారంభోత్సవ సమయంలో ఉపన్యాసములు, నీతులు బోధించినపుడు నాకు కోపంవచ్చింది. సంస్కృతి మొదలగు విషయాలలో ఒకప్పుడు తమతో సమానంగా వున్న ప్రజలపై కనీ వినంతగా దురాగతాలు జరిపి వారిని బానిసలుగా తయారుచేసిన తర్వాత "మాంసం, మద్యం మానండి-శుభ్రతను అలవరచుకోండి" అని ఉపన్యాసాలివ్వటం వారిని మరీ కించపరచుటగా నాకు తోచింది. నేను కరకుగానే మాట్లాడాను. నేను అలా మాట్లాడటం అక్కడున్న వారికి ఆశ్చర్యమైంది. నేను చెప్పింది జాగ్రత్తగా

వింటున్న డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్, వాటినిగురించి ఆలోచించారు. ఇతరులవలే ఆయన విమర్శ చేయలేదు. కొంతకాలం బీహార్‌కు కూడా సహాయ పడమని ఆ తర్వాత ఆయన నన్ను కోరారు. కలకత్తా వెళ్లరాదని నేను నిర్ణయించటం ఇలా జరిగింది. అస్పృశ్యతా నివారణ సంఘానికి కార్యదర్శినయ్యాను. ఆ తర్వాత ఈ సంఘాన్నే హరిజన్ సేవక్ సంఘ్ అని పిలిచేవారు. బిహార్‌లో నా ప్రజా జీవితం ఇలా ఆరంభమైంది.

గాంధీజీ ప్రారంభించిన ఉద్యమం

విడుదల చేయబడిన తర్వాత గాంధీజీ, అంటరాని తనానికి వ్యతిరేకంగా 1933 ఆగస్టులో ఒక ఉద్యమం ప్రారంభించారు. హిందువులలో సానుభూతి పెంపొందించడానికిగాను ఇరవై ఒక్క రోజులు నిరాహార దీక్ష వహించారు. అయితే ఆయన ఆశించిన మార్పు రాలేదు. జనసమూహం 'గాంధీజీకి జై' అని ఆకాశం అంటేట్టుగా హర్షధ్వానాలు చేశారు. కానీ, వారిలో మార్పేమీ లేకుండానే ఇండ్లకు తిరిగి వెళ్లారు. దురభిమానులు కొందరు నల్లజెండాల ప్రదర్శనం యేర్పాటు చేశారు. సుమారు ఇదే సమయంలో గాంధీజీ హరిజనులను అవులుగా అభివర్ణించారు. అది దయాదాక్షిణ్యాలను అభ్యర్థించినట్టవుతుందని నేను ఆయనకు ఉత్తరం వ్రాయగా అదుంకు సమాధానంగా ఆయన, ఆవు అన్నది నమ్రతకూ బాధా, సహనానికీ చిహ్నమనీ, ఆ పదం వాడటంలో దురుద్దేశం ఏమీ లేదని వ్రాశారు. 1934 మార్చిలో గాంధీజీ బీహారులో పర్యటించ నారంభించినపుడు ఆయన వెంట నేను కూడా వెళ్లాను. భూకంపం వలన విపరీతంగా నష్టం సంభవించింది. ప్రజలను ఓదార్చుతూ, వారికి బోధిసూ ఆయన ఒక చోటు నుంచి మరో చోటికి వెళ్లారు. బక్సర్‌లో రాళ్లు రువ్వబడినాయి. సభను చెదరగొట్టటానికి ప్రయత్నం జరిగింది. అయితే, చెప్పుకోదగిన సంఘటన ఏది జరగలేదు. గాంధీజీని వ్యతిరేకించడానికిగాను ఒప్పందాన్ని ప్రతిఘటించేవారు నిలబెట్టిన కాశీపండితుడు శ్రీ లాల్ శాస్త్రి కోపం కలిగేటట్టుగా ప్రవర్తించారు. గాంధీజీ కారును ముందుకు కదలనివ్వరాదని కారుకు అడ్డంగా పడుకున్నారు. గాంధీజీ కారును ఆపి కాలి నడకన వెళ్లారు. ఆగ్రా, పాట్నాలలో కూడా కొంత ప్రతిఘటన ఎదురైంది. అయితే, రాళ్ళు రువ్వటం జరగలేదు. అయితే మేము రాత్రి 2 గంటలకు తియోఘర్ చేరుకునేటప్పటికి అక్కడ పరిస్థితి తీవ్రంగా వున్నది. ఆ ఒప్పందాన్ని బలపరిచేవారు, దాన్ని వ్యతిరేకించేవారు ఈరెండు బృందాలు స్టేషనుకు చేరుకున్నారు. చిన్న కొట్లాట జరిగింది. గాంధీజీ ప్రయాణం చేస్తున్న కారుకు వెనుకగావున్న కిటికీ అద్దం బ్రద్దలయింది. అయితే ఆయన ఏమాత్రం ఆందోళన చెందలేదు. ప్రశాంతంగా వున్నారు. సమావేశ స్థలానికి మరునాడు కాలినడకమీద వెళ్ళదలచినట్టు ఆయన శ్రీ బినోదానంద్ ఝూకు [ఆయన కూడా తియోఘర్ పండా పూజారీ యేను] చెప్పారు. గాంధీజీ ఒక నిర్ణయంచేసిన తర్వాత ఏపరిస్థితులలోనూ అది మారదు. మార్గానికి ఇరు ప్రక్కల వాలంటీరు బారులు తీర్చి నిలబడ్డారు. థక్కర్‌బాబా, బినోదానంద్‌ఝూ నేను వెంటరాగా మహాత్మాగాంధీజీ సమావేశస్థలానికి వెళ్ళారు. సమావేశం ప్రారంభమౌతున్న సమయంలో చిన్న కొట్లాట జరిగింది. గాంధీజీ అక్కడ వుండటం వలన ప్రయోజనం కలిగింది. చివరకు దుండగీండ్రు కూడా శాంతపడి, ఓర్పుతో కూర్చొని ఆయన ఉపన్యాసాన్ని జాగ్రత్తగా విన్నారు. 1935 జూన్‌లో భారత ప్రభుత్వ చట్టంలో, పూనా ఒప్పందాన్నికూడా చేర్చటంతో, ఆ ఒప్పందానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన అంత మెందినది. అయితే గాంధీజీ అస్పృశ్యతా నివారణ ఉద్యమాన్ని తాను బ్రతికున్నంతకాలం కొనసాగిస్తూనే వున్నారు.

గాంధీజీ ఉద్యమం మూలంగా సాంఘికంగా మరో ముఖ్యమైన సంస్కరణ కూడా జరిగింది. పర్దా పద్ధతి అమలులో వున్న ఉత్తర భారతావనిలో కూడా స్త్రీలు తండోపతండాలుగా ఆయన సభలకు హాజరయ్యేవారు. చాలా మంది ఆ ఉద్యమంలో పాల్గొని, జెయిళ్ళకుకూడా వెళ్ళారు. మనదేశంలో శాసనసభలోనూ, పార్లమెంటులోనూ వున్నంత మంది స్త్రీలు ప్రపంచంలో మరే దేశంలోనూ లేరంటే ఆ విధమైన మార్పు వచ్చినందుకు ఆ ఘనత చాలావరకు గాంధీజీకే దక్కుతుంది. అయితే ఆయన కుల వ్యవస్థను సాంతం దుమ్మెత్తి పోయలేదు. దానిలో కొన్ని మార్పులు తెచ్చినట్టయితే దానివలన హిందూమతం ఒక జాతిగా రూపొందటానికి అవకాశముంటుందని ఆరంభంలో ఆయన భావించారు. అయితే క్రమక్రమంగా ఆయన ఆశలు నిరాశలయ్యాయి. కుల వ్యవస్థ రూపుమాసి పోవాలన్న నిర్ణయానికి చివరకు ఆయన వచ్చారు.

అస్పృశ్యతను పూర్తిగా నివారించాలంటే కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెరికివేయాలని మరో సందర్భంలో ఆయన చెప్పారు. గాంధీ ఆశించినది ఇంకా పూర్తికావలసి వుంది. 1936 లో బీహార్‌లోని గోపాల్ గంజ్ వద్ద జరిగిన సమావేశంలో నేను, జాతీయ ఉద్యమంలో లోటుగా దేన్ని భావిస్తున్నానో దాన్ని గురించి వివరించి చెప్పాను. దృక్పథంలోనూ ఉత్సాహంలోనూ ఈ ఉద్యమం కేవలం రాజకీయమైందనీ, సంఘాన్ని పూర్తిగా మార్చటానికి వీలుగా అది అభివృద్ధి చెందిందనే ఉత్సాహం మొగ్గలోనే అంతరించి పోవచ్చనీ నేను చెప్పాను. ప్రాతిపదికగా అది సంపూర్ణమైన జీవితానికీ, ఉన్నత జీవితానికీ ఆకాంక్ష అని నేను ఉద్ఘాటించాను. సంస్కరణ అన్నది మార్పుకు మార్గం కాదని నేను భావించాను. నా ఉపన్యాసాన్ని అడిగి చెప్పించుకొని గాంధీజీ చదివి ప్రశంసించారు. గాంధీజీ భావాలలో మార్పు వచ్చినపుడు నాకు సంతోషమైంది.

అస్పృశ్యులకు సంబంధించిన సమస్యను తొలిగిస్తే మిగిలిన సమస్య ఆర్థికమైనదని సామాన్యంగా అందరూ తలస్తుంటారు. ఆర్థిక సమస్యను సక్రమంగా పరిష్కరించినట్లయితే మిగతా విషయాలను లెక్కచేయ నక్కరలేదన్న భావం కూడా వుంది. అయితే అది లోతుగా ఆలోచించి చేసే నిర్ణయం కాదని నాభావం. మనం అనుసరించే పద్ధతి సంఘటితమైందిగా వుండాలనీ, ఆర్థిక రాజకీయ సమస్యలన్నిటి విషయంలో మనం సమానంగా శ్రద్ధవహించాలనీ, సాంఘికసమస్యలను విస్మరిస్తే పై రెంటి వినాశానికే అది దారితీస్తుందనీ నేను భావిస్తాను. నేనుచెప్పేదికూడా అదే.

జీవితం అవిభాజ్యమైందన్న గాంధీజీ సిద్ధాంతం ఈ విషయంలో నా దృక్పథాన్ని బలపరచ గలదు.

ఐక్యతా భావం

ఈ రోజున కులతత్వం రాజకీయ జీవితంలో ఎంతగా చొరబడిదంటే, మన ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం సంభవించే పరిస్థితి యేర్పడింది. అయితే ఈ ప్రమాదాన్ని ఎవరూ గుర్తించినట్టు కనిపించటం లేదు. వినాశకరమైన ఈ పద్ధతికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో జాతి నైతిక, ఆధ్యాత్మిక వనరులన్నిటినీ సంఘటిత పరచటం అవసరం. ఈ కుల, ప్రాంతీయ అభిమానాలకు మించిపోయేట్టుగా ఐక్యభావం పెంపొందాలి.

హిందూ సాంఘిక క్రమంలో సమూలంగా మార్పులు తీసుకురావటంలో గాంధీజీ విజయులు కాలేక పోయారు. అట్టి మార్పులు తీసుకు రావాలని ఆయన కోరలేదు. అందుకు పాటుపడ లేదుకూడాను. అయితే ఆయన అస్పృశ్యులను విమోచనా మార్గంలోకి తీసుకు రాగలిగారు. హిందువులు కొత్త భావాలను కొత్తదృక్పథాన్ని అలవరచు కున్నపుడే నూతన క్రమానికి నాంది ప్రస్తావన జరుగుతుంది. అయితే హిందువులలో ఈ మార్పు రావటానికి దీర్ఘకాలం పట్టక తప్పదు. వర్గ సమస్యను కుల సమస్యనుంచి విడదీయలేము. అయితే కాలం పరుగెత్తుతున్నది. ప్రజాస్వామ్యం వలన ప్రజలందరూ సమానంగా ప్రయోజనం పొందటానికి గాను భారీ ఎత్తున చర్యలు అవసరం. గాంధీజీ భావాలలో చాలా భాగం ఈ నాటి పరిస్థితులకు అనుగుణంగా లేవు. అయితే ప్రజల నడవడిలోమార్పు తీసుకురావడానికి నైతిక బలాన్ని వినియోగించటంఅన్నది ఇప్పటికీ వర్తిస్తుంది.

(డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ సంపాదకత్వం క్రింద న్యూఢిల్లీలోని గాంధీ పీస్ ఫౌండేషన్ ప్రచురించిన, మహాత్మాగాంధీ 100 సంవత్సరాలు అన్న గ్రంథం నుంచి; కాపీరైట్ గాంధీపీస్ ఫౌండేషన్)

నాటి గాంధీ సాహిత్యం



కత్తులులేవు శూలములు గాండివమున్ మొదలే శక్కి నో
రెత్తి ప్రచండ వాక్పటిమనేనియు జాటడు, వైరిమీద దం
డెత్తగ లేనెలేదు, బలహీనము కాయము, కోపతాపముల్
బొత్తిగ సున్న అట్టిపరమూర్తి, మనోబలశాలి గాంధి చే
యెత్తి నమస్కరించి స్మరియించెద మెప్డు స్వరాజ్యసిద్ధికిన్,

—దామరాజు పుండరీకాక్షుడు.

తరి గాంధీ యుగమేగుదెంచెనిక నేతద్భారతీయ స్వరా
జ్యరథంబాతని సారధిత్వమున వేసారింపుడంచున్ ప్రజా
గురు డీతండె స్వతంత్ర మిచ్చునని యుద్ఘోషించు తూర్యధ్వనుల్
ఉరుతద్దివ్యరథంబు లాగుటకు రండో భారతీయ ప్రజల్.

—బలిజేపల్లి లక్ష్మీకాంతకవి.

చరిత్రాత్మకమైన దండియాత్ర



శాసనోల్లంఘన జరిపి, ఉప్పు తయారు చేసేందుకై గాంధీ మహాత్ముడు 1930 మార్చి 12వ తేదీన దండి యాత్ర ప్రారంభించారు.

సరిగా ముప్పయితొమ్మిది సంవత్సరాలక్రితం, మార్చి 12వ తేదీన, చరిత్రాత్మకమైన దండియాత్రకు ఉపక్రమిస్తూ గాంధీజీ అమర్‌నాథ్‌కో, బదరీ-కేదార్‌నాథ్‌లకో యాత్రవెళ్తున్నట్లుగాఉంది" అన్నారు. అవును, ఆయనదృష్టిలో అది ఒక తీర్థయాత్రే.

సమాజంలో ఆ పేదవర్గాల వారి ఇక్కట్లను అధికారుల దృష్టికి తెచ్చేందుకై, డెబ్బయ్ ఎనమండుగురు అనుచరులను వెంటబెట్టుకుని ఆయన ఈ యాత్రజరిపారు. ఉప్పు తయారు చేయటమన్నది, కేవలం, తమ మనోభావాలను వెల్లడించేందుకు ఉద్దేశించిన చిహ్నం మాత్రమే. "స్వరాజ్యఉద్యమమన్నది ఈ దేశంలో అతి పేదవారికోసమని ప్రధానంగా ఉద్దేశించినది కనుక అందుకు ఈ విధంగానే ప్రారంభోత్సవం జరుగుగాక- అన్నారు గాంధీజీ. దేశంలో వేలాదిజనం, క్రమశిక్షణతో తమను అనుసరించి, వారుచేసేపనికి ఎలాంటిదండన అనుభవించవలసి వచ్చినా అందుకు సిద్ధంగా ఉండగలరని ఆశిస్తున్నామనికూడా అన్నారు.

వాలంటీర్లకు షరతులు

శాంతియుతమైన ఈ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు, సబర్మతి ఆశ్రమానికి షుమారు రెండువందల మైళ్ళదూరంలోఉన్న ఒక అనామకమైన ప్రదేశం "దండి"ని ఎన్నిక చేశారు గాంధీజీ. తనతోపాటు వెళ్ళదలచిన వాలంటీర్లకు ఒకేషరతు విధించారాయన. ఆశ్రమ వాసానికి, అక్కడి క్రమశిక్షణకూ అలవాటుపడినవారూ, మనోవాక్కాయ కర్మలా సత్యాహింసలను పాటించేవారూ మాత్రమే ఈయాత్రలో పాల్గొనేందుకు అర్హులు.

మొదట్లో స్త్రీ వాలంటీర్లనుకూడా చేర్చుకున్నారు కాని, దరిమిలా, ఆయన, తన అభిప్రాయం మార్చుకున్నారు. "స్త్రీలను ముందు ఉంచే పక్షంలో, ప్రభుత్వంవారు, మాఅందరిపైన మామూలుగా విధించదలచిన దండనను విధించేందుకు వెనకాడవచ్చు'' అని అందుకు కారణం చెప్పారు.

పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కచ్, సింధు, కేరళ, రాజపుటాన్, ఆంధ్ర, కర్ణాటక, బొంబాయి, తమిళనాడు, బీహార్, బెంగాల్, ఉత్కళ, నేపాల్, ఫిజీలకు చెందిన డెబ్బయి ఎనమండుగురు మొదటిజట్టు వాలంటీర్లుగా చేరారు. వారందరిలో చిన్నవానివయస్సు 16 సంవత్సరములు, పెద్దవాని వయస్సు 61 సంవత్సరములు. ఈ వాలంటీర్లలో ముస్లిములు ఇద్దరు, ఒక క్రైస్తవుడు ఉన్నారు. మిగిలినవారు హిందువులు, వారిలో ఇద్దరు హరిజనులు.

సంకల్ప శుద్ధిఉండి, సబబయిన ధ్యేయసాధనకై సన్మార్గాలను, విధానాలను అవలంబించే పక్షంలో భగవంతుడు తప్పక మనలను దీవించి తీరుతాడు అన్నారు గాంధీజీ. ఈ మూడు అంశాలు ఒకేసందర్భంలో తటస్థపడినప్పుడు, ఇక పరాజయమన్నది అసంభవమని విశ్వసించారు. సత్యాహింసలనూ, అంతర్వాణినీ విస్మరించినప్పుడే నిజమయిన సత్యాగ్రహికి పరాజయం అని ఆయన అభిప్రాయం.

మార్చి 12వతేదీ ఉదయం గం. 6.30లకు చరిత్రాత్మకమైన దండియాత్ర మొదలయింది.

యాత్ర వివరాలు

ఈ యాత్రను, జవాహర్‌లాల్ నెహ్రూ అతి వివరంగా వర్ణించారు. 'స్థిర సంకల్పంతో, ఏమాత్రం తొట్రుపాటు లేకుండా, చేతితో కఱ్ఱపట్టుకుని, గుజరాత్‌లో దుమ్ము రేగే రోడ్లమీదుగా నడక సాగించారాయన. ఆయనపట్ల అచంచలమైన భక్తి నమ్మకాలు గల అనుచరబృందం వెంటనడిచారు. లోగడ ఆయన ఎన్నో యాత్రలు జరిపారు ఎన్నో రోడ్లమీదుగా సాగివెళ్లారు. అయితే ఈ వరకు తలపెట్టిన యాత్రలన్నిటికంటె ఇది సుదీర్ఘమైనది. దారిలో అవరోధాలుకూడా ఎక్కువే. అయితే ఆయనది వజ్ర సంకల్పం. దౌర్భాగ్యస్థితిలో ఉన్న తోటి భారతీయులపట్ల ఆయనకుగల ప్రేమాభిమానాలు అనన్య సామాన్యమైనవి. సత్యాన్వేషణమే ఆయనకు వెలుగు, స్వాతంత్ర్యాభిలాషే ఆయనకు ఉత్తేజం. ఆయనను సమీపించినవారెవరైనా సరే సమ్మోహితులు కాకతప్పదు. సామాన్యులైనవారు నవచైతన్యం పొందుతారు. ఆయన ప్రారంభించి యాత్ర సుదీర్ఘమైనది. భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించి, లక్షలాది ప్రజలను, పరాయివారు తమస్వప్రయోజనాలకై అన్యాయంచేసే పద్ధతిని అంతమొందించటమే ఈ యాత్రలక్ష్యం".

రోజల్లా పదిమైళ్లో ఇంకా ఎక్కువదూరమో నడిచేవారు గాంధీజీ వారి మొదటి మజిలీ అస్లాలీ అనేచోట. మార్చి 13వ నవగాం అనేచోటా, 14 వ తేదీ వాస్నా అనే ఊళ్లోనూ, 15వ తేదీన నదియాద్ అనే ఊళ్లోనూ వారుబసచేశారు. ఒకచోటి నుంచి మరోచోటికి నడకసాగిస్తూనే ఉన్నప్పటికీ, మామూలు ప్రకారంగా ప్రార్థనలూ, సూత్రయజ్ఞం, ఆరోజు సంఘటనలనూ, అనుభవాలనూ డైరీలో వ్రాసుకోవటం మాత్రం, యధావిధిగా సాగిపోతూఉండేవి. ఆయనేకాదు. ఆ యాత్రలో పాల్గొన్న వారందరూ ఈ పనులు చేయవలసిందే సోమవారాలు విశ్రాంతి దినాలుగా పాటించేవారు.

మార్చి 18వ బొర్సాద్ అనే ఊరినీ, ఆమర్నాడు కనక్‌పుర అనే గ్రామాన్నీ చేరుకున్నారు గాంధీజీ. ఆదేరోజు సాయంకాలం ఒక చిన్న పడవలో నదిదాటి, ఆ రాత్రికి అవతలి గట్టున విశ్రమించారు వందమైళ్లు నడిచాక, పదవ రోజున, ఈ బృందం, గజ్రా అనే ఊరు చేరుకున్నది. అంటే, సబర్మతి నుంచి దండికి సగం దూరం సాగారన్నమాట.

మార్చి 26వ తేదీన బరోచ్ పట్టణంలోనూ, 29వ తేదీన భర్‌గంలోనూ ఆగి, ఏప్రిల్ 1న సూరత్ చేరుకున్నారు. తపతీ నదీ తీరాన 80,000 మంది సమావేశమైన బ్రహ్మాండమైన బహిరంగసభలో ఉపన్యసించారు గాంధీజీ.

ఏప్రిల్ 6వ తేదీన ఈ బృందం, తమ గమ్యస్థానమైన దండి చేరుకున్నది. 241 మైళ్ళ దూరాన్ని 24 రోజుల్లో ముగించారు ఈ సత్యాగ్రహులు. మరునాటి ఉదయం ప్రశాంతగంభీర వాతావరణంలో ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనానంతరం ఉపన్యసిస్తూ గాంధీజీ, తమను బ్రిటిష్ ప్రభుత్వంవారు అరెస్టుచేసే పక్షంలో మొదట అబ్బాస్ తయ్యబ్‌జీ, ఆ తర్వాత శ్రీమతి సరోజినీ నాయుడు ఈ ఉద్యమాన్ని నడపగలరని ప్రకటించారు.


ప్రార్థనా సమావేశం కాగానే, సహచరులతోపాటు గాంధీజీ, సముద్రంలో స్నానంచేసేందుకు వెళ్లారు గం. 8.30లకు క్రిందకువంగి ఉప్పుగడ్డను చేతులతో పైకి తీశారు. చట్టరీత్యా ఇది నిషిద్ధమైనపని. ఒక బ్రహ్మాండమైన ప్రజోద్యమానికి ఆ విధంగా నాంది ప్రస్తావన జరిగింది. వేలాది భారతీయులు ఆ చరిత్రాత్మకమైన దృశ్యాన్ని తిలకించారు.


జాతి యావత్తు ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఈ ఉద్యమంతో ప్రమేయం పెట్టుకోనివారుకూడా విదేశీ వస్త్రాలను బహిష్కరించాలనీ, చేతితో వడికి నేసిన ఖద్దరు వస్త్రాలను ధరించవలసిందనీ సలహా ఇచ్చారు. మద్యపానాన్ని నిషేధించవలసిందిగా కూడా హితవు చెప్పారు.

మహిళల పాత్ర


తమ సలహాపై పురస్కరించుకుని స్త్రీలు దండియాత్రలో పాల్గొనకపోయినప్పటికీ, దేశ స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు వహించవలసిన పాత్రఏమిటో గాంధీజీకి తెలియకపోలేదు. "స్వాతంత్ర్య సముపార్జనకు పురుషులకంటె నిజానికి స్త్రీలే హెచ్చుగా తోడ్పడగలరని" తమకు అంతకంతకు బాగా నమ్మకం చిక్కుతుందని ఈ యాత్రపూర్తికాగానే ఆయన అన్నారు. అహింసా విధానాన్నీ సూత్రాన్నీ పురుషులకంటె స్త్రీలే సరిఅయిన విధంగా అన్వయించగలరన్నారు. ఇందుకు కారణం పురుషులు అహంభావంతో అనుకున్నట్లుగా, స్త్రీలు అబలలుకావటం కారణం కాదనీ, సరిఅయిన ధైర్యం అన్నది వారికే హెచ్చుకావటమూ, స్వార్థ త్యాగ శీలత వారిలోనే అమితంగా ఉండటమూ కారణమనీ చెప్పారు.

గాంధీజీ తలపెట్టిన ఉద్యమం, ప్రచండమారుతమై దేశమంతటా వీచింది. చాలా వింత పరిస్థితులలో మే 4వ తేదీ పగలు 12-45లకు. గాంధీజీ అరెస్టు అయినారు పిస్తోళ్లు ధరించిన ఇద్దరు ఆఫీసర్లనూ, తుపాకులు చేతబట్టుకున్న పోలీసులు దాదాపు ముప్పయిమందినీ వెంటపెట్టుకుని సూరత్ జిల్లా మెజస్ట్రేటు దండికి మూడుమైళ్ల దూరాన కారడి అనేచోట ప్రశాంతమైన శిబిరంలోకి నిశ్శబ్దంగా, అకస్మాత్తుగా ప్రవేశించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వ్యవధి నివ్వవలసిందిగా గాంధీజీ కోరారు. అవి కాగానే, తమబృందంలోని వారందరికీ, పేరుపేరు వరుసనా ప్రేమపూర్వకంగా వీడ్కోలు చెప్పారు. మధ్యాహ్నం ఒంటిగంటా పది నిమిషాలకు గాంధీజీని లారీలో ఎక్కించుకుని, యెరవాడ సెంట్రల్ జైలుకు ప్రయాణమైనారు.





చూచినంత మేర భూముల పచ్చని పంట
మనసుకి కలిగిస్తుంది సంతోషపు విలువ
పోగొడుతుంది కడుపులోని ఆకలి మంట
అది కూపర్ డీసెల్ పంపుసెట్లు చలవ



కూపర్ డీసెల్ పంపుసెట్లు

వర్టికల్ ఇంజిన్స్: 3.5-15 బి.హెచ్.పి.
హారిజాంటల్ ఇంజిన్స్: 5-40 బి.హెచ్.పి.
కూపర్ ఇంజినీరింగ్ లిమిటెడ్

Shilpi CE 7/80 Tel

సీరియల్

తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు. పెద్దవాడు సత్యం శాంతినికేతనం వెళ్ళి చిత్రలేఖనం నేర్చుకొచ్చాడు. చిన్నవాడు సూర్యం పట్నంలో డాక్టరీ చదువుతున్నాడు. మేనమామకూతురు సరళ చిన్నప్పటినుంచీ వాళ్ళింట్లోనే వుంటున్నది. పెదబావ అంటే సరళకు యిష్టం. అయితే పెద్దబావ చిన్నబావలాగ ఎప్పుడూ తన అందాన్ని గురించి పొగడడని సరళకు కోపం. తమ ఇంట్లో బట్టలు ఉతికే మాణిక్యం పాటైనా తను చెయ్యకపోయినందుకు ఆమెకు బాధ కలిగింది.

మాణిక్యాన్నిగూర్చి సరళ అభిప్రాయం విన్న సత్యానికి నవ్వొచ్చింది.

సత్యం పెదవులమీద చిరునవ్వు లీలగా కనిపించి అంతలోనే మాయమైంది. ముఖం గంభీరంగా మారింది. "అదే సరళా! వాస్తవానికీ, కళకూవున్న భేదం. వాస్తవిక జగత్తులో అతి సాధారణంగా కనుపించే వస్తువు, కళా జగత్తులో స్థానం పొందినప్పుడు అది ఆకర్షణీయంగా, అందంగా కనుపిస్తుంది. ఆ ఉదాత్తత వస్తుగతమైందికాదు. మనిషి హృదయగతమైంది. కళ మానవుని చూసే శక్తికీ, అనుభవించే హృదయానికీ ఉదాత్తతను ప్రసాదిస్తుందన్నమాట. అంటే మానవుని మానసిక స్థాయిని కళ కొంచం పైకి ఎత్తుతుందన్నమాట. ఒంటెను చూస్తుంటే, దాని ప్రతికదలికలోనూ మనకు నవ్వు తెప్పించే గుణంవుంది. చాలా వికారంగా కనిపిస్తుంది. కాని దాన్ని గొప్ప కళాకారుడు చిత్రించాడనుకో! మనంచూసి "ఎంత సహజంగావుంది" అంటూ ప్రశంసిస్తాం. దాన్ని మళ్ళీ మళ్ళీచూస్తాం! చేతనయితే కొనుక్కొని మన డ్రాయింగ్ రూంలో తగిలించుకొని మన కళా పిపాసను తీర్చుకుంటాం. వాస్తవిక జగత్తంటే. స్వాప్నిక జగత్తు అందంగా, ఆకర్షణీయంగానే వుంటుంది. కాని స్వాప్నిక జగత్తు మనకు కళ్ళు మూసుకుంటేగాని కనిపించదు. కళ్లు తెరిచిచూస్తే కనిపించేది వాస్తవిక జగత్తు. భూమికంటే ఆకాశం అందంగా కనిపిస్తుంది. అందుకని మనిషి తను నిలబడివున్న భూమికేసి చూడకుండా ఆకాశంకేసిచూస్తే కనుపించేది ఏమిటి? మానవ జీవితం తాలూకు రంగురంగుల చిత్రం భూమిమీదనే పరచివుంది. ఎంతలోతుగా దాన్నిచూసి, అనుభవించగలిగితే, అంత అందం ఆనందం అందుకోగలం."

సరళ ఇబ్బందిగా ముఖంపెట్టి కూర్చుంది. సత్యం



మాట్లాడేది ఏ భాషో తెలియడం లేదు. తెలుగు లాగేవుంది! కాని తనకు అర్థం కాదేం? సరళ ముఖంలోకి చూసిన సత్యంలోని ఉద్రేకం, పొంగుతున్న పాలమీద చన్నీళ్లు చిలకరించినట్లు, అట్టడుగుకు దిగజారిపోయింది. అంతలోనే కేశవరావుగారి అమ్మాయి తేజోవంతమైన కళ్ళు తళుక్కుమన్నాయి. ఆ అమ్మాయి ఎక్కడుందో? తన భావాలను అర్థంచేసుకొని తనతోపాటు ఆనందాన్ని పంచుకొని వుండేది. సరళకు ఇలాంటివి అర్థంకావు. బొత్తిగా పెరగని మనిషి.

"బావా! పోలయ్యను రోజూ ఎదురుగా నిల్చోపెట్టుకొని బొమ్మ వేస్తున్నావు గదా మరి మాణిక్యం....?" సందేహాన్ని కక్కేసింది సరళ.

సత్యానికి నవ్వొచ్చింది. "మాణిక్యాన్ని కూడా రోజూ ఆ చెట్టు కింద గుడ్డల మూట మీద కూర్చో బెట్టి ఆ బొమ్మ గీశాను." అన్నాడు సత్యం.

సరళకు దుఃఖమే వచ్చింది. అయితే బావ కళ్ళకు తను ఒక్కర్తే అందంగా లేదన్నమాట. ఉంటే ఈ పాటికి బొమ్మ గీసేవాడేగా!

"నా బొమ్మగియ్యవేం బావా?" అనేసింది సరళ.

"నీ బొమ్మ గియ్యక పోతే మరెవరి బొమ్మ గీసాను!" అన్నాడు చిరునవ్వుతో.

"అన్నీ అబద్ధాలే!" బుంగమూతి పెట్టింది.

సత్యం మాట్లాడకుండా సరళను చూశాడు.

"ఏం మాట్లాడవు. నా బొమ్మ బాగుండదా?"

"వేస్తాను. నీ బొమ్మ బ్రహ్మాండంగా, నా కౌశలాన్నంతా వినియోగించి వేస్తాను." చిన్న స్వరంలో నిదానంగా వచ్చిన ఆ మాటలు సత్యం తనకు తానే చెప్పుకున్నట్లున్నాయి.

సరళ కళ్ళలో కాంతి రేఖలు కదిలాయి. "అయితే మరి నన్ను ఎదురుగా కూర్చో మనవేం?"

ఎప్పుడూ నాకళ్ళలోనే వుండే రూపాన్ని కళ్ళ ఎదురుగా పెట్టుకోవడం ఎందుకూ? -అన్నట్లు చిరునవ్వు నవ్వాడు. బావ జవాబు చెప్పకుండా అదోలా నవ్వటం సరళకు బాధ కలిగించింది. అక్కడ నుంచి చివ్వునలేచి వెళ్ళిపోయింది.

ఆ నాడంతా సరళ సత్యంతో ముభావంగానే వుండిపోయింది. సత్యం గమనించీ గమనించనట్లే వూరుకున్నాడు.

"నువ్వెంత అందంగా వున్నావు సరళా! రా! అలావచ్చి ఎదురుగా కూర్చో! నీబొమ్మ వేస్తాను." అని బావ అంటాడేమోనని ఎదురు చూసిన సరళకు నిరాశే ఎదురైంది. కాని సరళ పెద్దబావతో ఎక్కువ కాలం కోపంగా మూతిముడుచుకొని వుండలేదు. సత్యానికి కావాల్సినవి చూస్తూ, చదువుకుంటూ, ఎన్నో విషయాలు మాట్లాడుతూ వుండేది. కాని మనసులో ఎక్కడో సత్యం తన అందం యెడల చూపించే నిర్లక్ష్యం బాధపెడుతోనే వుండేది. కాని ఆ విషయం ప్రస్తావించడం మానేసింది.

సరళకు నిద్రరావడం లేదు. ఎంత ప్రయత్నించి అశాంతిగా పక్కమీద దొర్లుతుంది. కళ్ళవెంట నీరు ఆమెకు తెలియకుండానే కారుతూ దిండును తడిపేస్తుంది.

పెద్దబావ చాలా మంచివాడు. ఆ ఒక్క విషయంలో తప్పించి ఎప్పుడూ తనను నిర్లక్ష్యంగా చూడలేదు.

ఆ నాడు సూర్యం పట్నం నుంచి వస్తూనే తననుచూసి "ఎంత పెద్దదానివయావు సరూ! ఎంత అందంగా వున్నావు?" అన్నాడు. అప్పుడు తనలోని ప్రతి జీవాణువూ ఒక వీణ అయి స్పందించింది. కోటివీణలు ఒకసారి మ్రోగినట్లూ, ఆ మధురధ్వనిలో తను కరిగి కలిసిపోయినట్లూ అనుభూతిని పొందింది. సూర్యం అంటే అభిమానం పెంచుకుంది. కాని పెద్దబావను నిర్లక్ష్యం చెయ్యలేక పోయింది

పెద్దబావ తనను ఎంతో ఆదరంతో చూస్తాడు. పెద్దబావ నోటితో చెప్పని విషయాలు కళ్ళతోనే చెబుతాడు. ఒకోసారి ఆ చూపులు 'ఎంత అందంగా వున్నావు!' అంటున్నట్టుంటాయి ఆకళ్ళలో ఎంత ఆరాధనా భావం తొణికిసలాడుతుంది! తను పెద్దబావను సరిగా అర్థం చేసుకోలేదు. తను రాత్రి అత్తయ్యతో అన్నమాటలు పెద్దబావకు తెలిస్తే మళ్ళీ తనమొహం నాకు చూపించడు. ఎవర్నీ ఒక్కమాట అనడు. అత్తయ్యకు ఇప్పుడే తన నిర్ణయంచెప్పేస్తే, రాత్రి ఏదో ఆవేశంలో అన్నమాటల్ని మర్చిపొమ్మనీ, తనను క్షమించమనీ అత్తయ్య కాళ్ళ మీదపడితే! ఇంత రాత్రిపూట అత్తయ్యతో మాట్లాడటం ఎలా? ఆమె నిద్రపోయి వుండాలి. అక్కర్లేదు. అత్తయ్య ఈ విషయం ఎవరితోనూ చెప్పదు. అసలు తన వాగుడు పిచ్చిదాని వాగుడు కింద కట్టేసి వుంటుంది.

ఒక నిర్ణయానికి వచ్చిన సరళకు గుండెల మీదవున్న బరువు బండను ఎవరో తప్పించినట్లు రిలీఫ్‌గా నిట్టూర్చింది. సత్యం రూపాన్ని కళ్ళలో పొదివి పట్టుకొని కళ్ళు మూసుకుంది. హాయిగా నిద్రపట్టింది.

కాని అదే సమయంలో సత్యం తన గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. రాత్రి తను విన్న మాటలు చెవుల్లో ఉండి ఉండి మారుమ్రోగుతున్నాయి. 'అవును. తను అవిటివాడు. సరళ తనను వివాహం చేసుకొని ఏం సుఖపడుతుంది? ఆమెకూ ఓ యిష్టం అంటూ వుంటుందని కూడా తను ఆలోచించలేదు. ఒకటి రెండు సార్లు సరళ సూర్యాన్ని ప్రేమిస్తుందేమోనన్న అనుమానం తనకు రాక పోలేదు. కాని ఆ విషయాన్ని గురించి తను పెద్దగా ఆలోచించటానికి ప్రయత్నించ లేదు ? ఎందుచేత ? స్వార్థమా ? కాదు, తను ఊహించుకుంటున్నది పొరపాటని తన హృదయం మందలించటం వల్ల !

సత్యం టేబుల్ దగ్గర తక్కున ఆగిపోయాడు. ఓ క్షణం ఆలోచించి, కుర్చీలో కూర్చున్నాడు టేబుల్ సొరుగు తెరచి అందులో నుంచి లెటర్ పాడ్, కలం తీసుకున్నాడు.

మందంగా వెలుగుతున్న కోడి గుడ్డు లాంతరు వత్తిని పైకి ఎత్తి తలవంచుకొని గబగబా వ్రాయడం మొదలు పెట్టాడు.

ఆ పక్క గదిలో వున్న సూర్యం నిద్రపట్టక మంచం మీద లేచి కూర్చున్నాడు. తను చాల నీచంగా ప్రవర్తించాడు. అన్నయ్య విషయంలోనా తను అలా ప్రవర్తించవలసింది. మొదటి నుంచి తను అన్నయ్యను బాధ పెడుతూనే వున్నాడు. కాని అన్నయ్య తనను ఏ ఒక్కనాడూ ఏ విధంగానూ కష్టపెట్టినట్లు తనకు గుర్తు లేదు. నిజంగా తను సరళను ప్రేమిస్తున్నాడా? అయితే దూరంగా చదువుతున్న ఈ మూడు నాలుగు సంవత్సరాల్లో ఒక్కసారి కూడా తనకు సరళ పెద్దగా గుర్తు రాలేదు. ఆమెను ఎప్పుడు చూద్దామా అనే ఆరాటం కలగలేదు. ఆమె లేకుండా తను లేడు అని అనిపించదేం? కేవలం తనలో వుంది అన్నయ్య అంటే ఈర్ష్య భావం మాత్రమే. చిన్ననాడు తెలిసీ తెలియని వయస్సులో తేలు పిల్లలా ప్రవేశించిన ఈ ఈర్ష్య పెద్దదై తన హృదయంలో అశాంతిగా తిరుగుతున్నది. తనకు మతి పోగొట్టుతున్నది. లేకపోతే అన్నయ్యకా తను ద్రోహం చెయ్యవలసింది. తెల్లవారి లేచి అన్నయ్యకు తను మొహం ఎలా చూపించటం? సరళ అన్నయ్యను చేసుకోనని అమ్మతో ఈ పాటకే చెప్పేసి వుంటుంది. అన్నయ్యకు ఆ విషయం తెలిస్తే ఇంకేమయినా వుందా. తొణక్కుండా, తాపీగా అమ్మనూ నాన్ననూ ఒప్పించి ఈ పెళ్ళి కాస్తా జరిపించి వేస్తాడు. అన్నయ్య 'శ్రీశ్రీ' లా లోకం బాధను తన బాధగా చేసుకుంటాడు. అంతేగాని తన బాధను లోకం మీద రుద్దడు.

సూర్యం లేచి సూట్‌కేసు తీసుకొని చిన్నగా బయటకు నడిచి చీకట్లో కలిసిపోయాడు.

* * *

"బావా! పెద్దబావా! వెళ్ళిపోకు! నన్ను క్షమించుబావా! బావా!" సరళ కెవ్వుమంది. శాంతమ్మ సరళ భుజాలు పట్టుకొని కుదుపుతున్నది.

"అమ్మాయ్ సరళా! ఏమిటమ్మా అలా పలవరిస్తున్నావు? కళ్ళు తెరచి అయోమయంగా చూస్తున్న సరళను ప్రశ్నించింది శాంతమ్మ.

"పలవరింతా? వట్టి పలవరింతేనా? తనకు కల వచ్చిందా? లేక ఇది కలా!"

"ఏమిటమ్మా సరళా! లేచి కూర్చో! అలా వణికి పోతున్నావేం?" సరళ తలమీద ఆప్యాయంగా నిమురుతూ అంది శాంతమ్మ.

"అత్తయ్యా!" అంటూ శాంతమ్మ చేతికి చుట్టుకుపోయి కదిలి కదిలి ఏడవసాగింది సరళ.

"ఛ! ఏమిటమ్మా అది! పెళ్ళికూతురివి అలా ఏడవకూడదు. అసలు ఏమయింది? ఏం కల వచ్చింది?"

అత్తయ్యా! నన్ను క్షమించు. రాత్రి వాగిందంతా మర్చిపో! నాకు పెద్ద బావంటేనే ఇష్టం! పెద్ద బావ చాలా మంచివాడు. దేముడిలాంటివాడు." వెక్కిళ్ళ మధ్యలోనే అంది సరళ.

శాంతమ్మ నెత్తినుండి మొయ్యలేని బరువును దింపేసినట్లయింది.

"నాకు తెలుసమ్మా నీ మనసు" అంటూ సరళను రెండు చేతులతో పొదివి పట్టుకుంది.

"అత్తయ్యా! మరేమో నాకు చాలా చెడ్డ కల వచ్చింది. ఎంత భయం వేసిందనుకున్నావ్! ఎంత ఏడ్చానో! మరేమో పెద్ద బావ ఎక్కడికో వెళ్ళిపోతున్నాడట! నేను ఎంత పిలిచినా, ఎంత ఏడ్చినా వెనక్కి కూడా తిరిగి చూడలేదు. అలా నడుచుకుంటూనే వెళ్ళిపోయాడు." రుద్ధ కంఠంతో అంది సరళ.

"పిచ్చి పిల్లా! రాత్రంతా బాధపడివుంటావు. అందుకే అలాంటి కల వచ్చింది. పడుకో! మళ్ళీ పొద్దున్నే లేవాలి!" అంది శాంతమ్మ మంచం మీదనుంచి లేస్తూ.

* * * *

"లే! లే! ఏమిటా నిద్ర! పెళ్ళికొచ్చాననుకుంటున్నావా? లేక పెళ్ళి నీ యింట్లోనే అనుకుంటున్నావా?" చంద్రయ్య నవ్వుతూ శాంతమ్మను నిద్ర లేపాడు. శాంతమ్మ ఆదరాబాదరాగా నిద్ర లేచింది. తెల తెలవారుతోంది.

"అరే బాగానే తెలవారిపోయిందే? మీరెళ్ళి విడిది వారికన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయో లేదో చూసుకోండి."

"ముందు ఇన్ని కాఫీ నీళ్లు పొయ్యి. అక్కడ వంటవాళ్ళను పెట్టాంగా. అన్నీ సవ్యంగానే జరుగుతాయిలే. అయినా ఏమిటంత సేపు పడుకున్నావు, వంట్లో బాగాలేదా?"

"అబ్బే అదేం లేదు. రాత్రి సరిగా నిద్ర పట్టలేదు." అంటూ శాంతమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

కాఫీ గ్లాసు తెచ్చి చంద్రయ్యకు అందించింది శాంతమ్మ. "పెద్ద వాడుకూడా ఇవ్వాళ ఇంకా నిద్ర లేచినట్లు లేదే?" అన్నాడు చంద్రయ్య భార్య చేతిలోని రెండో గ్లాసుకేసి చూస్తూ.

"వాడు ఇంత సేపు పడుకోడు. ఎప్పుడో లేచి వుంటాడు." అంటూ శాంతమ్మ కాఫీ గ్లాసుతో సత్యం గదిలోకి వెళ్ళింది. సత్యం గదిలో లేడు. గ్లాసు టేబుల్ మీద పెట్టి, సత్యం బాత్‌రూంలో వున్నాడేమోనని చూట్టానికి వెనక్కు తిరిగింది. ఎదురుగా స్టాండు మీద వున్న బొమ్మనుచూసి ఆశ్చర్యపోయింది. నిలువెత్తున నిల్చొనివున్న సరళ చిత్రం అది. శాంతమ్మ ముగ్ధురాలై చిత్రాన్ని చూస్తూ వుండిపోయింది.

"ఏమిటి! ఆ గదిలోనుంచి ఊడిపడవాఏంటి? ఎదీ నిన్న నీ చేతికిచ్చిన డబ్బు ఇలా ఇయ్." అంటూ గదిలో ప్రవేశించిన చంద్రయ్యకూడా ఆ చిత్రాన్ని చూస్తూ ఈ లోకాన్నే మర్చిపోయాడు.

"చూశారా మనవాడు ఎంతబాగా వేశాడో? అదాటుగా సరళే వచ్చి నిల్చుంచనుకున్నాను సుమా?" అంది శాంతమ్మ ముసిముసిగా, ఆనందంగా నవ్వుకుంటూ.

చంద్రయ్య సమాధానం ఇవ్వలేదు. సగర్వంగా ఓ చిరునవ్వు తొంగిచూసింది గుబురుమీసాల సందుల్లోంచి

"వాడేడీ! ఆ కాఫీ అలాపెట్టేశావ్ చల్లారిపోవటంలేదు?" అన్నాడు కళ్ళను చిత్రంమీదనుంచి మరల్చకుండానే.

"నిజమే! ముఖంకడుక్కుంటున్నాడేమో చూస్తాను." అంటూ శాంతమ్మ స్నానాలగది దగ్గరకువెళ్ళింది. అక్కడ సత్యానికి బదులుగా సరళ పళ్ళుతోముకుంటుంది.

"ఒసే అమ్మాయ్! బావగదిలోకెళ్ళి చూడు, అచ్చంనీలాంటి అమ్మాయే వుంది." అంది శాంతమ్మ ఉత్సాహంగా.

'సరళ ఆశ్చర్యంగా చూసింది.

"అవునమ్మా! త్వరగావెళ్ళు! నామతిమరుపు మండిపోనూ, అసలుసత్యం ఏడీ? ఇక్కడేవున్నాడనుకున్నాను." అంది

"బావ గదిలో లేడూ!"

"లేడు. పళ్ళుతోముకుంటున్నాడేమోనని కాఫీచల్లారిపోతుంది త్వరగా రమ్మని చెబుదామని వచ్చాను." అంటూనే శాంతమ్మ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

సరళకు పెద్దబావ గదిలోవున్న అమ్మాయి ఎవరో చూడాలనే కుతూహలం కలిగింది. కాని తను పెళ్ళికూతురు. ఈ రాత్రికే పెద్దబావతో పెళ్ళి అని జ్ఞాపకం రాగానే సిగ్గుదొంతర్లు దొర్లిపోయాయి ఆమె చెక్కిళ్ళ మీదుగా.

శాంతమ్మ సత్యం గదిలోకి వచ్చేటప్పటికి చంద్రయ్య కుర్చీలోకూర్చొని ఏదో కాగితం చూస్తున్నాడు. శాంతమ్మ ఏదో అనబోయి, అప్పుడే ప్రాణంపోయిన శవంలా బిగుసుకొనిపోయి వున్న చంద్రయ్యను చూసి ఆగిపోయింది.

'ఏమిటా కాగితం? ఉత్తరమా? ఎవరు రాసివుంటారు? సత్యం ఏడీ? ఒకవేళ సత్యం రాత్రి సరళ తనతో అన్నమాటలు గాని వినలేదు కదా?' ఎన్నో అనుమానాలూ, భయాలూ ఆమెను చుట్టివేశాయి. నిలువెల్లా వణికిపోయింది. ఎలాగో భర్తదగ్గరకు నడచి "ఏమండీ! ఏమిటా వుత్తరం? ఏం జరిగింది?" అంది ఆత్రంగా.

చంద్రయ్య కదిలాడు. ఓ క్షణం మళ్ళీ ఉత్తరంకేసి చూశాడు. "జరగకూడందే జరిగింది." అన్నాడు. ఆ మాటలు తనకు తానే చెప్పుకుంటున్నట్లున్నాయి.

"ఏమిటండీ! ఏం జరిగింది? ఎవరురాశారు ఆ ఉత్తరం?" దాదాపు ఆక్రోశంలాగే వచ్చాయి శాంతమ్మ కంఠంనుంచి మాటలు.

చంద్రయ్య జవాబివ్వలేదు. పిచ్చివాడిలా చూస్తూకూర్చుండిపోయాడు.

శాంతమ్మ బెదిరిపోయింది. "ఒరే సూర్యం" అంటూ గావు కేక పెట్టింది.

ఆ కేకకు సూర్యం పలుకలేదు కాని సరళమాత్రం గాబరాగా పరుగెత్తుకొచ్చింది.

"ఏమిటత్తయ్యా ఏం జరిగింది?" అంది.

శాంతమ్మ మౌనంగా భర్తచేతిలోని ఉత్తరాన్ని లాక్కొని సరళకిచ్చింది.

సరళ గాబరాగా కింద సంతకం చూసింది. అది సత్యం రాసిన ఉత్తరం అని తెలియగానే చేతులు వణికాయి. ఆ ఉత్తరంలో ఎలాంటివార్త వుందోననే భయంతో చదవకుండానిల్చుండిపోయింది.

"చదువు?" శాంతమ్మ దాదాపు అరచినట్లే అంది!

సరళ వణుకుతున్న గొంతుతో ఉత్తరం చదవసాగింది.

"తమ్ముడూ!

నన్ను క్షమించు! నిన్ను గానీ, సరళనుగానీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించ లేదు. చిన్నతనంలో సరళతో నేను మాట్లాటంగాని, ఆమెకు దగ్గరగా వుండటంగాని నీవు సహించలేకపోయేవాడివి. అప్పుడు నేను చిన్నవాణ్ణి. కనుక ఆ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక పొయేవాణ్ణి. ఆ తరువాత కూడా ఆ విషయాన్ని గురించి ఆలోచించలేదు.

సరళకు నీవే తగిన భర్తవు. నాకు ఆ అర్హత లేదు. ఈ విషయాన్ని నేను చాల ఆలస్యంగా తెలుసుకున్నాను. కాని సమయం మించి పోక ముందే తెలుసు కున్నందుకు నాకు సంతృప్తిగా వుంది.

సరళను ఏవిధంగాను కష్ట పెట్టకు. ఇద్దరు కలకాలం ఆదర్శ దంపతులుగా వర్తిల్లాలని మనః పూర్వకంగా కోరుకుంటున్నాను. నేను ఇలా చెప్పకుండా వెళ్ళిపోవటాన్ని అపార్థం చేసుకోకు. నేను నిలబడి ఈ వివాహం జరిపించవలసినది కాని ఆ అదృష్టం నాకులేదు. కారణంనాఅజ్ఞానమే. ఇంతకాలం మీఇద్దర్నీ అర్థం చేసుకో లేక పోవటమే. ఇవ్వాళ నేను నిన్ను పీటలమీద కూర్చోపెడతానంటే అమ్మా, నాన్నా ఒప్పుకోరు. వాళ్ళకు భయపడి లోకులకు భయపడి నువ్వూ అంగీకరించకపోవచ్చు. అదీగాక నేను కూర్చోవలసిన పీట మీద నువ్వుకూర్చోవటానికి, నేను నీ ఎదుట వుండగా నీవు అంగీకరించలేక పోవచ్చు. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. అమ్మ, నాన్నా నిన్నూ, సరళనూ నిందిస్తారని తెలుసు. కాని మీరు బాధపడవద్దు. వారిబాధను అర్థం చేసుకొని శాంతంగా సమస్యను పరిష్కరించుకోండి. అమ్మా, నాన్నాలను క్షమించమని నాతరపుగా అర్థించు. ఏ నాటికైనా తిరిగి వచ్చి వారికి నా క్షమాపణలను చెప్పుకోగలనని ఓదార్చు. పుత్రుడిగా నేను తీర్చుకోలేని

రుణం నీవు తీర్చుకో. అమ్మకూ నాన్నకూ ఎలాంటి కష్టాన్ని కలుగనివ్వకు. నువ్వు డాక్టర్ పూర్తి కాగానే, ఎక్కడ ఉద్యోగానికివెళ్ళినా అమ్మను నాన్నను కూడా తీసుకెళ్ళు. మనం లేని ఆ ఇంట్లో పెద్దవారై వాళ్ళిద్దరూ వుండడం ఎంత కష్టమో ఆలోచించు.

సరళతో చెప్పు. సరళ ఎప్పుడూ "బావా! నాబొమ్మ గీయవా? నేను అందంగా లేనా?" అంటూ వుండేది. తాను ఎంత అందమైందో నేను గీసిన చిత్రమే చెబుతుందని చెప్పు. రోజూ అందరూ నిద్రపోయాక ఆ చిత్రాన్ని చిత్రించే వాణ్ణి. అది దాదాపు రెండు సంవత్సరాల నుంచి గీస్తూనే వున్నాను మొన్న రాత్రి పూర్తయింది సరళకు వివాహ బహుమతిగా ఆశ్చర్యం కలిగేలా ఇవ్వాలనుకున్నాను. కాని ఆ చిత్రాన్ని ఇప్పుడు నీకు బహూకరిస్తున్నాను పెళ్ళి కానుకగా. సరళతో పాటు ఆ చిత్రాన్ని కూడా అంత ఆదరంగానూ, జాగ్రత్తగానూ చూసుకుంటావు గదు తమ్ముడూ!

నన్ను వెతికించటానికి ప్రయత్నించ వద్దనీ, నాకోసం ఎదురుచూడడం వ్యర్థమనీ అమ్మకూ, నాన్నకూ చెప్పు.

ఎక్కడవున్నా, ఎలావున్నా, సర్వదా నీసుఖాన్నే అభిలషించే___

నీ అన్న
సత్యం"

సరళకు బుర్రలో ఏదో బరువైన వస్తువు గిర్రున తిరిగినట్లయింది. కళ్ళ మీద ఏవేవో మసకలు కమ్ముతున్నాయి. ఆ మసకల్ని చీల్చుకుంటూ, ఎదురుగావున్న బొమ్మను చూట్టానికి ప్రయత్నించింది. కాని అది స్పష్టంగా కనిపించటంలేదు "బావా!" అని కలలో పలవరించినట్లు అంటూ నేలమీద కూలబడింది.

శాంతమ్మ పిచ్చి ఆవేశంగా సూర్యం గదిలోకి పరుగెత్తింది "ఒరేయ్! చచ్చినోడా, ఇంటికి నిప్పుపెట్టి ఇంకా నిద్రపోతున్నావురా" అంటూ ఖాళీమంచం చూసి కొయ్య బారిపోయి నిల్చింది. వెర్రిదానిలా గదంతా కలయ జూసింది. సూర్యం తాలూకు బట్టలు గాని, సూట్ కేసుగాని ఏమి లేవు.

"ఏడీ! ఆ దుష్టుడు! ఇవ్వాళ వాడిరక్తం కళ్ళ జూస్తాను." వాడికి పెళ్ళి కావాలా పెళ్ళి! రుద్రరూపంతో చేత్తో ముల్లుకర్ర పట్టుకొని గదిలోనికి వచ్చిన చంద్రయ్య మొఖంలోకి భావహీనంగా చూసింది శాంతమ్మ.

"ఏడీవాడు?" చంద్రయ్య పొలికేక పెట్టాడు. చంద్రయ్య కోపంతో నిలువెల్లా వణికి పోతున్నాడు.

శాంతమ్మ మౌనంగా చూట్టంతప్పించి ఏమీ అనలేకపోయింది. ఆ చూపులచాటున కదిలిన భావం, చంద్రయ్య వెన్నుపూసమీద బలంగా కర్రదెబ్బలా తగిలింది. గదంతా కలయజూశాడు. అర్థం అయింది. తలపట్టుకొని చెట్టంతమనిషి కుప్పకూలి పోయాడు.

"పెళ్ళికొచ్చిన వారికి ఏమని చెప్పను? ఊళ్ళోవాళ్ళకు ముఖం ఎలా చూపించను:" నిద్రలోలా తనసుతనే ప్రశ్నించుకుంటూ కూర్చుండిపోయాడు .

శాంతమ్మ ఉలకలేదు. పలకలేదు. అసలు ఆమెకు ఏమీ వినిపించటం లేదు.

"అత్తయ్యా! ఈ జావైనాతాగు!" సరళ శాంతమ్మ పడుకొని వున్నమంచం పక్కగా నిల్చుంది, సగ్గుబియ్యం జావతో వున్నగ్లాసు పట్టుకొని. శాంతమ్మ బల్లిలా మంచానికి అతుక్కుపోయివుంది. నీరసంగా కళ్ళు తెరిచింది కళ్ళతోనే 'నాకు ఏమీవద్దు' అన్నట్లుచూసి మళ్ళీ కళ్ళు మూసుకుంది!

"అత్తయ్యా "

"ఊ !"

"ఈ జావ తాగు. రెండురోజులుగా మరీ ఏమీ తినలేదు." అంది సరళ దిగులుగా.

"నాకు వద్దమ్మా " నీరసంగా ఉంది శాంతమ్మ స్వరం.

"ఏమిటత్తయ్యా! ఎంతకాలం ఇలా నిద్రాహారాలు లేకుండా వుంటావు?" బొంగురుపోయింది సరళ కంఠం.

"మొండిప్రాణం ఇది పోదమ్మా ! నువ్వు భయపడకు.'

"పెద్దబావ ఎప్పటికైనా తిరిగొస్తాడు. ఆ నమ్మకం నాకుంది. నువ్వు అలా మంచానికి అతుక్కుపోయి లేవవు. తిరగవు, తినవు. మామయ్య, సమయానికి ఇన్ని మెతుకులు గొంతులో వేసుకొని ఆ గొడ్లపాకలో నులక మంచంమీద కూర్చొని వుంటాడు. ఈ ఇంట్లో మొండిగా తింటూ తిరుగుతూ వుంది నేను ఒక్కదాన్నే. నా బతుకే మొండిబతుకు అయిపోయింది" సరళ కంఠంలోకి దుఃఖం పెల్లుబికింది.

"అమ్మా ! సరళా ! ఏమిటమ్మా ఆ మాటలు!" నీరసంగా మందలిస్తున్నట్లు అంది శాంతమ్మ.

"లేకపోతే ఏమిటత్తయ్యా ! అమ్మపోయినప్పుడే నేనూ పోతే ఈ ఇంటికి ఈనాడు ఈ దుస్థితి కలిగేదికాదు." అంది సరళ గొంతులోని దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుకుంటూ.

"సరళా! ఏమిటమ్మా ఆ మాటలు" అంటూ శాంతమ్మ మంచంమీద లేచికూర్చుంది. "రా ! ఇలా కూర్చో" అంటూ బలహీనంగా వున్న చేతిని ముందుకు చాచింది.

"అవునత్తయ్యా! నావల్లనేగా మీకు యిన్నికష్టాలు వచ్చాయి. ఊళ్ళో మామయ్య తలెత్తుకొని తిరగలేకుండా వున్నారు;" సరళ చేతిలోని గ్లాసును మంచంపక్కనేవున్న స్టూలుమీద పెడుతూ అంది.

శాంతమ్మ కాంతిహీనమైన కళ్ళతో సరళ ముఖంలోకి పరిశీలనగా చూసింది. మళ్ళీ మళ్ళీ చూసింది. గుండెలు బరువెక్కాయి. సరళ ఎంత చిక్కిపోయింది ఈ ఆరునెలల్లో! తను గమనించనేలేదు. పచ్చగా, బొద్దుగా, దబ్బపండులా వుండే సరళ

రంగుతగ్గిపోయి వొగచూరిన కట్టెలా అయింది. శాంతమ్మకు తప్పుచేసి నట్లనిపించింది.

"నాకు చావువస్తే బావుణ్ణు అత్తయ్యా!"

"సరళా?" గట్టిగా అరిచింది శాంతమ్మ.

"అవునత్తయ్యా! నువ్వేమో ఇరవై నాలుగ్గంటలూ బావను తల్చుకుంటూ, కన్నీరు కారుస్తూ తిండీతిప్పలు లేకుండా మంచంలో పడివుంటావు! మామయ్య తిని తిరుగుతున్నా ఈ ప్రపంచంలోని మనిషిలా కనిపించడు. ఒక్కమాటైనా మాట్లాడడు. ఈ ఇంటో నేను ఒకదాన్ని వున్నాననే విషయాన్నే మీఇద్దరూ మర్చిపోయారు" సరళ కళ్ళలో నీరు ఉబికింది.

శాంతమ్మ ఉలిక్కిపడింది ఓక్షణం ఆలోచిస్తూ చూసింది. 'ఇలారా! తల్లీ! ఇలాకూర్చో' శాంతమ్మ స్వరంలోని ఆప్యాయతకు సరళ కరిగిపోయింది. ఇంతకాలంగా మనస్సులోనే కరడు కట్టిన ఆవేదనంతా కరిగి ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది.

"అత్తయ్యా?" అంటూ శాంతమ్మను చుట్టేసి బావురుమంది.

"ఉరుకోతల్లీ! నిజమే, పాపిష్టిదాన్ని నిన్ను మర్చేపోయాను. నీగురించి ఒక్కరోజుకూడా ఆలోచించలేదు. ఎంత చిక్కిపోయావో! ఇక ఉరుకోతల్లీ!" అంది శాంతమ్మ బొంగురుపోయిన గొంతుతో.

అంతకుముందే వచ్చి అక్కడ నిల్చుని ఇద్దరి సంభాషణా విన్న చంద్రయ్య ఆలోచిస్తూ నిల్చుండిపోయాడు. చంద్రయ్యను చూసిన సరళ కళ్ళుతుడుచుకుంటూ లేచి వెళ్ళిపోయింది.

"చూశారా సరళ ఎంత చిక్కిపోయిందో?" అంది శాంతమ్మ భర్తను ఉద్దేశించి.

"చూశాను. ఇప్పుడే చూశాను. ఇప్పుడే నా కళ్ళూచెవులూ పనిచేయసాగాయి. అంతా విన్నాను. ఈ జావతాగు, ఇక మనం ఇలా ఉండగూడదు." అంటూ జావగ్లాసు శాంతమ్మకు అందించాడు.

శాంతమ్మ గ్లాసు అందుకొని జావ గటగట మందుతాగినట్లు తాగేసింది

"మీరు ఇల్లు విడిచి బయటకు వెళ్ళడం మానేశారట."

"అవును! కాని ఇవ్వాళే కళ్ళు తెరిచాను. మనకు కొన్ని బాధ్యతలు ఉన్నాయని కూడా ఇద్దరం మర్చిపోయాం."

"అయినా మనం సిగ్గుపడాల్సిందేముంది? మనపిల్లలు తప్పు పనులు ఏం చేశారని మనం ఇతర్లముందు తల వంచుకోవాలా? ఇది కేవలం మన కుటుంబానికి సంబంధించినదే! అన్న, తమ్ముడి కోసం తన పెళ్ళి మానుకున్నాడు. తమ్ముడు అన్నను బాధపెట్టాననే పశ్చాత్తాపంతో వెళ్ళినవాడు తిరిగి రావటానికి సిగ్గు పడుతున్నాడు. అన్నదమ్ముల ప్రేమనుచూసి ఇంకా మనం గర్వించాలి. సిగ్గుపడనక్కర్లేదు" శాంతమ్మ గబగబా, వల్లించిన పాఠం అప్పజెప్పినట్లు అంది.

చంద్రయ్య శాంతమ్మ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు. దీర్ఘంగా నిట్టూర్చాడు,

"అవును! నాకు ఈ మాత్రం ఆలోచనకూడా రాలేదు." అన్నాడు మంచం పెట్టెమీద కూర్చుంటూ.

"చిన్నవాడి దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది." అన్నాడు చంద్రయ్య

"ఏం రాశాడు?" ఆత్రంగా అడిగింది శాంతమ్మ.

"హౌస్‌సర్జన్ హైదరాబాద్‌లో చేస్తాడట. వచ్చేనెలకు హైదరాబాదు వెళుతున్నాడట. ఇప్పుడు సెలవేనట!"

"వస్తానని రాశాడా?"

"ఎలా వస్తాడు? వాడురాసిన ఒక జాబుకైనా మనం జవాబు రాశామా?"

"రమ్మని రాయండి, హైదరాబాదు ఇక్కడినుంచే వెళ్ళ వచ్చని రాయండి! ఇద్దరూ మనకు రెండుకళ్ళు. ఒక కన్నుకు దెబ్బ తగిలిందని రెండో కంటిని పీకేసు కుంటామా?" అంది శాంతమ్మ.

చంద్రయ్య ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? రమ్మని రాయండి! పిచ్చిసన్యాసి ఎంత బాధపడుతున్నాడో?" అంది శాంతమ్మ. ఆమె కంఠంలో పుత్రవాత్సల్యం పెల్లుబికింది

"అలాగే లే!" అంటూ లేచాడు చంద్రయ్య.

"ఏమండీ?" శాంతమ్మ పిలుపుకు ఆగిపోయి, ఏమిటన్నట్లు చూశాడు.

"చిన్నవాడికి సరళను ఇచ్చి పెళ్ళి చేద్దాం!"

చంద్రయ్య అర్థం కానట్లు భార్య ముఖంలోకి చూశాడు.

"ఆడ పిల్లకు ఎంతకాలం పెళ్ళిచేయకుండా వుండటం? పైగా వాళ్ళిద్దరూ..." పెద్ద కొడుకు జ్ఞాపకంరాగా శాంతమ్మ గొంతులో మాటలు ఉంగిడి చుట్టకు పోయినై.

చంద్రయ్య ఆలోచనలోపడ్డాడు. అవును! అదే ఒక విధంగా మంచిదేమో! వాళ్ళిద్దరకూ వివాహంఅయిపోయిందని తెలిస్తేనన్నా సత్యం ఇంటికి తిరిగొస్తాడేమో!


"సరేలే! ఆవిషయం తరవాత ఆలోచిద్దాం! నువ్వు కాస్సేపు పడుకో కళ్ళు మూసుకొని" అంటూ చంద్రయ్య చరచరా బయటకు వెళ్ళాడు.


శాంతమ్మ భర్త వెళ్ళినవైపే ఎంతోసేపుచూస్తూ కూర్చుండిపోయింది. ఎన్నోరకాల ఆలోచనలు ఆమె మనస్సును చుట్టేశాయి.

(సశేషం)

అందమైన ఇంద్రధనుస్సు ద్వీపం

మారిషస్





వి. ఏ. మూర్తి

నైరుతి హిందూమహా సముద్రంలో, మకరరేఖ మండలంలోపల ఆఫ్రికా తీరంనుంచి సుమారు 1250 మైళ్ల దూరంలోవున్న సుందరమైన చిన్నద్వీపం మారిషస్ దీనిపొడవు దాదాపు 40 మైళ్లు వెడల్పు 30 మైళ్లు. వైశాల్యం 720 చదరపుమైళ్లు. సముద్రతీర ప్రదేశంలోని వాతావరణం యిచ్చట వుంటుంది. కేంద్ర పీఠ భూమిలో సగటు ఉష్ణోగ్రత ఆగస్టు నెలలో, సూర్యోదయ సమయంలో 13° సెంటిగ్రేడ్, మధ్యాహ్న సమయంలో 19° సెంటీగ్రేడ్. వుంటుంది. ఇది ఫిబ్రవరి నాటికి వరుసగా 19° సెం. 26° సెం. లకు పెరుగుతుంది. వర్షపాతం సముద్రమట్టం నుండి నేల ఎత్తును బట్టి మారుతుంటుంది వార్షిక వర్షపాతం పశ్చిమ తీరప్రాంతంలో 40 అంగుళాలకంటె తక్కువ వుండగా, కేంద్ర పీఠభూమిలో 200 అంగుళాల వరకు వుంటుంది ప్రత్యేకంగా వర్షకాలమంటూ లేదు అయితే జనవరి, మే నెలల మధ్య వర్షాలు అధికంగా కురుస్తాయి. ఇతర నెలల్లో వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంటుంది. సంవత్సరంపొడవునా పచ్చని ప్రకృతి సౌందర్యంతో పరిసరాలు శోభాయమానంగా వుంటాయి.

మారిషస్ ఇంద్రధనుస్సు ద్వీపం. దీని ఉనికి దృష్ట్యా ఈ ద్వీపానికి హిందూ మహాసముద్రంలో కీలకమైన స్థానం వున్నది. వివిధ జాతులకుచెందిన సుమారు ఎనిమిది లక్షల మందిప్రజలు ఇచ్చట నివసిస్తున్నారు. వీరిలో దాదాపు మూడింట రెండువంతుల మంది భారతీయ సంతతికి చెందినారు మిగిలినవారు క్రియోలులు, చైనీయులు, యూరోపియన్లు భారతీయ సంతతివారు మాట్లాడే ప్రధాన భారతీయ భాషలు – హిందీ, ఉర్దూ, తమిళం, తెలుగు, మరాఠీ. అయితే భారతీయభాష అయిన భోజ్‌పూరీ, ఫ్రెంచిభాషకుచెందిన క్రియోల్ ఎక్కువగా ప్రచారంలోవున్నాయి. ఇచ్చట అనేక జాతులు, భాషలు, మతాలవారు ఏకమై కాలక్రమేణా కొత్త మారిషస్ జాతిగా రూపొందుతున్నారు. 157 సంవత్సరాల బ్రిటిష్ పరిపాలన అనంతరం 1968 మార్చి 12వ తేదీ అర్ధరాత్రి మారిషస్‌కు స్వాతంత్ర్యం లభించింది. ఈ ద్వీపవాసులు తమ ప్రథమ స్వాతంత్ర్యదిన వార్షికోత్సవాన్ని సముచిత రీతిని జరుపుకొన్నారు.

మారిషస్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన అలంకృత శకటాలు ఈ వ్యాసారంభంలో ప్రచురించటంజరిగింది మారిషస్ ప్రజల జీవన విధానాన్నీ, సాంస్కృతిక జీవితాన్నీ యివి చూపిస్తాయి. ఛాయాచిత్రాలు, మారిషస్ రేడియో సమాచారమంత్రిత్వశాఖ, విద్య, సాంస్కృతిక వ్యవహారాల శాఖవారిసౌజన్యంతో ప్రచురించబడుతున్నవి.

మారిషస్‌కు మొట్టమొదట వలస వచ్చినవారు మొదలుకొని యిప్పటివరకు అచ్చటి వివిధ విశేషాలను తెలిపేవివరాలను పరిశీలిద్దాం.

మారిషస్‌లో డచ్ ప్రజలు

ఒకప్పుడు హిందూ మహా సముద్రంలో నౌకాయానం జరిగే మార్గాలకు మరుగుగా ఒక చిన్న ద్వీపంవుండేది. అరబ్బులు, పోర్చుగీసులు మొదట దీని ఉనికిని కనుగొన్నారు. అయితే 17వ శతాబ్దిలో డచ్చివారు ఇచ్చట నివాసం ఏర్పర్చుకునే వరకూ ఈ ద్వీపం అనాక్రమిత ప్రదేశంగానే వుండిపోయింది.

ఆగ్నేయ కోస్తాలోని ప్రాచీనమైన రేవులో వలసప్రజలు వృక్షాలు నరికి, చేపలుపట్టి, వేటాడిజీవనం సాగించారు.

వారు అపూర్వమైన 'డోడో'ను కూడా ధ్వంసం చేశారు. అయితే ఈ ద్వీపానికి వలసవచ్చిన మొట్టమొదటివారు డచ్చివారు కాబట్టి ఒక డచ్చివ్యక్తి పేరిట ద్వీపానికి ఈ పేరువచ్చింది

లేబర్ డన్నాయస్-పోర్‌లూయీ

మారిషస్ ఫ్రెంచివారి ద్వీపంకూడా. 18వ శతాబ్దిలో యిది పూర్తిగా వారి స్వాధీనంలోనే వుంది.

పోర్టులూయీ 1735 తర్వాత భారత దేశానికి చెందిన కొంతమంది పడవవాళ్లు, కార్మికులు భావి ఇంజనీర్ల సహాయంతో, లేబర్ డన్నాయస్ అనే ఆయన ఓడరేవును మాత్రమే గాకుండా ఒక పట్టణాన్ని, త్వరితంగా అభివృద్ధి జెందుతున్న వలస రాజధానినికూడా సాధించాడు.

పాల్ - వర్జీనియా

ఈ ఫ్రెంచి ద్వీపం ప్రాచీన ప్రణయ గాథలకు కూడా ప్రసిద్ధిపొందింది. పాల్ - వర్జీనిలయాల ప్రేమగాథ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది.

కోర్సేర్స్ సాహస కృత్యాలు

తరచుగా యుద్ధసమయంలో ఈ ఫ్రెంచి ద్వీపాన్ని దాని అదృష్టానికి దానిని వదలివేయడం జరుగుతుండేది. అప్పుడిది ఆ సవాళ్లను ఎదుర్కొన్నది.

కోర్సేర్స్, నౌకాదికారు పోర్ట్ లూయీ నుంచి బయలుదేరి వచ్చి ఇంగ్లీషువారిని హడలెత్తించారు. ఫలితంగా మారిషస్, నౌకా యుద్ధ తంత్రానికి స్థావరంగా పరిగణించబడ సాగింది.

విప్లవ కాలంలో స్వతంత్ర ఫ్రెంచి ద్వీపం పరిరక్షణకు కూడా కోర్సేర్స్ సాహస కృత్యాలు తోడ్పడ్డాయి.

ఆంగ్లేయుల ఆక్రమణ

నెపోలియన్ పరిపాలన కాలంలో ఈ ఫ్రెంచి ద్వీపం స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. బ్రిటిష్‌వారి విధానాలకు, ఆశయాలకు లోనయింది.

1810 ఆగష్టులో జరిగిన గ్రాండ్ పోర్ట్ యుద్ధం నిష్ఫలమైనది. కాని మరుసటి నవంబరు 29వ తేదీన జనరల్ అబెర్‌క్రాంబీ దళాలు ఉత్తర తీరంలో దిగాయి కొంత పోరాటం జరిగిన తరువాత, డిశంబరు 3వ తేదీన ఫ్రెంచివారు లొంగిపోయారు

4వ తేదీన యూనియన్‌పతాకం రెపరెపలాడింది. మారిషస్‌కు తిరిగి వెనుకటి పేరు వచ్చింది.

దాస్య విమోచనం

బ్రిటిష్ పరిపాలన ఒకటిన్నర శతాబ్దాల పాటు సాగింది. 1814లో ఈ ద్వీపంలో దాస్య వర్తకాన్ని నిషేధించారు. 1835లో దాస్యాన్ని రద్దు పరిచారు. డచ్చివారి హయాములో మారిషస్ ప్రజల సాంఘిక జీవితంలోని ప్రధాన అంశం యిది.

చెరకుతోటలలో భారతీయ శ్రామికులు

బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో మారిషస్ ద్వీపపు ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి చెందింది. కారణం వీరి హయాములో చెరకు తోటలు బాగా అభివృద్ధి పరచబడినాయి ఈతోటలలో పని చేసేందుకు అనేక మంది పనివారు, నిపుణత గలవారు చాలా వరకు భారతదేశస్థులు-అవసరమయ్యారు.


మారిషస్ చెరకు తోటలలో పనిచేయడం కొరకు 1834వ సంవత్సరం తర్వాత అనేక వందలు వేల మంది పనివారలు భారత దేశం నుంచి వచ్చారు. వారు స్థానిక చెరకు తోట యజమానులకు తోడ్పడి ఈ పంట విషయంలో మారిషస్‌కు పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టారు.

యూరపియన్లు, ఆఫ్రికన్లు భారతీయులు అని మారిషస్ జనులు మూడు ఖండాల సంస్కృతీ సంప్రదాయాలకు చెందిన వారు. 19వ శతాబ్ది మధ్య భాగంలో పోర్ట్ లూయిస్‌లోని వీధులలో సంచరించినవారు, ఉత్తరోత్తరా అనేక రూపాలలో ఉత్తమ వారసత్వం కలిగిన జాతిగా రూపొందగల వివిధ సంస్కృతులు మేళవించిన సమాజాన్ని సందర్శించి వుంటారు.

స్వాతంత్ర్యం మానవ - హక్కులు

దాదాపు ఒక శతాబ్దం పాటు సహనంతో స్వతంత్ర నాగరికతను వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నపిదప మారిషస్ ఒకజాతిగా అవతరించినది ఈ శతాబ్దకాలం ఈ జాతి చరిత్రలో కీలకమైనది క్లిష్టమైనది. ఈ కాలంలో ఎన్నోమార్పులు సంభవించాయి ఎంతో అభివృద్ధి జరిగింది. ఇప్పుడు మారిషస్‌కు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయి ఇప్పుడు దేశంలో పూర్వం వలె ధనికులు, బీదవారు వుండరు. హెచ్చు తగ్గులు వుండవు. వర్ణ విచక్షణలు వుండవు. ఒకే దేశం. ఒకే పౌరసత్వం. అందరికి సమాన హక్కులు,అందరిదీ ఒకే గమ్యం.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం



నూతనంగా నిర్మించిన వ్యవసాయ కళాశాల, నిర్వహణ కార్యాలయ భవనాలు

మనదేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ప్రధానమైనది. అందువల్ల యిక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధక సంస్థలు, తదితర వ్యవసాయ సంబంధమైన సంస్థలు మన ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని తీర్చిదిద్దడంలో ముఖ్యమైన పాత్రవహిస్తాయి. మన విద్యావిధానం ఎప్పుడూ జీవితంలోని వాస్తవిక పరిస్థితులకు సన్నిహిత సంబంధం కలిగివుండాలి. అందుచేత ఉన్నత విద్యాసంస్థలు కొన్ని ప్రత్యేక రంగాలలో కృషిచేసే ప్రస్తుత విధానం అవశ్యం అనుసరణీయమూ, అభిలషణీయమూను. ఈ దృష్ట్యా ఆలోచించినప్పుడు, మన విద్యావిధానం వాస్తవిక పరిస్థితులకు సన్నిహితంగా వుండేట్టు చేయడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

మనదేశంలో వ్యవసాయాభివృద్ధిని శీఘ్రతరం చేయడానికి వ్యవసాయ పరిశోధన, వ్యవసాయవిస్తరణ సర్వీసులమధ్య సన్నిహిత సంబంధాన్ని నెలకొల్పడం చాలా అవసరం. అందువల్ల పరిశోధనా ఫలితాలు వ్యవసాయదారులమధ్యకు చేరే అవకాశం వుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు యిందుకు అమితంగా దోహదం చేయగలవు.

అమెరికాలోని అగ్రికల్చరల్ లేండ్ గ్రాంట్ యూనివర్సిటీల నమూనాలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పబడింది. దీనికి 1965 మార్చి 20న అనాటి ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాదు శివార్లలోని రాజేంద్రనగర్‌లో ప్రారంభోత్సవం చేశారు. ఈ విశ్వవిద్యాలయ నూతన భవనాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. అమెరికాలోని కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయం సన్నిహిత సహకారంతో యీ వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేస్తున్నది. శాస్త్రీయ విజ్ఞాన ఫలితాలు రైతులకు అందేందుకు వీలుగా బోధన, పరిశోధన, ప్రత్యక్ష ఆచరణలను సమన్వయించి సమీకరించడమే రాజేంద్రనగర్‌లోని యీ వ్యవసాయ విశ్వవిద్యాలయ ముఖ్యోద్దేశం. ఈ విశ్వవిద్యాలయం కేవలం బోధనా కేంద్రం మాత్రమేకాదు, గ్రామాలలోని ప్రజల జీవన స్థాయిని అభివృద్ధి పరచడానికి పూనుకున్న సంస్థకూడా. దీని పాఠ్యవిధానం, శిక్షణా కార్యక్రమాలు అవసరాలనుబట్టి మార్చుకోవడానికి వీలైన విధంగానే రూపొందించబడ్డాయి. ఒకవైపు రాష్ట్రావసరాలను దృష్టిలో వుంచుకొని, మరోవైపు విద్యార్థుల శిక్షణపొందే వ్యక్తుల వ్యక్తిగత ఆశయాలను, అవసరాలను దృష్టిలో వుంచుకుని మార్పుకు వీలుగా రూపొందించబడ్డాయి. ఈ విశ్వవిద్యాలయం ఒకవంక విజ్ఞానపీఠంగా వుంటూనే మరోవంక వ్యవసాయదారులకు సేవాసంస్థగా తోడ్పడుతోంది. బోధన, శిక్షణ, పరిశోధన, విస్తరణసేవలు – యివన్నీ ఒకచోట సమీకరించబడి వీటి ఫలితాలు నేరుగా రైతులకు అందడానికీ, రైతుల సమస్యలు శిక్షణాకేంద్రాలలో చర్చించి తదనుగుణంగా మార్గాలను వేయడానికి అవకాశాన్ని కల్పించే సంస్థ యీ వ్యవసాయ విశ్వవిద్యాలయం. మన వ్యవసాయ వ్యవస్థలో నూతన చైతన్యాన్ని కలిగించి వ్యవసాయోత్పత్తులను విశేషంగా పెంచడమే ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం లక్ష్యం.

—టి. రాజగోపాలన్

వ్యవసాయోత్పత్తులలో మనదేశాన్ని స్వయం సమృద్ధం చేయదలచిన వారికి యీ విశ్వవిద్యాలయం తోడ్పడుతుంది. "ప్రజల సుఖప్రదమైన జీవితానికి మనం రూపొందించే ప్రణాళికల విజయం ఎప్పుడూ మనం మన వ్యవసాయరంగంలో సాధించిన విజయంమీద ఆధారపడివుంది. అందుచేత వ్యవసాయ విశ్వవిద్యాలయాలు యీ విషయంలో చాలా గురుతరమైన పాత్ర వహిస్తాయనే చెప్పవచ్చు" అని డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు అన్నారు.

నిన్న మొన్నటి వరకూ దేశంలో వ్యవసాయ విద్యావిధానంలో విద్యాబోధన, పరిశోధన, విస్తరణ సర్వీసులు ఒకదానికొకటి సంబంధంలేకుండా విడివిడిగా వుంటూ వచ్చాయి. అందుచేత వ్యవసాయ విద్యార్థులకు యిచ్చే శిక్షణ కేవలం ప్రత్యక్ష అనుభవంగాలేక పుస్తకాభిముఖంగావుంటూ వచ్చింది. అమెరికాలోని లేండ్ గ్రాంట్ యూనివర్సిటీలు బోధన, పరిశోధన, విస్తరణ రంగాలలో ఒక సమీకృత విధానాన్ని ప్రవేశపెట్టి ఆదేశంలో వ్యవసాయాభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డాయి. ఆ పద్ధతే మనమూ అనుసరించదగినదిగా అనిపించింది. పైపెచ్చు యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్, భారత-అమెరికా సంయుక్తబృందాలు రెండు ఫోర్డు ఫౌండేషన్, అగ్రికల్చరల్ ఎడ్మినిస్ట్రేటివ్ కమిటీ-యివన్నీ, కూడా మన వ్యవసాయ కార్యక్రమాలన్నిటినీ సవరించితేనే తప్ప వ్యవసాయదారునికి వాస్తవంగా కావలసినదేమిటో దానిని మనం అందజేయలేమనీ, వ్యవసాయ ఉత్పత్తులను పెంచలేమనీ అభిప్రాయపడ్డాయి.

విశ్వవిద్యాలయాలకు అనుబంధంగావుండే వ్యవసాయ కళాశాలలద్వారా వ్యవసాయసంబంధమైన విద్యను గరపడంలో లోటుపాట్లు చాలా వున్నట్టు 1948 లో రాధాకృష్ణన్ కమిషన్ గుర్తించి అమెరికాలోని లేండ్ గ్రాంట్ యూనివర్సిటీల మాదిరి వ్యవసాయ విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేయాలని గట్టిగా సిఫార్సు చేసింది. 1954లో వ్యవసాయ విద్యను పరిశీలించేందుకై ఏర్పాటు చేసిన తొలి భారత - అమెరికా బృందం యీ సిఫార్సునే అమలు పరచవలసిందిగా తెలియజేసింది. ఇతర విశ్వవిద్యాలయాలమాదిరిగా గ్రామీణ విశ్వవిద్యాలయానికికూడా అధికారులు వుండాలనిన్నీ, ఇతర విశ్వవిద్యాలయాలు యిచ్చే పట్టాలకు ఎలాటి విలువ వుంటుందో ఆదేమాదిరిగా గ్రామీణ విశ్వవిద్యాలయం యిచ్చే పట్టాలకు కూడా విలువ వుండాలనిన్నీ, గ్రామీణ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ కళాశాల, పశువైద్యకళాశాల ఒకే ఆవరణలో వుండి క్రమక్రమంగా సైన్సు కళాశాల, టెక్నాలజీ కళాశాలకూడా ఏర్పాటై దానికితోడు విద్యార్థులకు పరిశోధనాగారంగా వుపయోగించడానికి పరిసరాలలో గ్రామాలుకొన్ని వుండాలనిన్నీ యీబృందం సూచించింది.

వ్యవసాయవిద్య, పరిశోధన విషయాలపై 1959లో మరొక భారత-అమెరికా పరిశీలకబృందం ఏర్పాటుచేయబడింది. ఇదికూడా యీమాదిరి సూచనలనే చేసింది. ప్రతి రాష్ట్రంలోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక్కటైనా నెలకొల్పబడాలని సిఫారసు చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలన్న ప్రతిపాదన 1957లో చేయడం జరిగింది. ఈ విషయాన్ని పరిశీలించేందుకై రాష్ట్రప్రభుత్వం ఒక కమీటీని కూడా వేసింది. దీని సిఫారసులమేరకు ఒక చిత్తుబిల్లు రూపొందించబడింది. నెలకొల్పాలనుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన పథకంకూడా ఒకటి తయారుచేయడం జరిగింది.



ఫిబ్రవరి 9 న తిరుపతిలోని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 4 వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రధాని

1963లో ఈ బిల్లు ఆమోదించబడి చట్టమైంది

ఈ విశ్వవిద్యాలయంలో అధికారాలు ప్రధానంగా మేనేజ్‌మెంట్ బోర్డు, అకడమిక్ కౌన్సిల్, బోర్డు ఆఫ్ ఫేకలటీస్ చేతిలో వుంటాయి.

ఈ విశ్వవిద్యాలయం స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ. దీని విధానాలను బోర్డు నిర్ణయిస్తుంది. ఉపాధ్యక్షుడు ప్రవేశపెట్టే బడ్జెటుకు కూడా ఈ బోర్డు తన ఆమోదాన్ని తెలియజేస్తుంది.

ఈ విశ్వవిద్యాలయ విద్యావిషయాలను అకడమిక్ కౌన్సిల్ చూస్తుంది. విద్యాబోధన, పరీక్షలు, పట్టాల ప్రదానం వంటి తదితర విషయాలలో యీ విశ్వవిద్యాలయ ప్రమాణాలను సరిగా వుండేట్టు చూచే బాధ్యత కూడా యీ కౌన్సిలుదే. ప్రతి ఫేకల్టీకు ఒక బోర్డు వుంటుంది. ఆ ఫేకలటీ డీన్ దీనికి ఛైర్మన్‌గా వుంటారు.

విద్యావిషయాలకు అధిపతిగానూ, ప్రధాననిర్వహణాధికారిగానూ ఉపాధ్యక్షుడే వ్యవహరిస్తారు. ఆయన బడ్జెటును, అకౌంట్లకు సంబంధించిన స్టేట్‌మెంట్లను బోర్డువారికి సమర్పిస్తారు. ఈయనను విశ్వవిద్యాలయ అధ్యక్షులవారే బోర్డువారితో సంప్రదించి అయిదేళ్ళపాటు నామినేట్ చేస్తారు.

ఈ విశ్వవిద్యాలయానికి సంబంధించి యితర అధికార్లు కూడా వున్నారు. ఒకాయన రిజిస్ట్రారు. వీరి అధీనంలో విశ్వవిద్యాలయ రికార్డులు, ముద్ర వుంటాయి. మరొకాయన-కంప్ట్రోలరు. విశ్వవిద్యాలయ ఆర్థిక విధానాలలో ఈయన సలహా

ను యిస్తారు. దీని ఆస్తులు, పెట్టుబడుల నిర్వహణను వీరు చూస్తుంటారు. వీరుగాక విద్యార్థుల బాగోగులను చూసే డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్, వ్యవసాయ పరిశోధన కేంద్రాల డైరెక్టరు, ఎక్స్టెన్షన్ డైరెక్టరు వుంటారు.

ప్రభుత్వం చేసిన చట్టంవల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగావున్న హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో గల వ్యవసాయ కళాశాల, పశువైద్య పశుపోషణ కళాశాల, గృహ విజ్ఞాన శాస్త్రకళాశాలలు; ఆంధ్రవిశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్న బాపట్లలోని వ్యవసాయ కళాశాల; శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి అనుబంధంగావున్న తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల, ఎ. వి. కళాశాల-యివన్నీ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధం చేయబడినవి.

నూతన ప్రయోగాలు

ఈ విశ్వవిద్యాలయం అనేక కొత్తకొత్త ప్రయోగాలను చేసింది. వ్యవసాయ, పశువైద్య, గృహవిజ్ఞాన కళాశాలల్లో తొలి సంవత్సరంలో భౌతిక, రసాయనిక, జీవశాస్త్రాల్లోనూ, ఇంగ్లీషులోనూ ఒకే విధమైన కోర్సును బోధించేందుకై రాజేంద్రనగర్‌లో బేసిక్ సైన్సు కళాశాల ప్రారంభించబడింది.

పరీక్షలను నిర్వహించే విధానంలోకూడా ముఖ్యమైన మార్పు తీసుకురావడం జరిగింది. డా. ఎస్. రాధాకృష్ణన్ నాయకత్వంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయ విద్యాకమిషన్, ప్రస్తుత విద్యా విధానంలో వార్షికంగా జరిపించే పరీక్షలద్వారా విద్యార్థి యోగ్యతను నిర్ణయించే పద్ధతి బదులు ఎప్పటికప్పుడు జరిపించే ప్రశ్నోత్తరావళిద్వారా, లేబరేటరీ తదితర విషయాలలో విద్యార్థి ప్రదర్శించే తీరుద్వారా, నెలాఖరులో జరిపే స్లిప్‌టెస్టుల ద్వారా నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించింది. విద్యార్థులు వ్రాసిన సమాధాన పత్రాలను అక్కడికక్కడే దిద్ది వెంటనే యివ్వడంవల్ల విద్యార్థికి ఎక్కడతను పొరపాటుచేశాడో, ఎక్కడ చక్కగా అన్సరు చేశాడో తెలుస్తుంది. ఈ విధమైన వాస్తవ ప్రతిభా సామర్థ్యాలను నుదింపువేసే పద్ధతి అమెరికాలో అమల్లో వుంది. ఈ పద్ధతిని యీప్రాంతం అవసరాల దృష్టిలో వుంచుకుని కొన్ని మార్పులు చేర్పులతో యీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టడం జరిగింది. మొదట్లో తొలి సంవత్సరం కోర్సులలో దీనిని ప్రవేశపెట్టి అటుపిమ్మట ఆ తర్వాతి సంవత్సరాలకుకూడా విస్తరింపచేయడం జరిగింది.

ఈ విశ్వవిద్యాలయంలో చేసిన మరొక ముఖ్యమైన సంస్కరణ-సలహా విధానాన్ని ప్రవేశపెట్టడం. దీనిప్రకారం ఒక సలహాదారు చెప్పుచేతల్లో కొంతమంది విద్యార్థులను వుంచడం జరుగుతుంది. ఈ సలహాదారు, విద్యార్థులకు విద్యావిషయాల్లో, ఆధ్యాత్మిక నైతిక విషయాలలో సహాయపడుతుంటాడు. మొత్తం రాష్ట్రమంతటా విస్తరణ కార్యక్రమాలను చేపట్టడానికి వీలుగా ఒక వ్యవసాయ విస్తరణ సర్వీసును ప్రారంభించేందుకు ఈ చట్టం వీలు కల్పించింది. వ్యవసాయ కళాశాల తాలూకు విస్తరణ విద్యా విభాగం, రాజేంద్రనగర్ పంచాయతీ సమితిలోని కొన్ని ఎన్నిక చేసిన గ్రామాలలో పంచాయతీ సమితి, జిల్లాపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వశాఖల సహకారంతో విస్తరణ కార్యక్రమాలను చేపట్టుతున్నది. విస్తరణ విద్యాసంస్థకూడా ఒకటివుంది. ఇదికూడా కళాశాలలో ఒక భాగమే. విస్తరణ విద్యాబోధనలో - ముఖ్యంగా గ్రామ సేవకుల శిక్షణకేంద్రంలోనూ, బ్లాకులలో పనిచేసే విస్తరణాధికారుల శిక్షణ కేంద్రంలోనూ - స్థాయిని మెరుగుపరచడం దీని ప్రధానాశయం.

రాజేంద్రనగర్, బాపట్ల, తిరుపతిలలోని కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేటు, అండర్ గ్రాడ్యుయేటు తరగతులకు విద్యగరపడం తోపాటు 1966 జూలైనుంచి రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం క్షేత్రపరిశోధనా బాధ్యతనుకూడా చేపట్టింది. 43 పరిశోధనా కేంద్రాలు దీనిక్రింద వున్నాయి. వీటిలో 41 వ్యవసాయ పరిశోధక కేంద్రాలు, 2 పశు సంవర్ధక పరిశోధకకేంద్రాలు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విశ్వవిద్యాలయానికి 108 పరిశోధన పథకాలను బదిలీ చేసింది.

రాజేంద్రనగర్‌లోనిప్రసిద్ధ కిద్వాయి ఉద్యానవనం కూడా మొన్న ఈ మధ్యనే విశ్వవిద్యాలయ యాజమాన్యంక్రిందకు బదిలీ చేయబడింది. దీనితో రాజేంద్రనగర్ పరిశోధనా సంస్థ ఆవరణ పెరిగి కొత్తశోభ చేకూరింది. విశ్వవిద్యాలయానికీ, సమాజానికీ అధిక ప్రయోజనం చేకూరేట్లు దాదాపు 2000 ఎకరాల విస్తీర్ణంగల యూనివర్సిటీ ప్రాంగణాన్ని అభివృద్ధిపరచేందుకు "ఫారమ్ డెవలప్‌మెంటు" అనే కొత్త సంస్థను నెలకొల్పడంకూడా జరిగింది. పరిశోధన, విస్తరణ రంగాలను మరింత ఫలప్రదంగా, విజయవంతంగా నిర్వహించేందుకు, విశ్వవిద్యాలయ అధినేతలు ఒక సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి, వ్యవసాయదారులకు, శాస్త్రజ్ఞులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించే అభ్యుదయ రైతులను యిందులో సభ్యులుగా చేర్చుకోవాలని తీర్మానించారు.

విద్యావిస్తరణ కార్యక్రమంలో ఒక భాగంగా విశ్వవిద్యాలయం వర్తమాన సంవత్సరం (1969) లో నూరు జాతీయ ప్రదర్శనా కేంద్రాల నిర్వహణను చేపట్టింది. ఈ కేంద్రాలు భారత వ్యవసాయ పరిశోధనా సంస్థవారు కేటాయించినవి. వ్యవసాయదారుల్లో పనితనాన్నీ, కొత్త వ్యవసాయ పద్ధతులనూ పెంపొందించే ఉద్దేశంతో వ్యవసాయదారుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు విశ్వవిద్యాలయం ఆలోచిస్తున్నది.

2,670 మంది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలోను, 214 మంది పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలోను ప్రస్తుతం వున్నారు. యమ్. యస్. సి. స్థాయిలో ప్రవేశాలు కోరే వారి సంఖ్య అధికం కావడంతో, 1967-68 విద్యాసంవత్సరంలో యమ్.యస్.సి. (అగ్రికల్చర్) కోర్సులో సీట్ల సంఖ్య 50 నుండి 100కు పెంచడం జరిగింది. మాస్టర్స్ డిగ్రీ లభించేందుకు అవకాశం కల్పించే విధంగా పశువైద్యశాస్త్ర వివిధశాఖలలో పోస్టు గ్రాడ్యుయేట్ తరగతులను వర్తమాన విద్యా సంవత్సరంనుంచీ, హైదరాబాద్, తిరుపతి వెటర్నరీ కాలేజీలలో ప్రారంభించడం జరిగింది. గృహ విజ్ఞాన శాస్త్రంలో యమ్ యస్.సి. డిగ్రీ పొందేందుకూ, వ్యవసాయ



రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం తాలూకు పాత హాస్టలు భవనం

రంగంలో పి.హెచ్‌డి. పొందేందుకు వీలుగా పోస్టు గ్రాడ్యుయేటు కోర్సులనుకూడా త్వరలో ప్రవేశపెట్టబోతారు.

1968 లో 'హోమ్‌సైన్స్' కళాశాలలో, నర్సరీ పాఠశాల నొకదానిని ప్రారంభించారు. స్త్రీల ప్రయోజనార్థం పౌష్టికాహారం, వస్త్రాలు, దుస్తులు, గృహయాజమాన్యం మొదలైన విషయాల్లో చిన్నపాటి కోర్సులను ప్రారంభించాలనికూడా నిర్ణయించారు.

ముసోరీలోని అకాడమీ అఫ్ అడ్మినిస్ట్రేషన్ వారి అభ్యర్థనను పురస్కరించుకొని రెండు జట్టులలో ఐ.ఎ.యస్. ప్రొబేషనర్లకు శిక్షణ యివ్వడం జరిగింది. జిల్లా అధికారులుగా తాము నిర్వర్తించే సంక్షేమ విధ్యుక్త ధర్మాలతోపాటు, కొత్తవ్యవసాయ పద్ధతులను పల్లెప్రాంతాల్లో ప్రచారంచేసి ప్రోత్సహించడంలో ఎదుర్కొనే సమస్యలను విజయవంతంగా పరిష్కరించుకొనేందుకు ఈ శిక్షణ వీరికి తోడ్పడుతుంది.

వ్యవసాయరంగంలో రైతులకు సకాలానికి పనికివచ్చే అభివృద్ధివిషయాల సమాచారాన్ని అందించే తలంపుతో ప్రతిదినం ఐదునిమిషాలపాటు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంనుండి ప్రసారమయ్యే ఒక కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని వివిధ కేంద్రాలు రిలే చేస్తాయి. దేశం మొత్తంమీద మొట్టమొదటిదిగా పరిగణింపబడే ఈ కార్యక్రమం విరివిగా వ్యవసాయదారుల మెప్పును చూరగొనడం ముదావహమైన విషయం.

వ్యవసాయశాస్త్రానికి సంబంధించిన వివిధ విషయాలను రైతులోకంలో త్వరితంగా ప్రచారమయ్యేటట్లు చూడడం ముఖ్యమైన విషయం కావడందృష్ట్యా, భారతీయ వ్యవసాయ పరిశోధనాసంస్థ, వీలైనంతవరకూ ఫోర్డు ఫౌండేషన్‌వారి సహకారంతో, కట్టుదిట్టమైన పద్ధతిలో నడిచే ఒక వ్యవసాయ ప్రచార కేంద్రాన్ని నెలకొల్పి, అన్ని ప్రచారసాధనాల వినియోగంలో నిపుణతను సంపాదించేందుకు శిక్షణ నేర్పాటుచేయాలని సంకల్పించింది. ఈ సందర్భంలో వ్యవసాయానికి సంబంధించిన పత్రికల నిర్వహణలో కూడా శిక్షణ ఏర్పాటుచేయాలని అనుకుంటున్నారు.

విశ్వవిద్యాలయంలో వ్యవసాయ యింజినీరింగ్‌కు సంబంధించిన విభాగాన్నికూడా ప్రారంభించాలని తీవ్రంగా యోచిస్తున్నారు. డ్రెయినేజి, భూసారపరిరక్షణ, వ్యవసాయానికి పనికివచ్చే యంత్రాలు, సాగుకు లాయకగా వ్యవసాయ భూముల మరమ్మత్తు, నీటిపారుదల విషయాలకు సంబంధించి, వుంటుంది ఈ వ్యవసాయ యింజనీరింగ్ విభాగం. మొదట్లో అండర్ గ్రాడ్యుయేటు, పోస్టు గ్రాడ్యుయేటు స్థాయిలో బోధనాపాటవాన్ని పటిష్ఠంచేసి క్రమేణ క్రమబద్ధమైన నిర్ణీత నియమావళి మేరకు యీ యింజనీరింగ్ శాఖ కట్టుదిట్టమైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

పంటపండించవలసిన పరిసరాలకు, వాతావరణానికి అనుకూలించే వివిధ వంగడాలను వుత్పత్తిచేసి, వ్యవసాయ పద్ధతులను అభివృద్ధిచేసేందుకు కృషిచెయ్యడమే ప్రస్తుతం విశ్వవిద్యాలయం ప్రధానాశయంగా పెట్టుకొన్నది. ఇటీవలనే విశ్వవిద్యాలయం విడుదలచేసిన కొత్త వంగడాలను పరిశీలించినట్లయితే విశ్వవిద్యాలయ ఆశయం మనకు సులభంగా బోధపడుతుంది. కొత్తవంగడాలు: (1) హెచ్చుపంటనిచ్చే వరివంగడం-హంస, (2) సొర్గమ్-స్వర్ణ, (3) పత్తి-కృష్ణ, (4) మిర్చి (5) చెరకు వీటిలో కడపటి రెండింటికీ సరియైన పేర్లు పెట్టలేదు


ఇతర సంస్థలతో పరస్పర సంబంధాలు

అమెరికాకు చెందిన కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీవారు, డా॥ ఆర్థర్ డి. వెబెర్ నాయకత్వాన అనుభవజ్ఞులైన అధ్యాపక బృందాన్ని యిక్కడకుపంపి విశ్వవిద్యాలయానికి తోడ్పడుతున్నారు. పరిశోధనా రంగంలో సలహాదారుగా డా॥ వెబ్‌స్టర్ పశువైద్యశాస్త్రంలో సలహాదారుగా డా॥ ఎరల్ యస్. మూర్‌లు యిక్కడికి వారువచ్చినపని ముగించుకొని వారివారి పదవీకాలం ముగియగానే యిటీవలనే అమెరికాకు తిరిగి వెళ్ళారు. ప్రాంగణ అభివృద్ధివిషయమై సలహాదారుగా విచ్చేసిన ప్రొఫెసర్ జె. హెచ్. మిల్లర్ యిప్పటికే యించుమించు తనువచ్చినపని పూర్తిజేసుకున్నారు.

యమ్.యస్‌సి; పి.హెచ్‌.డి. పై చదువుల నిమిత్తం యిక్కడి విద్యార్థులనుకూడా చాలామందిని కాన్సాస్‌స్టేట్ యూనివర్సిటీ, తదితర యూనివర్శిటీలకు పంపించడం జరిగింది. నేటికీ యీ పద్ధతి కొనసాగుతూనేవుంది. అమెరికాలోను, ఐరోపాలోను మరికొన్ని విశ్వ విద్యాలయాలకు కూడా యిక్కడి విద్యార్థులను పంపడం జరుగుతున్నది. వైస్‌ఛాన్సలర్, శ్రీ ఒ. పుల్లారెడ్డి ఐ.సి.యస్. (రిటైర్డ్) అధిపత్యంక్రింద విశ్వవిద్యాలయం త్వరితగతి అభివృద్ధి చెందుతూ వస్తున్నది. విశ్వవిద్యాలయానికి, చెందిన వివిధ శాఖలను నెలకొల్పేందుకు తగినన్ని భవనాలు అతివేగంగా నిర్మింపబడినవంటే అందుకు శ్రీ పుల్లారెడ్డిగారే కారకులు.

భవన నిర్మాణ కార్యక్రమం

ఒక రెండు సంవత్సరాలలోపుగానే విశ్వవిద్యాలయ భవన నిర్మాణ కార్యక్రమంలో సాధించిన అపూర్వ ప్రగతి విశేషించి చెప్పుకోదగినది.



శ్రీ చవన్ వ్యవసాయ కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

1969 జనవరి 10న దేశవ్యవహారాల మంత్రి శ్రీ వై. బి. చవన్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల భవననిర్మాణ పథకానికి ప్రారంభోత్సవం చేశారు. ఏడున్నర కోట్ల రూపాయలు విలువచేసే విశ్వవిద్యాలయ భవన నిర్మా పథకంలో రాజేంద్రనగర్, తిరుపతి, బాపట్ల కళా శాలల ప్రాంగణాలను అభివృద్ధిపరచేందుకు సంకల్పించబడింది.

ప్రధానంగావుండే రాజేంద్రనగర్ ప్రాంగణాన్ని వృద్ధిపరచేందుకు దాదాపు రు. 5.25 కోట్లు ఖర్చవుతుందని అంచనా. వ్యవసాయ శాస్త్రం, పశువైద్య శాస్త్రం, గృహవిజ్ఞాన శాస్త్రం–ఈ మూడుశాఖలకు అవసరమయ్యే భవన నిర్మాణం ఖర్చుకూడా యిందులో చేరివుంటుంది. యిదికాక సుమారు 2000 మంది విద్యార్థులకు వసతి కల్పించే హాస్టలు భవనాలు, 800 మంది సిబ్బందికి సరిపోయే యిళ్ళు, ఒక సెంట్రల్ లైబ్రరీ, ఆటస్థలాలు మున్నగువాటిమీద ఖర్చుకూడా యిందులోనే చేరివుంటుంది.

ఈ కార్యక్రమానికి సంబంధించిన రు 15 లక్షలు ఖరీదు చేసే విద్యార్థుల వసతి గృహం, రు. 11 లక్షలు ఖరీదుచేస్తూ 100 మందికి సరిపోయే జూనియర్‌స్టాఫ్ క్వార్టర్లు పూర్తిగావించడం జరిగింది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ప్రాంగణానికి సంబంధించి రు. 5 లక్షలు ఖరీదుచేసే ప్రధాన భవన నిర్మాణం కార్యక్రమం కూడా పూర్తిచేయడం జరిగింది. బహుశ దేశంలోకే పెద్దదిగా భావించబడే ఈ భవనంలో బోధన, పరిశోధనా రంగాలకు సంబంధించిన అండర్ గ్రాడ్యుయేటు, పోస్టు గ్రాడ్యుయేటు శాఖలతోపాటు ఆయాశాఖల విస్తరణ విభాగాలకూ, ఐ.సి.ఏ.ఆర్, ఫోర్డు ఫౌండేషన్ సహకారంతో నెలకొల్పబడిన అగ్రికల్చరల్ కమ్యూనికేషన్ కేంద్రానికి వసతి లభించాలి. కాలేజీలో 50 లేబొరేటరీలు, ఒక ఆడిటోరియం, ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసువుంటాయి, 300 మంది విద్యార్థులకు ఒక వసతిగృహం, 20 మంది సీనియర్ సిబ్బంది నివాసగృహాలకు సంబంధించిన భవననిర్మాణ కార్యక్రమం వెంటనే ప్రారంభమౌతుంది.

నూతన భవన నిర్మాణ పథకం ప్రారంభోత్సవ సమయంలో ప్రసంగిస్తూ వైస్‌ఛాన్సలర్ శ్రీ పుల్లారెడ్డి, 800 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకూ, 200 మంది పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకూ శిక్ష నిచ్చేందుకు వీలుగా ఈ వ్యవసాయ కళాశాల భవన నిర్మాణ పథకం డిజైను చేయబడిందని అన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలనుండీ, ప్రభుత్వ కళాశాలలనుండి, పరిశోధనా సంస్థలనుండి సంక్రమింపజేసుకొన్న బోధనా, పరిశోధనా, విస్తరణ విషయాల సమగ్ర అభివృద్ధికి సంబంధించి అవసరమయ్యే భౌతిక సదుపాయాలన్నింటినీ ఒకేచోట కల్పించి, ఆయాశాఖలను పని చేయించాలనే వ్యవసాయకళాశాల నూతన దృక్పథానికి అనుగుణ్యంగానే ఈ భవన నిర్మాణకార్యక్రమం రూపొందించబడిందని కూడా ఆయన అన్నారు. పరిశోధనా, బోధనా కార్యకలాపాలకు సంబంధించిన భౌతిక సదుపాయాల మాట అటుంచి, ఆయా శాఖలను నిర్వహించే సిబ్బంది పనితనాన్ని అభివృద్ధిచెందించే కృషియే ఒకపెద్ద సమస్యగా తయారయింది. వివిధ కాలేజీలను విశ్వవిద్యాలయానికి బదిలి చేసుకొనే సమయంలో, ఈ సంస్థలలో పనిచేసే సాంకేతిక సిబ్బందిలో మూడోవంతు కేవలం అండర్ గ్రాడ్యుయేట్లు. ఇక పరిశోధనా విభాగంలో చూస్తే 500 మందికిగాను ఆరోవంతు మాత్రమే పోస్టుగ్రాడ్యుయేట్లుగా వున్నారు అని కూడా శ్రీ పుల్లారెడ్డి అన్నారు. అధ్యాపకులు, పరిశోధనాకృషి జరిపేవారిలో యోగ్యతలను, సాంకేతిక నైపుణ్యాన్ని త్వరితగతిని మెరుగుపరచాలనే ధృడసంకల్పంతో వీరిని ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, అమెరికాలోని కాన్సాస్ స్టేట్ యూనివర్శిటీకి పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల నిమిత్తం పంపించడం ద్వారా పైలోపాన్ని దాదాపు తుడిచివేయగలిగిన పరిస్థితిని చేరుకున్నామని చెప్పవచ్చు నని కూడా అన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ యిండియా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అభ్యర్థనలను పురస్కరించుకొని విశ్వవిద్యాలయం వారు దేశం మొత్తంమీద వివిధ బ్యాంకులలో పనిచేసే 30 మంది ఉద్యోగులకు, రైతులకు పరపతి సౌకర్యాల నందజేసే విధానంపై శిక్షణ నిచ్చే ఒక చిన్నపాటి కోర్సును కూడా నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం సత్ఫలితాలనివ్వడంతో, తమబ్యాంకు ఉద్యోగస్థుల ప్రయోజనార్థం ఈ కోర్సును తిరిగి నిర్వహించవలసిందిగా కోరటం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, యు.యస్.ఎ.ఐ.డి. ఏజెన్సీల సహాయ సహకారాలతోనూ; విద్యార్థులూ, సిబ్బందిసౌజన్య సౌమనస్యాలతోనూ, రైతులూ వ్యవసాయ రంగానికి చెందిన ప్రముఖుల ఆదరాభిమానంతోనూ ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం కనీసం ఆంధ్రప్రదేశ్‌లోనైనా వ్యావసాయిక విజ్ఞానాన్ని దృఢతరం చేసే ప్రముఖ సాధనంగా తయారు కాగలదని ఆశిద్దాం.

గ్రామాలకు మంచినీటి సరఫరా

—కె. ఎల్. రావు

ప్రతి గ్రామంలోను పరిశుభ్రమైన నీటి సరఫరా ఏర్పాట్లు ఉండాలని గాంధీజీ ఆశించేవారు. మరి నేటి మన పరిస్థితి ఏమిటి ?

గాంధీ మహాత్ముని దృష్టిలో స్వరాజ్యం కేవలం గ్రామాల సేవకే పరిమితమైంది. తక్కిందంతా కేవలం స్వప్న ప్రాయం మాత్రమే.

త్రాగేందుకూ, వ్యవసాయానికీ నీటిని సరఫరా చేయటం, పారిశుధ్య సదుపాయం కల్పించటం, విద్యుచ్ఛక్తి సరఫరా ఏర్పాట్లు చేయటమే గ్రామాభ్యుదయానికి చేయగల ఉత్తమసేవ. ప్రతి గ్రామానికీ ఈ సదుపాయాలన్ని లభించేట్లైతే దారిద్ర్యము, క్షామము, ఇంకా తత్సంబంధమైన ఉపద్రవములు అన్నీ భారత సరిహద్దులనుండి, సర్వకాలాలకు తుడిచి పెట్టబడతాయి. నూటికి ఎనభైమంది—అంటే సుమారు నలభైకోట్ల జనాభా—చిన్న, పెద్ద గ్రామాల్లోనే నివసిస్తునారు కాబట్టి మనకు ఆ దృక్పథం అవసరం. పల్లెల నుంచి పట్టణాలకు ప్రజలు వలసపోవటం ఫలితంగా అక్కడ మురికి వాడలు ఏర్పడకుండా నిరోధించటం వివేకవంతమైన పని, లాభదాయకమైన పని కూడాను. మనకు గాలి ఎంత అవసరమో గ్రామీణులకు మంచినీరు కూడా అంతే అవసరం.

ప్రతి గ్రామంలోను పరిశుభ్రమైన మంచినీటి సరఫరా ఏర్పాటు ఉండాలని గాంధీజీ వాంఛించేవారు. కాని మనస్థితి ఏమిటి?

ప్రతి ఐదుగురిలోను ఒకనికి మాత్రమే నిత్యావసరమగు పరిశుభ్రమైన మంచినీరు లభిస్తోంది. మిగిలిన నాలుగున్నర లక్షల గ్రామాలకు ఏదో విధంగా ఇబ్బంది కల్గుతూనే ఉంది. మూడు వంతుల గ్రామాలకు మంచినీటి కొరత ఉంటున్నది. ముఖ్యంగా ఎండాకాలంలో బావులు ఎండిపోతాయి. మరో మూడువంతుల గ్రామాల్లో నీరు అనారోగ్యకరమైనది. ఆ నీటిలో ఫ్లోరైడు కానీ, క్లోరైడు కానీ అధికంగా ఉంటున్నాయి. లేదా మరోదోషం ఏదైనా ఉంటున్నది. కొన్ని గ్రామాల్లో మంచినీటికోసం, ఎనిమిది లేక పదిమైళ్లు కాలినడకన పోవలసివస్తున్నది. ఇంకో మాటలో చెప్పాలంటే, ఈ గ్రామాల్లో త్రాగేనీరు లేనేలేదు.

మొత్తం ఉన్న 5 లక్షల 70 వేల గ్రామాలలోను, వెయ్యి కాని అంతకంటె తక్కువకాని జనాభాగల గ్రామాలు 5 లక్షలున్న విషయం గుర్తించాలి. మంచినీటి సదుపాయం లేని చిన్న చిన్న గ్రామాలు చాలా ఉన్నాయి. నిమ్న జాతులైన హరిజనులు, ఆదివాసులు ఈ గ్రామాల్లోను, చిన్న చిన్న పల్లెలలోను నివసిస్తున్నారు. గాంధీజీ కన్న కలలు ఫలింపజేయుటకు, ఈ గ్రామాల వైపు, మంచినీరు లేని పల్లెలవైపు ఆరోగ్యకరంగాగాని, సమృద్ధిగాగాని నీటి సరఫరా లేని గ్రామాలవైపు మన దృష్టి సారించాలి. నేటినుంచి 1970 అక్టోబరు వరకుగల కాలంలో, త్వరితగతిని పూర్తిచేసే విధంగా ఈ కార్యక్రమాలకు నాంది పలకాలి.

గణనీయమైన కృషి

ఈ విషయమై స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మన ప్రభుత్వం గణనీయమైన కృషిచేసింది. 150 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, నాల్గున్నర లక్షల కొత్తబావులు త్రవ్వించింది. సుమారు ఆరులక్షల పాతబడ్డ బావులను బాగు చేయించింది. సుమారు 17,500 గ్రామాలకు కొళాయిలద్వారా నీటి సరఫరా ఏర్పాట్లు చేయబడ్డాయి. నాల్గవ ప్రణాళికలో మరొక 150 కోట్ల రూపాయల మేరకు ఖర్చు పెట్టటానికి ఉద్దేశించారు కాని ప్రారంభంలో చెప్పినట్లుగా ఈ సమస్య ఇంకా తీవ్రంగానే ఉన్నది. ప్రభుత్వము, ప్రజలు కలిసిమెలిసి కృషిచేయటం అవసరం.

కొరత ప్రాంతాలలో నీటిసరఫరాకు ఏర్పాట్లు చేయటంలో నీటి వనరులు కనుగొనుటే మొదటి అడ్డంకి. నదులనుండి, కాలువలనుండి, చెరువులనుండి నీరు లభిస్తుంది. బావులలోను, లోతైన నూతులలోను, గొట్టపు బావులలోనుకూడా నీరు లభిస్తుంది. ఈ రెండు విధములా కూడా నీటిని పొందవచ్చును,

తక్కువగా వర్షములు కురిసినప్పటికీ, ఆ వనరులు, సంవత్సరము పొడవునా నీటిని సరఫరా చేయగలవి కావాలి, అనగా త్రాగేందుకూ, వ్యవసాయానికీ సమృద్ధిగా నీరు లభించేదిగా ఉండాలి. ప్రతినాల్గు సంవత్సరాలలోనూ కనీసం మూడు సంవత్సరాలపాటు, ఈ వనరుల ద్వారా నమ్మకంగా నీరు లభించేట్లు ఉండాలి. ఇక్కడ ఇంకా మరికొన్ని ప్రయోజనాలుకూడా పరిశీలించవచ్చు. భూమిలోని నీటిని ఉపయోగంలోనికి తేవడం సులభం. పరిశుద్ధం చేయనవసరం కూడా ఉండదు. భూమి

లోతట్టున లభించునీటిలో, నదులు మొదలైన వాటిలో దొరకు నీటి కంటె మాలిన్యములు తక్కువ. భూమి ఉపరితలంపై దొరకు నీటిని వ్యవసాయమునకు సులభంగా విరివిగా ఉపయోగించుకో వచ్చును.

దురదృష్టవశాత్తూ, కొరత ప్రాంతాల్లో నీటి వనరుల గురించిన అవసరసమాచారం లభించటంలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ఉపయోగించుకోవాలి. పరిశీలనలుచేసి మరి కొంత సమాచారం సేకరించాలి. గ్రామజనాభా సేకరణ, నీరు లభ్యమయ్యే విధము, వనరులు, నీటిని పరిశుభ్రపరచు విధానం మొదలగు విషయాలనుగురించి కూడా సమాచారం సేకరించాలి.

బావులు, లోతు చేయవలసిన నూతులు, లోతైన గొట్టపు బావులు, పంటకాలువలు, దగ్గరలో ప్రవహించే కాలువలు అన్నీ నీటి వనరులే. ఇవన్నీ కూడా అందుబాటులో ఉండకపోవచ్చు. అప్పుడు కొన్ని గ్రామాలకు కలిపి గొట్టములద్వారా నీటి సరఫరా పథకము ఏర్పాటు చేసుకోవచ్చు. హిమాచల ప్రదేశ్‌లోను, ఉత్తర ప్రదేశ్‌లోను కల కొండ ప్రాంతాలలో మాదిరి కొన్ని గ్రామాలు, నదులకు దూరంగా ఎత్తైన ప్రదేశాల్లో ఉంటాయి. ఈ సందర్భాల్లో, గొట్టములద్వారా నీటిని 500 నుండి 2000 అడుగుల ఎత్తువరకు తీసికొని పోవచ్చును ఈ ఎత్తైన ప్రదేశాల్లో, కొళాయి పథకాలను నిర్వహిస్తున్నప్పుడు, అసలు ధరకే విద్యుచ్ఛక్తిని సరఫరా చేయాలి. పెద్ద పరిశ్రమలో యిట్లే జరుగుతోంది. ఇట్లే ఉత్తర ప్రదేశ్‌లోని బాబేల్ ప్రాంతము, రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలు, గుజరాత్‌లోని ఉప్పునీటి ప్రాంతాలు చాలా విచిత్రమైనవి. వీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఎప్పటికైనా ఎంత ఖర్చుఅయినా సరే మన గ్రామాలకు, మంచి నీటి సరఫరా ఏర్పాట్లు చేయక తప్పదు.

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వార్ధాలోని "సేవాగ్రామ్" ఆశ్రమంలో మానవ జీవితానికి ప్రాథమిక అవసరాలు అనే అంశపై ఏర్పాటు చేయబడ్డ ఉపసంఘం సమావేశమైంది. ప్రజలు తమంతట తాము చేయగల పని ఏదో నిర్ణయం చేయుటకూ, జన సామాన్యం ఉత్సాహంగా ఈ పథకాలలో పాల్గొనేట్టు చేసే వాతావరణం కలుగచేయుటకూ, ఈ సమావేశం ఏర్పాటైంది. శ్రీ జగజీవన్‌రామ్, శ్రీ శ్రీమన్నారాయణ్, యింకా అనేకమంది నాయకులు హాజరైన ఈ సమావేశంలో ఉపయోగకరమైన, నిర్మాణాత్మకమైన సూచనలు చేయబడ్డాయి.

ప్రస్తుతం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లోని అనేక మంత్రి వర్గాలచే, ఈ నీటిసరఫరా సమస్య పరిశీలింపబడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా ఒకే ఒక వ్యవస్థ క్రిందఉండాలని సూచించబడింది. ఈ సంవత్సరం అక్టోబరు రెండవ తేదీతో అంతమయ్యే గాంధీ శతజయంత్యుత్సవ సంవత్సరంలో వెయ్యి లేక అంతకు తక్కువ జనాభా గల్గిన ఒక లక్ష గ్రామాలకైనా మంచినీటి సరఫరా సదుపాయం కల్గించాలని నిర్ణయింపబడింది. ఆ సమావేశంలోనే 25,000 బావులు త్రవ్వేందుకు, వివిధ కళాశాలల్లోని పెక్కు ఉపాధ్యాయ, విద్యార్థి, క్రైస్తవ సంఘాలు ముందుకు వచ్చాయి.

తర తరలుగా మన ప్రాచీన ఔన్నత్యము, సంప్రదాయము కూడా దప్పికగొన్నవారికి నీరుయిచ్చుటను భగవంతునకూ, మానవాళికీ చేసిన అత్యుత్తమ సేవగా పరిగణించాయి.

మన సంస్కృతీ. సంప్రదాయము ఉత్తమమైనవిగా మనము పరిగణిస్తాము. ప్రాచీనకాలంనుండి భారతదేశంలో ఏదైతే అత్యుత్తమమైనదో అదంతా మూర్తీభవించిన జాతిపిత పవిత్ర సంస్మృతి సందర్భంగా వచ్చిన ఈ అపూర్వ అవకాశం చేజార్చుకోగూడదు. గాంధీజీ, తన జీవితం యావత్తూ దేశసేవకే అంకితం చేశారు. ఆయనచేసిన కొన్ని ప్రాథమిక ఉపదేశములైనా ఆచరించి, ఆయనచేసిన సేవలకు తగినవారమని నిరూపించుకోవాలి.

★

చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవవలెనోయి,

అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి.

—గురజాడ

మన పరిశ్రమలు

విశాఖపట్టణం నౌకాశ్రయాభివృద్ధికిచర్యలు

ఇనుప ఖనిజాన్ని ఓడల్లోకి ఎక్కించేందుకు విశాఖపట్టణం ఓడరేవులో ఇప్పుడున్న యంత్రం, ఇప్పట్లో సాలీనా 45 లక్షల టన్నుల సరుకును ఓడల్లో చేర్చేందుకు మాత్రమే వీలున్నది. ఇలా కాక సాలీనా 60 లక్షల టన్నుల ఖనిజాన్ని ఓడలోకి నింపేందుకు వీలుగా ఈ యంత్రాన్ని మెరుగుపరిచే పని ఇప్పుడు జరుగుతున్నది. 57 లక్షలరూపాయలు ఖర్చు అయ్యే ఈ పని 1969 అక్టోబరుకల్లా పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

విశాఖపట్టణంలో ఇప్పుడున్న నౌకాశ్రయానికి ఎగువన, ఖనిజాలను మోసుకొనిపోయె బాగా పెద్దరకం ఓడల్లోకి సరుకును ఆధునిక యంత్రాల సహాయతో నింపేందుకు అనువైన మరో రేవును నాల్గవ ప్రణాళికా కాలంలో ఏర్పాటు చేయాలని కూడా సంకల్పించడమయింది.

టర్బోవిద్యుదుత్పాదక యంత్రం సరఫరా

పంజాబ్‌రాష్ట్రంలో భటిండా అనే చోట నెలకొల్పబోతూన్న థర్మల్ కేంద్రానికి, 1,10,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల టర్బో రకం యంత్రాన్ని సప్లయి చేసేందుకు, పంజాబ్ విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలితో ఒక బేరాన్ని నికరపరుచుకున్నట్లు, హైదరాబాద్ సమీపానగల భారత భారీ విద్యుత్ పరికరాల కర్మాగారం అధికారులు ప్రకటించారు. ఈ యంత్రం ఖరీదు నాలుగు కోట్ల రూపాయలకు పైన ఉంటుంది. రాగల కొన్ని నెలల్లో ఇదే రకం యంత్రం మరొకటి సప్లయి చేసేందుకు బేరం రాగలదని భావిస్తున్నట్లు కూడా భారీ విద్యుత్ పరికరాల సంస్థ తెలియ చేసింది.

ఈ థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎన్నిక చేసేందుకుగాను, పంజాబ్ విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలి అధ్యక్షుడు శ్రీ ఆర్. యస్. గిల్, హైదరాబాద్‌లోని భారత భారీ విద్యుత్ పరికరాల కర్మాగారంలో వాణిజ్య విషయాల ప్రధానాధికారి శ్రీ యస్. రామస్వామి, ఇరుపక్షాల ఉన్నతాధికారులు మరికొందరు కలిసి, ఆ ప్రదేశంలో పరిశీలన జరిపి స్థలం నిర్ణయించి వచ్చారు. భటిండా పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరాన గల ఒక స్థలాన్ని ఎన్నిక చేశారు. నూట పదేసి మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగలయంత్రాలు రెండింటిని నెలకొల్పడానికి వీలుగా ఈ థర్మల్ కేంద్రాన్ని రూపొందిస్తున్నారు. దరిమిలా, అయిదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఇలాంటి యంత్రాలు మరోరెండింటిని ఏర్పాటు చేసేందుకు వీలు ఉంటుంది. పక్కగా ప్రవహించే సర్హింద్ కాలువలో నీటిని, ఈథర్మల్ కేంద్రంలో యంత్రాలను చల్లబరచడానికి ఉపయోగిస్తారు. ఈ కేంద్రానికి అవసరమైన బొగ్గు, బీహార్ రాష్ట్రంలోని సంగౌరీ గనుల నుంచి సరఫరా అవుతుంది. 220 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికి తగిన విధంగా ఈ కేంద్రాన్ని నెలకొల్పడానికి 40 కోట్ల రూపాయల పెట్టుబడి అవసరమవుతుంది.

ఈ విద్యుత్ కేంద్ర నిర్మాణానికిగాను, పంజాబ్ విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలి, 160 యకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నది. దాదాపు 400 మంది సిబ్బందికి ఇళ్లు నిర్మించడానికై మరో 70 యకరాలను సేకరించింది. ఈ విద్యుత్ కేంద్రానికి సరిఅయిన విధంగా రూపకల్పన చేయడంలో, భారత భారీ విద్యుత్ పరికరాల సంస్థ చాలా బాధ్యత వహిస్తున్నది.

హైదరాబాద్‌లోని భారీ విద్యుత్ పరికరాల కర్మాగారం నుంచి, కొత్తగూడెంలోని, బీహారులో పత్రాటులోని థర్మల్ కేంద్రాలకు నూట పదేసి మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల యంత్రాలనూ, తమిళనాడులోని ఎన్నూరు, ఉత్తరప్రదేశ్‌లోని హరిద్వార్ గంజ్, ఢిల్లీ దగ్గరి ఇంద్రప్రస్థంలోని కేంద్రాలకు అరవయ్యేసి మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల యంత్రాలనూ, సరఫరా చేస్తున్నారు.

ట్రాక్టరు అద్దె కేంద్రాలు

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, పరిశ్రమల కార్పొరేషను, రైతులకు వ్యవసాయం కొరకు అద్దెకు ఇచ్చేనిమిత్తం, 25 అశ్వశక్తి కలిగిన యాభై జెటర్ 2011 ట్రాక్టర్లను సమకూర్చుకున్నది. వీటికి నాగళ్లు, హారో కట్టివేటర్లు, వడ్లర్లు మొదలయిన అవసరమైన సాధన సామగ్రిని అమర్చడం జరుగుతున్నది.

ఈ ట్రాక్టర్లతో, నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ఒక అద్దె కేంద్రాన్ని నెలకొల్పనున్నారు.

పోచంపాడు, తుంగభద్ర, మధ్య పెన్నారు, కడెం, రాజోలి బండ తదితర ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాలలోకూడా ఇటువంటి అద్దె కేంద్రాలను ప్రారంభించదలచారు.

ఈ ట్రాక్టర్లను గంటకు రూ. 25 చొప్పున అద్దెకు ఇస్తారు. అవసరమైనవారు గురజాల, సత్తెనపల్లి, నర్సారావుపేట, వినుకొండ, గుంటూరు, మిర్యాలగూడెంలోని అసిస్టెంట్ అగ్రికలర్చల్ ఇంజనీర్లను సంప్రదించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయాభివృద్ధి: తులనాత్మక పరిశీలన

ఆర్థికాభివృద్ధివల్ల చేకూరు ప్రయోజనాలను, తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకు విస్తృతీకరించడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి సంబంధించిన ముఖ్యలక్ష్యాలలో ఒకటి. ఆర్థిక వ్యవస్థ పురోగతి, వివిధ ప్రాంతాలు సాధించిన అభివృద్ధిలో ప్రతిఫలిస్తుంది. ఆ యా ప్రాంతాలలో వనరులను ఇతోధికంగా అభివృద్ధి పరచడంవల్ల, మొత్తంమీద ఆర్థిక వ్యవస్థ పురోగతి వృద్ధిచెందుతుంది. చారిత్రక కారణాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్, కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా అనే మూడు ప్రాంతాలతో కూడుకొని వున్నట్లు పరిగణించబడుతున్నది. రాష్ట్రంలోని యీ మూడు ప్రాంతాలలో ముఖ్యమైన కొన్ని ఆర్థికరంగాలలో సాధించిన అభివృద్ధిని గురించి అధికారికమైన అంకెల సహాయంతో పరిశీలించడానికి ఈ వ్యాసంలో ప్రయత్నం జరిగింది.

సేద్యపునీటిపారుదల, విద్యుచ్ఛక్తి

1956-57వ సం.రం నుంచి 1964-65వ సం.రం వరకుగల కాలంలో సేద్యపునీటి పారుదల సౌకర్యాలు పొందిన భూమి నికర విస్తీర్ణం కోస్తా ఆంధ్ర జిల్లాలలో 41·14 లక్షల ఎకరాల నుంచి 45·36 లక్షల ఎకరాలకు, రాయలసీమలో 9·73 లక్షల ఎకరాలనుంచి 11·81 లక్షల ఎకరాలకు, తెలంగాణాలో 19·81 లక్షల ఎకరాలనుంచి 20·86 లక్షల ఎకరాలకు పెరిగింది. రాష్ట్రానికి సంబంధించిన మొత్తం అంకెలతో పోల్చినప్పుడు వీటి శాతం యీ మూడు ప్రాంతాలలో వరుసగా 58·1, 15·1, 20·88 చొప్పున ఉంది. 1956-57--1965-66 సంవత్సరాల కాలంలో, పైరుచేసిన విస్తీర్ణంలో సేద్యపునీటి పారుదల జరిగిన విస్తీర్ణం శాతం కోస్తా ఆంధ్రలో 39·6 నుంచి 46.5కూ, రాయలసీమలో 11·4 నుంచి 18·9కీ, తెలంగాణా ప్రాంతంలో 14·25 నుంచి 19·9కీ హెచ్చింది.

రెండవ ప్రణాళిక, మూడవ ప్రణాళికా కాలాలలో భారీ, మధ్యరకం సేద్యపునీటి పారుదల ప్రాజెక్టులపై జరిగిన ఖర్చును గురించీ, యీ కాలాలలో ఏర్పడిన నీటిపారుదల శక్తిని గురించీ తెలుసుకుందాము. ఈ రెండు ప్రణాళికా కాలాలలో భారీ, మధ్యరకం సేద్యపునీటి పారుదల ప్రాజెక్టులమీద కోస్తా ఆంధ్రలో రూ. 6,926·16 లక్షలు, రాయలసీమలో రూ. 2,441·64 లక్షలు, తెలంగాణాలో రూ. 5,676·25 లక్షలు ఖర్చుపెట్టారు. రాష్ట్రానికి సంబంధించిన మొత్తం అంకెలతో పోల్చినప్పుడు వీటి శాతం, యీ మూడు ప్రాంతాలలో వరుసవారీగా 46, 16·2, 37·8 చొప్పున ఉంది. మూడవ ప్రణాళిక ముగింపు వరకు కల్పించవలసిన సేద్యపు నీటి పారుదల శక్తి శాతం (క్యుములేటివ్) రాష్ట్రానికి సంబంధించిన మొత్తం అంకెలతో పోల్చినప్పుడు కోస్తా ఆంధ్రలో 21·8, రాయలసీమలో 56.7, తెలంగాణాలో 21.5 ఉంది. విద్యుచ్ఛక్తి వినియోగం విషయంలో 1957-58వ సం.లోని పరిస్థితితో 1965-66వ సం.రం పరిస్థితిని పోల్చినప్పుడు అభివృద్ధిశాతం కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో వరుసగా 227, 365, 365 చొప్పున ఉంది.

సేద్యపునీటి పారుదల సౌకర్యాలు

1956-66 సం.ల కాలంలో, పంపుసెట్లకోసహా ఆయిల్ ఇంజన్ల సంఖ్య కోస్తాంధ్రలో 4,727 నుంచి 11,706కూ, రాయలసీమలో 5,003 నుంచి 16,995కూ, తెలంగాణాలో 7,041నుంచి 18,040కి పెరిగింది. కాగా అభివృద్ధి శాతం యీ మూడుప్రాంతాలలో వరుసగా 148, 240, 156 చొప్పున ఉంది. ఈ దశాబ్దిలో విద్యుచ్ఛక్తి పొందిన పంపుసెట్ల సంఖ్య కోస్తాంధ్రలో 2,911 నుంచి 18,495కూ, రాయలసీమలో 1,788 నుంచి 21,071కీ, తెలంగాణాలో 231 నుంచి 17,659కీ హెచ్చింది. రాష్ట్రానికి సంబంధించిన మొత్తం అంకెలతో పోల్చినప్పుడు వీటి శాతం మూడు ప్రాంతాలలో వరుసవారీగా 32·3, 36·8, 30.9 చొప్పున ఉంది. 1956-57వ సంవత్సరంలో తెలంగాణా ప్రాంతంలో విద్యుచ్ఛక్తి పొందినట్లు పైన పేర్కొన్న 231 పంపుసెట్లూ ఒక్క హైదరాబాదు జిల్లాలోనివే.

పారిశ్రామిక పెట్టుబడి

ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామిక ప్రాజెక్టులు, భారీ రేవులపై కేంద్ర రంగం పెట్టుబడి 1967-68వ సంవత్సరాంతం నాటికి ఆంధ్రప్రాంతంలో రూ. 41·77 కోట్లు, హైదరాబాదు జిల్లా మినహా తెలంగాణా ప్రాంతంలో రూ. 53·30 కోట్లు, హైదరాబాదు నగరంలో రూ. 31·10 కోట్లు ఉంది. మొత్తం పెట్టుబడితో పోల్చినపుడు వీటి శాతాలు వరుసవారీగా 33.1, 42.2, 24.7 చొప్పున ఉంటాయి. తెలంగాణా ప్రాంతం విషయంలో పేర్కొనబడిన రూ. 53·30 కోట్ల పెట్టుబడిలో భారత ప్రభుత్వం 1967 మార్చి వరకు సింగరేణి కాలరీలకు ఋణాల రూపంలోనూ, వాటా ధనం రూపంలోనూ పెట్టుబడి పెట్టిన రూ. 19·3 కోట్ల మొత్తం కూడా ఉంది.

విద్య

1956-57—1965-66వ సంవత్సరాల కాలంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ పాఠశాలల సంఖ్య కోస్తా ఆంధ్రలో 15,093 నుంచి 17,765కు, రాయలసీమలో 6,223 నుంచి 8,943కు, హైద్రాబాదు నగరంతో సహా తెలంగాణాలో 7,684 నుంచి 11,059కి హెచ్చింది. అభివృద్ధిశాతం యీ మూడు ప్రాంతాలలో వరుసవారీగా 17·7, 43·7, 43·9 చొప్పున ఉంది. ఈ కాలంలో పాఠశాలల్లో చేర్పించిన 6-11 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లల సంఖ్య కోస్తా ఆంధ్రలో 14·92 లక్షల నుంచి 18·16 లక్షలకు, రాయలసీమలో 5·04 లక్షల నుంచి 7.35 లక్షలకు, తెలంగాణాలో 5·00 లక్షల నుంచి 6.43 లక్షలకు పెరిగింది. ఈ మూడు ప్రాంతాలలో అభివృద్ధి శాతం వరుసక్రమంలో 21·7, 4.58, 28·6 చొప్పున ఉంది.

సెకండరీ విద్యారంగంలో 1956-57—1965-66 సంవత్సరాల కాలంలో పాఠశాలల సంఖ్య కోస్తా ఆంధ్రలో 557 నుంచి 2,065కు, రాయలసీమలో 174 నుంచి 825కు, తెలంగాణాలో 274 నుంచి 1,985కు పెరిగింది. రాష్ట్రానికి సంబంధించిన 1965-66వ సం. మొత్తం అంకెలతో పోల్చినపుడు అభివృద్ధిశాతం యీ ప్రాంతాలలో వరుసక్రమంలో 42.4, 16, 40.7 చొప్పున ఉంది. ఈ దశాబ్దిలో కళాశాలల సంఖ్య కోస్తా ఆంధ్రలో 29 నుంచి 42కు, రాయలసీమలో 7 నుంచి 13కు, తెలంగాణాలో 21 నుంచి 47 కు హెచ్చింది. 1965-66వ సం.పు మొత్తం అంకెలతో పోల్చినపుడు యీ ప్రాంతంలో అభివృద్ధి శాతం వరుసవారీగా 41·2, 12·7, 46 చొప్పున ఉంది.

వైద్యం, ప్రజారోగ్యం

ఇక, ప్రజారోగ్యం, వైద్య సదుపాయాల విషయంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిద్దాము. 1956-57—1965-66 సంవత్సరాలకాలంలో ఆసుపత్రులలోని పడకల సంఖ్య కోస్తా ఆంధ్రలో 6,926 నుంచి 11,760కి, రాయలసీమలో 1,854 నుంచి 4,632కు, తెలంగాణాలో 5,215 నుంచి 9,563కు హెచ్చింది. ఈ పెరుగుదల వరుసవారీగా 69·8, 149·8, 83·4 శాతం చొప్పున అభివృద్ధిని సూచిస్తున్నది. 1965-66వ సం.లో ఆసుపత్రులలోని పడకల సంఖ్య ప్రతి ఒక లక్ష జనాభాకూ కోస్తా ఆంధ్రలో 67, రాయలసీమలో 60, తెలంగాణాలో 68 చొప్పున ఉంది. 1956–57—1965–66 సంవత్సరాల కాలంలో వైద్య కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య కోస్తా ఆంధ్రలో 230 నుంచి 450కి, రాయలసీమలో 50 నుంచి 250కి, తెలంగాణాలో 158 నుంచి 420కి పెరిగింది. ఈ పెరుగుదల వరుసవారీగా 96, 400, 166 శాతం అభివృద్ధికి సమానం.

పశువైద్యశాలలు

1956·57—1965–66 సంవత్సరాలకాలంలో పశువైద్యశాలల సంఖ్య కోస్తా ఆంధ్రలో 107 నుంచి 311కు, రాయలసీమలో 72 నుంచి 139కి, తెలంగాణాలో 106 నుంచి 285కు పెరిగింది. రాష్ట్రానికి సంబంధించిన 1965-66వ సం. మొత్తం అంకెలతో పోల్చినపుడు యీ మూడు ప్రాంతాలలో అభివృద్ధి శాతం వరుసవారీగా 42.3, 18·9, 38.8 చొప్పున ఉంది.

ఈ సంచికలో రచయితలు

1. శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, కవి, హైదరాబాదు
2. శ్రీ సి. వి. హెచ్. రావు, జర్నలిస్టు, హైదరాబాదు
3. శ్రీ కాళోజీ నారాయణరావు, కవి. వరంగల్లు
4. శ్రీ నటరాజ రామకృష్ణ, నాట్యాచార్య, హైదరాబాదు
5. శ్రీ మంచాళ జగన్నాథరావు, నిలయ విద్వాంసుడు· ఆకాశవాణి, హైదరాబాదు
6. శ్రీ చలసాని ప్రసాదరావు, చిత్రకారుడు, హైదరాబాదు
7. శ్రీ దేవులపల్లి రామానుజరావు, కార్యదర్శి, సాహిత్య అకాడమి, హైదరాబాదు
8. డా॥ దివాకర్ల వేంకటావధాని, ప్రధానాచార్యులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు
9. డా. అడపా రామకృష్ణరావు· రీడరు, ఇంగ్లీషుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
10. శ్రీ జగ్జీవనరామ్, కేంద్రమంత్రి, న్యూఢిల్లీ
11. డా. వేటూరి ఆనందమూర్తి, తెలుగువిద్యా బోధకుడు, మారిషస్
12. డా. కె. ఎల్. రావు, కేంద్రమంత్రి, న్యూఢిల్లీ

నగరంలో ...

గాంధీ శతజయంతి ఉత్సవాలు


గాంధీజీ ఆశయాన్ని, సందేశాన్ని యింటింటికీ, వ్యక్తి వ్యక్తికీ ఎరుక పరచే మూకవుమ్మడి ప్రచారాలతో ప్రాధాన్యత గడించిన మాసం కావడంతో జనవరి 1969 ఒక ప్రత్యేక విశిష్టతను సంతరించుకున్నది. జంటనగరాలలో గాంధీ శతజయంతి ఉత్సవకార్యక్రమాలకు హార్దికమైన మద్దతు లభించినది. నగరంలో జరిగిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన సందర్భంగా ఏర్పాటుగావించబడిన "గాంధీ దర్శన్" ప్రదర్శనశాలను వేలాది ప్రజలు సందర్శించి గాంధీజీని గురించి వివరంగా తెలుసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. పెవిలియన్‌లో ప్రదర్శించిన గాంధీజీ చిత్రపటాలతో, ఛాయాచిత్రాలతో, బొమ్మలతో ఎగ్జిబిషన్ ఈ సంవత్సరం నూతన శోభతో ప్రకాశించింది. బ్యాడ్జీలు, లాకెట్లు, ఫోటోలు అనేకం అమ్మకానికి పెట్టారు. వేలాది ప్రజలు, భారత దేశం గురించి గాంధీ కన్న కలలు సఫలీకృతం చేసేందుకు పాటు పడగలమని ప్రతిజ్ఞా పత్రాలమీద సంతకాలు చేశారు.

శ్రీ శంకర్ రావు దేవ్ రాక నగర ప్రజలలో మతసామరస్య అవసరాన్ని గురించిన ఆలోచనను రేకెత్తించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం గాంధీజీ ప్రతిభను, సందేశాలను ప్రతిఫలింపజేసే ఉపన్యాస పరంపరలను ప్రారంభించి నిర్వహించింది. ఆస్ట్రియానుండి సార్వస్ సంస్థ సభ్యులైన 40 మంది విదేశీయాత్రికులు జంట నగరాల్లో గాంధేయకార్యకర్తలను కలుసుకునే నిమిత్తం హైదరాబాదుకు విచ్చేశారు.


శాంతి యాత్రలు నిర్వహించబడ్డాయి. 1969 జనవరి 30వ తేదీ ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో ఏర్పాటు చేసిన బహిరంగసభకు ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు.

వికలాంగుల దినోత్సవం


హైదరాబాద్‌లోని మానసిక ఆరోగ్యకేంద్రంలో మార్చి 16న దశమ వికలాంగుల ప్రపంచదినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, వికలాంగులు సమాజానికి ఏ విధంగా భారం కాదనే భావాన్ని మానసికంగా వారిలో కలిగించవలసినబాధ్యత ప్రభుత్వం మీద, సమాజంమీద కూడా వున్నదని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని సంస్థలలో వికలాంగులకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించాలని కూడా ఆయన అన్నారు. ఆరోగ్యమంత్రి శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ అధ్యక్షతవహిస్తూ "అదృష్టానికి నోచుకోని వికలాంగులకు ప్రజలు సహాయపడి సేవచేయా" లన్నారు. వికలాంగులకు, వికలాంగులను ఉద్యోగాల్లో చేర్చుకొన్నయజమానులకు శ్రీమతి కుముదినీ దేవి యోగ్యతాపత్రాలను పంచి పెట్టారు.



కొత్త ఎం. ఎల్. ఏ. క్వార్టర్సులో శాసనసభ్యుల క్లబ్బుకు మార్చి 10 వ తేదీన శాసనమండలి అధ్యక్షులు శ్రీ పిడతల రంగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు.



నార్వే దేశపు పరిశ్రమల మంత్రి వాల్టర్ ఎన్. రోస్టోఫ్ ఫిబ్రవరి 24న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో కలుసుకున్నారు.



ఎం. ఎల్. సి. శ్రీ వి.పి. రాఘవాచారి ప్రపంచ పర్యటన సందర్భంగా ఆంధ్ర కన్వెన్షన్ సభ్యులు ఫిబ్రవరి 8న విందు ఇచ్చారు.

గోవా స్వాతంత్ర్య సమరయోధుడు

పదమూడున్నర సంవత్సరాలపాటు పోర్చుగీసు జైలులో మ్రగ్గి యిటీవలే విడుదల చేయబడిన గోవా స్వాతంత్ర్య యోధుడు శ్రీ మోహన్ రణడే, ప్రాంతీయ సమస్యలను పరిష్కరించే విషయంలో సంకుచితత్వం కూడదన్నారు. మార్చి 11 వ తేదీన హైదరాబాదులోని వివేకవర్ధనీకళాశాల గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అఖిల భారతీయ విద్యా పరిషత్తు ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన దేశంలో అస్పృశ్యత యింకా తొలిగిపోలేదనీ, దేశం అభివృద్ధి చెందటానికై ప్రజలంతా తమ తమ భాషా, ప్రాంతీయ విభేదాలను విస్మరించి కలిసికట్టుగా కృషిచేయడానికై ముందుకు రావాలనీ అన్నారు. మహారాష్ట్ర నుండి యితర రాష్ట్రులవారిని వెడలగొట్టినంత మాత్రంచేత వారి సమస్యలు పరిష్కరించబడవనీ, ఇది ఒక విధంగా చెప్పాలంటే, ఈ రోగ నివారణ పద్ధతి అసలు రోగంకన్న ప్రమాదకరమైనదనీ ఆయన అన్నారు. భారతదేశంలో దారిద్ర్యం, అసమానత, అస్పృశ్యతవంటి సమస్యలు అనేకం వున్నాయి, ఈ సమస్యలను మనం ముందుగా పరిష్కరించుకోవాలి–అని ఆయన పేర్కొన్నారు.

ప్రజలు సంకుచిత భావాలను విడిచిపెట్టి అన్యాయం మీద సమిష్టిగా పోరాటంచేసి పటిష్ఠమైన దేశాన్ని నిర్మించడంలో తోడ్పడవలసిందిగా అన్నిభాషల, అన్ని ప్రాంతాల ప్రజలకూ ఆయన విజ్ఞప్తి చేశారు.

గాలిబ్ శతవర్ధంతి ఉత్సవాలు

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ మార్చి 2న హైదరాబాదులో గాలిబ్ శతవర్ధంతి ఉత్సవాలకు ప్రారంభోత్సవంచేశారు. గాలిబ్ 'బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలను ప్రభావితులను చేసిన మహాకవి' అని గవర్నరు పేర్కొన్నారు. కవిత్వానికి ఉచ్ఛదశ వున్నరోజుల్లో గాలిబ్ జీవించి వున్నారనీ, గాలిబ్ జీవితదృక్పథం, వ్యక్తిత్వం ఆయన రచనల్లో ద్యోతకమవుతాయని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. 'గాలిబ్ – హైదారాబాదు' అన్న గ్రంథాన్నీ, ఒక సావనీరునూ ఆవిష్కరించారు.



ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ఫిబ్రవరి గోలుకొండవద్ద "ఖులి కుతుబ్‌షా దినోత్సవం"లో ప్రసంగించారు.

'మనోరమ'లో ఒకరోజు

హైదరాబాదు యాత్రికులకు 'మనోరమ' లో
ఒకరోజు మరపురాని అనుభూతి

గోల్కొండ కోట	ఉస్మాన్‌సాగర్
చార్‌మినార్	సాలార్జంగ్ మ్యూజియం
పబ్లిక్ గార్డెన్స్	ఉస్మానియా విశ్వవిద్యాలయం

మొదలయిన స్థలాలకు తీసుకొని వెళ్తుంది

శుక్రవారం మినహా ప్రతిరోజూ పర్యటించవచ్చు

సాలార్జంగ్ మ్యూజియం

ప్రవేశ రుసుముతో సహా

రూ. 8-00 మాత్రమే


రిజర్వేషన్లు చేయించుకోవలసిన స్థలము-''మనోరమ'' బయలుదేరు స్థలము

రాష్ట్రీ జన సంబంధ శాఖ


గాంధీభవనం ఎదుట, హైదరాబాదు.



ముఖ్యమంత్రి కృష్ణాజిల్లా లఘుపరిశ్రమల సమావేశానికి జనవరి 24 విజయవాడలో ప్రారంభోత్సవం చేసినప్పటి చిత్రం



ముఖ్యమంత్రి ఇటీవల విజయవాడలోని ఎస్. ఆర్. ఆర్. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించినప్పటి చిత్రం



అమెరికా ట్రావల్ ఏజంట్లు మార్చి 10 న నాగార్జునకొండ మ్యూజియంను సందర్శించినప్పటి చిత్రం

కరువు నివారణ చర్యలకు రూ. 5 లక్షలు మంజూరు

నిజామాబాద్ జిల్లాలో అనావృష్టి పరిస్థితుల నివారణకై రు 5 లక్షలు కేటాయించ బడింది. ఇదివరలో ప్రకటించిన రు 2.5 లక్షలుగాక యిది అదనంగా చేసిన కేటాయింపు. ఈ మొత్తాన్ని పంచాయితీరాజ్ సంస్థల ద్వారా పంపిణీచేయడం జరుగుతుంది.

ఆదిలాబాద్ జిల్లాలో మంచినీటి సౌకర్యం

గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కలిగించే నిమిత్తం ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వం రు 4 లక్షలు కేటాయించడం జరిగింది.

జిల్లాలనుండి

గ్రామాలకు విద్యుత్ సరఫరా

ఆదిలాబాద్ జిల్లాలో బోత్ తాలూకు చెందిన పొచెరా, తేజాపూర్, బుక్కాకొండ, దన్నూర్, కుచ్లాపూర్ గ్రామాలలో రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలివారు గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని ఈ ప్రాంతంలో యిలాంటి కార్యక్రమం చేపట్టడం యిదే మొట్టమొదటిది. ఆర్థికంగాను, పారిశ్రామికంగాను ఈ ప్రాంతం చాలా వరకు పురోభివృద్ధి చెందేందుకు ఈ విద్యుదీకరణ కార్యక్రమం దోహదం చేస్తుంది.

వీరంకిలాక్‌లో ట్యూబెక్టమీ శిబిరం

జనవరి 20 నుండి ఫిబ్రవరి 27 లోగా వీరంకిలాక్‌లో ఏర్పాటైన ట్యూబెక్టమీ శిబిరంలో 600 స్టెరిలైజేషన్ ఆపరేషన్లు నిర్వహింపబడినాయి. కేవలం ఒకటిన్నర మాసం వ్యవధిలోనే వుయ్యూరు పంచాయితి సమితిలో రెండవసారిగా ఏర్పాటైన మూకుమ్మడి ట్యూబెక్టమీ శిబిరం యిది. మొదటిసారి జరిగిన శిబిరం కాటూరు గ్రామంలో జరిగింది. 1968 నవంబరు, డిసెంబరు నెలల్లో జరిగిన ఈ శిబిరంలో 730 స్టెరిలైజేషన్ ఆపరేషన్లు నిర్వహించారు.

జిల్లాల్లో అనావృష్టి నివారణకు రూ. 1½ కోట్లు

జిల్లాల్లో అనావృష్టి నివారణ సహాయ కార్యక్రమాల నిమిత్తం, ఒకటిన్నరకోట్ల రూపాయలు మంజూరు చేయబడినవి. ఇందులో ఒక కోటిరూపాయలను అనావృష్టి పీడిత ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ తదితర కార్యక్రమాల నిర్వహణకై పంచాయతీ రాజ్ సంస్థలద్వారా, బట్వాడా చేసేవిధంగా కూడా ఏర్పాట్లు చేయబడినవి. మిగిలిన 50 వేల రూపాయలను మంచినీటి సౌకర్యం కల్పించే నిమిత్తం 20 జిల్లాలకు సమానంగా పంపిణీచేయడం జరుగుతుంది.

ఖమ్మంలో మంచినీటి బావులకు నిధులు

మంచి నీటి బావుల నిమిత్తం ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లకు రు. 5 లక్షలను పంపిణీ చేయడం జరిగింది. ఉన్న బావులను లోతు చేయడం, క్రొత్త బావులను త్రవ్వడం వంటి కార్యక్రమాలు యిదివరకే ప్రారంభమైనాయి.

గొట్టపుబావుల త్రవ్వకం యంత్రానికి ప్రారంభోత్సవం

కరీంనగర్ జిల్లాలోని గట్టుదుద్దెనపల్లిలోగల సహకార సంఘం యిటీవల సుమారు రూ. 50,000ల విలువచేసే గొట్టపు బావుల త్రవ్వకం యంత్రాన్ని కొనుగోలు చేసింది. కరీంనగర్ జిల్లా కలెక్టరు హుజూరాబాదు బ్లాకులో పోత్కంపల్లి గ్రామంలో ఆ యంత్రంతో గొట్టపుబావి త్రవ్వకానికి ప్రారంభోత్సవం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో అనావృష్టి నివారణకు సహాయక చర్యలు


మహబూబ్‌నగర్ జిల్లాలోని అనావృష్టి ప్రాంతాలలో సహాయక చర్యలక్రింద నీటిపారుదల తదితర కార్యక్రమాల నిర్వహణకు, మార్చి 31వ తేదీలోగా ఖర్చుపెట్టేందుకుగాను, రూ. 4.75 లక్షల మొత్తాన్ని రెవెన్యూబోర్డు, పంచాయతీరాజ్ సంస్థలకు కేటాయింపు చేసింది.



నెల్లూరు జిల్లా వెంకటగిరిలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఇటీవల కార్మికశాఖామంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి ప్రసంగించినప్పటి చిత్రం



తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం పంచాయతీ సమితిలో ఈ మధ్యనే రామస్వామి బ్రిడ్జికి దేవాదాయమంత్రి శ్రీ రుద్రరాజు రామలింగరాజు ప్రారంభోత్సవం జరిపారు



జమ్మూ-కాశ్మీర్ సాంస్కృతిక బృందం ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించింది, ఆసందర్భములో తిరుపతిలో జరిగిన ప్రదర్శన దృశ్యం.

Statement about Ownership and other Particulars About

"ANDHRA PRADESH"

FORM-IV

(*See Rule* 8)


Place of Publication	: Hyderabad.
Periodicity of Publication	: Monthly.
Printer's Name	: Director, Government Printing.
Nationality	: Indian.
Address	: Chanchalguda, Hyderabad-24.
Publisher's Name	: B. K. Rao, I.A.S.
Nationality	: Indian.
Address	: Sanchalak, Jana Sambandha Shakha, Hyderabad, A.P.
(Chief) Editor's Name	: B. K. Rao, I.A.S.
Nationality	: Indian.
Address	: Sanchalak, Jana Sambandha Shakha, A.P.
Name and address of individuals who own the Newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.	—

I, B. K. Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

B. K. RAO,
Signature of the Publisher.

ప్రచురణ ; ఆంధ్రప్రదేశ్ జనసంబంధశాఖ సంచాలకుడు
ముద్రణ ; ప్రభుత్వ ముద్రణాలయము, చంచల్‌గూడ, హైదరాబాదు.





Regd. No. H. 133